

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి



సోమవారం | 12-3-2018 | పేజీలు: 18 + 20 | వెల: రూ. 5.00 | సంపుటి: 14 సంచిక: 241 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: దశమి ఉ. 11.14 తదుపరి ఏకాదశి; నక్షత్రం: పూర్వాషాఢ ఉ. 9.34 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: రా. 6.33-8.21; దుర్ముహూర్తం: మ. 12.49-1.37, మ 3.12-3.59; అమృతఘడియలు: తె. 5.20-7.08; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.30; సూర్యాస్తమయం: 6.21 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai



భగవద్గీత ఎందుకు చదవాలంటే..



"నాకు ఈ సమయంలో హిందువుల పవిత్ర గ్రంథం భగవద్గీత గుర్తొస్తోంది. 'నీ విధి నువ్వు నిర్వర్తించాలి' అంటూ విష్ణువు యువరాజుకు (అర్జునుడికి) చెబుతూ తన విశ్వరూపాన్ని చూపుతాడు. 'నేనే మృత్యువును. లోకాలను నాశనం చేసే శక్తిని' అని చెబుతాడు"

..రెండో ప్రపంచయుద్ధ సమయంలో అణ్వస్త్రాలకు సంబంధించిన మన్‌హట్టన్ ప్రాజెక్టులో కీలకపాత్ర పోషించిన రాబర్ట్ జూలియస్ ఓపెన్‌హేమర్ చెప్పిన మాట ఇది. అణుబాంబు తయారీలో కీలకపాత్ర పోషించిన ఆయన భగవద్గీత చదవడం వల్లనే తనకు ఆ స్థితప్రజ్ఞత కలిగిందని చెప్పాడు. అణుపరీక్ష జరిపినప్పుడు విడుదలైన వేయి సూర్యుల కాంతిని విశ్వరూపుడైన పరమాత్మ కాంతితో సరిపోల్చాడు. ప్రపంచ మత గ్రంథాల్లో యుద్ధభూమిలో చెప్పబడిన ఏకైక గ్రంథం.. గీత. లోకంలోని దుఃఖాన్ని తన దుఃఖంగా భావించుకొని అర్జునుడు పొందిన విషాదాన్ని కృష్ణుడు గీతాప్రబోధంతో పటాపంచలు చేశాడు. ధర్మక్షేత్రాల్లో కూడా యుద్ధం సంభవించడం.. శ్రీకృష్ణుడి లాంటి దక్షుడైన అవతారపురుషుల కాలంలో కూడా రాజ్యకాంక్ష ఉండటం ద్వాపరం విశేషం. అనుశాసన పర్వంలో ధర్మరాజు ఇదే విషయాన్ని చెబుతూ.. "రాజ్యకాంక్షతో ఇన్ని దుర్మార్గాలకు పాల్పడ్డ దుర్యోధనుడు సరే.. నా సంగతేమిటి? 'ఛీ, ఈ రాజ్యం నాకెందుకు' అని నేను అనుకుని ఉంటే యుద్ధం తప్పేదిగా? అంటే జరుగుతున్న పరిణామాలకు దుర్యోధనుడు ఒక కోణమైతే నేను ఇంకో కోణం అన్న మాట" అని వాపోతాడు. ఇవే ప్రశ్నలు.. 'నేనే చేస్తున్నాను' అనే భావన అర్జునుడిలోనూ ఉదయించినందువల్లనే గీత బోధ జరిగింది. అర్జునుడిని స్థితప్రజ్ఞుడిని చేసి ఆ స్థితి నుంచి కర్తవ్యం దిశగా తీసుకెళ్లడమే గీతా యోగం. అలా ఎవరికైనా సరే కర్తవ్యబోధ చేసి ఒడిదొడుకుల నుంచి కాపాడే పరమౌషధం భగవద్గీతే. అందుకే అందరూ భగవద్గీత చదవాలి.

- డాక్టర్ పి.భాస్కర యోగి

Paramjyothi
పరంజ్యోతి



మీ భక్తులు ప్రభూ... సోషల్ మీడియాలో మెసేజ్‌లు పంపుతున్నారు.....


ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	38.0	21.0
నిజామాబాద్	36.0	23.7
హైదరాబాద్	35.5	25.5
నల్లగొండ	34.8	23.0
వరంగల్	34.5	20.5

సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమలలో ఆదివారం దాదాపు 75వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి 15 గంటలు, దివ్యదర్శనానికి 3 గంటల సమయం పడుతోంది. మంగళవారం సేవలకు.. విజయా బ్యాంకులో సోమవారం లాటరీ ద్వారా జారీచేసే సుప్రభాతం 50, కల్యాణోత్సవం 80 తదితర టిక్కెట్లు అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్‌లో రూ.300 టిక్కెట్లు www.ttdseva online.comలో పొందవచ్చు.

– ఆంధ్రజ్యోతి, తిరుమల



కంచి కామకోటి పీఠంలో విజయేంద్ర సరస్వతితో శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి

కంచి పీఠంలో శారదా పీఠాధిపతి

పెందుర్తి(విశాఖ సిటీ), మార్చి 11: తమిళనాడులోని కంచి కామకోటి పీఠాన్ని ఆదివారం విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి సందర్శించారు. ఈ సందర్భంగా జయేంద్ర సరస్వతి మహాసమాధిని ఆయన దర్శించారు. తరువాత కంచికామకోటి నూతన పీఠాధిపతి విజయేంద్రసరస్వతిని కలిసి, శారదామాత శేషవస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఇరు పీఠాధిపతులు హైందవధర్మ పరిరక్షణపై చర్చలు జరిపారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో శంకరభాష్యం అద్వైతసారాన్ని ప్రబోధన చేయాలని శారదా పీఠాధిపతిని కంచికామకోటి పీఠాధితి కోరినట్టు పీఠం శ్రీకార్యం పేర్కొన్నది. కర్ణాటక రాష్ట్రంలో హిందూ వ్యతిరేక శక్తులు హిందూ ధర్మానికి హాని కలిగించేలా ప్రవర్తిస్తున్నాయని, దీనిపై పీఠాలు సమీక్ష చేయాలన్నారు. శారదా పీఠాధిపతి వెంట ఉత్తర పీఠాధిపతి బాలాస్వామి, ధర్మాధికారి కామేశ్వర శర్మ, ఆస్థాన విద్వాంసులు శ్రీకృష్ణశర్మ ఉన్నారు.

రామనారాయణుడు కాదు..
రామచంద్రుడే



శివస్వామి, వైదిక సిబ్బంది వాదోపవాదాలు

- ఆ పేరుతోనే కల్యాణం జరిపించాలి
- 'అమరావతి' పీఠాధిపతి శివస్వామి డిమాండ్
- భద్రాద్రి అంతరాలయంలో బైఠాయింపు
- 32 నిమిషాల పాటు దర్శనానికి బ్రేక్
- ఏప్రిల్ ఒకటిన భద్రాద్రి వేదికగా పండితుల సమక్షంలో చర్చ

భద్రాచలం, మార్చి 11: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచల రామాలయంలో ఆదివారం కలకలం రేగింది. భద్రాద్రిలో నిర్వహిస్తున్న సీతారామ కల్యాణంలో గోత్రప్రవరలు మార్చి చెబుతున్నారన్న ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో.. అమరావతి శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి భక్త బృందంతో స్వామి దర్శనానికి వచ్చి అంతరాలయంలోనే బైఠాయించారు. భద్రాద్రిలో కొలువైనది రామచంద్రుడేనని.. రామనారాయణుడు కాదని పేర్కొంటూ జై శ్రీరామ్, శ్రీరామ జయరామ జయజయరామ అంటూ నినాదాలు చేశారు. రామచంద్రుడి కల్యాణం విషయమై తమకు స్పష్టత కావాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ లేదా ఆలయ ఈవో లాంటి బాధ్యత గల అధికారులు వచ్చి మాట్లాడాలని పట్టుబట్టారు. దీంతో ఆలయ పర్యవేక్షకులు కనకదుర్గ అక్కడికి చేరుకుని.. సందేహాలుంటే ఆలయ వైదిక సిబ్బంది నివృత్తి చేస్తారని, అలా అంతరాలయంలో బైఠాయించడం భావ్యం కాదని సూచించారు. ఆలయ ఎస్‌పీఎఫ్, ప్రైవేట్ భద్రతా సిబ్బంది, పోలీసులు.. ఎవరు చెప్పినా శివస్వామి బయటకు వెళ్లేందుకు అంగీకరించలేదు. భద్రాచలం పట్టణ సీఐ పి.సత్యనారాయణరెడ్డి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. వైదిక సిబ్బంది అడిగినా కూడా ఆయన బయటకు రాకపోవడంతో.. తాము ప్రస్తుతం బ్రహ్మోత్సవాల పనిలో ఉన్నామని, ఉత్సవాలు ముగిసిన అనంతరం సందేహాలకు సమాధానం చెబుతామని వారు హామీ ఇచ్చారు. ఏప్రిల్ 1న చర్చించేందుకు ఇరువర్గాలూ అంగీకారానికి రావడంతో.. శివస్వామి, ఆయన భక్త బృందం అంతరాలయం నుంచి బయటకు వచ్చారు. ఈ క్రమంలో 32 నిమిషాల పాటు దర్శనం నిలిచిపోయింది. భక్తులకు తీవ్ర అసౌకర్యం కలిగింది. శతాబ్దాల చరిత్ర ఉన్న భద్రాద్రి అంతరాలయంలో ఎన్నడూ ఈ రీతిన ఎవరు బైఠాయించిన దాఖలాలు లేవు. చివరకు అటు శివస్వామి, ఇటు వైదిక సిబ్బంది ఏప్రిల్ 1న చర్చిద్దామని అంగీరానికి రావడంతో వివాదం సర్దుమణిగింది.

2013 నుంచే..

భద్రాచలంలో తొలి నుంచి రామచంద్రుడి పేరిట కల్యాణం నిర్వహించే వారని.. 2013 నుంచి మాత్రమే కల్యాణంలో రామనారాయణుడి ప్రస్తావన అర్చకులు తెస్తున్నారని శివస్వామి ఆరోపించారు. అంతరాలయం నుంచి బయటకు వచ్చిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. భక్తరామదాసు ఏ లక్ష్యంతో ఆలయాన్ని నిర్మించారో అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. భద్రాద్రి రామాలయం ఏ ఒక్కరి సొత్తు కాదని ఇక్కడ పని చేస్తున్న వైదిక సిబ్బంది కేవలం ఉద్యోగులన్న విషయాన్ని విస్మరించరాదని వ్యాఖ్యానించారు.

భద్రాద్రి వైష్ణవ క్షేత్రమే..

శివస్వామి సందేహాలను ఏప్రిల్ 1న నివృత్తి చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని భద్రాద్రి దేవస్థానం వైదిక సిబ్బంది తెలిపారు. వారి తరపున అధర్వ వేద పండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు మాట్లాడారు. శివస్వామి భద్రాద్రి క్షేత్రంపై శివస్వామి పూర్తిస్థాయి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా అంతరాలయంలో బైఠాయించడం ఏంటని ప్రశ్నించారు. భద్రాద్రి ఆలయం వైష్ణవ క్షేత్రమేనని ఆయన స్పష్టం చేశారు. కాగా, దీనిపై ఆలయ పరిపాలన, వైదిక సిబ్బందితో మాట్లాడి.. జరిగిన సంఘటన గురించి ఉన్నతాధికారులకు వివరాలు తెలిపి అనంతరం చర్యలు చేపడతామని ఆలయ ఈవో కె.ప్రభాకర శ్రీనివాస్ చెప్పారు.



విలేకరులతో మాట్లాడుతున్న వైదిక సిబ్బంది



భర్త కొడితే తిరిగి కొట్టండి

అకారణంగా చేయి చేసుకునే భర్తల విషయంలో భార్యలు వెనక్కి తగ్గొద్దు. తిరిగి కొట్టాలి. వారి చెంప ఛెళ్లుమనిపించాలి. సమాజంలో మహిళలు ఏ ఒక్కరికీ తీసిపోరు.

- అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడీ



జీఎస్టీని బుట్టదాఖలు చేయండి

కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం అమలు చేసిన జీఎస్టీ అన్ని వర్గాలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఆ బిల్లును చెత్తబుట్టలో పడవేయటమే మంచిది. పెద్దనోట్ల రద్దు పథకం మంచిదే అయినా, దానిని అమలు చేయడంలో కేంద్రం పూర్తిగా విఫలమైంది.

- మక్కల్ నీది మయ్యం అధినేత, సినీ నటుడు కమల్‌హాసన్



మోగింది కల్యాణ వీణ..

వధూవరులతో కలెక్టర్ శ్రీదేవసేన, ఎమ్మెల్యే పుట్ట మధు

మోగింది కల్యాణ వీణ..

- ఒకే రోజు ఒకే వేదికపై ఏకమైన 205 జంటలు
- మంథనిలో సామూహిక వివాహాలు

పెద్దపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : స్వాగత తోరణాలు, ఎటు చూసినా పూల అలంకరణలు.. బాజా భజంత్రీలు.. మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు.. వేలల్లో అతిథులు.. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వేదికగా 205 జంటలు వేద మంత్రాల సాక్షిగా ఒక్కటయ్యాయి. పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంథని ఎమ్మెల్యే పుట్ట మధు, శైలజ దంపతులు పెళ్లి పెద్దగా వ్యవహరించారు. పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో ఈ వివాహాలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా వధూవరులకు ట్రస్టు ద్వారా పెళ్లి బట్టలు, తాళిబొట్టులు, పరుపు, మంచం, బీరువా, గ్యాస్ స్టవ్, సైకిల్, నెల రోజులకు సరిపడా బియ్యం, ఉప్పు, కారం, పప్పు తదితర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ నూతన వధూవరులను ఆశీర్వదించి ప్రభుత్వం ఇచ్చే కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు.



వధూవరులకు కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఈటల



మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ కమలాకర్‌ను విచారిస్తున్న ఏసీబీ అధికారులు

లంచం తీసుకుంటూ దొరికిపోయిన ఎస్ఐ

మహబూబాబాద్ క్రైం, మార్చి 11: ఓ ఎస్ఐ రూ. 8వేల కోసం కక్కుర్తిపడి అవినీతి నిరోధక శాఖ అధికారులకు అడ్డంగా దొరికిపోయాడు. మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో గతేడాది సెప్టెంబర్ 12న ఓ ఇంటి వివాదానికి సంబంధించి కేసు నమోదైంది. బాధితురాలు నక్క సంధ్య, ప్రత్యర్థి వరకూటి శ్రీనివాస్ యాదవ్ ఆరునెలల గడువు తర్వాత పెద్దమనుషుల సమక్షంలో ఒప్పందానికి వచ్చారు. ఇదే విషయాన్ని టౌన్ ఎస్ఐ కమలాకర్‌కు ఇరువర్గాలవారు తెలియజేసినప్పటికీ కేసు చార్జ్‌షీటు కోసం వరకూటి శ్రీనివాస్‌యాదవ్ నుంచి రూ.10 వేలు డిమాండ్ చేశాడు. చివరికి రూ. 8వేలకు ఎస్ఐ అంగీకరించాడు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచనల మేరకు.. ఆదివారం మధ్యాహ్నం ఎస్ఐ కమలాకర్‌కు శ్రీనివాస్‌యాదవ్ డబ్బు అందజేశాడు. వెంటనే ఏసీబీ అధికారులు అక్కడికి చేరుకుని రెడ్‌హ్యాండెడ్‌గా ఎస్ఐని పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఏసీబీ వరంగల్ జోన్ డిప్యూటీ డైరెక్టర్ సుదర్శన్‌గౌడ్ తెలిపారు. దాడుల్లో వరంగల్ ఏసీబీ డీఎస్పీ కిరణ్‌కుమార్, సీఐలు వాసాల సతీష్, క్రాంతికుమార్, వెంకటి, అనిల్, ఖమ్మం సీఐలు ఎస్వీ రమణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో
కాంగ్రెస్ ప్రభంజనం

లేకుంటే రాజకీయాల నుంచి తప్పుకుంటా.. 'బడ్జెట్' కోసమే బస్సు యాత్రకు విరామం

- నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేస్తాం
- ప్రజల దృష్టి మరల్చేందుకే కేసీఆర్ థర్డ్ ఫ్రంట్
- ఫేస్‌బుక్ లైవ్‌లో టీపీసీసీ చీఫ్ ఉత్తమ్



హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభంజనం ఖాయమని, అలా జరగని పక్షంలో తాను రాజకీయాల నుంచి వైదొలుగుతానని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణలో నిశ్శబ్ద విప్లవం రాబోతోందని, కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారని తెలిపారు. ఫేస్‌బుక్ లైవ్ ద్వారా కార్యకర్తలు, ప్రజలతో ఆదివారం సాయంత్రం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అధికార పార్టీ, సీఎం కేసీఆర్ వైఫల్యాలపై విరుచుకుపడ్డారు. ఉద్యోగాల భర్తీలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్రంలో 1.07 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే.. నాలుగేళ్ల తర్వాత అంతకన్నా ఎక్కువ పోస్టులు ఖాళీగా ఉండటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. టీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ కుటుంబ సభ్యులకు మాత్రం ఉద్యోగాలు వచ్చాయని ఎద్దేవా చేశారు. కొడుకు, కూతురు, మేనల్లుడు ఇప్పటికే ఉద్యోగాలు పొందితే.. తాజాగా మరొకరిని రాజ్యసభకు పంపిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలను ఇంకెంతో కాలం మోసం చేయలేరని, కేసీఆర్ ఇంటికి వెళ్లే సమయం ఆసన్నమైందని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటూ, ప్రజల దృష్టిని మరల్చేందుకే థర్డ్ ఫ్రంట్ పేరుతో కేసీఆర్ నాటకం ఆడుతున్నారని దుయ్యబట్టారు. టీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలు, కేసీఆర్ మోసపూరిత వాగ్దానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ప్రజలు, కార్యకర్తలే నా కుటుంబం

కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలే తన కుటుంబమని ఉత్తమ్ మరో సారి స్పష్టం చేశారు. కొంతమంది నేతలు తనపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని, ఇకనైనా వారు పద్ధతి మార్చుకోవాలని సూచించారు. యుద్ధ విమానాల పైలట్‌గా తన జీవితంలో ఎక్కువ భాగం చైనా, పాకిస్థాన్ సరిహద్దుల్లో పని చేశానని గుర్తు చేశారు. ఫేస్‌బుక్‌లో యాక్టివ్‌గా ఉండాలని, ఫాలోవర్ల సంఖ్యను పెంచుకోవాలని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లాలని కార్యకర్తలను కోరారు. ఓ కార్యకర్త అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా రాంచందర్‌నాయక్ ఉంటారని స్పష్టం చేశారు.

బస్సు యాత్ర అద్భుతంగా సాగింది

మొదటి విడత ప్రజా చైతన్య బస్సు యాత్ర అద్భుతంగా సాగిందని ఉత్తమ్ సంతోషం వ్యక్తం చేశారు. యాత్రలో భాగంగా 16 సభలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. బడ్జెట్ సమావేశాల దృష్ట్యా రెండు వారాల పాటు బస్సు యాత్రకు విరామం ఇచ్చినట్లు చెప్పారు. కొన్ని నియోజకవర్గాల్లో పార్టీ బలహీనంగా ఉండటానికి కారణాలు తెలిశాయని, బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవగానే ఉద్యోగ ఖాళీలన్నింటినీ భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు.



కమలమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న చాడ వెంకటరెడ్డి, నేతలు

సాయుధ పోరాట యోధురాలు
కమలమ్మ ఇకలేరు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు, కమ్యూనిస్టు పార్టీ సీనియర్ గాయకురాలు చెన్నబోయిన కమలమ్మ (90) ఇకలేరు. కొంతకాలంగా కిడ్నీ సంబంధ వ్యాధితో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఆమె మరణవార్తను తెలుసుకున్న సీపీఐ శ్రేణులు హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌కు ఆమె భౌతికకాయాన్ని తరలించి నేతలు, కార్యకర్తల సందర్శనార్థం ఉంచారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, పలు పార్టీల నాయకులు కమలమ్మకు నివాళి అర్పించారు. వరంగల్ పోచమ్మమైదాన్‌లోని స్వగృహానికి మృతదేహాన్ని తరలించగా పలువురు ప్రముఖులు సందర్శించారు. అనంతరం అశ్రు నయనాల మధ్య అంత్యక్రియలు పూర్తయ్యాయి. మహబూబాబాద్ సమీపంలోని నెల్లికుదురు మండలం నైనాలలో జన్మించిన ఆమె చెన్నబోయిన అప్పన్నను వివాహం చేసుకుంది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో రెండో మగ బిడ్డకు జన్మనిచ్చిన కమలమ్మ.. ఉద్యమం కోసం ఏకంగా కన్నకొడుకునే వదులుకుంది. రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యపుస్తకాలలో కమలమ్మ చరిత్రను పొందుపర్చింది. ఇంగ్లిషు మీడియం లోని 8వ తరగతి సాంఘికశాస్త్రంలో 12వ పాఠ్యాంశంగా ఆమె చరిత్రను రూపొందించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం 2016 మార్చి 8న ఆమెకు రాష్ట్ర ఉత్తమ మహిళా అవార్డును కూడా ప్రదానం చేసింది.

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్		డీజిల్	
పాత ధర	రూ.76.75	పాత ధర	68.33
కొత్త ధర	రూ.76.72	కొత్త ధర	68.31
తగ్గుదల: 3 పైసలు		తగ్గుదల: 2 పైసలు	



గుండె వైఫల్యానికి కారణమైన 36 జన్యువులు గుర్తింపు

వాషింగ్టన్, మార్చి 11: రక్తాన్ని సరిగా పంపింగ్ చేయలేక గుండె అవస్థలు పడడమే గుండె వైఫల్యం. హృదయం తన శక్తిసామర్థ్యాలు కోల్పోయినపుడు ఈ ప్రమాదం ముంచుకొస్తుంది. ఈ సమస్యకు సంబంధించి 36 కొత్త జన్యువులను అమెరికాలోని నార్త్‌ఈస్టర్న్ వర్సిటీ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇది కొత్తరకం చికిత్సలకు దోహదం చేస్తుందని వెల్లడించారు.



ఎక్కువసేపు టీవీ చూస్తే పేగు కేన్సర్!

లండన్, మార్చి 11: గంటల తరబడి టీవీకి అతుక్కుపోవడం వల్ల దీర్ఘకాలంలో పురుషులకు పేగు కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందని తాజా అధ్యయనం హెచ్చరిస్తోంది. దాదాపు 5లక్షల మందిని పరీక్షించగా ఎక్కువ సేపు టీవీ ముందు కూర్చున్నవారు కేన్సర్ బాధితులుగా మారినట్లు వెల్లడైందని ఫ్రాన్స్‌లోని ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ కేన్సర్, యూకేలోని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ శాస్త్రవేత్తలు తెలిపారు.



www.andhrajyothy.com
నిజామాబాద్ సిటీ*
ఆంధ్రజ్యోతి
సోమవారం 12-3-2018



Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai


టీఆర్ఎస్ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్

2019 వరకు నేనే సీఎం

- జాతీయ రాజకీయాల్లోకి వెళ్లి తీరుతా
- నాడు మోదీలాగా రాష్ట్రాలన్నీ తిరుగుతా
- మళ్లీ బీజేపీ గెలవదు, మోదీ ప్రధాని కాడు
- మనది థర్డ్ ఫ్రంట్ కాదు, మెయిన్ ఫ్రంట్
- వచ్చేసారి కేంద్రంలో మనమే కీలకం
- సక్సెస్ అయితే ఓకే.. లేకుంటే ఇక్కడే ఉంటా
- 103 నుంచి 106 సీట్ల వరకు గెలుస్తాం
- సిట్టింగ్‌లందరికీ మళ్లీ టిక్కెట్లు ఇస్తాం
- రిజర్వేషన్లకై అవసరమైతే ఢిల్లీలో ధర్నా
- సభను అడ్డుకుంటే కాంగ్రెస్‌పై వేటు తప్పదు
- టీఆర్ఎస్ఎల్పీ భేటీలో సీఎం కేసీఆర్

ముందు ముందు ఎట్లా చేస్తానో చూడండి



"అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం మూడు సర్వేలు చేయించాం. ఇప్పటివరకు రెండు సర్వేల ఫలితాలు వచ్చాయి. ఒక సర్వేలో 103 అసెంబ్లీ స్థానాలు, ఇంకో సర్వేలో 106 స్థానాలను టీఆర్ఎస్ గెలుస్తుందని తేలింది. ముగ్గురు, నలుగురు పార్టీ ఎమ్మెల్యేలకు 40% లోపు ఓటింగ్ వచ్చింది. వారిని ఎట్లా గెలిపించుకోవాలో అట్లా గెలిపించుకుంటాం"

"సంతోష్ నమ్మకమైన వ్యక్తి. జాతీయ రాజకీయాల్లోకి వెళ్తున్న నా మంచీచెడు చూసుకోవటానికి, నాకు టైంకు మందులు ఇవ్వటానికి సంతోష్ నా వెంట ఉంటే భరోసాగా ఉంటుంది. అందుకే సంతోష్‌ను రాజ్యసభకు తీసుకెళ్తున్నాను".

-ముఖ్యమంత్రి కేసీఆర్

8

బీసీలకు పట్టం

- రాజ్యసభకు సంతోష్, ప్రకాశ్, లింగయ్య
- టీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించిన కేసీఆర్
- నేడు నామినేషన్ల దాఖలు
- ముగ్గురూ ఉన్నత విద్యావంతులే
- ముగ్గురి ఎన్నికా లాంఛనమే


సంతోష్ కుమార్
బండ ప్రకాశ్
బి.లింగయ్య

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి మూడు రాజ్యసభ స్థానాలకు టీఆర్ఎస్ అభ్యర్థులను ఖరారు చేశారు. పెద్దల సభ ద్వైవార్షిక ఎన్నికల్లో భాగంగా నిర్వహిస్తున్న ఈ మూడు స్థానాలకు జోగినిపల్లి సంతోష్‌కుమార్, బండా ప్రకాశ్, బడుగుల లింగయ్య యాదవ్ పోటీ చేయనున్నారు. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదివారమిక్కడ జరిగిన టీఆర్ఎస్ఎల్పీ భేటీలో వీరి అభ్యర్థిత్వాలను ప్రకటించారు. రాష్ట్రంలో సామాజిక, ప్రాంతీయ సమీకరణాలను పరిగణనలోకి

మిగతా 6వ పేజీలో...

ఏపీలో టీడీపీ నుంచి సీఎం రమేశ్, రవీంద్ర

8


అంజనీ కుమార్


సజ్జనార్

భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

- హైదరాబాద్ సీపీగా అంజనీ కుమార్
- సైబరాబాద్, వరంగల్, సిద్దిపేటకు కొత్త సీపీలు
- మొత్తం 38 మంది అధికారుల బదిలీ
- ఒకేసారి ఏఎస్పీ నుంచి డీజీ స్థాయి వరకు..

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీగా ఐపీఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. మావోయిస్టులు తెలంగాణలో పాగా వేసేందుకు సన్నద్ధమవుతున్నారన్న నిఘా వర్గాల హెచ్చరికలు, పలు కమిషనరేట్లలో శాంతిభద్రతలను పటిష్ఠపర్చాల్సిన అవసరాల నేపథ్యంలోనే సర్కారు ఈ బదిలీలు చేపట్టినట్లు సమాచారం. హైదరాబాద్ సీపీగా బదిలీ అయిన అంజనీ కుమార్‌కు నగరంలో సుదీర్ఘంగా పనిచేసిన అనుభవం ఉంది. దీంతో పాటు ఇంటెలిజెన్స్, గ్రేహౌండ్స్‌లో కీలక ఆపరేషన్లు చేపట్టారు. అలాగే సైబరాబాద్ సీపీగా బదిలీ అయిన సజ్జనార్‌కు మావోయిస్టు నెట్‌వర్క్‌లపైనా, వారి కదలికలను అంచనా వేయడంపైనా మంచి పట్టుంది. మరోవైపు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన భద్రాచలం, మహబూబాబాద్, కుమ్రంభీం, మంచిర్యాల, భూపాలపల్లి, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లో మెరికల్లాంటి యువ ఐపీఎస్‌లను నియమించారు. రాష్ట్రంలో మొత్తం 38 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఏఎస్పీ స్థాయి నుంచి డీజీ స్థాయి వరకు ఒకేసారి బదిలీలు చేయడం రాష్ట్రంలో ఇదే మొదటిసారి. ఈ బదిలీల్లో హైదరాబాద్, సైబరాబాద్, వరంగల్, సిద్దిపేటలకు కొత్త కమిషనర్లు నియమితులయ్యారు. హైదరాబాద్ సీపీగా అంజనీకుమార్, సైబరాబాద్‌కు సజ్జనార్, వరంగల్‌కు రవీందర్, సిద్దిపేటకు జోయల్ డేవిస్‌లు బదిలీ అయ్యారు. రైల్వే అండ్ రోడ్ సేఫ్టీకి డీజీగా ఉన్న కృష్ణప్రసాద్‌ను కేవలం రోడ్‌సేఫ్టీకి పరిమితం చేశారు. ఇటీవల

మిగతా 12వ పేజీలో...



కమ్మేసిన కార్చిచ్చు

- తమిళనాడులో ట్రెక్కింగ్‌కు వెళ్లిన సుమారు 50 మంది
- దావానలంలో చిక్కుకుని విలవిల.. 15 మందికి 30-50% గాయాలు
- వారిలో ముగ్గురి స్థితి విషమం.. రంగంలోకి వైమానిక దళం

14





శ్రీరామ నీ నామమే మారెనా?

- భద్రాచలంలో మారిన సీతారాముల గోత్రప్రవరలు!
- 'రామచంద్ర స్వామినే వరాయ' అనడానికి బదులు 'రామనారాయణ స్వామినే వరాయ' అంటున్న అర్చకులు!

11







తెలంగాణ పదం - సంస్కృత పరిష్వంగ సుఖం



తెలుగు భాషకూ, సంస్కృతానికీ అవినాభావ సంబంధం వుంది. అది తల్లీబిడ్డల బంధం కాకపోవచ్చును. అక్కాచెల్లెళ్ళ అనుబంధం అవకపోవచ్చును. అయితేనేం, తెలుగు పండిత ప్రకాండులెందరో అమరం నెమరు వేసారు. అనేకానేక సంస్కృత గ్రంథాలు రాసారు. దాదాపు వెయ్యేండ్ల నుంచి ఈనాటికీ అవ్యాహతంగా సాగిన, ఇంతోఅంతో సాగుతున్న, కాస్తో కూస్తో సాగబోతున్న పద్య సాహిత్యంలోని పదసంపదకు మూలధాతువు సంస్కృత శబ్దజాలమే! తెలుగు వ్యాకరణ గ్రంథాలు, అలంకారశాస్త్రాలు, ఛందశ్శాస్త్రాలు... యిత్యాది వివిధ శాస్త్ర పరిభాష అంతా సంస్కృతమే! తెలుగులోని మార్గ సాహిత్యంపై సంస్కృత భాషా ప్రభావం బాగా ఎక్కువ. ఆ ప్రభావం పదాల్లోనే కాకుండా వస్తు స్వీకరణలోనూ కన్పిస్తుంది. తెలుగులో దాదాపు ముప్పై శాతం సంస్కృత పదాలు వుండడానికి కారణాలు అనేకం. సంస్కృత భాషాధిపత్య ధోరణి అని కొందరు, తెలుగు భాషా పండితుల్లో నెలకొన్న అమరభాషా వ్యామోహం అని ఇంకొందరు, భాషల మధ్య ఆదానప్రదానాలు సహజం అని మరికొందరు, తెలుగులోనే కాదు- ఏ భాషలోనైనా భావ ప్రకటనా సంగ్రహణాలకు అవసరమైన అన్ని పదాలూ వుండవని అన్యులు.. యిట్లా అనేక కారణాలు చెప్పారు.

సంస్కృత భాషలోంచి నిరాఘాటంగా తెలుగులోకి శబ్దజాలం వచ్చిచేరినందువల్ల తెలుగు సుసంపన్నభరితమైంది. కొన్ని సందర్భాల్లో ఏది తెలుగు, ఏది సంస్కృతం అని విడమరిచి చెప్పలేనంత సందిగ్ధస్థితి నెలకొంది. పూవుకు తావిలా తెలుగుకు అమరం అమరింది సహజంగా. అయితే ఈ సంస్కృత శబ్దజాలం తెలంగాణ తెలుగులోనూ వెలిగిపోతున్నది. తెలంగాణ ప్రాంతంలోని పండితుల్లోనే కాకుండా పండితేతర ప్రజాసమూహాల్లో అంటే సామాన్య ప్రజలు నిత్యం జరుపుకొనే భాషా వ్యవహారాల్లో అద్భుతంగా వుంది. రాజపూజితంగ, ఉచితార్థంగ మొదలైనవి పదస్వరూపాల్లో ఏమాత్రం మారకుండా సంభాషణల్లో దొర్లుతాయి. అంటే తత్సమాలున్నాయి. ఇంచుక పద స్వరూపం మారిన ఇంటింటి "మారాజులు", "మా"యెల్లెమే వంటి తద్భవాలు వున్నాయి. "కోపగొండి"లాంటి మిశ్రసమాసాలు అనేకం. పండితులు అయిష్టంగా భ్రుకుటి ముడివేసిన దుష్ట సమాసాలున్నాయి. ఇది ప్రజాస్వామిక యుగం. ప్రజలు మాట్లాడుతున్నవన్నీ సాధురూపాలుగా స్వీకరించాల్సిన సన్నివేశమిది. ప్రజల పలుకుబడులన్నీ, పదాలన్నీ సాధువులే, శిష్టసమాసాలే!

తెలంగాణ ప్రాంతంలోని గ్రామీణుల సంభాషణల్లోని సంస్కృత పదాలపై దృష్టి నిలపడం వుద్దిష్టాంశం. వాళ్ళ సల్లాపాల్లో అలవోకగా సంస్కృత పదాలు దొర్లుతుంటాయి. కాకపోతే... పద స్వరూపం మారుతుంది. మహాప్రాణాలు మామూలు ప్రాణాలు అవుతాయి (ఖఘఛఠథలు కచటతపలుగా మారుతాయి). సంయుక్తాలు, ద్విరుక్తాలవుతాయి (అగ్ని అగ్గి అవుతుంది). వర్ణవ్యత్యయం, వర్ణసమీకరణాది మార్పులు వస్తాయి. రా వత్తు చాలా సందర్భాల్లో పోతుంది.

> **సంస్కృత భాషలోంచి నిరాఘాటంగా తెలుగులోకి శబ్దజాలం వచ్చిచేరినందువల్ల తెలుగు సుసంపన్నభరితమైంది. పూవుకు తావిలా తెలుగుకు అమరం సహజంగా అమరింది. ఈ సంస్కృత శబ్దజాలం తెలంగాణ తెలుగులోనూ వెలిగిపోతున్నది. తెలంగాణ ప్రాంతంలోని పండితుల్లోనే కాకుండా సామాన్య ప్రజలు నిత్యం జరుపుకొనే భాషా వ్యవహారాల్లో అద్భుతంగా వుంది.**

ఉదాహరణకు సంస్కృతంలో "తంత్రి" అనే మాటుంది. దీనికి తంతి, నరము, తిప్పతీగ అని అర్థాలు. మరి, మరలా 'తంతి' అంటే ఏమిటి? వీణ మొదలైన వాటికి వేసే ఉక్కు కమ్మి అని బహుజనపల్లివారిచ్చిన అర్థం. తెలంగాణలో ఓ దశాబ్దం క్రితం వరకు పల్లెల్లో "మీ నాయిన చచ్చిపోయిన ముచ్చట బొంబాయిల వున్న మీ అన్నకు తంతి కొట్టింర్రారా?" మోస్తరు వాక్యాలు వినవచ్చేవి. దీనికి అర్థం ఫోన్ చేశారా అని. ఇప్పుడంటే వైర్‌లెస్ సిస్టమ్‌గానీ మునుపు టెలిఫోన్ స్తంభాలు, స్తంభాల్ని కలిపే తీగలు... క్రెడిల్, రిసీవర్లు... ఇదీ ఫోన్ వ్యవస్థలోని సామాగ్రి. ఫోన్ ఆంగ్లం, తంతి సంస్కృతం. అందుకే ఇప్పటికీ ప్రమాణ భాషలో తంతితపాలాశాఖ, తంతి తపాలా కార్యాలయం వంటివే చూస్తాం. తంతి ఎంత చక్కని సంస్కృత పదం!

"గా నాట్కంల రాజేషం ఏసినోడు తల్వార్ మంచిగ తింపిండు. అచ్చం వుద్దెంల ఎట్ల పడ్తరో గట్లనే పట్టిండు" వాక్యాల్లోని "తల్వార్" సంస్కృత శబ్దం. కాకుంటే దాని మూలరూపం తరవారి. అంటే కత్తి అని అర్థం. పై వాక్యాల్లోని "వుద్దెం" అంటే యుద్ధం. యుద్ధమూ సంస్కృత శబ్దమే! పలకడానికి పదాదిలో వున్న "యు" కాన్న "వు" సులువు.

ఈ ప్రకృతిలో వున్న పర్వతాల గురించి మనకు తెలుసు. గుట్టల్ని తొలిచి మానవుడు తన అవసరాలకు రాళ్ళను వుపయోగించుకున్నాడు. రాతియుగంలోనైతే పనిముట్లు శిలల్లోంచి తయారైనవే! రాళ్ళలో కత్రౌతులు, బెందడి రాళ్ళు, కంకర్రాళ్ళు, హద్దురాళ్ళు, పొడవుగా గజం పరిమాణంలో వుండే కనీలు, పరుపులాగా పరచుకొని వుండే వెడల్పాటి "సల్పా"లు... యిట్లా పలురకాలుగా వుంటాయి. వీటిల్లో "సల్ప" సంస్కృతశబ్దమైన "తల్ప"భవం. "తల్పము" అంటే దూదిపరుపు అని అర్థం. అట్లా వుండేవే గానీ గట్టిగా వుంటాయి "సల్పరాళ్ళు".

"జెర్ర తాతిపరెంగ పో! కొద్దిగంత తాతిపరెంగ వుండు" అనడంలోని తాతిపరెం సంస్కృత తాత్పర్యం నుండి వచ్చింది. తెలుగులో దీనికి అభిప్రాయము అనే అర్థాన్ని నిఘంటువు దఖలు పరిచినా రూఢి మాత్రం సారాంశం అని. తెలంగాణ "తాతిపరెం" పదానికి అర్థం మాత్రం వేరు. ఇక్కడ కొంత నిదానం అని భావం. ఒక భాషలో ఒక అర్థంతో ప్రయుక్తమవుతున్న పదం మరో భాషలో యింకొక అర్థంతో ఉపయుక్తం కావడం మామూలే! ఉదాహరణకు "దాహం" అంటే సంస్కృతంలో కాలడం. తెల్గులో దప్పి. ఇదంతా అర్థవిపరిణామం.

"తిలకం" అంటే బొట్టు అనీ, "తిలకం" సంస్కృతం మాట అనీ అందరికీ తెలుసు. తెలంగాణలో తిలకం అంటే ఒకానొకప్పుడు తుమ్మకాయలతో ప్రత్యేకంగా తయారు చేసిన పదార్థమే! అది కాటుకలాగా నల్లగా తయారయ్యేది. నుదుట పెట్టుకునేటపుడు దాన్ని మాత్రమే "తిల్కం" అనేవాళ్ళు. అర్థ విపరిణామంలో యిది అర్థ సంకోచం అన్న మాట, "చీర"లాగా (నన్నయ కాలంలో చీర అంటే వస్త్రం అని అర్థం. ఇవాళది స్త్రీలు కట్టుకొనేది మాత్రమే).

"వాడు మస్తు తీవ్రమ్మీదవున్నడు" వాక్యంలోని తీవ్రానికి కోపం అని అర్థం. ఈ తీవ్రమూ అమరమే! ఈ మాటకు "కోపం" అనే అర్థాన్ని నిఘంటువులు చూపించకున్నా తెలంగాణ ప్రజల్లో ఆ అర్థమే వుంది. "తురుష్కుడు" సంస్కృత పదం అని శబ్ద రత్నాకరం చెబుతున్నది. ఇది "తురక" అని తెలుగులో మారింది. "ఆయనెకు తుర్కం వస్తది" అంటే ఉర్దూ భాష తెలుసని అర్థం.

"తృప్తి" అనే సంస్కృత పదం తెలంగాణ ప్రజల్లో "తుర్తి"గా వుంది. మొదటి ఋత్వం పోయింది. అయినా "ఋ"లోని ఉత్వం వుంది. ఋత్వం పోయి అది హల్లుగా ("ర") మారింది. చిత్రంగా "తృప్తి"లోని పకారం అసలే లేదు తెలంగాణలో. జానపదులు పదాల్ని యిట్లా మార్చుకుంటారు మరి! వారికి అర్థ బోధ ముఖ్యం. భాష వుద్దేశం కూడా అదే! "తైలికుడు" సంస్కృతం. అర్థం గాండ్లవాడు. కొన్ని ప్రాంతాల్లో తేలోల్లు అని కూడా అంటారు. తేల్ అంటే నూనె. తిలల్లోంచి వచ్చేదే సంస్కృత తైలం. హిందీ తేల్ అని తేలిపోతున్నది. అందుకనే తెలంగాణలో కొందరు తైలికుల్ని తేలోల్లు అని తేల్చి వేశారు. మరి గాండ్ల? ఆ పదం "గానుగల". గానుగు కట్టి నూనె తీసేవాళ్ళు గాండ్లోల్లు.

"దోర్నాలు కుచ్చి తలుపులకు మామిడాకులు పెట్టింర్రా?"లోని "దోర్నాలు" సంస్కృత తోరణాలు. కాకతీయ తోరణంలాంటి నిర్మాణాలు ఒక రకం. గుమ్మానికి మామిడాకుల్ని దారానికి కట్టి వేలాడదీయటం యింకొక విధం. సంస్కృత తోరణాలు తెలుగులో దోర్నాలు అయినై. తెలంగాణలో మోదుగాకుల్ని దబ్బనంతో గుచ్చి పెద్ద దొంతరగా చేయడమూ దోర్నాలే!

"ఆ పిలగానికి వర్దక్షిణ ఎంత యిస్తున్నరు?"లోని వర్దక్షిణ- వరదక్షిణే! ఇదీ సంస్కృతమే. సాధారణంగా యితర తెలుగు ప్రాంతాల్లో వరకట్నం అంటారు. ప్రమాణ భాష ప్రభావంతో యివాళ తెలంగాణలోనూ వరకట్నం అంటున్నారు కానీ, పల్లెల్లో చాలామంది వర్దక్షిణ అనే అంటుంటారు.

సంస్కృతంలో "దధి" అంటే పెరుగు. తెలంగాణలో వేసవిలో హోటళ్ళలో "దైవడ" లభ్యమవుతుంది. ఇది నిజానికి దహీవడ. "దహి" హిందీ. దానికి మూలం దధి. అది క్రమంగా తెలంగాణలో "దై" ఐంది. ముప్పదిలోని పది "ఫ్పై" (ముప్పై) కాలేదా? "పదిలం"లోని పది పైలంలో "పై" కాలేదా? ఇవి భాషలో సహజమైన మార్పులు. తెలంగాణలోనూ "దద్దోజనం" అనే మాట వుంది. ఇది దధి భోజనం. పిదప దధియోజనం- దద్యోజనం- దద్దోజనం.

"దశకం" అంటే పది. దశకం సంస్కృతం. తెలంగాణలో తీసివేతలో ఈ దశకం దస్కం అని వాడబడుతుంది. ఉదాహరణకు ముప్పై అనే సంఖ్య నుండి పందొమ్మిది తీసివేయాలి అనుకున్నప్పుడు- ముప్పైలో చివరి సున్నా నుండి పందొమ్మిదిలోని చివరి తొమ్మిది పోదు కనుక "దస్కం తెచ్చుకోండి పక్కన వున్న మూడులకెల్లి" అంటారు. అప్పుడు ఆ పదిలోంచి పందొమ్మిదిలోని తొమ్మిది తీసివేసి ఒకటి వేసి లెక్క పూర్తి చేస్తారు. అది గణితపరమైన లెక్క. భాషాపరమైన లెక్క ఏమిటంటే, సంస్కృత "దశకం" తెలంగాణలో "దస్కం" అవుతుందనీ, శకారం సకారం అయినా వికారం లేదనీ, పైగా "స్క" అనే సంయుక్తం సముచితంగానే యుక్తంగానే తయారవుతుందనీనూ!

"పొద్దున చచ్చిపోయిండు. ఇప్పుడే దానం అయింది. కొడుకులు బిడ్డలు అందరు సైమానికి అందింర్రు" అనే వాక్యాల్లోని "దానం" సంస్కృతం "దహనం" పదం నుండి వచ్చింది. దహనం అంటే కాలేయడం, దహన సంస్కారాలు కావించడం. సంస్కృత "దహనం" తెలంగాణ "దానం" అయ్యింది.

ఇక "దారుణం" ముచ్చట. అర్థం భయంకరం అని. వాస్తవంగా జరుగరాని ఘోరం ఏదో జరిగినప్పుడు "ఎంత దారుణం?" అంటారు ఆధునిక ప్రమాణ భాషలో. తెలంగాణలో దారుణం "దార్నం" అయింది. అంతే కాదు, అర్థం మారింది. "వానిది దార్నం పెయ్యి" అంటుంటారు. అంటే వేడి శరీరం అని. అరచేతుల్లో పైచర్మం పగుళ్ళువారినా, పైపొట్టు వంటిది లేచినా "దార్నం అయింది" అంటారు. అంటే వేడి వల్ల అలా పరిణమించింది అని. ఇక్కడ భయంకరం అనే అర్థం పోయి "వేడి" అనే అర్థం స్థిరపడింది. వేడి కావటం కూడా ఓ రకమైన భయంకరమే కదా!

"దినం" సంస్కృతం. దీనికి దివసం, పగలు అర్థాలు. తెలంగాణలో "దినాలు ఎప్పుడు?" అంటే మాత్రం ప్రత్యేకమైన దినాలు. చనిపోయినవారికి చేసే దశ దినకర్మలు మొదలైనవి (కొందరు పదకొండు, పన్నెడు రోజుల్లో చేస్తారు- మరికొందరు ఐదు రోజుల్లో ముగిస్తారు. ఇన్ని రోజుల్లో చేయాలన్న కచ్చిత నియమం లేనట్లుంది). "నీ దినాలు గాను" అనే తిట్టూ వుంది. దినాలే కాకుండా "దినవారాలు" అనే సమాస ప్రయోగమూ వుంది. నిజామాబాదు ప్రాంతాల్లో "దెవ్సాలు ఎప్పుడు" అంటారు. ఇందులోని "దెవ్సాలు" సంస్కృత "దివసాలు". ఇవీ దినవారాల్లాంటివే! "వానికి నేను దినాం చెప్తున్న. ఇంటనే లేడు" అనటంలోని "దినాం" అంటే దినదినం, అనుదినం, ప్రతిదినం అని అర్థం. ఇదే అర్థంలో "నిత్తె చెప్తున్న" అంటుంటారు. అంటే నిత్యం అని అర్థం. ప్రతి రోజూ అని. నిత్తెలో నిత్యంలోని సున్నా లోపించింది. ఇది కన్నడ ప్రభావం. పైగా "నిత్తె"లో చివర ఎకారం వుంది. అదీ కన్నడ ప్రభావమే! కన్నడ ఆదికవి పంపను పోషించిందీ తెలంగాణనే కదా! (వేములవాడ చాళుక్యరాజు రెండవ అరికేసరి).

"ఏ... ఆయినె దీక్ష తీసుకున్నడు. తిను తాగు అని బలవంతం చెయ్యకుండ్రి"లోని "దీక్ష" సంస్కృతం. "దీపావళి" చిత్రంగా "దీలె", "దివిలె" లోనగు రూపాలు మారివుంటుంది. అయితేనేం... దీపాలవుతే వుంటాయి. "దీర్ఘము" అంటే నిడుద, ఆయతం అని అర్థాలు. "వీడు ప్రతిదానికి దీర్గం తీసి చెప్తడు" అంటే సాగదీస్తాడు అని అర్థం. ఇక... "దుఃఖం" తెలంగాణలో "దుక్కం" అయితుంది (దుక్కం లేనోడు బర్రెను కొనుక్కున్నట్లు- అని ఒక సామెత).

ఈ విధంగా సంస్కృత భాషా పరిష్వంగంతో తెలంగాణ పదం ముదమార పరవశించింది.

■ **నలిమెల భాస్కర్**
97043 74081



ద్రిమ్మరి

బయట ముసురు పట్టినా
నీలో కురిసే వర్షాన్ని జారనీకు
ఏ మైదానమూ స్వీకరించని వాన చినుకువి నీవు

నీవెంత బలహీనుడివో...
మనుషులు వెళ్ళిపోయాక
నీడలతో సహవాసం చేస్తావు
ఒక్క నీడా నీ కరచాలనాన్ని అందుకోలేదని
అందరూ ఇక ఇప్పుడు నిన్ను ఎగతాళి చేస్తున్నారు

నిన్ను నీవు రిక్తం చేసుకుని అందించిన చేతిని
ఎవరూ స్వీకరించని తిరస్కృతుడివి నీవు
నీ లోపల గడ్డ కట్టిన సంస్కారాన్ని
అనుభవించలేని మర్యాదస్తుల మధ్య తిరుగాడే ద్రిమ్మరివి నీవు

ఏ ప్రాచీన రేవు పట్టణంలోనో
ఎప్పటికీ రాని ఓడ కోసం
తీరం వెంబడి ఎదురు చూసే
శాపగ్రస్త యాత్రికుని నిరీక్షణవు నీవు

నీవొక పురాస్మృతి వనానివి
నీవెప్పుడూ శిథిలాల మధ్య, చిగురాకుల మధ్య
ఒకానొక జ్ఞాపకంలో నిక్షిప్తమైన రహస్యం కోసం
అన్వేషిస్తుంటావు

జలపాతం బండరాళ్లకు తగిలి ఛిద్రమైన శబ్దాలను
వెన్నెల చిందుతున్న నిశ్శబ్ద రాత్రులలోని మౌనాన్ని
అనువదించే మార్మిక బేహారివి

అడవిలో గుబురుగా పెరిగిన వెదురు పొదలలో వినిపించే వేణువులో
ఏదో నిగూఢ సందేశం అందుతుందేమోనని ఎదురు చూసే ఆశవు నీవు

వర్షాన్ని, వెన్నెలను, వేణువును,
జలపాతాల్ని, మబ్బులను, మల్లెలను, నవ్వులను
పసిపాపల్ని పొదుముకున్న ఆనందానివి నీవు

■ **మల్లవరపు ప్రభాకరరావు**

'ఏంలేదు' కాదు, ఎంతో ఉంది.

చిత్తూరు జిల్లా చౌడేపల్లిలో మార్చి రెండో తేదీ ఉదయం పదిగంటలకు, చాలామంది జనం మధ్య ఉండి కూడా ఒంటరిగా మిగిలాను. నా స్నేహితుడని గర్వంగా చెప్పుకోగలిగిన నాయుని కృష్ణమూర్తి కొంచెం దూరంగా విగతజీవిగా వున్నాడు (ఐస్ బాక్స్‌లో). అతని జీవితపు ఆఖరి ఘట్టం చూస్తున్న నాకు గుండెలో దుఃఖం సుళ్ళు తిరుగుతోంది. అతని జీవితం తొలి దశ నుంచీ జ్ఞాపకాలు ఉప్పెన ముంచెత్తుతోంది.

కృష్ణమూర్తి ఇటీవలే 'ఏం లేదు' అనే కథా సంకలనం వెలువరించారు. నిజానికి అతని జీవితంలో ఎంతో వుంది. 1951లో చిత్తూరు జిల్లా ఒక మారుమూల పల్లెలో నాయుని రామయ్య, నర్సమ్మ దంపతుల నాలుగో కుమారుడిగా అతని జీవిత ప్రస్థానం ప్రారంభమయింది. తండ్రి ఉపాధ్యాయుడు కావటంతో చదువు అబ్బింది. 1974 సంవత్సరంలో ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ నుంచి పట్టభద్రుడు కావటమే కాకుండా, అదే సంవత్సరం ఆంధ్రప్రభ నవలల పోటీలో 'యామినీ కుంతలాలు' అనే నవలకు బహుమతి పొంది రచయితగా కూడా జన్మించాడు. ప్రభుత్వోద్యోగం అన్న ఆలోచనే నచ్చలేదు అప్పటి కృష్ణమూర్తికి, అదృష్టవశాత్తూ! అందువల్లే ఇప్పటి ఈ కృష్ణమూర్తి రూపొందాడు. జీవనోపాధి కోసం తనకి 'తృప్తి'నిచ్చే వ్యాపకం ఎంచుకొన్నాడు. చెన్నై (అప్పటి మద్రాసు) వచ్చి విజయబాపినీడు గారు నిర్వహించిన 'బొమ్మరిల్లు', 'విజయ', 'నీలిమ' పత్రికల్లో ఉపసంపాదకుడిగా చేరాడు. తర్వాత కొన్నాళ్ళపాటు 'చక్రవర్తి' మాస పత్రిక, 'స్నేహబాల' పిల్లల మాసపత్రికకు సంపాదకత్వం వహించారు.

ఇంతవరకూ అతని వివరాలు నేను విన్న విశేషాలు మాత్రమే. చెన్నైలోనే 'జ్యోతి' మాసపత్రిక సంపాదక శాఖలో పనిచేస్తున్న నాకు, ఈ కృష్ణమూర్తితో ధనికొండ హనుమంతరావుగారి ప్రింటింగ్ ప్రెస్‌లో స్నేహం కుదిరింది. ఇద్దరం మా పత్రికల పనుల మీద అక్కడ తరచూ కలిసేవాళ్ళం. ఆ స్నేహం వ్యక్తిగతం దాటి కుటుంబ బంధంగా పెరిగింది. ధృడపడింది. ఆ తర్వాత కృష్ణమూర్తి జీవనయానం నాకు పరిచితంగానే జరిగింది.

చదువు, సాహిత్యం మీద అభిరుచి కృష్ణమూర్తిని కేవలం ఒక పత్రికా ఉద్యోగిగా మాత్రమే ఉండనివ్వలేదు. అప్పటికే ఉపాధ్యాయులుగా వున్న ఇద్దరు అన్నలతో కలసి విద్యార్థులకు ఉపయోగపడే 'మాబడి', 'పాఠశాల' పత్రికలు ప్రారంభించారు. అలా చెన్నై నుంచి తిరిగి చౌడేపల్లికి చేరిన అతని జీవితం ఎన్నో విధాల వికసించటం ప్రారంభించింది. కుటుంబ సంస్థగా ప్రారంభమైన 'విజయవాణి' పత్రికలతోపాటు, ఒక రెసిడెన్షియల్ పాఠశాల, పెద్ద ముద్రణాలయం స్థాపించటం వరకూ ఎదిగింది.

ఈ క్రమంలో అద్భుతాలు చేసాడు కృష్ణమూర్తి. పిల్లల కోసం ఎన్నో పుస్తకాలు రూపొందించాడు. ఎలిమెంటరీ స్థాయి పిల్లలకు ఈయన రూపొందించిన 125 పుస్తకాల సెట్ నభూతో న భవిష్యతిగా వర్ణించదగ్గది. నిరంతరం పిల్లల విద్య గురించే ఆలోచించి చాలా సంవత్సరాలు శ్రమించి తెలుగు-ఇంగ్లీషు నిఘంటువు, నాలుగు వేల పదాలతో ఇంగ్లీషు సచిత్ర నిఘంటువు, ఎనిమిది వేల పదాలతో తెలుగు-ఇంగ్లీషు విద్యార్థి నిఘంటువు, ఒక బొమ్మల నిఘంటువును రూపొందించారు. అక్షరాస్యత పెంచే ఉద్దేశ్యంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ఎన్నో కార్యక్రమాలలో కీలక పాత్ర వహించారు. రాష్ట్ర సాక్షరతా సమితి మిషన్ సభ్యుడిగా, జాతీయ స్థాయిలో అక్షరాస్యత సంస్థ సభ్యుడిగా కూడా వుండి విశేషమైన సేవలు అందించారు. ఈ క్రమంలో నూతన అక్షరాస్యుల కోసం ఈయన సంపాదకత్వం వహించిన 'వెలుగుబాట' పత్రికను యూకె ప్రభుత్వం నియమించిన ఒక కమిటీ సభ్యులు అలెన్ రోజర్స్, డిరైన్ హాలండ్ ఇండియాలోనే ఒక కేస్ స్టడీగా ఎన్నుకొన్నారు. 1995లో డిరైన్ హాలండ్ చౌడేపల్లి వచ్చి 'విజయవాణి' ప్రెస్‌ని సందర్శించి, నాయుని కృష్ణమూర్తిని ఇంటర్వ్యూ చెయ్యటం ఒక గొప్ప విశేషం.



నాయుని కృష్ణమూర్తి

విద్యారంగంలో ఈ కృషికి సమాంతరంగా రచనా వ్యాసంగం కొనసాగిస్తూ 'ప్రలోభం', 'యామినీ కుంతలాలు', 'మనసు గుర్రమురోరి మనిషీ' నవలలూ; 'ఈ కోతి డ్రామాకు పనికి వస్తుందా', 'వియోగ విభావరి' నాటికలూ; 'నాయుని కృష్ణమూర్తి కథలు', 'ఏం లేదు' కథా సంపుటి వెలువరించారు.

రామాయణాన్ని 14 భాగాలుగా విడదీసి అర్థమయేలా తెలుగులో రూపొందించిన సెట్‌తో పాటు, వాల్మీకి రామాయణాన్ని, పోతన భాగవతాన్ని, తెలుగు భాషలో అనువదించి అందించారు. ఇటీవలే వ్యాస భారతాన్ని 'జయం' పేరుతో నవలగా ప్రచురించారు.

నేను కథ అందించిన 'మహర్షి' సినిమాలో అత్యంత ప్రజాదరణ పొందిన "సుమం ప్రతి సుమం" పాట కృష్ణమూర్తి రాసిందే. దర్శకుడు వంశీ ప్రోత్సాహంతో ఈ పాట రాశారీయన. నిజానికి ఈ పాట రాయటానికి ముందు ఒక పాటని కృష్ణమూర్తితో రాయించటమూ, దాని రికార్డింగ్ రోజు ఆఖరి నిముషంలో ఆ ట్యూన్ మార్చి మరో ట్యూన్ వాడదామనుకొన్న సంగీత దర్శకుడు ఇళయరాజా, దర్శకుడు వంశీ నిర్ణయం మేరకు ఆ స్టూడియో దగ్గరే కూర్చుని ఒక గంటలోనే ఈ పాట రాశారు కృష్ణమూర్తి.

సాహిత్యకారుడిగానే కాక, గొప్ప స్నేహశీలిగావున్న కృష్ణమూర్తిని ఎందరో రచయితలూ, సాహిత్యకారులూ గొప్ప మిత్రుడిగా భావించి ప్రేమించారు. మద్రాసులో ఇద్దరికీ సన్నిహితుడైన ఒక మిత్రుడు విపరీతమైన ఆర్థిక ఇబ్బందుల్లో వుంటే 'నేనున్నా'నని అభయం ఇచ్చి ఆ కుటుంబాన్ని చౌడేపల్లికి పిలిచి, పని కల్పించి, వారి పిల్లలకు చదువు చెప్పించి, ఇప్పుడు చక్కగా సెటిల్ అయిన కుటుంబంగా మారటానికి కారణమయింది అతని స్నేహగుణం. ఒక్క మాటలో చెప్పాలంటే తెల్లగడ్డం, తెల్ల జుట్టుతో రుషిలా కన్పించే కృష్ణమూర్తి నిజంగా రుషిలాంటి వాడే. రాగద్వేషాలకు అతీతుడు. స్నేహానికి సార్థకత కలిగించినవాడు, ప్రేమను మాత్రమే పంచినవాడు. ఆర్థికంగా ఉన్నత స్థాయికి ఎదిగిన కృష్ణమూర్తి, ఆ స్థితి కల్పించిన సౌకర్యాలను అనుభవించాడు తప్ప అహంకారాన్ని ఒంటికి పూసుకోలేదు. ఇంతటి గొప్ప మనిషికి నిజమైన అండగా, భార్యగా, సహచరిగా, స్నేహితురాలిగా, సేవకురాలిగా పద్మ అందించిన సహకారం గురించి తప్పక చెప్పాలి.

ఇంతటి సార్థక జీవితం చివరి రెండేళ్ళు అనారోగ్యపు కుదుపుకు లోనైంది. కృష్ణమూర్తిని విసిగించింది. కృంగదీసింది. 'నన్ను నేను చూసుకొంటే జాలి కలగలేదుగాని, ఎదుటివాళ్ళు పరామర్శిస్తుంటే కన్నీళ్ళు ఉబికివచ్చాయి' అనుకునేలా బాధించింది. 'ఇలా ఎంతదూరమో ఎవరికి తెలుసు' అని ఈ అనారోగ్యపు హింస గురించి కృష్ణమూర్తి చివర్లో రాసిన ఒక తాత్వికత నిండిన వ్యాసంలో చివరి వాక్యాలు: "చినుకులు ఆగటం లేదు. వాటికి తోడు మెరుపులు. అప్పుడప్పుడు ఉరుములు నాకు చిత్తభ్రమణం కల్పించాయి. నెమ్మదిగా అడుగులో అడుగులేసుకుంటూ ముందుకు గమించాను. మళ్ళీ వెనక చరచరమని ఒక సవ్వడి. తలతిప్పి దానిని చూడదలుచుకోలేదు. వాన ఉధృతి తగ్గలేదు. నా వెనక వస్తున్న పాము వేగం తగ్గించలేదు. అడుగు ముందుకు పడుతూనే ఉంది." ఆ పాము మరింత వేగం పుంజుకొని మార్చి 1, 2018 ఉదయం కృష్ణమూర్తిని కాటేసింది. దాదాపు 67 సంవత్సరాల ఆయన జీవితపు అడుగులు ఆగిపోయాయి.

■ **వేమూరి సత్యనారాయణ**
98483 21703


చీనీ మినీ కవిత

నా కవిత్వం నా ఇష్టం

సముద్రం వొడ్డున ఇసుక తిన్నెల మీద
తన పొడవైన ముక్కుతో సీరియస్‌గా
కవిత్వం రాసుకుంటూ పోతూ వుంది ఓ పక్షి
విప్పారిన చీపురుకట్టలా వున్న దాని తోక
ఆ కవిత్వాన్ని చెరిపేస్తూ వుంది.

ఇదేమిటి? అడిగింది మరో పక్షి ఆశ్చర్యంగా
"నా కవిత్వం - నా ఇష్టం ఇతరులెవ్వరూ
చదవడానికి వీల్లేదు" అంది నిర్లక్ష్యంగా

■ **తెలుగు అనుసరణ: మహాస్వప్న**



కథారచనపై ఒక్కరోజు కార్యశాల

తెలంగాణ విశ్వవిద్యాలయం, డిచ్‌పల్లి, నిజామాబాద్; తెలంగాణ సాహిత్య అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో కథా రచనపై ఒక్కరోజు కార్యశాల మార్చి 14న ఉ.10గం.ల నుంచి తెలంగాణ విశ్వవిద్యాలయంలోని న్యాయకళాశాల సమావేశ మందిరంలో జరుగుతుంది. ప్రారంభ సభకు ముఖ్య అతిథి పి.సాంబయ్య; విశిష్ట అతిథి నందిని సిధారెడ్డి; గౌరవ అతిథులు ఎ.రవీందర్‌రెడ్డి, కె.శివశంకర్, శంకరగిరి నారాయణస్వామి; కీలకోపన్యాసం కె.శ్రీనివాస్, సభాధ్యక్షులు వి.త్రివేణి. తర్వాతి సమావేశాల్లో నాళేశ్వరం శంకర్, స్వాతి శ్రీపాద, కాసుల ప్రతాపరెడ్డి, బి.వి.ఎన్.స్వామి, పెద్దింటి అశోక్ కుమార్, నలిమెల భాస్కర్ తదితరులు పాల్గొంటారు.

- వి. త్రివేణి

తెలంగాణ వచన కవితా వికాసం

హనుమకొండ ఆర్ట్స్&సైన్స్ కళాశాల, తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో బన్న అయిలయ్య సంచాలకులుగా 'తెలంగాణ వచన కవితా వికాసం' అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు మార్చి 22, 23 తేదీల్లో జరుగుతుంది. సదస్సులో నందిని సిధారెడ్డి, ఏనుగు నరసింహారెడ్డి, రామాచంద్రమౌళి, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, కాత్యాయనీ విద్మహే తదితరులు పాల్గొంటారు.

- బన్న అయిలయ్య

'జ్ఞాపకాల్లో ఇంద్రవెల్లి' కవితా సంపుటి

ఇంద్రవెల్లి ఘటన జరిగి 37ఏళ్ళు కావొస్తున్న సందర్భంగా తీసుకువస్తున్న కవితా సంపుటికోసం కవితలు, జ్ఞాపకాల పంక్తులు, అనుభవ వాక్యాలను చిరునామా: జయధీర్, ప్లాట్ నెం.81, తిరుమల హిల్స్, నియర్ గోల్డెన్ టెంపుల్, పుప్పాలగూడ, మణికొండ, హైదరాబాద్-89కు గానీ, ఈమెయిల్: gyapakalloindravelli@gmail.comకు గానీ పంపగోరుతున్నాం.

- ఎస్. సుధాకర్

కవిసంధ్య కవితల పోటీ ఫలితాలు

కవిసంధ్య-పానుగంటి కవితల పోటీలో మొదటి బహుమతి (రూ.3000): బంగార్రాజు కంఠ, విజయవాడ; రెండవ బహుమతి (రూ.2000): పి.అశోక్ కుమార్, యానాం; మూడవ బహుమతి (రూ.1000): బండారి రాజ్‌కుమార్, వరంగల్‌కు ప్రకటిస్తున్నాం. ప్రత్యేక బహుమతి (రూ.500) సాంధ్యశ్రీ, నిశాపతి, దేశరాజు, సి.ఎస్.రాంబాబు, కుంచె నాగసత్యనారాయణ, పల్లెపట్టు నాగరాజు, మార్ని జానకిరామచౌదరి, ఆకొండి ధన్వంతరి, కె.ఉషాసరస్వతి, టి.వెంకటేష్ లకు. మార్చి 21న బహుమతి ప్రదానం ఉంటుంది.

- కవిసంధ్య

కె.వి.ఆర్ 'శీర్షికలు' ఆవిష్కరణ

కె.వి.ఆర్ (కె.వి. రమణారెడ్డి) వివిధ పత్రికలలో నిర్వహించిన 'శీర్షికలు' అదే పేరుతో పుస్తకంగా వస్తున్నాయి. పుస్తకావిష్కరణ సభ మార్చి 23 సా.5.30ని.లకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలు, చల్లపల్లి బంగ్లా వద్ద, విజయవాడ నందు జరుగుతుంది. అధ్యక్షత వి.చెంచయ్య, ఆవిష్కర్త హెచ్.ఎస్.వి.కె రంగారావు, స్మారకోపన్యాసం పాణి (అంశం: దళితుల ఆకాంక్షలు-బూర్జువా దళితవాదం).

- కె.వి.ఆర్. శారదాంబ స్మారక కమిటీ

పంచాయతీలకు నేరుగా నిధులు

జనాభా ప్రాతిపదికన గ్రేడ్‌ల విభజన

- ఈ వార్షిక బడ్జెట్‌లో కేటాయింపులు?
- రూ. 5లక్షల నుంచి 15లక్షల వరకు వచ్చే అవకాశం

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు శుభ వార్త! కనీస సౌకర్యాల కల్పన కోసం నిధులులేక అల్లాడుతున్న వాటికి ఇక మహర్దశ పట్టనుంది! పంచాయతీలకు నేరుగా నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువగా ఉండేవి గ్రామ పంచాయతీలే. వీటికి ఇప్పటివరకు వివిధ పథకాల కింద తప్ప.. ప్రత్యేక నిధులంటూ ఏ కేటాయింపులూ లేవు. రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులను సమకూరుస్తున్నప్పటికీ అవి నామమాత్రమే. దీంతో కనీస సౌకర్యాలు, మౌలిక సదుపాయాల కల్పన ఇబ్బందిగా మారుతున్నదని గ్రామ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో జనాభా ఆధారంగా గ్రామ పంచాయతీలకు నేరుగా నిధులను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదేవిధంగా పట్టణ స్థానిక సంస్థలైన మున్సిపాలిటీలకు కూడా నేరుగా నిధులు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు 2018-19 వార్షిక బడ్జెట్ ప్రతిపాదనల్లో ఈ కేటాయింపులు ఉండనున్నాయని విశ్వసనీయ సమాచారం. పంచాయతీల జనాభా ఆధారంగా మూడు, నాలుగు, ఐదు గ్రేడ్‌లుగా వర్గీకరించి రూ. 5లక్షలు, రూ. 10లక్షలు, రూ. 15లక్షలు చొప్పున కేటాయింపులు జరపాలని ప్రభుత్వం భావిస్తోంది. గత సంవత్సరం కొన్ని మున్సిపాలిటీలకు బడ్జెట్ అనంతరం ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద కొంత మొత్తాన్ని కేటాయించారు. బడ్జెట్‌లో నగరాలకు కేటాయింపులు జరిపారు. ఈసారి నగరాలు, మున్సిపాలిటీలు అన్నింటికీ వాటి గ్రేడ్‌ల ఆధారంగా ప్రత్యేక నిధులు కేటాయించనున్నారు.

మండల, జిల్లా పరిషత్తుల నిరీక్షణ

పంచాయతీరాజ్‌లో గ్రామ పంచాయతీలు, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులు అనే మూడంచెల వ్యవస్థ ఉంది. 13వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం ఈ మూడంచెలకు సమకూర్చేది. 14వ ఆర్థిక సంఘం నుంచి కేవలం గ్రామ పంచాయతీలకు, పట్టణ స్థానిక సంస్థలైన మున్సిపాలిటీలకే నిధులు కేటాయించింది. మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులకు పెద్దగా నిధులు లేవు. దీంతో ఈ రెండు అంచెల్లోని ప్రజాప్రతినిధులు తాము ఉత్సవ విగ్రహాలమవుతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కనీసం 15వ ఆర్థిక సంఘం ప్రతిపాదనల్లోనైనా వీటిని చేర్చాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సూచించింది. అటు కేంద్రం, ఇటు రాష్ట్రం కూడా మండల, జిల్లా పరిషత్తులకు నిధులు కేటాయించే విషయంలో స్పష్టతనివ్వడం లేదు. కనీసం మండల ప్రాదేశిక నియోజకవర్గ అభివృద్ధి నిధులైనా, జిల్లా ప్రాదేశిక నియోజకవర్గ అభివృద్ధి నిధులైనా కేటాయించాలని జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు దీర్ఘకాలంగా పోరాడుతున్నారు. రాష్ట్రంలో ఉన్న 9 జిల్లా పరిషత్తుల్లోనూ అధికార పార్టీ పాలకమండళ్లే ఉన్నాయి. ప్రస్తుత జిల్లా, మండల పరిషత్తుల పాలకమండళ్ల గడువు ఏడాదిన్నర కూడా లేదు. ఈ సారైనా నిధులు కేటాయించాలని జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు కోరుతున్నారు. జిల్లా, మండల పరిషత్‌లకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, లేదా నియోజకవర్గ అభివృద్ధి నిధుల కింద కేటాయింపులు జరపాలని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మన్నగారి మనోహర్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ.. కేసీఆర్ సొత్తు కాదు

- నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని తెరిపిస్తాం:కేంద్ర మంత్రి హన్స్‌రాజ్



బోధన్, మార్చి 11 : తెలంగాణ రాష్ట్రం.. సీఎం కేసీఆర్, ఆయన కుమార్తె, కొడుకు, అల్లుడి సొత్తు కాదని కేంద్ర మంత్రి హన్స్‌రాజ్ గంగారాం వ్యాఖ్యానించారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన చెరుకు రైతు చర్నాకోల్ పాదయాత్ర ముగింపు సభ ఆదివారం నిజామాబాద్ జిల్లా బోధన్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా హన్స్‌రాజ్ మాట్లాడుతూ టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని, అధికారం ఎవరికి అప్పగించాలో ప్రజలే నిర్ణయిస్తారన్నారు. నిరుద్యోగం, పేదరికం నిర్మూలించడమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రామగుండంలో ఎరువుల కర్మాగారం మాదిరిగా నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో మూతపడిన ఐడీపీఎల్ కర్మాగారాన్ని తిరిగి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు కేంద్రం నిధులు ఇస్తోందని, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కోట్లాది రూపాయల మంజూరు చేసిందని పేర్కొన్నారు. ప్రజల కోసం పని చేస్తున్నందు వల్లే త్రిపుర, జమ్ముకశ్మీర్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చామన్నారు. నిజాంలను తరిమికొట్టిన చరిత్ర, వారసత్వం మనకుందని, బీజేపీ దేశ భక్తుల పార్టీ అని వ్యాఖ్యానించారు. తెలంగాణలో రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని జోస్యం చెప్పారు.

పిల్లలతో ఆయుధాల సరఫరా

ఛత్తీస్‌గఢ్ టూ తెలంగాణ.. మావోయిస్టుల పనే అంటున్న పోలీసులు.. అటవీ ప్రాంతాల్లో పెరిగిన కూంబింగ్

- తెలంగాణలో పాగా వేసేందుకు వ్యూహాలు
- సరిహద్దుల్లో డ్రోన్లతో గ్రేహౌండ్స్ నిఘా





ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా అటవీ ప్రాంతంలో లభించిన ఆయుధాలు, పోలీసుల అదుపులో మహిళలు, పిల్లలు

భూపాలపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మావోయిస్టులు దండకారణ్యాన్ని ఆయుధాగారంగా మార్చుకుంటున్నారా? తెలంగాణలో పాగా వేసేందుకే ముందస్తుగా ఆయుధాలను సమకూర్చుకుంటున్నారా..? ఛత్తీస్‌గఢ్ సరిహద్దు దాటి తెలంగాణలో ప్రవేశించేందుకు మహిళలు, పిల్లలను ఆయుధాలు సరఫరా చేసేందుకు వినియోగించుకుంటున్నారా..? అంటే ఔననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మావోయిస్టులు గత కొన్నేళ్లుగా తెలంగాణ సరిహద్దుల్లోని ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల్లో బలమైన కేడర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఆయా రాష్ట్రాల దండకారణ్యంలో ఇటీవల పోలీసుల తనిఖీలు పెరిగాయి. ఈ నేపథ్యంలో మావోయిస్టులు తెలంగాణ వైపు దృష్టి సారించారనే ప్రచారం జరుగుతోంది. పాత వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లోకి చొరబడేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లుగా ఇంటెలిజెన్స్ వర్గాలు కూడా పలుమార్లు పోలీసులను హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఇటీవల తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించడంతో జయశంకర్ జిల్లా వెంకటాపురం సమీపంలోని పూజారి కాంకేర్ అడవుల్లో భారీఎన్‌కౌంటర్ చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 6న సుకుమా జిల్లా దోర్నపాల్ అటవీ ప్రాంతంలోని మధుబాన్ ఏరియాలో సీఆర్‌పీఎఫ్, గ్రేహౌండ్స్ దళాలు కూంబింగ్ నిర్వహిస్తుండగా భారీగా ఆయుధాలు లభించినట్లు సమాచారం. ఇందులో 5 ఎస్ఎల్ఆర్, 2 ఐఎన్ఎస్ఏఎస్, నాలుగు 302 రైఫిళ్ల, ఒకటి ఏకేఎం, ఒకటి ఏకే 47, ఒకటి కంట్రీమేడ్ పిస్తల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే ఈ ఆయుధాలను పిల్లలు, మహిళలు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లుగా పోలీసు బలగాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అటవీ సరిహద్దు ప్రాంతాల్లో ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయడంతో పాటు అనుమానితులను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. వేసవి కావడంతో దండకారణ్యం సైతం పలుచబడుతుండడంతో పోలీసులు సరిహద్దుల్లో డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది.

టీఆర్ఎస్ కార్యకర్తపై చొప్పదండి ఎమ్మెల్యే దాడి



ఎఫ్ఐఆర్ కాపీని చూపుతున్న నర్సింబాబు

కరీంనగర్ క్రైం, మార్చి 11 : చొప్పదండి ఎమ్మెల్యే బొడిగె శోభ.. టీఆర్ఎస్ కార్యకర్త తడగొండ నర్సింబాబుపై చేయిచేసుకున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎంపీ వినోద్‌కుమార్ ఇంటి వద్ద ఆదివారం ఉదయం ఈ ఘటన జరిగింది. బాధితుడు రామడుగు మండలం తిర్మలాపూర్‌కు చెందిన నర్సింబాబు మాట్లాడుతూ చొప్పదండి టీఆర్ఎస్ నాయకుడు సుంకె రవిశంకర్‌తో కలిసి తాను ఆదివారం ఉదయం ఎంపీ ఇంటికి చేరుకున్నానని, అక్కడికి ఎమ్మెల్యే బొడిగె శోభ కూడా వచ్చారన్నారు. కొద్దిసేపటికి తాను ఎంపీ ఇంటి నుంచి బయటకు వచ్చి మళ్లీ వెళ్లేందుకు లిఫ్ట్ వద్దకు చేరుకోగా అక్కడే ఉన్న ఎమ్మెల్యే శోభ తనపై భౌతిక దాడికి పాల్పడి, దూషించారని ఆరోపించారు. ఎమ్మెల్యేతోపాటు ఆమె గన్‌మెన్ కలిసి తనను లిఫ్ట్‌లోకి నెట్టేయగా అక్కడి నుంచి తప్పించుకుని వచ్చానన్నారు. తను సుంకె రవిశంకర్‌తో తిరుగుతున్నానని ఆగ్రహం వ్యక్తం చేస్తూ 'నీ అంతుచూస్తానని, చంపుతానని ఎమ్మెల్యే హెచ్చరించిందని' ఆరోపించారు. ఎమ్మెల్యే నుంచి తనకు ప్రాణభయం ఉందని, తనపై దాడి చేసిన ఎమ్మెల్యేపై చట్టపరమైన చర్యలు తీసుకుని తన కుటుంబానికి రక్షణ కల్పించాలని బాధితుడు కరీంనగర్ రెండో ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే శోభ, చొప్పదండి టీఆర్ఎస్ నాయకుడు సుంకె రవిశంకర్‌లతో ఎంపీ తన ఇంటిలో మాట్లాడుతుండగానే ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగిందని సమాచారం. ఫిర్యాదుపై విచారణ జరుపుతున్నామని ఠాణా సీఐ మహేష్‌గౌడ్ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

శాలిగౌరారం, మార్చి 11: అప్పుల బాధతో నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామానికి చెందిన యానాల శేఖర్‌రెడ్డి(50) ఆత్మహత్య చేసుకున్నాడు. శేఖర్ రెడ్డి రెండు ఎకరాల్లో నిమ్మ తోట, మరో రెండున్నర ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. ఇటీవల రెండు బోర్లు వేయగా, నీరు పడలేదు. వాటి ఖర్చు, పత్తి పెట్టుబడికి చేసిన అప్పులు కలిపి సుమారు రూ.4 లక్షలయ్యాయి. భార్య అనారోగ్యానికి గురికావడంతో చికిత్స కోసం మరో రూ.2లక్షలు అప్పు చేశాడు. అప్పులు తీర్చే మార్గంలేక ఆదివారం తెల్లవారుజామున వ్యవసాయ బావి వద్ద పురుగు మందు తాగాడు.



ఓ వ్యక్తి తన భార్య, ముగ్గురు పిల్లలు, లగేజీతో బైక్‌పై ప్రయాణిస్తున్న దృశ్యమిది. ఆదివారం మధ్యాహ్నం వనపర్తి జిల్లా కొత్తకోట మండల కేంద్రంలో ట్రాఫిక్ ఉల్లంఘనలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన పోలీసులు.. ఈ సీన్ చూసి అవాక్కయ్యారు. 'దండం పెడతాం.. ఇలాంటి ప్రయాణాలొద్దు' అంటూ వారికి నచ్చజెప్పారు. - కొత్తకోట

ఆర్మీ జవాను ఆత్మహత్య



తాంసి, మార్చి 11: దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న ఓ జవాను ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం బెల్సరి రాంపూర్ గ్రామానికి చెందిన పుర్క సుఖ్ దేవ్(24) ఆర్మీ జవానుగా సరిహద్దు ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం విధి నిర్వహణలో ఉండగా తుపాకీతో కాల్చుకుని మృతి చెందాడు. సుఖ్ దేవ్ 2013లో ఆర్మీలో చేరాడు. ఆదివారం మధ్యాహ్నం ఆయన మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. అంత్యక్రియల్లో పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ తెగలకు చెందిన నాయకులు, గిరిజన కుటుంబాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జవాను మృతికి గల కారణాలు తెలియరాలేదు.

చెరువులో పడి బాలుడు మృతి

రఘునాథపల్లి రూరల్, మార్చి 11: జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామంలో పదకొండేళ్ల బాలుడు చెరువులో పడి మృతి చెందాడు. చింత శోభ, రమేష్ దంపతుల ఏకైక కుమారుడు సాత్విక్ (11) ఐదో తరగతి చదువుతున్నాడు. గ్రామ సమీపంలో ఉన్న పెద్ద చెరువులో ఎండ వేడికి చనిపోతున్న చేపలను చూసేందుకు స్నేహితులతో కలిసి శనివారం సాయంత్రం వెళ్లాడు. అందులో లోతు ఎక్కువ ఉండడంతో మునిగిపోయాడు.

ఈటలపై రేవంత్ ఆరోపణలు అవాస్తవం

- రేవంత్‌రెడ్డిపై ఉత్తమ్‌కు ఫిర్యాదు చేస్తాం: రైస్‌మిల్లర్లు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): మిల్లింగ్ చార్జీలు పెంచడంలో మంత్రి ఈటల రాజేందర్ మిల్లర్ల నుంచి లంచాలు తీసుకున్నారని కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. పీడీఎస్ బియ్యాన్ని సన్నబియ్యంగా మార్చి ఇస్తున్నారనే ఆరోపణలో నిజం లేదని, తాము ఎవరికీ కమీషన్లు ఇవ్వలేదని స్పష్టం చేసింది. ఈ మేరకు వరంగల్, భూపాలపల్లి, నిజామాబాద్‌లోని సుభాష్‌నగర్‌లో రైస్‌మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రేవంత్‌పై పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. మార్చి 31లోగా మిల్లింగ్ చార్జీలను చెల్లించాలని లేకపోతే ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామన్నారు. కాగా, పేద విద్యార్థులు ఆకలితో అలమటిస్తుంటే వారికి సన్నబియ్యంతో భోజనం పెట్టాలనే ఆలోచన చేసింది ఈటల రాజేందర్ అని.. అలాంటి వ్యక్తిపై రేవంత్ ఆరోపణలు అర్థరహితమని పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్లు అన్నారు.

కాలి వేళ్లపై పరుగు

- రికార్డు కోసం కరీంనగర్ యువకుడి ప్రయత్నం



కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 11: ఎవరూ చేయని ప్రయత్నం ద్వారా గిన్నిస్ రికార్డు సాధించాలనేది ఆ యువకుడి సంకల్పం. కరీంనగర్ కోతిరాంపూర్‌కు చెందిన రాపెల్లి శ్రీనివాస్ ఆదివారం ఇందుకోసం ప్రయత్నించాడు. గిన్నిస్ బుక్ రికార్డు చరిత్రలో ఇప్పటి వరకు మునికాలి వేళ్లపై పరుగెత్తిన రికార్డులు చోటు చేసుకోలేదు. ఈ అరుదైన ఘట్టానికి తెర లేపి కేవలం నిమిషం వ్యవధిలో 137.15 మీటర్ల దూరం పరుగెత్తాడు శ్రీనివాస్. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియం వేదికగా ఉదయం ఈ ఫీట్ జరిగింది. గిన్నిస్ బుక్ ప్రతినిధి, జిల్లా ఒలింపిక్ సంఘం బాధ్యుల సమక్షంలో ఈ ఫీట్ వీడియో చిత్రీకరణ జరిగింది. శ్రీనివాస్ నిమిషంలో 137.15 మీటర్ల దూరం పరుగెత్తాడు. ప్రపంచంలో ఎవరూ చేయలేనిది తాను చేయాలన్న సంకల్పంతో కొన్ని సంవత్సరాల నుంచి కాలి ముని వేళ్లపై పరుగు పెట్టడం సాధన చేశాడు. తర్వాత గిన్నిస్ రికార్డు ప్రయత్నం కోసం దరఖాస్తు చేసుకోగా ఇటీవలే అనుమతి వచ్చింది.

బ్రహ్మానందానికి 'హాస్య నటరత్న'

- పాలమూరులో నేతలు, తారల తళుక్కు



బ్రహ్మానందంను సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు, సినీనటులు

మహబూబ్‌నగర్, మార్చి 11: తారలు దిగివచ్చారు.. నేతలు కదిలివచ్చారు.. కాకతీయ కళా పరిషత్ వ్యవస్థాపకుడు, రాజ్యసభ సభ్యుడు టీ.సుబ్బిరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మహబూబ్‌నగర్‌లో హాస్య నటుడు బ్రహ్మానందాన్ని హాస్య నటరత్న బిరుదుతో సత్కరించారు. కార్యక్రమానికి అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీలు జితేందర్‌రెడ్డి, నంది ఎల్లయ్య, కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, బాబూమోహన్, ప్రముఖ సినీ నటి జయప్రద, నటుడు రాజశేఖర్, నటి జీవితతో పాటు హాస్య నటులు, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాకతీయ వైభవాన్ని కళాకారులు కళ్లకు కట్టినట్లు నృత్య రూపంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా స్పీకర్ మధుసూదనాచారి మాట్లాడుతూ కాకతీయ కళా వైభవానికి రాజకీయం లేదన్నారు. కాకతీయులకు మహబూబ్‌నగర్ ప్రజలకు అవినాభావ సంబంధం ఉన్నదన్నారు.

మూడో కూటమికి మంచి స్పందన

- రాష్ట్రాల హక్కులు, అభివృద్ధిపై కూటమి దృష్టి: డీఎస్

న్యూఢిల్లీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో సీఎం కేసీఆర్ సారథ్యంలో రాబోతున్న మూడో కూటమి రాష్ట్రాల హక్కులు, అభివృద్ధిపై దృష్టిసారిస్తుందని టీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు డీ శ్రీనివాస్ అన్నారు. జాతీయ పార్టీలకు అధికారంలోకి రావాలనే ఆలోచన తప్ప, ప్రజాహితం విషయంలో పట్టింపు లేదని దుయ్యబట్టారు. ఆదివారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ మూడో కూటమితో రావడంపై అన్నిచోట్ల నుంచి మంచి స్పందన వ్యక్తమవుతోందన్నారు. ప్రస్తుతం రిజర్వేషన్ల విషయంలో కేంద్రం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని, ఒక్కో రాష్ట్రంలో ఒక్కోరకంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలు, మైనారిటీలున్నారని, అందుకే రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలకే పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలన్నారు. తను పార్టీ మారడంపై వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని, ఒకవేళ తనను కాంగ్రెస్ పిలిచినా వెళ్లే ఉద్దేశం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు తనతో సంప్రదింపులు జరుపుతున్నారని వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు. రాజకీయ కుటుంబాల్లో ఎవరు ఏ పార్టీతో ఉండాలనేది వారి ఇష్టంపైనే ఆధారపడి ఉంటుందని, ఇందుకు తన కుమారుడు అతీతుడేమీ కాదన్నారు. తాను రాష్ట్రంలో కాంగ్రెస్‌ను రెండుసార్లు అధికారంలోకి తీసుకువచ్చానని, అయినా.. ఆ పార్టీ తనను బయటకు వెళ్లేలా పరిస్థితులు కల్పించిందని ఆవేదన వ్యక్తంచేశారు.

1700 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలపై కేసులు

- తెలుగురాష్ట్రాల్లో 200కు పైగా కేసులు

న్యూఢిల్లీ, మార్చి 11: దేశవ్యాప్తంగా 1,700 మందికి పైగా సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలపై 3,045 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ జాబితాలో ఉత్తరప్రదేశ్ 248 మంది ఎంపీ, ఎమ్మెల్యేలతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. తర్వాతి స్థానాల్లో తమిళనాడు(178), బిహార్ (144), పశ్చిమ బెంగాల్(139) ఉన్నాయి. ఏపీ, తెలంగాణ, కేరళలతో పాటు మరో మూడు రాష్ట్రాల్లో వందకు పైగా ఎంపీలు, ఎమ్మెల్యేల చొప్పున క్రిమినల్ కేసుల్లో విచారణ ఎదుర్కొంటున్నారని కేంద్రం సుప్రీంకు తెలిపింది. 2014 నుంచి 2017 మధ్య కాలంలో చాలా వరకు కేసులు నమోదైనట్లు అఫిడవిట్‌లో పేర్కొంది. మార్చి 5 వరకు అన్ని హైకోర్టుల్లో నమోదైన కేసుల వివరాలు సేకరించినట్లు తెలిపింది. మొత్తం 3,816 కేసుల్లో కేవలం 125 కేసుల్లో మాత్రమే తీర్పు వెలువడ్డాయని వివరించింది.

కోర్సు గైడ్

మేనేజ్‌మెంట్ విద్యలో.. భారతీయం

ఆర్థిక సంస్కరణలు, ఆ తర్వాత టెక్నాలజీ రాకతో వ్యాపార, వాణిజ్య, ఆర్థిక కార్యకలాపాల నిర్వహణలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఎంఎన్‌సీల ప్రవేశంతోపాటు, రోబోటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మొబైల్ ఇంటర్నెట్, క్లౌడ్ టెక్నాలజీ, డిజిటల్ ఎకానమీ వంటి అధునాతన సాంకేతిక వ్యవస్థలు అందుబాటులోకి వచ్చాయి. ఈ మార్పులను ప్రతిఫలిస్తూ మేనేజ్‌మెంట్ విద్యను కూడా మారిస్తేనే ప్రస్తుత కంపెనీల అవసరాలను సరిపోయే మేనేజర్లు తయారవుతారు. ఈ నేపథ్యంలో మేనేజ్‌మెంట్ విద్యకు సరికొత్త రూపు ఇవ్వడానికి ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) చర్యలను ప్రారంభించింది. ప్రస్తుత కరిక్యులంలో మార్పులు, చేర్పులు చేస్తూ రూపొందించిన మోడల్ కరిక్యులంను తన వెబ్‌సైట్‌లో ఉంచింది. భారతీయ కంపెనీల విజయగాథలు, వేదాలు, చాణక్యుడి అర్థశాస్త్రం, రామాయణం, మహాభారతాలను పాఠ్యాంశాల్లో భాగంగా ప్రతిపాదించడం విశేషం. తిరుమలలో క్యూ నిర్వహణను కూడా అధ్యయన అంశంగా చేర్చింది. ప్రతిపాదిత మార్పుల వివరాలను తెలుసుకుందాం...



మేనేజ్‌మెంట్ విద్యకు సంబంధించి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లు ప్రపంచంలోనే ది బెస్ట్ బి - స్కూల్స్‌గా గుర్తింపు పొందాయి. సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా కరిక్యులం, మార్పులను దృష్టిలో పెట్టుకొని పరిశ్రమ ఆశిస్తున్న విధంగా నైపుణ్యాలు పెంపొందించడం ఐఐఎంలను అగ్రస్థానంలో నిలబెట్టాయి. కానీ దేశంలోని మిగతా మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లు ఆ స్థాయికి చేరుకోవడంలో విఫలమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కాలం చెల్లిన సిలబస్‌కు స్వస్తి పలికి సమకాలీన సవాళ్లను ఎదుర్కోవడమే లక్ష్యంగా ఎంబీఏ, పీజీడీఎం కోర్సులను సమీక్షించాలని ఏఐసీటీఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం భీమరాయ మెత్రి (ఐఐఎం త్రిచి డైరెక్టర్) నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ప్రతిపాదించిన మార్పులు ఇలా ఉన్నాయి...

పాఠ్యాంశంగా తిరుమల క్యూ నిర్వహణ

మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన విధానాలను అమలు చేస్తూ ఎన్నో భారతీయ సంస్థలు ప్రపంచ వ్యాపార రంగంలో తమదైన ముద్రను వేశాయి. సవాళ్లను తట్టుకుంటూ విజయాలు సాధిస్తున్నాయి. విద్యార్థులను చైతన్యపరచడం, వారిలో స్ఫూర్తిని నింపే ఉద్దేశంతో ఇందులో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్, టాటా గ్రూప్, ఐటీసీ ఈ-చౌపల్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ తదితర భారతీయ కంపెనీల విజయగాథలకు కరిక్యులంలో చోటు కల్పించారు. కేవలం వ్యాపార సంస్థలకే కాకుండా విభిన్న రంగాలకు చెందిన సంస్థలను కూడా ఇందులో చేర్చారు. ఉదాహరణకు అక్షయపాత్ర (పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఉచితంగా అందజేస్తున్న లాభాపేక్ష లేని సామాజిక సంస్థ), తిరుమలలో క్యూ నిర్వహణ, బయోకాన్ (బయోటెక్నాలజీ కంపెనీ) వంటివి.

వేదాలు, అర్థశాస్త్రం

ప్రపంచవ్యాప్తంగా వెలుగు చూస్తున్న ఆర్థిక సంక్షోభాలు, ఉద్దేశపూర్వక రుణ ఎగవేత వంటి అంశాలు వ్యాపార రంగంలో నైతిక విలువలు లోపించాయి అనే వాదనకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. దేశంలో చోటు చేసుకున్న సత్యం స్కామ్, సహారా స్కామ్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ లిమిటెడ్ సంక్షోభం, పెరుగుతున్న ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారులు (విల్‌ఫుల్ డిఫాల్టర్స్), డిమానిటైజేషన్ తరవాత బ్యాంకుల్లో పెద్ద ఎత్తున డిపాజిట్ చేసిన వ్యాపార సంస్థలు / వ్యక్తుల గురించి కరిక్యులంలో ఉదహరించారు. ఈ నేపథ్యంలో భవిష్యత్ మేనేజ్‌మెంట్ నిపుణులకు భారతీయ విలువలు, వ్యాపార రంగంలో వాటి ప్రాధాన్యాన్ని వివరించడానికి ఉపనిషత్తులు, వేదాలు, చాణక్యుడు రచించిన అర్థశాస్త్రం, పంచతంత్రం, ఇతిహాసాలు (రామాయణం, మహాభారతం) అంశాలకు కరికుల్యంలో చోటు కల్పించారు. వీటిని కోర్ సబ్జెక్టులుగా బోధిస్తారు.

కోర్‌తోపాటు స్పెషలైజేషన్స్

మార్పులు చేర్పులు కేవలం కోర్ సబ్జెక్టులకే పరిమితం కాలేదు. ఎలెక్టివ్ కోర్సులను కూడా పునఃసమీక్షించారు. ఈ దిశలో కొన్ని ఎలెక్టివ్ కోర్సుల్లో కొత్త అంశాలకు చోటు కల్పించారు. అంతేకాకుండా మారుతున్న అవసరాలు, కొత్తగా మనుగడలోకి వస్తున్న రంగాలను సమర్థంగా నిర్వహించడానికి బిజినెస్ మేనేజ్‌మెంట్ స్కిల్స్ మరికొన్ని రంగాలకు విస్తరించాల్సిన అవసరం ఉందని కమిటీ భావించింది. ఈ దిశలో కొన్ని కొత్త స్పెషలైజేషన్స్‌ను ప్రతిపాదించింది. తద్వారా మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేట్లకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయి.

ప్రతిపాదిత స్పెషలైజేషన్స్: ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్, హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్, సోషల్ ఎంటర్‌ప్రైజ్ మేనేజ్‌మెంట్, అగ్రి - బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మేనేజ్‌మెంట్, స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్, రూరల్ బిజినెస్ మేనేజ్‌మెంట్.

పరిమితులు లేకుండా

ప్రతిపాదిత నూతన కరిక్యులంలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్ (ఆవిష్కరణ)లు వంటి కీలక అంశాలకు పెద్ద పీట వేశారు. ఇటీవలి కాలంలో చోటుచేసుకున్న కొన్ని సంఘటనల కారణంగా భారతీయ దృక్పథంతో వ్యాపారంలో నైతిక విలువలు, సంస్కృతి వంటి విషయాలపై అవగాహన కల్పించేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. సంస్కృతి, సంప్రదాయాలు, పని వేళలు వంటి పరిమితులు లేకుండా, జట్టుగా పని చేసే నైపుణ్యం, ప్రపంచవ్యాప్తంగా ఎక్కడైనా విధులు నిర్వహించే సంసిద్ధత గల మేనేజ్‌మెంట్ నిపుణులను తీర్చిదిద్దడానికి నూతన కరిక్యులంలో ప్రాధాన్యం ఇచ్చారు. ఈ దిశగా కోర్ కోర్సుల్లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్, సస్టయినబిలిటీ అండ్ సోషల్ రెస్పాన్సివ్‌నెస్, మేనేజ్‌మెంట్ ఆఫ్ సోషల్ సెక్టార్, మేనేజ్‌మెంట్ ఆఫ్ ఎంఎస్‌ఎంఈఎస్, ఇండియన్ ఈథోస్ అండ్ బిజినెస్ ఎథిక్స్ అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు.

సమీక్ష ఇలా

భీమరాయ మెత్రి నేతృత్వంలోని కమిటీ పరిశ్రమ వర్గాలు, విద్యావేత్తలు, కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్స్, వివిధ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌ల అలూమ్ని, ప్రస్తుత విద్యార్థులు వంటి వారి నుంచి అభిప్రాయాలను స్వీకరించింది. వరల్డ్ ఎకనమిక్ ఫ్యూచర్ జాబ్ రిపోర్ట్‌ను కూడా పరిగణనలోకి తీసుకుంది. దేశ, విదేశాల్లోని టాప్-బి స్కూల్స్ పాటిస్తున్న ప్రమాణాలను కూడా దృష్టిలో పెట్టుకుంది. ఇలా అన్ని రకాల వర్గాల నుంచి సేకరించిన సమాచారాన్ని విశ్లేషించింది. వీటి ఆధారంగా ప్రస్తుత డిజిటల్ యుగంలో భారతీయ విలువలపై అవగాహనతో కార్పొరేట్ రంగం, బిజినెస్ ఎంటర్‌ప్రైజెస్ అవసరాలకు అనుగుణంగా టెక్నాలజీని వినియోగించుకుంటూ, సవాళ్లను ఎదుర్కొనే నైపుణ్యం గల మేనేజ్‌మెంట్ నిపుణులను తయారు చేసే మేనేజ్‌మెంట్ విద్య అవసరమనే అభిప్రాయానికి వచ్చింది. మార్పులు చేర్పులకు ఆరు అంశాలను ప్రామాణికంగా తీసుకుంది. అవి.. బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ అండ్ డొమైన్ నాలెడ్జ్, క్రిటికల్ థింకింగ్, బిజినెస్ అనాలిసిస్, ప్రాబ్లమ్ సాల్వింగ్, ఇన్నోవేషన్ సొల్యూషన్స్, గ్లోబల్ ఎక్స్‌పోజర్ అండ్ క్రాస్ కల్చరల్ అండర్‌స్టాండింగ్, సోషల్ రెస్పాన్సివ్‌నెస్ అండ్ ఎథిక్స్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, లీడర్‌షిప్ అండ్ టీమ్‌వర్క్.

ఇంటర్న్‌షిప్ చేస్తేనే డిగ్రీ



మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా జాబ్ రెడీ స్కిల్స్, ప్రాక్టికల్ ఎక్స్‌పోజర్, రియల్ టైం ఎక్స్‌పీరియన్స్‌ను అందించేవి ఇంటర్న్‌షిప్స్. తరగతి గదుల్లో బోధించిన అంశాలను వాస్తవ పరిస్థితులకు అన్వయించగలిగే అవకాశం ఇంటర్న్‌షిప్స్ ద్వారా లభిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రాక్టికల్ థింకింగ్, కోర్సులో భాగంగా నేర్చుకున్న నైపుణ్యాలను వాస్తవికంగా అన్వయించడానికి ఇంటర్న్‌షిప్ / ఫీల్డ్ వర్క్‌ను మేనేజ్‌మెంట్ కోర్సుల్లో తప్పనిసరి చేశారు. అంతేకాకుండా ఇంటర్న్‌షిప్‌ను పూర్తి చేస్తేనే డిగ్రీని ప్రదానం చేస్తారు. ఇందుకు 6 క్రెడిట్స్ ఇచ్చారు.

నూతన కరిక్యులంలో ప్రతిపాదించిన మొత్తం క్రెడిట్లు 102

టీచింగ్‌కు సంబంధించి ఎంబీఏ / పీజీడీఎం కోర్సులకు మొత్తం 96 క్రెడిట్స్ ఇచ్చారు (ఒక క్రెడిట్ అంటే 10 గంటలతో సమానం).

ఎంబీఏ	క్రెడిట్లు
మొదటి సంవత్సరం (1, 2 సెమిస్టర్లు)	కోర్ కోర్సెస్‌కు 54 క్రెడిట్లు
రెండో సంవత్సరం (3, 4 సెమిస్టర్లు)	ఎలెక్టివ్ కోర్సెస్‌కు 42 క్రెడిట్లు
ఇంటర్న్‌షిప్ / ఫీల్డ్ వర్క్	6 క్రెడిట్లు
పీజీడీఎం	**క్రెడిట్లు**
మొదటి సంవత్సరం (1, 2, 3 టర్మ్‌లు)	కోర్ కోర్సెస్‌కు 54 క్రెడిట్లు
రెండో సంవత్సరం (4,5,6 టర్మ్‌లు)	ఎలెక్టివ్ కోర్సెస్‌కు 42 క్రెడిట్లు
ఇంటర్న్‌షిప్ / ఫీల్డ్ వర్క్	6 క్రెడిట్లు



జాబ్ కార్నర్

టెక్నీషియన్లు

ఖాళీలు 80

ఇస్రో ఆధ్వర్యంలోని స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ (ఎస్ఏసీ)- పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

- పోస్టుల వారీగా ఖాళీలు: సైంటిస్ట్ ఇంజనీర్ (ఎస్‌డి) 3, సైంటిఫిక్ అసిస్టెంట్ (మల్టీమీడియా) 1, టెక్నీషియన్ (బి) 73, క్యాటరింగ్ అటెండెంట్ 1, కుక్ 2
- అర్హత: పోస్టును అనుసరించి పీహెచ్‌డీ / ఎంఈ / ఎంటెక్/ బీఈ/ బీటెక్/ బీఎస్సీ - మల్టీమీడియా / ఐటీఐ / 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
- వయసు: 18 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 2, 2018.
- వెబ్‌సైట్: www.sac.gov.in

కంటోన్మెంట్ బోర్డ్ పుణె

ఖాళీలు 77

భారత రక్షణ శాఖ ఆధ్వర్యంలోని పుణె కంటోన్మెంట్ బోర్డ్ - పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

- పోస్టుల వారీగా ఖాళీలు: అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ 4, జూనియర్ ఇంజనీర్ (సివిల్ 3, ఎలక్ట్రికల్ 1), బీఈడీ టీచర్స్ 10, డిఈడీ టీచర్స్ 17, హెల్త్ ఇన్‌స్పెక్టర్ 3, స్టాఫ్ నర్స్ 9, ల్యాబ్ టెక్నీషియన్ 2, జూనియర్ క్లర్క్ 18, డ్రైవర్ 10, హిందీ టైపిస్ట్ 1, హెల్త్ అసిస్టెంట్ 1
- వయసు: పోస్టును అనుసరించి 18 నుంచి 30 ఏళ్లు.
- అర్హత: అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ పోస్టులకు ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతోపాటు ఎంఎంసీ/ ఎంసీఐ గుర్తింపు ఉండాలి. జూనియర్ ఇంజనీర్ పోస్టులకు బీఈ (సివిల్/ ఎలక్ట్రికల్)పూర్తి చేసి ఉండాలి. టీచర్ పోస్టులకు బీఈడీ/ డీఈడీ ఉండాలి. క్లర్క్, టెక్నీషియన్, నర్స్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు బీఎస్సీ (కెమిస్ట్రీ/ నర్సింగ్/ జనరల్ నర్సింగ్ / ఫిజిక్స్ / కెమిస్ట్రీ/ బయాలజీ) తోపాటు డిప్లొమా (శానిటరీ ఇన్‌స్పెక్టర్/ ల్యాబ్ టెక్నీషియన్/ హెల్త్ అసిస్టెంట్) పూర్తిచేసి ఉండాలి. టైపిస్ట్‌కు 10వ తరగతి ఉత్తీర్ణతతోపాటు నిమిషానికి 30 పదాల వేగంతో హిందీ టైపింగ్ చేసే సామర్థ్యం ఉండాలి. డ్రైవర్‌కు 10వ తరగతి ఉత్తీర్ణతతోపాటు హెవీ మోటార్ వెహికిల్ లైసెన్స్ ఉండాలి.
- ఎంపిక విధానం : రాత పరీక్ష, స్కిల్ టెస్ట్ ద్వారా
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 7, 2018.
- వెబ్‌సైట్: www.punecantonmentboard.org

ఐఐటీ పాలక్కడ్

ఖాళీలు 34

పాలక్కడ్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)- పలు ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

- పోస్టుల వారీగా ఖాళీలు: డిప్యూటీ రిజిస్ట్రార్ 1, అసిస్టెంట్ రిజిస్ట్రార్ 3, టెక్నికల్ ఆఫీసర్/ కంప్యూటర్ సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ 1, జూనియర్ సూపరింటెండెంట్ 6, జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్/ సీనియర్ ప్రొఫెషనల్ అసిస్టెంట్ 2, జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్ 6, జూనియర్ టెక్నీషియన్ 7, జూనియర్ అసిస్టెంట్ 8
- అర్హత: 55 శాతం మార్కులతో పీజీ/ ఎంబీఏ/ ఎంసీఏ/ బీఈ/ బీటెక్/ డిగ్రీ/ ఎంఈ/ ఎంటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. ఆయా పోస్టులకు నిర్దేశించిన మేర అనుభవం కూడా ఉండాలి.
- వయసు: పోస్టును అనుసరించి 27 నుంచి 50 ఏళ్లు.
- ఎంపిక విధానం : ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 11, 2018.
- హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ: ఏప్రిల్ 16, 2018.
- వెబ్‌సైట్: https://iitpkd.ac.in

మేనేజర్

ఖాళీలు 12

ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ (ఏపీటీఏ)- కాంట్రాక్ట్ ప్రాతిపదికన మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- పోస్టుల వారీగా ఖాళీలు: డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్) 1, జనరల్ మేనేజర్ 1, అసిస్టెంట్ డైరెక్టర్ (స్ట్రాటజీ) 1, మేనేజర్ (మార్కెటింగ్ కమ్యూనికేషన్) 1, మేనేజర్ (టూరిజం) 5, ప్రిన్సిపల్ ప్లానర్ 1, అసిస్టెంట్ ఇంజనీర్ 1, ప్లానింగ్ అసిస్టెంట్ (ల్యాండ్‌స్కేప్ ఆర్కిటెక్ట్) 1
- అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ /పీజీ .
- దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 20, 2018.
- వెబ్‌సైట్: www.aptourism.gov.in


బీఐఎస్‌లో 109 సైంటిస్ట్ పోస్టులు

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్).. భారత ప్రభుత్వ ఆహార, వినియోగదారుల, ప్రజాపంపిణీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పని చేసే సంస్థ. నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా వివిధ రంగాల ఉత్పత్తులకు గుర్తింపు ఇవ్వడం, నాణ్యమైన బంగారు/వెండి ఆభరణాలను ఎంచుకోవడం కోసం వాటికి హాల్ మార్కింగ్ చేయడం వంటి ఈ సంస్థ విధులు. బీఐఎస్ సైంటిస్ట్ బి గ్రేడ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంజనీరింగ్ పట్టభద్రులకు ఇది చక్కని అవకాశం. కొద్దిగా కష్టపడితే ఏడాదికి దాదాపు రూ. 10 లక్షల వేతనంతో కూడిన కొలువును దక్కించుకోవచ్చు. ఈ నేపథ్యంలో సంబంధిత వివరాలను తెలుసుకుందాం..

బీఐఎస్ తాజా ప్రకటన ద్వారా 109 'బి గ్రేడ్' సైంటిస్టు పోస్టులను భర్తీ చేయనుంది. ఇందులో జనరల్ వర్గానికి 50, ఓబీసీలకు 32, ఎస్సీలకు 18, ఎస్టీలకు 9 పోస్టులను కేటాయించారు. విభాగాల వారీగా ఖాళీలు...

మెకానికల్ ఇంజనీరింగ్	31
మెటలర్జికల్ ఇంజనీరింగ్	10
సివిల్ ఇంజనీరింగ్	8
ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్	10
ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్	17
కెమికల్ ఇంజనీరింగ్	12
ఫుడ్ టెక్నాలజీ	5
మైక్రో బయాలజీ	13
టెక్స్‌టైల్ అండ్ ఫైబర్ సైన్స్	3

- **నెలకు రూ.79,929 వేతనం:** బీఐఎస్ కేంద్ర ప్రభుత్వ సంస్థ. కాబట్టి ఎంపికయితే ఐదంకెల వేతనంతో కెరీర్ మొదలవుతుంది. ప్రారంభంలోనే అన్ని కలుపుకొని నెలకు రూ.79,929 వేతనం లభిస్తుంది. అంతేకాకుండా కెరీర్‌పరంగా ఉన్నతస్థాయి హోదాను స్వల్ప కాలంలో అందుకోవచ్చు.



- **రాత పరీక్ష:** రాత పరీక్షను పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ఇందులో ఉండే విభాగాలు..

విభాగం	ప్రశ్నలు	మార్కులు
రీజనింగ్	50	50
ఇంగ్లీష్ లాంగ్వేజ్	50	50
క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్	50	50
టెక్నికల్ నాలెడ్జ్	50	50
మొత్తం	**200**	**200**

సమాధానాలను గుర్తించడానికి రెండు గంటల (120 నిమిషాలు) సమయం ఇస్తారు. రుణాత్మక మార్కులు ఉన్నాయి. ప్రతి తప్పు సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. టెక్నికల్ నాలెడ్జ్ మినహా మిగిలిన అన్ని విభాగాలు అందరికీ కామన్‌గా ఉంటాయి. టెక్నికల్ విభాగంలో మాత్రం అభ్యర్థి ఎంచుకొన్న సబ్జెక్ట్ ఆధారంగా ప్రశ్నలు ఇస్తారు.

- **అర్హత:** ఇంజనీరింగ్ విభాగాల్లోని పోస్టులకు సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఈ / బీటెక్ పూర్తిచేసి ఉండాలి. మైక్రోబయాలజీ విభాగానికి మాత్రం ప్రథమ శ్రేణి మార్కులతో పీజీ లేదా తత్సమాన అర్హత ఉండాలి. ఎస్సీ / ఎస్టీ వర్గాలకు 50 శాతం మార్కులు వస్తే చాలు.
- **ఎంపిక ఇలా:** ఎంపికలో రెండు దశలు ఉంటాయి. అవి.. రాత పరీక్ష, ఇంటర్వ్యూ. రాత పరీక్షలో అర్హత సాధించిన వారికి ఇంటర్వ్యూ ఉంటుంది. ఈ రెండు దశల్లో చూపిన ప్రతిభ ఆధారంగా పోస్టింగ్ ఇస్తారు.
- **సిలబస్:** రీజనింగ్ విభాగంలో పజిల్స్, వెర్బల్, నాన్ వెర్బల్, లాజికల్, డేటా సఫిషియెన్సీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్, అనలిటికల్ సంబంధిత అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. ఇంగ్లీష్ లాంగ్వేజ్‌లో సినానిమ్స్, యాంటోనిమ్స్, ప్రిపోజిషన్స్, సెంటెన్సెస్, యాక్టివ్ అండ్ పాసివ్ వాయిస్, స్పెల్లింగ్స్, ఎర్రర్స్, పాసేజ్, సబ్‌స్టిట్యూషన్, ట్రాన్స్‌ఫర్మేషన్, ఇడియమ్స్ ,ఫ్రేజెస్, పేరా కంప్లీషన్, ఫిల్ ఇన్ బ్లాంక్స్ వంటి ప్రశ్నలు అడుగుతారు. ఆప్టిట్యూడ్ విభాగంలో టైం అండ్ డిస్టెన్స్, ట్రైన్ ప్రాబ్లమ్స్, టై అండ్ వర్క్, రేషియో, బోట్స్ అండ్ స్ట్రీమ్స్, సింపుల్ ఇంట్రెస్ట్, కాంపౌండ్ ఇంట్రెస్ట్, ఏరియాస్, యావరేజెస్, ఎల్‌సీఎం, హెచ్‌సీఎఫ్, నెంబర్స్, వాల్యూమ్స్, ప్రాఫిట్ లాస్, ఆడ్ మన్ ఔట్, రేసెస్ & గేమ్స్, ఏజెస్, మిక్చర్స్, అలిగేషన్స్, పర్సెంటేజెస్, సింపిల్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, మెన్సురేషన్, పర్మిటేషన్స్ అండ్ కాంబినేషన్స్, ప్రాబబిలిటీ తదితర అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: మార్చి 16, 2018.
- దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 2, 2018.
- పరీక్షను నిర్వహించే తేదీ: ఏప్రిల్ 15,2018.
- వెబ్‌సైట్: www.bis.gov.in

ఆంధ్రజ్యోతి

అనేక

7

నిజామాబాద్ • సోమవారం 12 మార్చి 2018



ని-దర్శనం
Nidarshanam

విద్యాధరి చెంతన 'గంగా' ఝరి

▸▸ బుగ్గ నుంచి పొంగే నీటితో సాగు



స్వయంభూ శంభులింగేశ్వరుడి ఆలయం.. పక్కనే కొలువైన విద్యా సరస్వతి అమ్మవారు, శనైశ్చరుడు.. అక్కడికి సమీపంలోనే నిరంతరం నీరు ఊరే జల బుగ్గ! అమృతం లాంటి నీరు.. ఎక్కడి నుంచి వస్తుందో తెలియదు. ఎండాకాలంలోనూ ఆగదు. సిద్దిపేట జిల్లా వర్గల్ మండల కేంద్రంలో శంభగిరి కొండలపై విద్యాధరి క్షేత్రం ఈ అంతుపట్టని రహస్యానికి మూలం. ఆ జల బుగ్గ నుంచి వచ్చే నీటితో పక్కనే ఉన్న పొలాల్లో వ్యవసాయం కూడా చేస్తారంటే ఎంత నీరు వస్తుందో అర్థం చేసుకోవచ్చు. రైతులు మాత్రం ఆ నీరు తమకు దేవుడిచ్చిన వరం అంటారు.

మునుల తపో ఫలితమే..

సుమారు 54 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన శంభుగిరి కొండల్లో స్వయంభూ శంభులింగేశ్వరస్వామి ఆలయం, విద్యాసరస్వతి, శనైశ్చర ఆలయాలు కొలువై ఉన్నాయి. ఆ కొండలపై పూర్వకాలంలో ఎందరో మునీశ్వరులు తపస్సు చేశారని.. ఆ మునుల తపోఫలితం, కొండపై వెలసని దేవతల అనుగ్రహ ఫలితమే ఈ జల బుగ్గ అని స్థానికులు అంటారు.

– గజ్వేల్/వర్గల్

▸▸ ఐదు కోట్ల మైలురాయి..



కన్నుగీటి కవ్వించి రాత్రికిరాత్రే కుర్రాళ్ల కలల సుందరి అయిపోయిన ప్రియా ప్రకాశ్ వారియర్ పాట 'మాణిక్య మలరాయ పూవి' గుర్తుందా..! ఆమె అందానికి, చిలిపిదనానికి ఫిదా అయిపోయిన కుర్రకారు పదేపదే ఆ వీడియోను చూస్తుండడంతో.. సరిగ్గా నెల రోజుల వ్యవధిలోనే ఆ పాట 5 కోట్ల వ్యూలను దక్కించుకుంది.





సింహళ దేశంలో విద్వేష పంజా

నాడు ఈలం... తమిళులపై బౌద్ధుల జులుం



▸▸ నేడు ఇస్లాంపై బోధిసత్వుడి వారసుల యుద్ధనాదం

▸▸ శ్రీలంకలో ఘర్షణపూరిత వాతావరణం

నాడు తమిళులకు (హిందువులకు), సింహళులకు మధ్య ఘర్షణ రక్తపుటేర్లను పారించింది. ఇపుడు మత విద్వేషాగ్ని ఎగసిపడుతోంది. బౌద్ధులైన సింహళీయులకు, ముస్లింలకు మధ్య గొడవలు తారస్థాయికి చేరి హింసా విధ్వంసాలకు దారితీస్తున్నాయి. కారణం చూస్తే చాలా చిన్నది.. కాండీ జిల్లాలో ఓ సింహళ లారీ డ్రైవర్ తన వాహనాన్ని నడుపుతూ వెళుతున్నపుడు వెనక ఓ నాలుగు ఆటోలకు ఎంతకీ దారి ఇవ్వలేదట! కాసేపటి తర్వాత వారు ఓవర్‌టేక్ చేసి లారీని ఆపి లారీడ్రైవర్‌ను చితక్కొట్టారు. ఆ కొట్టినది ముస్లింలు.. గాయాలతో ఆ డ్రైవర్ ఆస్పత్రిలో మరణించాడు. ఈ ఘటన సింహళుల్లో ఆగ్రహావేశాలను రగిల్చింది. ముస్లింలపై ప్రతీకార దాడులకు తెగబడ్డారు. ముగ్గుర్ని చంపేశారు. రెండువారాల కిందట ఓ చిన్న వదంతి మళ్లీ అగ్గి రాజేసింది. అంపారా జిల్లాలో ముస్లింలు నడుపుతున్న హోటళ్లలో పదార్థాల్లో గర్భనిరోధక మాత్రలు కలిపి వడ్డిస్తున్నారని, సింహళుల్లో లైంగిక సామర్థ్యాన్ని దెబ్బతీయడానికే ఇలా చేస్తున్నారన్నది ఆ వదంతి. 2002 నాటి గణాంకాల ప్రకారం దేశంలో సింహళుల సంఖ్య తగ్గుతోంది, ముస్లింల సంఖ్య పెరుగుతోంది. ఇది కూడా సింహళుల్లో అశాంతికి కారణమయ్యింది.

> బుద్ధుడు నడయాడిన నేల అది.. శాంతి సామరస్యాల్ని పంచిన భూమి అది.. ఇపుడు అశాంతి, ఉద్రిక్తలతో అట్టుడుకుతోంది. శ్రీలంకలో జాతుల మధ్య వైషమ్యాలు మనకి తెలుసు. 30 ఏళ్ల పాటు సాగిన అంతర్యుద్ధం ఆ దేశాన్ని కకావికలం చేసింది.

వహాబీల పెత్తనం పెరిగి...

శ్రీలంక ముస్లింలు ఒకప్పుడు చాలా సాత్వికంగా ఉండేవారు. వ్యాపారాలు చేసుకుంటూ సింహళులతో సఖ్యంగా మెలగేవారు. క్రమేణా అక్కడ వహాబీ ముస్లింల ప్రాబల్యం పెరుగుతూ వస్తోంది. సంప్రదాయకంగా ఉండే సూఫీ ఇస్లాంను మరుగున పర్చి వహాబీల పెత్తనం ఎక్కువయింది. వీరికి సౌదీ అరేబియా మద్దతుంది. మయన్మార్ నుంచి రోహింగ్యా ముస్లింల తాకిడి కూడా శ్రీలంకలో ఎక్కువ అయ్యింది. అక్కణ్నుంచి పొట్టచేత పట్టుకొని వచ్చిన వీరు స్థానికంగా ఉన్న సూఫీల కంటే ఎక్కువ సంఖ్యలో ఉన్నారని, భవిష్యత్తులో మరింత పెరుగుతారనీ వినవస్తోంది. ప్రభుత్వం కూడా వారి పట్ల మానవీయ దృక్పథం కలిగి ఉండడం సింహళుల్లో ముస్లిం వ్యతిరేకత పెరగడానికి కారణమయ్యింది.

రాజకీయ కారణాలు

ప్రస్తుతం అధికారంలో ఉన్న సిరిపాల మైత్రీసేన - రనీల్ విక్రమసింఘే ప్రభుత్వం మైనారిటీ అనుకూల విధానాన్ని అవలంబిస్తోంది. గతంలో అధికారంలో ఉన్న మహేంద్ర రాజపక్సే ప్రభుత్వం పూర్తిగా సింహళ-అనుకూల వైఖరితో ఉండేది. నిర్ణయాలు కూడా మెజారిటీ ప్రజలైన సింహళులను దృష్టిలో పెట్టుకొనే తీసుకొనేది. రెండు వర్గాలకు రాజీ కుదర్చడమే దేశ శ్రేయస్సు దృష్ట్యా మంచిదని మైత్రీసేన ప్రభుత్వం వాదన. ఈ మత కల్లోలాలు మళ్లీ 2020లో తనకు అధికారం కట్టబెడతాయని రాజపక్సే భావిస్తున్నారు. వీలైనంత వరకూ ఈ గొడవలు కొనసాగాలన్నది ఆయన అభిమతమని ప్రభుత్వం ఆరోపిస్తోంది. కానీ సకాలంలో అల్లర్లను అణచివేయడంలోనూ, బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.


ఆగని హింస

శ్రీలంకలో ఎమర్జెన్సీ విధించాక కూడా హింసా విధ్వంసాలు ఆగలేదు. కాండీ జిల్లాలో అల్లరి మూకలు రెచ్చిపోయి ముస్లింలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో రాళ్ల దాడులకు పాల్పడుతున్నాయి. 26 మంది గాయపడ్డారు. అనేక వాహనాలకు నిప్పు పెట్టారు. మూడు జిల్లాల్లో కర్ఫ్యూ విధించారు. కర్ఫ్యూని ధిక్కరించి మరీ భద్రతా బలగాలతో అల్లరి మూకలు ఘర్షణలకు దిగాయి. ముస్లిం వ్యతిరేక ప్రచారాలు ఎక్కువవడంతో కేండీలో ఇంటర్నెట్‌ను ఆపేశారు. సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ట్విట్టర్, సోషల్ మెసేజింగ్ వేదిక వాట్సాప్‌లపై ఆంక్షలు విధించారు. మీడియా సందర్శనలపై, కథనాలపై కూడా ఆంక్షలు పెట్టారు. దీంతో హింస జరిగిన ప్రాంతాల్లో పరిస్థితి బయటి ప్రపంచానికి తెలియడంలేదు.



బౌద్ధమత వృక్షం పల్లవించిన చోటు..

మూడో శతాబ్ది నుంచే బౌద్ధం శ్రీలంకలో పరిఢవిల్లింది. అశోకుడి కుమారుడు మహింద భిక్కు బోధివృక్షం మొలకను శ్రీలంకకు తెచ్చి అనూరాధపుర సమీపంలో నాటినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. పాళీ భాష పరిమళించిందీ ఇక్కడే. సింహళీయుల్లో దాదాపు 75% మంది బౌద్ధులే. సింహళీయులు థెరవాద బౌద్ధాన్ని అనుసరిస్తారు. వీరు ఎక్కువగా లావోస్, కంబోడియా, శ్రీలంక, మయన్మార్ మొదలైన దేశాల్లో ఉంటారు. 20వ శతాబ్దిలో థెరవాద బౌద్ధంలో అతివాద ధోరణులు ఎక్కువయ్యాయి. ముఖ్యంగా ఇస్లాం నుంచి ముప్పు పొంచి ఉందనే అభద్రతతో థెరవాద బౌద్ధుల్లో రాడికల్ భావాలు పెరిగాయి. విద్వేష రాజకీయం ఎగసిపడుతోంది. శ్రీలంకలో సింహళులదే సింహభాగం. 2011 జనాభా లెక్కల ప్రకారం థెరవాద బౌద్ధులు 70.02%. హిందువులు (తమిళులు) 12.6%, ముస్లింలు 9.7%, క్రిస్టియన్లు 7.4 శాతం మంది ఉన్నారు.





'అమ్మకు మేమున్నాం'

▸▸ 'హోల్డ్ యువర్ మదర్స్ హ్యాండ్' క్యాంపయిన్

▸▸ చైనా సోషల్ మీడియాలో కొత్త ట్రెండ్

అమ్మ తన పిల్లల నుంచి ఏం కోరుకుంటుంది? 'అమ్మా..నీకు మేమున్నాం..' అన్న ఒక్క చిన్న మాట తప్ప! ఇదే విషయాన్ని చిన్న ఫొటోతో చాటారు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్! చైనా అధ్యక్షుడు ఇటీవల తన తల్లిని కలిసి.. ఆమెను చేయిపట్టుకుని నడిపిస్తున్న ఓ ఫొటోను విడుదల చేశారు. అప్పటి నుంచి ప్రభుత్వ మీడియా 'హోల్డ్ యువర్ మదర్స్ హ్యాండ్' ప్రచారం మొదలుపెట్టింది. చైనా సింగర్ జాసన్ జాంగ్ వంటి సెలబ్రిటీలతోబాటు లక్షలాది సామాన్యులు కూడా 'అమ్మకు మేమున్నాం' అని నినదిస్తూ ఫొటోలు, వీడియోలు పోస్ట్ చేస్తున్నారు. చైనా సోషల్ మీడియాలో ఇప్పుడిదో సరికొత్త ట్రెండ్‌గా మారింది. 'హోల్డ్ యువర్ మదర్స్ హ్యాండ్' హ్యాష్‌ట్యాగ్‌తో ఇప్పటికే 20 లక్షల పోస్ట్‌లు వెల్లువెత్తాయి. యువతీ యువకులు తమ అమ్మ చేతిని పట్టుకున్న ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. అధ్యక్షుడుగా అంతర్జాతీయంగా చక్రం తిప్పడమేకాదు.. సోషల్ మీడియాను గెలవడం కూడా జిన్‌పింగ్‌కు తెలుసని ఆయనపై చైనాలో ప్రశంసల జల్లు కురుస్తోంది. ఇదే మాదిరిగా భారత ప్రధాని నరేంద్ర మోదీ 2015లో 'సెల్ఫీ విత్ డాటర్' క్యాంపయిన్‌కు పిలుపునిచ్చారు. అమ్మాయిల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి చేసిన ఈ ఆలోచన దేశాన్ని కదిలించింది. వేలాది మంది తండ్రులు తమ కూతుళ్లతో సెల్ఫీ దిగి.. సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

> చైనా సర్కారు చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. అధ్యక్ష పదవిలో రెండు సార్లు మాత్రమే కొనసాగే నిబంధనను తొలగించింది. దీంతో చైనాకు తన జీవితాంతం అధ్యక్షుడిగా ఉండాలనుకుంటున్న జీ జిన్‌పింగ్ కోరిక నెరవేరనుంది. చైనాలో సాధారణంగా ఒక అధ్యక్షుడు ఐదేళ్ల చొప్పున రెండు సార్లు పదవిని చేపట్టవచ్చు. ఆ తర్వాత మళ్లీ అధ్యక్ష పదవి చేపట్టడానికి వీలుండదు. ఈ నిబంధనను తొలగిస్తూ అధికార 'చైనా కమ్యూనిస్టు పార్టీ(సీపీసీ)' ప్రతిపాదించిన రాజ్యాంగ సవరణను పార్లమెంటు ఆదివారం భారీ మెజారిటీతో ఆమోదించింది.

జీ హుజూరే..!?

ఆజన్మాంత అధ్యక్షుడిగా జిన్‌పింగ్?



▸▸ 'రెండు సార్లు' నిబంధన తొలగించిన చైనా

▸▸ రాజ్యాంగ సవరణకు ఆమోదం

▸▸ భారీ మెజారిటీతో ఆమోదించిన ఎన్‌పీసీ

▸▸ ఏక పార్టీ నుంచి ఏక వ్యక్తి పాలనకు.. ప్రమాదకరమంటున్న ప్రపంచ దేశాలు

చైనా పార్లమెంటుకు 'రబ్బర్‌స్టాంప్' అనే పేరు ఉంది. ఎందుకంటే సీపీసీ ఏం చెప్పినా 'జీ హుజూర్' అనడమే దాని పని. అధ్యక్ష పదవీ కాల పరిమితిని తొలగిస్తూ సీపీసీ చేసిన ప్రతిపాదనను నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ 2,958 ఓట్ల మెజారిటీతో ఆమోదించింది. ఈ ప్రతిపాదనను కేవలం ఇద్దరు మాత్రమే వ్యతిరేకించగా.. ముగ్గురు సభ్యులు ఓటింగ్‌కు గైర్హాజరైనట్లు అధికారిక మీడియా వెల్లడించింది. ఈ ఓటింగ్‌కు ఎన్‌పీసీ ఎప్పటిలాగా చేతులు ఎత్తడం/ఎలక్ట్రానిక్ ఓటింగ్ పద్ధతిని కాకుండా పేపర్ బ్యాలెట్ విధానాన్ని అనుసరించడం విశేషం. చైనాలో తొలి రాజ్యాంగం 1954లో అమల్లోకి వచ్చింది. 1982 నుంచి అమల్లో ఉన్న ప్రస్తుత రాజ్యాంగానికి 4సార్లు సవరణలు చేశారు. ఓటింగ్‌కు ముందు అధికార పార్టీలోని ఏడుగురు సభ్యుల స్థాయీ సంఘం రాజ్యాంగ సవరణను ఏకగ్రీవంగా ఆమోదించింది. ఉపాధ్యక్ష పదవికి ఉన్న కాల పరిమితిని కూడా తొలగించారు. తాజా నిర్ణయంతో జిన్‌పింగ్ (64) జీవితాంతం చైనా అధ్యక్షుడిగా కొనసాగే అవకాశం ఉంది. కారణం.. సీపీసీలో శక్తిమంతమైన నేతగా పేరొందిన జిన్‌పింగ్‌కు ఇప్పట్లో ఎదురు నిలిచే నాయకుడే లేరు. ఆయన 2012లో చైనా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. రెండోసారి పదవీ కాలం 2023లో ముగియనుంది. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మావో జెడాంగ్ తర్వాత జీవితాంతం కొనసాగనున్న అధ్యక్షుడిగా జిన్‌పింగ్ నిలిచే అవకాశాలు బలంగా ఉన్నాయి. మొత్తం మీద చైనా ఏకపార్టీ పాలన నుంచి మళ్లీ ఏక వ్యక్తి పాలనా దేశంగా మార్పు చెందిందని పరిశీలకులు చెబుతున్నారు. జిన్‌పింగ్ ఆజన్మాంత అధ్యక్షుడిగా కొనసాగడంపై ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇది ప్రత్యేకించి భారత్‌కు ఇబ్బందికరమేనని పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు. జీ నేతృత్వంలోని చైనా ప్రభుత్వం పాక్ ఆక్రమిత కశ్మీరు గుండా చైనా-పాకిస్థాన్ ఆర్థిక కారిడార్, నేపాల్, శ్రీలంక, మాల్దీవులతో కనెక్టివిటీ ప్రాజెక్టుల నిర్మాణానికి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది.

అవినీతికి పాల్పడొద్దు..

అవినీతికి దూరంగా ఉండాలని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ అధికారులను హెచ్చరించారు. దేశాధ్యక్షుడిగా జీవితకాలం కొనసాగేలా చేసిన రాజ్యాంగ సవరణను ఎన్‌పీసీ ఆమోదించిన అనంతరం ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. 'మీ పిల్లలకు మీ పేర్లు వాడుకొనే అవకాశం ఇవ్వకండి. మీ చుట్టుపక్కల ఉండేవారి ప్రలోభాలకు లొంగకండి' అని జిన్‌పింగ్ అధికారులకు స్పష్టం చేశారు. స్వీయ నియంత్రణ పాటిస్తూ నిబద్ధతతో పనిచేయాలని చెప్పారు.

సవరణ చేసింది ఎందుకంటే..?

చైనాను ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలపాలన్నది జిన్‌పింగ్ ఆకాంక్ష. ఆర్థిక, వాణిజ్య, సైనిక, సామాజిక, శాస్త్రసాంకేతిక రంగాల్లో చైనాను ప్రపంచానికే మార్గదర్శిని చేయాలన్నది ఆయన బలమైన కోరిక. ఇందుకోసం దేశంలో ఇప్పటికే అన్నిరంగాల్లో భారీగా సంస్కరణలు ప్రారంభించారు. ముఖ్యంగా ఆర్థిక రంగంలో! కానీ, పదేళ్ల వ్యవధిలో ఇవన్నీ పూర్తయ్యే అవకాశాల్లేవు. వీటన్నింటినీ పూర్తి చేయాలంటే తానే అధికార పీఠంపై ఉండాలన్నది ఆయన అభిమతం, నిర్ణయం. 'అమెరికాలో అంతా అస్తవ్యస్తంగా ఉంది. ఐరోపాలో సంక్షోభాలు. మిగిలిన ప్రపంచమంతా పూర్తిగా ప్రగతి సాధించలేదు. ప్రపంచానికి ఇప్పుడో నాయకత్వం కావాలి. అది మనమే కావాలి' అని గత అక్టోబరులో జరిగిన సీపీసీ కేంద్ర కమిటీ సమావేశంలోనే జిన్‌పింగ్ స్పష్టం చేశారు.

ఏకవ్యక్తి పాలనతో విషాదమే..

చైనాలో ఏకవ్యక్తి పాలన విషాదాన్నే మిగిల్చింది. 70 ఏళ్ల కిందట తొలి నేత మావో చేపట్టిన సాంస్కృతిక విప్లవం, ఇతర నిర్ణయాలు దేశంలో కల్లోలం రేపాయి. ఆ తర్వాత వచ్చిన డెంగ్ జియావోపింగ్ మార్కెట్ ఎకానమీకి బాటలు పరచడంతో పాటు సామ్యవాదానికి ఆధునికత జోడించి కొంత దారిలోకి తెచ్చారు. అయితే ప్రజాస్వామ్య కాంక్ష చైనాలో అంతర్గతంగా రగులుతూనే ఉండడంతో 1989లో తియాననెమెన్ స్క్వేర్‌లో హింసాత్మక ప్రదర్శనలు చోటుచేసుకున్నాయి. ఇప్పుడు మళ్లీ ఏకస్వామ్యం వస్తోంది. ఇది ప్రపంచానికే ప్రమాదమని పశ్చిమదేశాలు కూడా భయపడుతున్నాయి.

సీషెల్స్‌లో భారత్ మిలటరీ స్థావరం

నిఘా, యుద్ధ విన్యాసాలకే పరిమితం

సీషెల్స్‌లో భారత్ మిలటరీ స్థావరం నిర్మాణానికి మార్గం సుగమమైంది. పలు వర్గాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా.. ఆ దేశ రాజకీయ నేతలు తమ అంగీకారాన్ని తెలిపారు. 2015లో సీషెల్స్ ద్వీప సమూహ పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఈ కీలక ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. మొత్తం రూ. 3,585.81 కోట్లతో భారత్ ఈ ప్రాజెక్టును చేపట్టనుంది. భారత్‌కు చెందిన అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు మొజాంబిక్ జలసంధి కీలకమైనది. ఈ మార్గంలో పైరెట్ల బెడద ఎక్కువే. ఈ నేపథ్యంలో.. సీషెల్స్‌లో మిలటరీ బేస్ క్యాంప్ వల్ల భారత్‌తోపాటు ఇతర దేశాల వాణిజ్య నౌకలకు భద్రత ఉంటుందని సీషెల్స్‌లోని భారత రాయబారి ఔసఫ్ సయీద్ అన్నారు. ఈ ఒప్పందంపై సీషెల్స్ వ్యాపార, వాణిజ్య వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. భారతదేశ సైన్యం తమ ద్వీపంలో దిగితే.. అక్కడి వ్యాపారుల ఆధిపత్యం పెరుగుతుందనే ఆందోళన వ్యక్తమైంది. వాస్తవానికి సీషెల్స్‌తో భారత్ 2003లోనే మిలటరీ సహకారంపై 30 ఏళ్లకు ఒప్పందం కుదుర్చుకుంది.


సీఎం రమేశ్


కనకమేడల రవీంద్ర

టీడీపీ రాజ్యసభ అభ్యర్థులుగా..

సీఎం రమేశ్, రవీంద్ర

» రమేశ్‌కు మరోసారి పొడిగింపు

» కనకమేడలకు అనుకోని అదృష్టం

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాజ్యసభ అభ్యర్థులుగా సీఎం రమేశ్, కనకమేడల రవీంద్ర కుమార్ ఖరారయ్యారు. ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ విభాగం అధ్యక్షుడు కళా వెంకట్రావు ఆదివారం మధ్యాహ్నం ఇక్కడ ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. పార్టీ అధినేత చంద్రబాబు తన నివాసంలో కొద్ది మంది పార్టీ ముఖ్యులతో భేటీ అయ్యి వీరి ఎంపికను ఖరారుచేస్తూ నిర్ణయం తీసుకొన్నారు. రమేశ్ ప్రస్తుతం టీడీపీ రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. ఆయనకు మరోసారి పొడిగింపు లభించింది. కనకమేడల రవీంద్రకుమార్ ప్రస్తుతం టీడీపీ న్యాయ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు. సుదీర్ఘ కాలం నుంచి పార్టీలో ఉండటంతో పాటు రాష్ట్ర విభజన సమయంలోనూ..ఇప్పుడు రాష్ట్రానికి ఇచ్చిన హామీల అమలులో కేంద్రం నిర్లక్ష్యంపై పోరాటంలోనూ రాజ్యసభలో చురుకుగా ఉంటున్న సీఎం రమేశ్‌ను కొనసాగించారు. ఇటీవల కడప జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు కృషి చేయడం, పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు క్రియాశీల పాత్ర పోషించడం వల్ల కూడా ఆయనకు మరోసారి కొనసాగింపు ఇవ్వాలన్న నిర్ణయానికి పార్టీ వచ్చింది. రవీంద్రకుమార్ గత 22 ఏళ్లుగా పార్టీ న్యాయ విభాగంలో పనిచేస్తున్నారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనూ ఆ విభాగానికి రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న ఆయన పార్టీ అధ్యక్షునిపైనా ఇతర పార్టీలు దాఖలు చేసిన కేసులు, పార్టీ నేతలపై పెట్టిన కేసుల్లో న్యాయసహాయం అందించారు. రెండుసార్లు ఆయనకు ఎమ్మెల్సీ ఇవ్వడానికి పార్టీ అధిష్ఠానం సిద్ధపడినా, సర్దుబాట్ల కారణంగా అవకాశం దక్కలేదు.

పారిశ్రామికవేత్తగా రమేశ్ ప్రస్థానం

కడప జిల్లా పొట్లదుర్తి గ్రామంలో జన్మించిన రమేశ్ చిన్న వయసులోనే వ్యాపార రంగంలోకి వచ్చారు. రుత్విక్ ప్రాజెక్ట్ పేరుతో ఒక సంస్థను నెలకొల్పి నిర్మాణ రంగం, మైనింగ్‌లో దానిని అగ్రగామి సంస్థగా తీర్చిదిద్దారు. దశాబ్దంన్నర కాలంలో దేశవ్యాప్తంగా కాంట్రాక్టులు నిర్వహిస్తూ కార్యాలయాలు ఏర్పాటు చేసుకునే స్థాయికి ఈ సంస్థ ఎదిగింది. రమేశ్ 1987లో టీడీపీలోకి వచ్చారు. 1989లో కుప్పంలో చంద్రబాబు పోటీ చేసినప్పుడు ఆయన తరఫున ప్రచారంలో చురుగ్గా పాల్గొన్నారు. 1997లో చిత్తూరు జిల్లా పార్టీ ప్రచార కార్యదర్శిగా ఉన్నారు. 2009లో పార్టీ ఉపాధ్యక్షునిగా నియమితులయ్యారు. 2012లో రాజ్యసభ సభ్యునిగా ఎంపికయ్యారు.

సీనియర్ న్యాయవాది 'కనకమేడల'

కనకమేడల రవీంద్రకుమార్ స్వస్థలం కృష్ణా జిల్లా. గత 35 ఏళ్లుగా ఆయన న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం హైకోర్టులో సీనియర్ న్యాయవాదిగా ఉన్నారు. ఆయన వయస్సు 61 సంవత్సరాలు. ఎంఏ, ఎంఎల్ చదివారు. సివిల్, క్రిమినల్, రాజ్యాంగం, ఎన్నికల చట్టాల్లో నిపుణులు. 1996 నుంచి టీడీపీ న్యాయ విభాగంలో పనిచేస్తున్న ఆయన ఆ తర్వాత ఆ విభాగం అధ్యక్షుడిగా ఎన్నికై ఇప్పటి వరకూ అదే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఏపీ బార్ కౌన్సిల్ సభ్యునిగా, నల్సార్ న్యాయ విశ్వ విద్యాలయం అకడమిక్ కౌన్సిల్ సభ్యునిగా పనిచేస్తున్నారు.

యూపీ నుంచి రాజ్యసభకు జీవీఎల్

న్యూఢిల్లీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి, గుంటూరు జిల్లాకు చెందిన జీవీఎల్ నరసింహారావును రాజ్యసభ సభ్యత్వం వరించింది. ఉత్తరప్రదేశ్ నుంచి ఆయనను రాజ్యసభకు ఎంపిక చేసినట్లు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ప్రకటించారు. ఎన్నికల విశ్లేషకుడుగా పేరొందిన జీవీఎల్‌కు 1998 నుంచి పార్టీతో సంబంధాలున్నాయి. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు మీడియా సలహాదారుగా ఆయన పనిచేశారు. 2011లో నరేంద్రమోదీ ప్రధాని అభ్యర్థిగా మొట్టమొదటగా అంచనావేసిన వార్తల్లోకెక్కారు. డీఆర్ఎస్ అనే సంస్థకు చైర్మన్‌గా ఉన్నారు. కాగా, టీడీపీకి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు రాజీనామా చేయడంతో జీవీఎల్‌కు ప్రాధాన్యం లభించిందని, ఆయన కేంద్ర మంత్రివర్గంలో చేరే అవకాశాలు కూడా ఉన్నాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

బీసీలకు పట్టం


రాజ్యసభ అభ్యర్థులు సంతోష్, బండ ప్రకాశ్, లింగయ్య యాదవ్‌లతో సీఎం కేసీఆర్, చిత్రంలో ఎంపీలు కేకే, జితేందర్ రెడ్డి


(మూడో పేజీ తరువాయి)

తీసుకొని అభ్యర్థులను ఎంపిక చేసినట్లు పార్టీ ముఖ్యులు చెబుతున్నారు. నామినేషన్ల దాఖలు గడువు సోమవారంతో ముగుస్తున్నందున టీఆర్ఎస్ అభ్యర్థులు ఉదయం 11 గంటలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అసెంబ్లీ కార్యదర్శి వేదాంతం నర్సింహాచార్యులుకు నామినేషన్లను సమర్పించనున్నారు. అభ్యర్థుల ఎంపికలో కేసీఆర్ బీసీలకు పెద్దపీట వేశారు. మూడింట్లో ఒక స్థానాన్ని యాదవుల (బీసీ)కు ఇస్తామని ముందే చెప్పిన ఆయన, మరో స్థానాన్ని కూడా బీసీలకే (ముదిరాజ్) కట్టబెట్టారు. ఒక స్థానాన్ని ఓసీ (వెలమ)కి ఇచ్చారు. మరో ఏడాదిలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికార టీఆర్ఎస్ తరఫున రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. మూడు స్థానాల్లో రెండు బీసీలకు ఇవ్వటం ద్వారా సీఎం కేసీఆర్ తమ పార్టీ, ప్రభుత్వ దృష్టి ఎవరిపైన ఉందనే విషయాన్ని చెప్పకనే చెప్పారు. బీసీల్లోనూ సామాజికంగా బలమైన యాదవ(లింగయ్య), ముదిరాజ్(ప్రకాశ్) సామాజిక వర్గాలకు అవకాశం ఇచ్చారు. ఉత్తర తెలంగాణకు చెందిన ఇద్దరికి(సంతోష్, ప్రకాశ్), దక్షిణ తెలంగాణకు చెందిన ఒకరికి(లింగయ్య) అవకాశం ఇచ్చారు. పూర్వ జిల్లాల్లో సంతోష్ కరీంనగర్, ప్రకాశ్ వరంగల్, లింగయ్య నల్గొండకు చెందిన వారు. టీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థులు ముగ్గురూ ఉన్నత విద్యావంతులు కావటం విశేషం. వీరిలో సంతోష్‌కుమార్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగా.. మిగిలిన ఇద్దరు రాష్ట్ర కార్యదర్శులు. పార్టీ పదవుల్లో ఉన్న ముగ్గురికి రాజ్యసభ సీట్లు దక్కడం గమనార్హం. సంతోష్‌కుమార్ మాత్రమే రాజకీయంగా టీఆర్ఎస్‌లో పుట్టి పెరగ్గా, బండా ప్రకాశ్ 2017లో కాంగ్రెస్ పార్టీ నుంచి, బడుగుల లింగయ్య యాదవ్ 2015లో టీడీపీ నుంచి టీఆర్ఎస్‌లో చేరారు. శాసనసభలో టీఆర్ఎస్‌కి తగిన బలం ఉన్నందున ముగ్గురు అభ్యర్థుల ఎన్నికా లాంఛనమే. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బరిలో ఉన్నా టీఆర్ఎస్ అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందీ ఉండదు. సంతోష్‌కుమార్‌కు రాజ్యసభ స్థానం ఖరారుపై ముందు నుంచీ ప్రచారం జరిగింది. అందరి కంటే ముందు ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' చెప్పింది. పార్టీలో, ఉద్యమంలో కీలక భాగస్వామిగానే కాకుండా, వివాదరహితుడిగా పేరున్న సంతోష్‌కుమార్ ఎంపికపై పార్టీలో ఇసుమంత వ్యతిరేకత కూడా లేదు. మిగిలిన ఇద్దరు అభ్యర్థులు లింగయ్య, ప్రకాశ్ ఎంపికపైనే టీఆర్ఎస్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ స్థానాలకు రేసులో ఉన్న చాలా మంది నిరాశ చెందారు. కాగా, రాజ్యసభ అభ్యర్థులుగా ఎంపికైన సంతోష్‌కుమార్, బండా ప్రకాశ్, బడుగుల లింగయ్యకు అభినందనలు వెల్లువెత్తాయి. వారి పేర్లు ప్రకటించిన వెంటనే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు వారిని అభినందనలతో ఉక్కిరిబిక్కిరి చేశారు. స్వయంగా సీఎం కేసీఆర్, మంత్రులు శుభాకాంక్షలు తెలిపారు.

'నాపై ఉంచిన నమ్మకం, బాధ్యతలను నిలబెడతాను. నాపై నమ్మకం ఉంచి, అవకాశం ఇచ్చిన పార్టీ అధినేత, సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు'.
- టీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థి సంతోష్

'వారధి'కి దక్కిన గౌరవం

టీఆర్ఎస్ తరఫున రాజ్యసభ అభ్యర్థిగా జోగినిపల్లి సంతోష్‌కుమార్‌ను ఎంపిక చేయటంపై పార్టీలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. 'వారధి'కి దక్కిన గౌరవంగా అందరూ అభిప్రాయపడుతున్నారు. ఆది నుంచీ టీఆర్ఎస్‌లో కొనసాగుతున్న సంతోష్‌కుమార్ అధినేత కేసీఆర్ వెన్నంటి ఉంటున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో, రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాల్లో ఆయనకు సహకారం అందిస్తున్నారు. పార్టీ నేతలు-కార్యకర్తలకు, అధినేత కేసీఆర్‌కు మధ్య వారధిగా నిలిచారు. ఇటీవలే టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి చేపట్టారు. గడిచిన 14 ఏళ్లలో టీఆర్ఎస్ అధిగమించిన ఎన్నో సవాళ్ల వెనుక సంతోష్‌కుమార్ కీలక పాత్ర పోషించారు. పార్టీకి, కేసీఆర్‌కు సేవ చేయటమే జీవిత పరమావధిగా భావించే ఆయనకు రాజ్యసభ సీటు ఇవ్వాలనే నిర్ణయం సముచితమనే అభిప్రాయం వినిపిస్తోంది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమకారుడి కోటాలో ఈ అవకాశం దక్కిందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. 42 ఏళ్ల వయసులోనే సంతోష్‌కుమార్ రాజ్యసభలో అడుగుపెట్టబోతున్నారు. దీంతో ఆయన పార్టీ తరఫున రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించే వారిలో పిన్న వయస్కులు కానున్నారు.




పూర్తి పేరు	: జోగినిపల్లి సంతోష్‌కుమార్
తల్లిదండ్రులు	: శశికళ, రవీందర్‌రావు
పుట్టిన తేదీ	: 21.07.1975
సామాజిక వర్గం	: వెలమ
భార్యాపిల్లలు	: రోహిణి, ఇద్దరు తనయులు ఇషాన్, శ్రేయాన్
విద్యాభ్యాసం	: ఎంబీఏ, ఎంపీఎం
స్వగ్రామం	: కొదురుపాక, బోయినపల్లి మండలం, కరీంనగర్ జిల్లా

నాడు నక్సలైట్ నాయకుడు..

నేడు రాజ్యసభ అభ్యర్థి

టీఆర్ఎస్ తరఫున రాజ్యసభ అభ్యర్థిగా ఖరారైన బండా ప్రకాశ్.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న చేప పిల్లల పంపిణీ పథకం సృష్టికర్తగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వరంగల్ నగరానికి చెందిన ఈయనకు పార్టీ శ్రేణులతో అనుబంధం తక్కువే. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం కొనసాగిన బండా ప్రకాశ్ నిరుడు టీఆర్ఎస్‌లో చేరారు. రాష్ట్ర మంత్రి ఈటల రాజేందర్‌కు సన్నిహితుడిగా ఆయన గులాబీ కండువా కప్పుకొన్నారు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు కూడా అయిన ప్రకాశ్ కాంగ్రెస్ పార్టీలో వివిధ పదవులు నిర్వహించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ప్రత్యేకించి పూర్వ వరంగల్ జిల్లాలో అధిక సంఖ్యలో ముదిరాజ్ సామాజిక వర్గం వారు ఉండటం ప్రకాశ్ ఎంపికకు దోహదం చేసినట్లు తెలుస్తోంది. ప్రకాశ్ విద్యార్థి దశలోనే విప్లవోద్యమాల పట్ల ఆకర్షితుడయ్యారు. రాడికల్ విద్యార్థి సంఘం తొలి తరం నేతగా ఆయనకు పేరుంది. ఎమర్జెన్సీ కాలంలో అజ్ఞాతంలోకి వెళ్లినా విప్లవోద్యమ కార్యకలాపాల్లో రహస్యంగా పాల్గొన్నారు. అనంతరం ఆయన పీపుల్స్‌వార్ పార్టీని వదిలి జనజీవన స్రవంతిలో కలిశారు. 1981లో స్వతంత్ర అభ్యర్థిగా వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిలర్‌గా పోటీ చేసి గెలవడంతో రాజకీయ జీవితం ప్రారంభమైంది.



పూర్తి పేరు	: బండా ప్రకాశ్
తల్లిదండ్రులు	: శకుంతల, సత్యనారాయణ
సామాజిక వర్గం	: ముదిరాజ్
వయసు	: 63 ఏళ్లు
భార్య-పిల్లలు	: అనిత, కూతురు పర్మిక ప్రకాశ్
విద్యాభ్యాసం	: ఎంఏ, పీహెచ్‌డీ
స్వస్థలం	: హంటర్ రోడ్, వరంగల్ సిటీ

టీఆర్ఎస్ తరఫున మూడు రాజ్యసభ స్థానాలు గెలిచే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రెండింటిని బడుగు వర్గాలకు సీఎం కేసీఆర్ కేటాయించారు. నన్ను రాజ్యసభ ఎన్నికల బరిలో నిలిపి బడుగు, సామాజిక వర్గాల వారిలో సీఎం ఆత్మవిశ్వాసాన్ని నెలకొల్పారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ఎజెండాని దేశవ్యాప్తం చేస్తాం. - బండా ప్రకాశ్, టీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థి

నమ్ముకున్న పార్టీకి విధేయుడు..

బడుగుల లింగయ్య యాదవ్ పార్టీకి విధేయుడిగా ఉంటాడనే పేరుంది. మంచి వాగ్ధాటి కలిగిన లింగయ్య 1982లో టీడీపీ ద్వారా రాజకీయ రంగప్రవేశం చేశారు. సీఎం కేసీఆర్ టీడీపీలో ఉన్నప్పుడు ఆయనతో లింగయ్యకు సన్నిహిత సంబంధాలు ఉండేవి. 2015లో టీఆర్ఎస్‌లో చేరటానికి ముందు వరకు లింగయ్య టీడీపీలోనే కొనసాగారు. ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీకి పెట్టని కోటగా పేరున్న పూర్వ నల్గొండ జిల్లాలో అనేక ఇబ్బందులను తట్టుకొని నిలబడ్డారు. 1998 నుంచి 2012 వరకు టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. 2009లో మహాకూటమి తరఫున ఎమ్మెల్సీగా పోటీ చేసి 26 ఓట్ల తేడాతో ఓడిపోయారు. రెండేళ్ల క్రితం టీఆర్ఎస్‌లో చేరిన ఆయనకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి పదవి ఇచ్చారు. ఉమ్మడి దక్షిణ తెలంగాణ అనే కాకుండా నల్గొండ జిల్లాలో బలంగా ఉన్న బీసీ సామాజిక వర్గాల్లో యాదవులు సింహభాగం ఉండటం కూడా ఆయన ఎంపికకు ఒక కారణమని తెలుస్తోంది. దీంతో అదే జిల్లా, సామాజిక వర్గానికి చెందిన మరో నేత నోముల నర్సింహయ్యకు చెక్ పెట్టినట్లు అయిందని భావిస్తున్నారు. మంత్రి జగదీశ్‌రెడ్డి చక్రం తిప్పడంతోనే లింగయ్యకు రాజ్యసభ సీటు ఖాయమైందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

పూర్తి పేరు	: బడుగుల లింగయ్య యాదవ్
తల్లిదండ్రులు	: యలమంచమ్మ, అంతయ్య
వయసు	: 58 ఏళ్లు
భార్యాపిల్లలు	: నాగమణి, తనయుడు యశ్వంత్, కూతురు దీప్తి
విద్యాభ్యాసం	: బీఏ, బీఈడీ
స్వగ్రామం	: భీమారాం, కేతేపల్లి మండలం, నల్గొండ జిల్లా



'అసలు చట్టసభలు ఎలా ఉంటాయో చూస్తామా? అని భావించే సామాజికవర్గం నుంచి వచ్చిన నన్ను రాజ్యసభకు పంపబోతున్న సీఎం కేసీఆర్‌ది ఎంతో ఉదారస్వభావం. 30 ఏళ్లపాటు టీడీపీలో పనిచేసిన నాకు ఆ పార్టీలో ఎలాంటి అవకాశాలు రాలేదు. టీఆర్ఎస్‌లో చేరిన మూడేళ్లలోనే రాజ్యసభకు వెళ్లే అవకాశాన్ని కేసీఆర్ కల్పించారు.
- లింగయ్య యాదవ్

2019 వరకు నేనే సీఎం

టీఆర్ఎస్ఎల్పీ భేటీలో సీఎం కేసీఆర్

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రానికి 2019 వరకు తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని సీఎం కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. జాతీయ రాజకీయాల్లోకి వెళ్లినా.. వచ్చే ఎన్నికల వరకు సీఎం పదవి వీడబోనని స్పష్టం చేశారు. ఆదివారం టీఆర్ఎస్ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో జరిగిన పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో వివిధ అంశాలపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. జాతీయ రాజకీయాల్లో ప్రస్తుతం స్పష్టమైన గ్యాప్ ఉందని సీఎం కేసీఆర్ అన్నారు. తాను జాతీయ రాజకీయాల్లోకి వెళ్లి తీరుతానని, దేశ ప్రజలు, గుణాత్మకమైన రాజకీయాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. రాష్ట్రంలో ఉంటూనే జాతీయ స్థాయిలో పనిచేస్తానన్నారు. తెలంగాణ తరఫున దేశానికి మన భాగస్వామ్యాన్ని అందించాల్సిన అవసరం వచ్చినప్పుడు జాతీయ రాజకీయాల్లోకి వెళ్లడం తప్పుకాదని తన నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. ప్రధాని నరేంద్రమోదీ 2014 సాధారణ ఎన్నికల వరకు గుజరాత్ ముఖ్యమంత్రిగా కొనసాగుతూ బీజేపీ తరఫున దేశమంతా తిరిగినట్లు.. తాను కూడా అన్ని రాష్ట్రాలను చుట్టి వస్తానన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ప్రాంతీయ పార్టీలు, పలు జాతీయ పార్టీలను ఏకం చేస్తానని చెప్పారు. తద్వారా ఏర్పడేది థర్డ్ ఫ్రంట్ కాదని, తమదే మెయిన్ ఫ్రంట్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ అధికారంలోకిరాదని, మోదీ మళ్లీ ప్రధాని కానే కారని చెప్పారు. ఒకవేళ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. పథకాల పేర్లు మారుతాయే తప్ప, ఒరిగేదేమీ ఉండదన్నారు. వచ్చేసారి కేంద్రంలో మనం కీలక పాత్ర పోషించబోతున్నామన్నారు.

కరువు ఉండటానికి అవకాశం లేదు

దేశ వ్యాప్తంగా అందుబాటులో ఉన్న నీటి వనరుల కారణంగా ఎక్కడా కరువు ఉండటానికి ఆస్కారం లేదని సీఎం కేసీఆర్ చెప్పారు. దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని నదుల్లో కలిపి 70 లక్షల టీఎంసీల నీళ్లు అందుబాటులో ఉన్నాయని, అందులో 40 లక్షల టీఎంసీలు వాడుకుంటేనే కోట్ల ఎకరాలకు సాగునీటిని అందించుకోవచ్చని, మరో 30 లక్షల టీఎంసీల నీళ్లు మిగులుతాయని అన్నారు. కానీ, కాంగ్రెస్, బీజేపీ బుర్రల్లోనే కరువు ఉందని ఎద్దేవా చేశారు. జలాల పంపిణీపై ఏర్పాటైన ట్రైబ్యునళ్లు సరిగా పనిచేయకుండా కేంద్ర ప్రభుత్వాలు అడ్డంకులు సృష్టిస్తున్నాయని కేసీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే అన్నట్లుగా ఉన్నాయని దుయ్యబట్టారు. దేశ ప్రణాళికలు మారాల్సి ఉందని, తాను ఏర్పాటు చేయబోయే ఫ్రంట్ వ్యక్తులెవరికీ వ్యతిరేకం కాదని, రాజకీయాల కోసం దీనిని ఏర్పాటు చేయటంలేదని చెప్పారు. దేశ ప్రజల ఆశలు నెరవేర్చటానికి, వ్యవస్థ మార్పు కోసం జాతీయ రాజకీయాల్లోకి వెళ్తున్నానని వివరించారు. ఈ ప్రయత్నంలో సక్సెస్ అయితే అవుతాం.. లేకపోతే ఇక్కడే (తెలంగాణలో) ఉంటానని చెప్పారు. అయితే జాతీయ రాజకీయాల్లోకి వెళ్తున్న తనతోపాటు ఎమ్మెల్సీ యాదవరెడ్డి సహా మరి కొందరు ఎమ్మెల్సీలు రావాల్సి ఉంటుందని చెప్పారు.

మళ్లీ మనదే విజయం

రాష్ట్రంలో మళ్లీ టీఆర్ఎస్‌దే విజయమని సీఎం కేసీఆర్ అన్నారు. వందకు వంద శాతం సిట్టింగ్‌లందరికీ తిరిగి టికెట్లు ఇస్తానని, ఎవరూ అభద్రతా భావానికి గురికావద్దని చెప్పారు. 'మీ కంటే పెద్దోళ్లు ఎవరూ లేరు. 2019లోగా అసెంబ్లీ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ జరగదు. సీట్లు పెరగబోవు' అని స్పష్టం చేశారు. 'రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడు సర్వేలు చేయించాం. ఇప్పటివరకు రెండు సర్వేల ఫలితాలు వచ్చాయి. ఒక సర్వేలో 103 స్థానాలు, ఇంకో సర్వేలో 106 స్థానాలను టీఆర్ఎస్ గెలుస్తుందని తేలింది. ఇవి ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో 6,500 నమూనాలు తీసుకొని శాస్త్రీయంగా చేసిన సర్వే ఫలితాలు. ముగ్గురు, నలుగురు ఎమ్మెల్యేలకు 40 శాతం లోపు ఓటింగ్ వచ్చింది. వారిని ఎట్లా గెలిపించుకోవాలో అట్లా గెలిపించుకుంటాం" అని చెప్పారు. మూడో సర్వే ఫలితాల తర్వాత వివరాలను జిల్లాల వారీగా సమావేశాలు పెట్టి ఎమ్మెల్యేలకు అందజేస్తానన్నారు. ఎక్కడ లోపాలున్నాయో అప్పుడే చెబుతానని, అందరినీ కలుపుకొని వెళ్లాలని ఆదేశించారు.

రిజర్వేషన్ల కోసం అవసరమైతే ఢిల్లీలో ధర్నా..

తాను జాతీయ రాజకీయాల్లోకి వెళ్తున్న క్రమంలో ఎస్సీ వర్గీకరణ సహా మైనారిటీ, ఎస్టీ రిజర్వేషన్ల పెంపును సాధించుకుందామని కేసీఆర్ అన్నారు. అవసరమైతే ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేద్దామన్నారు. ఇందుకు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలందరినీ తీసుకుపోదామని, కలిసివచ్చే ఇతర రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులనూ తీసుకెళ్దామని చెప్పారు. ముందు ముందు ఎట్ల చేస్తానో చూడండంటూ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

శోభా.. ఈ కొట్టుడేంది?

చొప్పదండి ఎమ్మెల్యే బొడిగె శోభపై సీఎం కేసీఆర్ సమావేశంలో సీరియస్ అయ్యారు. భేటీ కొనసాగుతుండగానే కరీంనగర్ పోలీసుల నుంచి వచ్చిన ఒక ఫోన్ కాల్ ద్వారా తెలిసిన సమాచారాన్ని ప్రస్తావించారు. "మీ ఎమ్మెల్యే శోభ కరీంనగర్‌లో ఒకరిని కొట్టిందని చెప్పారు. ఈ కొట్టుడేంది?" అని ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా ఈ ఏడాది కాలంలో తమ పనితీరును మరింత మెరుగుపర్చుకోవాలని, ప్రజలతో మంచిగా ఉండాలని ఆదేశించారు. వివాదాల జోలికి వెళ్లొద్దని హితవు పలికారు.

కొట్టకొట్టబోయేరు సుమా..!

రాష్ట్రంలో టీఆర్ఎస్ దూకుడు చూసి కాంగ్రెస్ నేతల ముఖాలు కళ తప్పాయని సీఎం కేసీఆర్ ఎద్దేవా చేశారు. ఈసారి అసెంబ్లీ, మండలి బడ్జెట్ సమావేశాలను ఎన్ని రోజులంటే అన్ని రోజులు నడపటానికి సిద్ధమని చెప్పారు. నెలాఖరులో గవర్నర్ విదేశీ పర్యటనకు వెళ్తున్నందున 27, 28 తేదీల్లోగానే బడ్జెట్ (ద్రవ్య వినిమయ బిల్లు)ను ఆమోదించుకోవాల్సి ఉందన్నారు. కాంగ్రెస్ సభ్యులు సభను అడ్డుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. "సభలో ఉంటే ఇజ్జత్ పోతదని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లొల్లి చేసి సస్పెండ్ కావాలని అనుకుంటున్నారు. సోమవారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం చేసే సమయంలో ప్రసంగం కాపీలను చించి, ఆయనపై పారేయాలని ప్లాన్ వేసుకున్నట్లు తెలిసింది. వాళ్లు కనుక అట్లా చేస్తే అటువైపు ఎవరూ పోవద్దు. సభను డిస్టర్బ్ చేసినా పట్టించుకోవద్దు. (నవ్వుతూ) కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మెట్‌పల్లి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఆగరు. ఆవేశంతో ఉరికి ఉరికి ముందుకు పోయేరు.. సభను అడ్డుకునే కాంగ్రెసోళ్లను కొట్టకొట్టబోయేరు సుమా! వీళ్లను ఆగబట్టే పని ఆ జిల్లా మంత్రి ఈటల రాజేందర్ తీసుకోవాలి" అని సీఎం అన్నారు. దీంతో అంతా ఘొల్లున నవ్వారు. సీఎం తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. సభను అడ్డుకునే కాంగ్రెస్ సభ్యులను కొట్టే ప్రయత్నం చేస్తే, వాళ్లకు ప్రాధాన్యం ఇచ్చినట్లు అవుతుందని, వారు చేసే లేనిపోని ఆరోపణలను పట్టించుకోవాల్సిన పనిలేదన్నారు. సభలో గవర్నర్ ప్రసంగాన్ని కాంగ్రెస్ సభ్యులు అడ్డుకుంటే, వారిపై ఈసారి బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు సస్పెన్షన్ వేటు వేద్దామని చెప్పారు. లోగడ మహారాష్ట్ర అసెంబ్లీలో గవర్నర్‌పై దాడికి యత్నించిన సభ్యులపై మూడేళ్లపాటు నిషేధం విధించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకొని, గలాభా సృష్టిస్తే కాంగ్రెస్ సభ్యులపై 30 రోజులు, అంతకంటే ఎక్కువ రోజులు సస్పెన్షన్ వేటు తప్పదన్నారు. ఈ వ్యవహారాన్ని సాఫీగా పూర్తి చేసే బాధ్యతను ప్రత్యేకంగా మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, హరీశ్‌రావులకు సీఎం అప్పగించారు.



టీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, చిత్రంలో మంత్రులు, పార్టీ ఎంపీలు

జానారెడ్డి ఆవేదనలో ఉన్నారు

కాంగ్రెస్ సభ్యుల తీరుతో సీఎల్పీ నేత జానారెడ్డి ఆవేదన చెందుతున్నారని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. "మా దాంట్లో (కాంగ్రెస్‌లో) కొందరు మంచోళ్లు ఉన్నరు. క్యారెక్టర్ లేనోళ్లు ఉన్నరు. కొందరు ఇట్లా చేస్తామంటే, ఇంకొందరు అట్లా చేస్తామంటరు. నేను మాత్రం పెద్దమనిషి తీరుగా ఉంటాను అని జానారెడ్డి తన సన్నిహితులతో చెబుతున్నారు" అని సీఎం తెలిపారు.

అవకాశాలు రాలేదని ఆ వర్గాలకు సీటు

పార్టీ తరఫున రాజ్యసభ అభ్యర్థుల ఎంపికకు ప్రాతిపదికను సీఎం కేసీఆర్ ఈ సందర్భంగా వివరించారు. యాదవులకు ఒక సీటు ఇస్తానని చెప్పి.. ఇచ్చానన్నారు. ఇదివరకు ముదిరాజ్‌లకు మంచి అవకాశాలు రాలేదని, అందుకే ఆ వర్గానికి చెందిన వ్యక్తికి రాజ్యసభ సీటు ఇచ్చానని తెలిపారు. రాష్ట్రంలో రాజ్యసభ ఎన్నికలు ఏకగ్రీవం కాకుండా పోలింగ్ జరిగితే.. దానిపై అవగాహన కోసం మళ్లీ ఒకరోజు సమావేశమవుదామని అన్నారు. రాజ్యసభ ఎన్నికల బాధ్యతను డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, మంత్రులు కేటీఆర్, ఈటల రాజేందర్, జి.జగదీశ్‌రెడ్డిలతో కూడిన కమిటీకి అప్పగించారు.

13న తెలంగాణ బంద్ వాయిదా

» ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ ప్రకటన

» పరీక్షలను రాజకీయంతో ముడిపెట్టొద్దు : కడియం



బౌద్ధనగర్/హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ డిమాండ్‌తో మార్చి 13న తలపెట్టిన రాష్ట్ర బంద్‌ను వాయిదా వేస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ ప్రకటించారు. ఆదివారం సాయంత్రం పార్శిగుట్ట కేంద్ర కార్యాలయంలో మాట్లాడుతూ ఇంటర్ పరీక్షల దృష్ట్యా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని బంద్‌ను వాయిదా వేశామన్నారు. తరువాత నిర్వహించే బంద్ తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు. కాగా, మార్చి 13న తెలంగాణలోని అన్ని జిల్లా, మండల కేంద్రాల్లోని అంబేడ్కర్ విగ్రహాల వద్ద మహాధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి మినిస్టర్స్ క్వార్టర్స్‌లోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. 'రాజకీయాలతో పరీక్షలకు ముడిపెట్టవద్దు, విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేయవద్దు. పరీక్షని వాయిదా వేసే పరిస్థితి లేదు, ఒకవేళ వాయిదా వేస్తే ఫలితాలు ఆలస్యంగా విడుదల చేయాల్సి వస్తుంది. దీంతో జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలు రాసే అవకాశాన్ని తెలంగాణ విద్యార్థులు కోల్పోతారు' అని అన్నారు. ఈ నెల 13న ఎమ్మార్పీఎస్ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఇంటర్ పరీక్షలకు హాజరయ్యేవారికి అవసరమైతే 'ఒక నిమిషం' నిబంధన సడలిస్తామన్నారు. మరోవైపు మాలమహానాడు అధ్యక్షుడు, కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్.. మందకృష్ణను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

రైతు సమన్వయ సమితి చైర్మన్‌గా

నేడు సుఖేందర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్‌గా నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. వ్యవసాయశాఖ కమిషనరేట్‌లో ఆయన కోసం ఏర్పాటు చేసిన చాంబర్‌లో బాధ్యతల స్వీకార కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, శాఖ అధికారులు పాల్గొననున్నారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు మంచి ముహూర్తం ఉండడంతో ఆ సమయాన్ని బాధ్యతల స్వీకరణకు గుత్తా సుఖేందర్‌రెడ్డి ఎంచుకున్నారు. కాగా, రెవెన్యూ గ్రామ స్థాయి నుంచీ జిల్లా స్థాయి వరకూ ఇప్పటికే రైతు సమన్వయ సమితులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కార్పొరేషన్‌కు ఇవి అనుసంధానంగా పనిచేస్తాయని సీఎం కేసీఆర్ పలు వేదికల్లో వివరించారు కూడా. రాష్ట్ర రైతు సమన్వయ సమితిని కార్పొరేషన్‌గా రిజిస్టర్ చేయడంతో దానికి చట్టబద్ధత వచ్చినట్లయింది. కానీ జిల్లా స్థాయి వరకూ రైతు సమన్వయ సమితులకు మాత్రం చట్టబద్ధత ఇంకా రాలేదు. ఇవి వ్యవసాయశాఖ అధికారులు, రైతులకు మధ్య సమన్వయం చేయడానికే ఏర్పాటు చేసినవని అధికారులు వివరిస్తున్నారు. అయితే కార్పొరేషన్ ఏర్పాటైన నేపథ్యంలో వాటి బైలాస్‌ను రిజిస్టర్ చేసేటప్పుడు అనుసంధానించే అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటారని చెబుతున్నారు.

రాచకొండకు కృష్ణా నీరు

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో ఎత్తిపోతల పథకం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ద్వారా నీటి కొరత ఎదుర్కొంటున్న రాచకొండ ప్రాంతానికి కృష్ణా నీటిని తీసుకురానున్నారు. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించిన ఇంజనీర్లు త్వరలో ప్రాజెక్టు సమగ్ర నివేదికను (డీపీఆర్)ను రూపొందించనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలకు తాగు, సాగునీరు అందుతుంది. నల్లగొండ జిల్లాలోని ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల కోసం డిండి ప్రాజెక్టును చేపట్టిన విషయం తెలిసిందే.

ఆంధ్రజ్యోతి

బిజినెస్

9 | నిజామాబాద్ • సోమవారం 12 మార్చి 2018 | andhrajyothibusiness@gmail.com

బంగారం ఇటిఎఫ్‌ల నుంచి రూ.773 కోట్ల ఉపసంహరణ

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18) మొదటి పదకొండు నెలల కాలంలో ఇన్వెస్టర్లు బంగారం ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఇటిఎఫ్) నుంచి 773 కోట్ల రూపాయలు ఉపసంహరించుకున్నారు. గడచిన ఫిబ్రవరి నెలలో ఇటిఎఫ్‌ల నుంచి ఉపసంహరించుకున్న మొత్తం 94 కోట్ల రూపాయలుగా ఉందని భారత మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ (యాంఫి) పేర్కొంది. అంతకు ముందు ఏడాది ఇదే నెలలో ఇన్వెస్టర్లు వెనక్కి తీసుకున్న పెట్టుబడుల మొత్తం రూ.46 కోట్లు. ఇక జనవరిలో 110 కోట్లు బంగారం ఇటిఎఫ్‌ల నుంచి బయటకు వచ్చాయి. ఈ ఇటిఎఫ్‌ల నుంచి వచ్చే రిటర్ను నిరాశాజనకంగా ఉంది. అంతేకాకుండా బంగారం ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లు తాము పసిడి ఇటిఎఫ్‌లలో పెట్టిన సొమ్మును వెనక్కి తీసుకుంటున్నారు. అయితే వచ్చే ఆర్థిక సంవత్సరంలో గోల్డ్ ఇటిఎఫ్‌ల పరిస్థితి మెరుగ్గా ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు.

ఎయిర్ ఇండియాపై జెట్ ఎయిర్‌వేస్ కన్సార్షియం ఆసక్తి

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాలో వాటా కొనుగోలుకు జెట్ ఎయిర్‌వేస్, ఎయిర్ ఫ్రాన్స్-కెఎల్ఎం, డెల్టా ఎయిర్‌లైన్స్‌ల కన్సార్షియం ఆసక్తి కనబర్చినట్లు సమాచారం. అయితే కన్సార్షియంలోని మూడు సంస్థలు ఈ విషయంపై స్పందించేందుకు నిరాకరించాయి. రూ.50 వేల కోట్లకు పైగా అప్పుల భారంతో సతమతం అవుతున్న ఎయిర్ ఇండియాను ప్రైవేటీకరించాలని కేంద్రం నిర్ణయించింది. ఇందుకు కేబినెట్ కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం త్వరలోనే బిడ్డర్ల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ (ఇఒఐ) దరఖాస్తులను ఆహ్వానించే అవకాశం ఉంది. అయితే, సంస్థలో విక్రయించనున్న వాటా, బిడ్డింగ్ విధివిధానాలపై ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అధ్యక్షతన ఏర్పాటైన మంత్రుల బృందం ఇంకా తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఎయిర్‌ఇండియాలో వాటా కొనుగోలు కోసం ఇప్పటివరకైతే ఇండిగోతో పాటు ఓ విదేశీ ఎయిర్‌లైన్ సంస్థ నుంచి అధికారిక ఆసక్తి వ్యక్తీకరణలను అందుకున్నట్లు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ తెలిపింది.

బోయింగ్‌తో ఎయిర్‌ఇండియా డీల్ పూర్తి

తాజాగా ఎయిర్ ఇండియా 23వ, ఆఖరి బోయింగ్ 777 విమానం డెలివరీ అందుకుంది. పదేళ్లక్రితం సంస్థ బోయింగ్‌కు 68 విమానాల సరఫరాకు ఆర్డరిచ్చింది. అందులో భాగంగా చివరి బోయింగ్ 777-300 ఇఆర్ విమానం ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో శనివారం ల్యాండ్ అయింది. ఎయిర్ ఇండియా ఆర్డరిచ్చిన వాటిలో 27 డ్రీమ్‌లైనర్లు, 15 బోయింగ్ 777-300 ఇఆర్, 8 బోయింగ్ 777-200 ఎల్ఆర్, 18 బోయింగ్ 737-800 విమానాలున్నాయి. మొత్తం 68 విమానాల్లో 50 ఎయిర్ ఇండియా కోసం కాగా.. మిగతావి అంతర్జాతీయ మార్గాల్లో సేవలందించే ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ కోసం ఆర్డరిచ్చారు.



అరబిందో యూనిట్‌లో 'ఆడ దోమ'

- యుఎస్ ఎఫ్‌డిఎ తీవ్ర ఆక్షేపణలు
- మొత్తం 9 అభ్యంతరాలు

లేవనెత్తిన నియంత్రణ సంస్థ

హైదరాబాద్ : హైదరాబాద్ సమీపంలోని అరబిందో ఫార్మా యూనిట్-4 ఫార్ములేషన్స్ (ఇంజెక్టబుల్స్) ప్లాంట్‌లో పాటిస్తున్న ఉత్పత్తి ప్రమాణాలపై అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యుఎస్ ఎఫ్‌డిఎ) తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. గత నెల 12-20 తేదీల మధ్య పాశమైలారంలో ఈ యూనిట్‌ను తనిఖీ చేసినప్పుడు పాక్షికంగా తయారైన ఫార్ములేషన్స్ ఉంచే స్టోరేజ్ రూమ్‌లో పెద్ద సైజులో ఉన్న ఆడ దోమ కనిపించిందని ఎఫ్‌డిఎ వెల్లడించింది. ఎక్విప్‌మెంట్ నిర్వహణ, పరికరాలకు సంబంధించి శుభ్రత, స్టెరిలిటీ, ఉద్యోగుల శిక్షణ, లాబ్, కంప్యూటర్ కంట్రోల్స్ వంటి వాటికి సంబంధించి మొత్తం తొమ్మిది అభ్యంతరాలను లేవనెత్తుతూ ఎఫ్‌డిఎ.. ఫారమ్ 483 జారీ చేసింది. కాగా తనిఖీల సమయంలో ఉత్పతి, ప్రాసెసింగ్, ప్యాకింగ్, ఔషధాలను ఉంచే భవనాలు ఏ మాత్రం శుభ్రంగా లేకపోవటంతో పాటు ఈ ప్రాంతాల్లో ఎలుకలు, పక్షులు తినే క్రిమికీటకాలు, ఇతర వ్యాధికారక క్రిమి కీటకాలు కనిపించాయని తెలిపింది.

అడుగడుగునా లోపాలు..

ఫార్ములేషన్స్ ఉత్పత్తి, ప్రాసెసింగ్, ప్యాకింగ్, నిల్వ చేసే విధుల్లో ఉన్న కంపెనీ ఉద్యోగులకు, తమ నిర్దిష్ట విధులు సరిగా నిర్వర్తించేందుకు అవసరమైన సరైన శిక్షణ కూడా లేదని ఎఫ్‌డిఎ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఉత్పత్తి, నియంత్రణ విధానాలకు సంబంధించి ఏర్పాటు చేసిన కంప్యూటర్లు, రికార్డుల్లో చేసే మార్పులపైనా సరైన నియంత్రణ లేదని పేర్కొంది. ఫార్ములేషన్స్ తయారీకి ఉపయోగించే యంత్రాలు, పరికరాలనూ నిర్దిష్ట కాలవ్యవధిలో కనీసం శుభ్రం కూడా చేయడం లేదని ఎఫ్‌డిఎ ఆక్షేపించింది. దీంతో కాలుష్యం పెరిగి ఫార్ములేషన్స్ భద్రత, గుర్తింపు, సామర్థ్యం, నాణ్యత, స్వచ్ఛత దెబ్బతినే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. ఈ యూనిట్‌లో ఉత్పత్తి చేసే ఫార్ములేషన్స్ ఉత్పత్తి, ప్రాసెసింగ్, ప్యాకింగ్, స్టోర్ చేసేందుకు ఉపయోగించే పరికరాల డిజైన్ పైనా ఎఫ్‌డిఎ అభ్యంతరాలు వ్యక్తం చేసింది.

యుఎస్ విక్రయాల్లో 15 శాతం వాటా..

వ్యాపారపరంగా పాశమైలారంలోని యూనిట్ 4 అరబిందో ఫార్మాకు అత్యంత కీలకమైంది. ఈ యూనిట్‌లోనే కంపెనీ స్టెరైల్ ఇంజెక్టబుల్స్, ఆప్తాలిమిక్స్ ఔషధాలను ఉత్పత్తి చేస్తోంది. అమెరికా మార్కెట్లో కంపెనీకి లభించే ఆదాయంలో 15 శాతం ఈ యూనిట్ ద్వారానే సమకూరుతుండటం విశేషం. అమెరికా ఎఫ్‌డిఎకు కంపెనీ సమర్పించిన మొత్తం జెనరిక్ ఫైలింగ్స్‌లో మూడో వంతు ఈ యూనిట్‌వే కావటం గమనార్హం. యూనిట్ 4లో ఉత్పత్తి చేస్తున్న ఔషధాలన్నీ అరబిందోకు అత్యధిక లాభాలు ఆర్జించి పెట్టేవి కావటం విశేషం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి పాశమైలారం ఇంజెక్టబుల్స్ యూనిట్ ద్వారా 18-18.5 కోట్ల డాలర్లు, 2020 నాటికి 25 కోట్ల డాలర్ల అమ్మకాలు సాధించాలని అరబిందో ఫార్మా లక్ష్యంగా పెట్టుకుంది. యుఎస్ ఎఫ్‌డిఎ తాజా అభ్యంతరాలతో ఈ అంచనాలకు గండి పడే ప్రమాదం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

15 రోజుల్లో సమాధానం ఇస్తాం : అరబిందో

ఎఫ్‌డిఎ వ్యక్తం చేసిన అభ్యంతరాలపై 15 పని దినాల్లో సమగ్రమైన, సంతృప్తికరమైన సమాధానం ఇస్తామని అరబిందో ఫార్మా పేర్కొంది. అయితే డేటా సమగ్రతకు సంబంధించిగానీ, గతంలో కనిపించిన లోపాలు పునరావృతమైనట్టుగానీ ఎఫ్‌డిఎ తన ఆడిట్ నివేదికలో పేర్కొనలేదని తెలిపింది.

కోలుకుంటోంది..

పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి అమలు ప్రభావాలపై ఐఎంఎఫ్



వాషింగ్టన్: పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి అమలుతో జరిగిన విధ్వంసాల నుంచి భారత ఆర్థిక వ్యవస్థ మళ్లీ కోలుకుంటోందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) పేర్కొంది. అయితే, విద్య, వైద్య రంగాలను భారీగా సంస్కరించడంతోపాటు బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల సామర్థ్యాన్ని మరింత మెరుగుపర్చడం ద్వారా భారత్ నిలకడైన, సమ్మిళిత వృద్ధి సాధించేందుకు వీలుపడనుందని ఐఎంఎఫ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ టావో జాంగ్ అన్నారు. తద్వారా ఇండియా కూడా సంపన్న దేశాల జాబితాలో చేరనుందన్నారు. టావో జాంగ్ ఈనెల 12 నుంచి 20 వరకు భారత్‌లో పర్యటించనున్నారు.

ఆర్థిక సంస్కరణల్లోనే భాగం కావాలి..

మొండిబకాయిలతోపాటు ప్రభుత్వ బ్యాంకింగ్ రంగ సమస్యల పరిష్కారానికి చేపట్టే సంస్కరణల ప్యాకేజీలోనే పిఎస్‌బిల మూలధన పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ కూడా భాగం కావాలని ఐఎంఎఫ్ పేర్కొంది. బ్యాంకింగ్, కార్పొరేట్ రంగాలకు హాని చేసే సమస్యల పరిష్కారానికి ఈమధ్యకాలంలో భారత ప్రభుత్వం పలు చర్యలను టావో జాంగ్ స్వాగతించారు. ఈ ఏడాది మార్చి చివరినాటికి దేశీయ బ్యాంకింగ్ రంగ మొండిబకాయిలు రూ.9.5 లక్షల కోట్లకు చేరుకోవచ్చని ఈమధ్య అసోచామ్-క్రిసిల్ సంయుక్తంగా విడుదల చేసిన నివేదిక అంచనా వేసింది.

భారత్‌లో మిగిలేది ఐదే

టెలికామ్ మార్కెట్‌పై ఎరిక్సన్ అంచనా

న్యూఢిల్లీ: దేశీయ టెలికాం రంగంలో వేగవంతంగా విలీనాల ప్రక్రియ జరుగుతోందని, చవకగా ఇన్నోవేషన్లతోపాటు అంతర్జాతీయ సాంకేతిక యవనికలో భాగం కావాలన్న ఆసక్తి వంటివి వచ్చే ఐదేళ్ల కాలంలో భారత మార్కెట్‌ను అద్భుతంగా మలచనున్నట్టు స్వీడన్‌కు చెందిన టెలికాం గేర్ తయారీ కంపెనీ ఎరిక్సన్ అంటోంది. "ఇప్పటికే కొన్ని దేశాల్లో విలీనాలు జరిగాయి. ప్రస్తుతం భారత్‌లోనూ అదే జరుగుతోంది. భారత్ అంతర్జాతీయ టెక్నాలజీ రేస్‌లో పాల్గొనేందుకు ప్రయత్నం చేస్తోంది. మేము కాస్ట్ ఇన్నోవేషన్స్‌లో పెట్టుబడులు పెడుతున్నాం. నా అభిప్రాయం ప్రకారం వచ్చే ఐదేళ్ల కాలంలో భారత్ మాకు అద్భుతమైన మార్కెట్ అవుతుంది" అని ఎరిక్సన్ హెడ్ (ప్రొడక్ట్ ఏరియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) నిశాంత్ బాత్రా వ్యాఖ్యానించారు. రిలయన్స్ జియో ప్రవేశంతో దేశీయ టెలికాం రంగంలో శరవేగంగా మార్పులు చోటు చేసుకున్న ఫలితంగా ఇటీవలి కాలంలో ఆశించిన స్థాయిలో పనితీరును కనబరచలేకపోయినట్టు ఆయన చెప్పారు. దేశంలో ఇప్పటికీ ప్రత్యేకమైన అవకాశాలున్నాయని తెలిపారు. ''కన్సాలిడేషన్ ప్రభావం చూపుతుంది. కానీ మార్కెట్లోని 7-8 సంస్థలు నిలదొక్కుకునే అవకాశం ఉండదు. వీటికి ఆశించిన స్థాయిలో మార్జిన్లు ఉండవు. చాలా దేశాల్లో కన్సాలిడేషన్‌కు 15-20 సంవత్సరాలు పడుతుంది. కానీ భారత్‌లో భిన్నంగా జరిగింది. రిలయన్స్ రాకతో టెలికాం రంగంలో కన్సాలిడేషన్ చాలా వేగంగా జరిగింది. రిలయన్స్ ప్రత్యక్షంగా, పరోక్షంగా మార్కెట్‌ను కన్సాలిడేట్ చేసింది" అని బాత్రా అన్నారు. ఈ ఏడాది ద్వితీయార్థంలో భారత్‌లో ఐదు టెలికాం సంస్థలే ఉండే సంకేతాలు కనిపిస్తున్నాయి. వీటిలో భారతీ ఎయిర్‌టెల్, ఐడియా-వొడాఫోన్ విలీన సంస్థ, రిలయన్స్ జియో, ప్రభుత్వరంగంలోని బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్ ఉండవచ్చు. టాటా టెలీసర్వీసెస్, టెలినార్ ఇండియా, టికోనా డిజిటల్ వంటివి ఎయిర్‌టెల్‌తో విలీనమయ్యే ప్రక్రియలో ఉన్నాయి. వీడియోకాన్ టెలికాం తన స్పెక్ట్రమ్‌నువిక్రయించింది. అప్పుల్లో కూరుకుపోయిన రిలయన్స్ కమ్యూనికేషన్స్ ఇప్పటికే తన వాయిస్ సర్వీసులను నిలిపివేసింది. మొబైల్ వ్యాపార ఆస్తులను రిలయన్స్ జియోకు విక్రయించేందుకుగాను ఒప్పందం కుదుర్చుకుంది. ఇక ఎయిర్‌సెల్ ఇప్పటికే దివాలా పిటిషన్ దాఖలు చేసింది.



క్యూ4లో 'ఉత్పత్తి' జోరు : ఫిక్కీ

న్యూఢిల్లీ: ఈ నెలతో ముగియనున్న ప్రస్తుత ఆర్థిక సంవత్సర నాలుగో త్రైమాసికం (క్యూ4)పై ఉత్పత్తిదారులు సానుకూల వైఖరి వ్యక్తం చేశారు. మూడో త్రైమాసికంతో పోలిస్తే క్యూ4లో ఉత్పత్తి పుంజుకుందన్న వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని ఫిక్కీ తాజా అధ్యయన నివేదిక వెల్లడించింది. ఫిక్కీ సర్వేలో పాల్గొన్నవారిలో గరిష్ఠ స్థాయి ఉత్పత్తిని రిపోర్ట్ చేసిన వారి వాటా క్యూ4లో 55 శాతానికి పెరిగింది. క్యూ3లో 47 శాతంగా నమోదైంది. అలాగే, ఉత్పత్తి కనిష్ఠానికి జారుకుందని తెలిపినవారు 15 శాతం నుంచి 11 శాతానికి తగ్గారని అసోసియేషన్ వెల్లడించింది. అధిక సంఖ్యలో ఆర్డర్లను అంచనా వేస్తున్నవారు క్యూ4లో 51 శాతానికి పెరిగారు. మూడో త్రైమాసికంలో వీరి వాటా 42 శాతంగా ఉంది. వస్తు ఉత్పత్తి రంగం పునరుద్ధరణబాట పట్టిందనడానికి ఇదే సంకేతమని ఫిక్కీ నివేదిక పేర్కొంది.

పిఎస్‌బిలపై ఆర్‌బిఐ ప్రత్యేక ఆడిట్

- బ్యాంకుల ట్రేడ్ ఫైనాన్స్, ఎల్ఒయుల జారీపైనే దృష్టి



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి)లో రూ.13 వేల కోట్ల కుంభకోణం వెలుగుచూసిన నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ తనిఖీలు ముమ్మరం చేసింది. ప్రభుత్వ రంగ బ్యాంకు (పిఎస్‌బి)ల ట్రేడ్ ఫైనాన్సింగ్ (వ్యాపార అవసరాల నిమిత్తం తీసుకునే రుణాలు) కార్యకలాపాలపై ప్రత్యేక ఆడిట్‌ను ప్రారంభించింది. ఈ ఆడిట్‌లో భాగంగా బ్యాంకులు గతంలో జారీ చేసిన లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్ఒయు)లపై ఆర్‌బిఐ ప్రధానంగా దృష్టిసారించనున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు, 2011 నుంచి జారీ చేసిన ఎల్ఒయుల వివరాలను సమర్పించాలని దేశంలోని బ్యాంకులన్నింటినీ ఆర్‌బిఐ ఆదేశించింది.

ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, ఆయన మేనమామ, గీతాంజలి జెమ్స్ అధినేత మెహుల్ చోక్సీలు కలిసి ఎల్ఒయుల ద్వారా విదేశీ శాఖల నుంచి రుణాలు పొంది పిఎన్‌బిని వేల కోట్లు ముంచారు. నీరవ్ మోదీ స్కాంతోపాటు ఈమధ్యకాలంలో వెలుగుచూసిన బ్యాంకింగ్ మోసాలన్నీ ట్రేడ్ ఫైనాన్స్‌కు సంబంధించినవేకావడం గమనార్హం. అంతేకాదు, ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారులకు చెందిన చాలా వరకు కేసుల మూలాలు కూడా ట్రేడ్ ఫైనాన్సింగేనని పరిశ్రమవర్గాలు తెలిపాయి.

వ్యవస్థ స్తంభించిపోకుండా చూడాలి: ఫిక్కీ

పిఎన్‌బి స్కామ్ కారణంగా దేశీయ ఆర్థిక సేవల వ్యవస్థ స్తంభించిపోకుండా, అందరిలో భయాందోళనలను రేకెత్తించకుండా ప్రభుత్వం, ఆర్‌బిఐ తగిన చర్యలు చేపట్టాలని ఫిక్కీ సూచించింది. పిఎన్‌బి కుంభకోణం కారణంగా ఫైనాన్షియల్ సర్వీసుల ఇండస్ట్రీ అచేతనం చేయకుండా ఉండేలా చూడాలని ఫిక్కీ ప్రెసిడెంట్ రాశేష్ షా ఆర్‌బిఐ, కేంద్రానికి లేఖ రాశారు. ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ ఎడిల్‌వీజ్‌కు రాశేష్ షానే చైర్మన్.

పిఎన్‌బి స్కామ్ ఆర్థిక సేవల వ్యవస్థపై ప్రభావం చూపనుందని, కార్పొరేట్ రుణ మంజూరు మళ్లీ మందగించనుందని బ్యాంకర్ ఒకరు అభిప్రాయపడ్డారు. వ్యాపార సంస్థలకు రుణాలిచ్చే విషయంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు జంకుతున్నాయని తెలుస్తోంది. ప్రస్తుతం బ్యాంకులు అంతర్గత తనిఖీలు, లోపాలను సరిదిద్దుకోవడంపైనే ప్రధానంగా దృష్టిసారించాయని, బ్యాంకర్ల రోజువారీ కార్యకలాపాల్లో రుణ ప్రతిపాదనలు, మంజూరుల పరిశీలనకు ప్రాధాన్యం తగ్గిందని సమాచారం. ఈ నేపథ్యంలో రుణాల మంజూరు బాగా తగ్గిందని, రుణ సేకరణ వ్యయం కూడా పెరిగిందని రాశేష్ షా అన్నారు. అయితే, ఇది తాత్కాలిక పరిణామమేనని, వ్యవస్థ కుదురుకునేందుకు మరో ఆరు నెలలు పట్టవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

దారులు మూసేస్తున్న సర్కారు

బ్యాంకులకు రుణాలు ఎగవేసి విదేశాలకు పారిపోవాలనుకునే వారిని అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తనవంతు చర్యలను చేపడుతోంది. యాభై కోట్ల రూపాయలు, అంతకుపైగా రుణం తీసుకునేవారు తమ పాస్‌పోర్టు వివరాలను సమర్పించడం తప్పనిసరని కేంద్రం స్పష్టం చేసింది. ఇప్పటికే రుణం తీసుకున్న వారి నుంచి 45 రోజుల్లో పాస్‌పోర్ట్ వివరాలు సేకరించాలని బ్యాంకులను ప్రభుత్వం ఆదేశించింది. అంతేకాదు, పరారీ నేరగాళ్ల ఆస్తులను జప్తు చేసి, విక్రయించడం ద్వారా వారి నుంచి బకాయిలు రికవరీ చేసేందుకు ప్రత్యేక చట్టం తీసుకురానుంది.

వృద్ధికి విఘాతం: అసోచామ్

పిఎన్‌బి స్కామ్‌పై బ్యాంకులు, దర్యాప్తు ఏజెన్సీలు అతిగా స్పందించడంతో వ్యాపార, పారిశ్రామిక రంగాలకు రుణాల లభ్యత తగ్గిపోతుందని, ఈ పరిణామం వృద్ధికి విఘాతం కల్గించవచ్చని అసోచామ్ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజల్లో వ్యక్తమవుతున్న ఆందోళనలతో వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లే ప్రమాదం ఉందని అసోచామ్ సెక్రటరీ జనరల్ డిఎస్ రావత్ హెచ్చరించారు. ఈ కుంభకోణం వల్ల వ్యవస్థ అంతటికీ నష్టం కలగకుండా బ్యాంకులు, నియంత్రణ మండళ్లు, ప్రభుత్వం, ఇండస్ట్రీ ప్రయత్నించాలని ఆయన అభిప్రాయపడ్డారు.

మైనర్ అప్‌ట్రెండ్‌కు ఆస్కారం





ప్రధాన నిరోధం 10500

నిఫ్టీ కరెక్షన్‌ను కొనసాగిస్తూ ప్రారంభమై 10140 వరకు దిగజారి స్వల్ప రికవరీ సాధించింది. గత వారం వీక్లీ చార్టుల్లో కూడా బలహీనత ఏర్పడింది. 10300 వద్ద బ్రేక్‌డౌన్ ఏర్పడినందు వల్ల పుల్‌బ్యాక్ రికవరీకి ఆస్కారం ఉంది. మార్కెట్ స్వల్పకాలిక ఓవర్‌సోల్డ్ స్థితిలో ఉండడం కూడా రికవరీ ఏర్పడవచ్చుననేందుకు సంకేతం. శుక్రవారం అమెరికన్ మార్కెట్ బలమైన ర్యాలీ సాధించినందు వల్ల సోమవారం పాజిటివ్ ట్రెండ్‌కే ఆస్కారం ఉంది. గత కొద్ది వారాలుగా ఆటుపోట్లతో ట్రేడయినందు వల్ల పాజిటివ్ ట్రెండ్ కోసం ఈ వారంలో కన్సాలిడేట్ కావలసి ఉంది. టెక్నికల్‌గా ఇప్పటికీ మార్కెట్ స్వల్పకాలిక కరెక్షన్‌లోనే ఉన్నందు వల్ల ఈ వారంలో బలాన్ని ప్రదర్శించడం అవసరం. రానున్న కొద్ది రోజుల కదలికలకు ఈ వారం అత్యంత కీలకం.

బుల్లిష్ స్థాయిలు

మైనర్ నిరోధం 10300 కన్నా పైన బలంగా క్లోజయినప్పుడే మైనర్ అప్‌ట్రెండ్‌కు ఆస్కారం ఉంటుంది. ప్రధాన నిరోధం 10500. గతంలో ఏర్పడిన టాప్, మైనర్ హై ఇదే. స్వల్పకాలిక ట్రెండ్‌ను నిర్ణయించే ఈ స్థాయిలో కొద్ది రోజుల పాటు కన్సాలిడేట్ కావాలి. ప్రధాన స్వల్పకాలిక నిరోధం 10700.

బేరిష్ స్థాయిలు...

10300 వద్ద నిలదొక్కుకోలేకపోతే అప్రమత్తతను సూచిస్తుంది. 10200 కన్నా దిగజారితే మరింత కరెక్షన్‌లో 10000 టార్గెట్‌గా కదలవచ్చు. ఇక్కడ రికవరీకి ఆస్కారం ఉంది.

టెక్ వ్యూ

- బ్యాంక్ నిఫ్టీ 24000 పాయింట్ల వద్ద మద్దతు తీసుకుంది. ప్రధాన నిరోధం, గత వారం గరిష్ఠ స్థాయి 25000.

స్వల్పకాలిక ధోరణి : 10200 స్టాప్‌లాస్‌గా స్వల్పకాలిక బై పొజిషన్లు పరిశీలించవచ్చు.

పాటర్న్ : ఇండెక్స్ ప్రస్తుతం "ఏటవాలుగా దిగువకు కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్"కన్నా దిగువన ఉంది. 10500 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" దగ్గర గట్టి నిరోధం ఉంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం ఇక్కడ బలం ప్రదర్శించాలి. మార్కెట్ ఇప్పటికీ 20, 50, 100 డిఎంఎల కన్నా దిగువనే ఉంది. రికవరీ బాట పడితే ఈ సూచికల వద్ద పరీక్షకు సమాయత్తం కావచ్చు. గత వారంలో 200 డిఎంఎ దగ్గర మద్దతు తీసుకుంది.

ఈ సూచిక ప్రకారం గురువారం తదుపరి రివర్సల్ ఉంది. వీక్లీ చార్టుల ప్రకారం సైతం ఈ వారంలో ప్రధానమైన మలుపు ఉండేందుకు ఆస్కారం కనిపిస్తోంది.

సోమవారం స్థాయిలు..

నిరోధం: 10360, 10430

మద్దతు: 10300, 10200


హెక్సావేర్ టెక్నాలజీస్ (రూ.358) - కొనుగోలు స్థాయిలకు చేరువలో..		
రూ.355 ఎగువన అప్‌ట్రెండ్	మొదటి నిరోధం రూ.380	రెండో నిరోధం రూ.410
రూ.340 దిగువన డౌన్‌ట్రెండ్	మొదటి మద్దతు రూ.315	రెండో మద్దతు రూ.295

టైటాన్ (రూ.821) - కొనుగోలు స్థాయిలకు చేరువలో..		
రూ.820 ఎగువన అప్‌ట్రెండ్	మొదటి నిరోధం రూ.860	రెండో నిరోధం రూ.900
రూ.800 దిగువన డౌన్‌ట్రెండ్	మొదటి మద్దతు రూ.770	రెండో మద్దతు రూ.740

■ వాసిరాజు సుందర్ రాజా
www.sundartrends.in

మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ పరిశ్రమ రెండేళ్లలో రూ.2 లక్షల కోట్లకు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా రానున్న కాలంలో కేవలం డిజిటల్ మీడియా వినియోగదారుల సంఖ్య భారీ స్థాయిలో పెరిగే అవకాశం ఉందని ఫిక్కీ-ఇవై తాజా నివేదిక పేర్కొంది. ప్రస్తుతం దేశంలో కేవలం డిజిటల్ వినియోగదారుల సంఖ్య 10-15 లక్షలుగా ఉందని, 2020నాటికి వీరి సంఖ్య రెండింతలకు పైగా పెరిగి 40 లక్షలకు చేరుకునే అవకాశం ఉందని నివేదికలో తెలిపింది. సాధారణంగా సాంప్రదాయ మీడియాను వినియోగించని వారిని డిజిటల్ వినియోగదారులుగా వ్యవహరిస్తుంటారు. వీరి సంఖ్య భారీగా పెరగడం వల్ల మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ (ఎం అండ్ ఇ) రంగానికి భారీ స్థాయిలో డిజిటల్ సబ్‌స్క్రిప్షన్ రూపంలో రాబడులు వచ్చే అవకాశం ఉందని నివేదిక అంచనా వేస్తోంది. మొత్తంగా 2020నాటికి మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ పరిశ్రమ 3,100 కోట్ల డాలర్ల (రూ.2 లక్షల కోట్లు)కు చేరుకునే అవకాశం ఉందని నివేదిక అంచనా వేసింది. 2020నాటికి ఆన్‌లైన్ వీడియోలను వీక్షించే వారి సంఖ్యా పరంగా ప్రపంచంలో భారత్ రెండో అతిపెద్ద దేశంగా మారుతుందని నివేదిక పేర్కొంది. ఇదేకాలంనాటికి దేశంలో సాంప్రదాయ మీడియా(చెల్లింపు లేదా ఉచితం) లేదా ఉచిత ఒటిటి (ఓవర్ ది టాప్)ని వినియోగించే వారి సంఖ్యనే అధికంగా ఉంటుందని తెలిపింది.



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	68.00	విజయవాడ	68.00
కరీంనగర్	69.00	గుంటూరు	68.00
వరంగల్	68.00	ఒంగోలు	70.00
మహబూబ్‌నగర్	68.00	చిత్తూరు	59.00
కర్నూలు	68.00	నెల్లూరు	59.00
విశాఖపట్నం	72.00	అనంతపురం	71.00
గోదావరి	68.00		



రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 3.90		నెక్ (100 గుడ్లు)	
హైదరాబాద్	330.00	చిత్తూరు	363.00
వరంగల్	332.00	చెన్నై	370.00
విజయవాడ	322.00	నమక్కల్	360.00
గోదావరి	322.00	బెంగళూరు	365.00
విశాఖపట్నం	330.00	ముంబై	370.00

వారం చివరి రెండు రోజులు కీలకం

(మార్చి 12-16 తేదీల మధ్య వారానికి)

ఆస్ట్రో గైడ్



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

గత వారం నిఫ్టీ : 10227 (-231)

నిఫ్టీ గత వారం 10429-10142 నడుమ సంచరించి 231 పాయింట్ల (2.21 శాతం) నష్టంతో కనిష్ఠ స్థాయికి చేరువలో నెగెటివ్ ధోరణిలో క్లోజయింది. ఇలా జరగడం వరుసగా ఇది రెండో వారం.

- చంద్రుడు కుంభ, మీనరాశుల సంచార సమయంలో నిఫ్టీ 10613-10303 పాయింట్ల మధ్య సంచరించి 303 పాయింట్ల పరిధి ఏర్పరచుకుంది. తదుపరి వారంలో గరిష్ఠ స్థాయిని స్వల్పంగా బ్రేక్ చేసి 10632 వరకు వెళ్లి, గత వారంలో కనిష్ఠ స్థాయికన్నా దిగజారి 10142 వరకు వెళ్లింది. 10000 టార్గెట్ దిశగా సగం ప్రయాణం మాత్రమే పూర్తయినందు వల్ల ఇప్పుడు ఆ స్థాయి వరకు వెళ్తుందా అన్నది వేచి చూడాలి. ఈ వారంలో గురు, శుక్ర వారాల్లో చంద్రుడు కుంభంలో సంచరిస్తాడు. ఆ రెండు రోజుల పరిధి ముందు రోజుల కదలికలకు కీలకం.
- స్వల్పకాలిక ట్రెండ్ చాలా బేరిష్‌గా మారింది. మధ్యకాలిక ధోరణిలో తటస్థంగాను, దీర్ఘకాలిక ధోరణిలో బుల్లిష్‌గాను ఉంది. 10450 పైన ముగిస్తే స్వల్పకాలంలో కూడా బుల్లిష్ అవుతుంది.
- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 10420, 10606, 10468, 10139 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.
- ప్రస్తుతం నిఫ్టీ ఒక్క 200 డిఎంఎ పైన ట్రేడవుతోంది. నిఫ్టీ 200 డిఎంఎ పైన ఉండడం 50 డిఎంఏ 200 డిఎంఎ పైకి రావడం (గోల్డెన్ క్రాస్) దీర్ఘకాలిక ట్రెండ్ బుల్లిష్‌గా ఉందనేందుకు సంకేతం.

బ్రేకౌట్ స్థాయి : 10450
బ్రేక్‌డౌన్ స్థాయి : 10050

నిరోధ స్థాయిలు: 10375, 10450 (10300 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 10075, 10000, 9925 (10150 దిగువన బేరిష్)

ఇన్వెస్టర్లకు సూచన

వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లను పరిశీలించవచ్చు.

ప్రథమార్ధం మెరుగు (సోమవారానికి)

తిథి: ఫాల్గుణ బహుళ ఏకాదశి
నక్షత్రం: ఉత్తరాషాఢ
ఆర్ద్ర, స్వాతి, శతభిషం నక్షత్ర జాతకులు, మకర, వృషభ రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.
నిఫ్టీ: 10242.65 (-88.45)
ట్రెండ్ మార్పు వేళలు: 9.33; 11.14; 2.30 గంటలు
ధోరణి: గ్రహగతులను బట్టి మెరుగ్గా ప్రారంభమై 1.10 వరకు అదే ధోరణిలో ట్రేడవుతూ ఆ తర్వాత చివరి వరకు నిస్తేజంగా మారే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ ఉదయం 9.30 గంటల సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి)కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని ఒంటి గంట సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1.30 తర్వాత ఎటిపికన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవలసి ఉంటుంది.
నిరోధం: 10265, 10300
మద్దతు స్థాయిలు: 10185, 10150

గ్రహగతులివే..

- ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 4 నుంచి కుంభంలోని శతభిషం పాదం 3 మధ్యలో చంద్ర సంచారం
- కుంభంలోని పూర్వాభాద్ర పాదం 3-4 మధ్యలో రవి సంచారం
- మీనంలోని ఉత్తరాభాద్ర పాదం 3-4 మధ్యలో బుధ సంచారం
- మీనంలోని ఉత్తరాభాద్ర పాదం 1, రేవతి పాదం 1 మధ్యలో శుక్ర సంచారం
- ధనుస్సులోని మూల పాదం పాదం1-2 మధ్యలో కుజ సంచారం
- ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 1లో సింహ నవాంశలో శని సంచారం
- తులలోని విశాఖ పాదం 3లో మిథున నవాంశలో బృహస్పతి వక్రగతి సంచారం
- కర్కాటకంలో రాహువు, మకరంలో కేతువు ధనుస్సు, మిథున నవాంశల్లో సంచారం

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక: ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

ఆంధ్రజ్యోతి
andhrajyothibusiness@gmail.com
బిజినెస్ ప్లస్
నిజామాబాద్ • సోమవారం 12 మార్చి 2018

ఎన్ఐఐటి టెక్నాలజీస్

ఐటి సొల్యూషన్స్‌ను ప్రపంచవ్యాప్తంగా అందిస్తున్న కంపెనీ ఇది. అమెరికా, యూరప్, ఆసియా, ఆస్ట్రేలియా దేశాల్లో విస్తరించి ఉంది. ట్రావెల్, ట్రాన్స్‌పోర్టేషన్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్, మాన్యుఫ్యాక్చరింగ్, మీడియా వర్టికల్స్‌కు అప్లికేషన్ డెవలప్‌మెంట్ నుంచి మెయింటెనెన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్, బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ సేవలను అందిస్తోంది. ప్రస్తుతం డిజిటల్ సేవలు, ప్లాట్‌ఫామ్ బేస్డ్ సేవలు, రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ విభాగాలపై దృష్టిసారించింది. మొత్తం రాబడిలో బిఎఫ్ఎస్ఐ విభాగం నుంచి 43 శాతం, ట్రాన్స్‌పోర్టేషన్ నుంచి 27 శాతం, మాన్యుఫ్యాక్చరింగ్ నుంచి 27 శాతం వస్తోంది. కాగా అమెరికా నుంచి 50 శాతం ఆదాయం వస్తుండగా యూరప్, ఆసియా దేశాల నుంచి 30 శాతం, మిగిలిన దేశాల నుంచి 20 శాతం రాబడి వస్తోంది. ఇటీవలే కొత్త సిఇఒగా సుధీర్ సింగ్‌ను నియమించింది.



గత నాలుగు త్రైమాసికాలుగా కొత్త ఆర్డర్లను పొందటంలో మంచి వృద్ధిని కనబరిచింది. ప్రతి త్రైమాసికంలో కనీసం 7 శాతం చొప్పున పెరుగుదలను నమోదు చేసింది. గత త్రైమాసికంలో 13 కోట్ల డాలర్ల ఆర్డర్లను అందుకుంది. మూడు భారీ ఆర్డర్లను కూడా గత త్రైమాసికంలోనే దక్కించుకుంది. రానున్న మూడు నెలల్లో అమెరికా, యూరప్‌ల నుంచి భారీ ఆర్డర్లను అందుకోబోతున్నట్లు ప్రకటించింది. వచ్చే ఏడాది కాలంలో నిర్వర్తించాల్సిన ఆర్డర్ల విలువ దాదాపు 32.9 కోట్ల డాలర్లు. కొత్త ఆర్డర్ల రాకతో 2018-19 ఆర్థిక సంవత్సరంలో రాబడి, ఇపిఎస్ వృద్ధి రేటు గణనీయంగా మెరుగుపడే అవకాశం ఉంది. బిఎఫ్ఎస్ఐ, ట్రాన్స్‌పోర్టేషన్ విభాగాల నుంచి కూడా రెవెన్యూ పెరగనున్నాయి. కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్‌ను అజూర్ ప్లాట్‌ఫామ్ మీద అభివృద్ధి పరిచేందుకు గాను మైక్రోసాఫ్ట్ ఒప్పందాన్ని కలిగి ఉంది. ఇటీవల డిజిటల్ ట్రైనింగ్ ప్లాట్‌ఫామ్ డిజిలైఫ్ 2.0ను ప్రవేశపెట్టింది. ఆటోమేషన్, రోబోటిక్స్ విభాగాల్లో తన స్థానాన్ని మరింత మెరుగుపరుచుకుంది.

షేర్ షాట్

ఫండమెంటల్స్

తృతీయ త్రైమాసిక ఫలితాలు అంచనాలకు మించి ఉన్నాయి. 11.52 కోట్ల డాలర్ల రాబడిని సాధించింది. భారత కరెన్సీలో రాబడి 9 శాతం వృద్ధితో రూ.756.50 కోట్లకు పెరిగింది. కాగా స్థూల లాభం 11.40 శాతం వృద్ధితో రూ.129.5 కోట్లకు చేరగా స్థూల లాభ మార్జిన్లు 16.8 శాతం నుంచి 17.1 శాతానికి పెరిగాయి. నికర లాభం 21.2 శాతం వృద్ధి చెంది 75.60 కోట్ల రూపాయలుగా నమోదైంది. బిఎఫ్ఎస్ఐ విభాగం 4 శాతం, ట్రాన్స్‌పోర్టేషన్ 4.4 శాతం రెవెన్యూ వృద్ధిని సాధించగా మాన్యుఫ్యాక్చరింగ్‌తో పాటు మిగతా విభాగాల నుంచి దాదాపు 1 శాతం రెవెన్యూ తగ్గింది. ఇపిఎస్ రూ.10.10 నుంచి రూ.12.30కి పెరిగింది. 2017-18 ఆర్థిక సంవత్సరానికి రూ.43.10 ఇపిఎస్‌ను అంచనా వేస్తుండగా 2018-19 ఆర్థిక సంవత్సరానికి ఇపిఎస్ రూ.52.50 గా అంచనా వేస్తున్నారు. కంపెనీకి రుణాలు లేకపోగా నగదు నిల్వలు గత త్రైమాసికంలో రూ.690.60 కోట్లకు పెరిగాయి. రిటర్న్ ఆన్ ఈక్విటీ 16.79 శాతంగా ఉంది. ఈ నేపథ్యంలో డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి ఎఫ్ఐఐల వాటా 3.46 శాతం నుంచి 39.54 శాతానికి పెరిగింది. అలాగే మొత్తం సంస్థాగత ఇన్వెస్టర్ల వాటా 56.49 శాతంగా ఉంది. 2016 డిసెంబరులో సంస్థాగత ఇన్వెస్టర్ల వాటా 51.50 శాతం మాత్రమే. ప్రమోటర్లకు 30.68 శాతం వాటా మాత్రమే ఉంది. గత జనవరి నుంచి ఈ షేరులో భారీ అక్యుములేషన్ జరుగుతోంది.

టెక్నికల్స్

జీవితకాలపు గరిష్ఠ స్థాయిలకు చేరువగా ఈ షేరు ట్రేడవుతోంది. గత ఆరు వారాలుగా స్టేజ్ 2 కన్సాలిడేషన్‌లో ట్రేడవుతోంది. స్వల్ప, దీర్ఘకాలిక చలన సగటులకు ఎగువన స్థిరంగా ట్రేడవుతోంది. ఓ నీల్ రిలేటివ్ ప్రైస్ స్ట్రెంత్ గరిష్ఠంగా 92గా ఉంది. ఇపిఎస్ స్ట్రెంత్ కూడా ఆరోగ్యకర స్థాయిలో 77గా ఉంది. ఇందులో గరిష్ఠ స్థాయిలో అక్యుములేషన్ జరుగుతున్నట్లుగా గత పది వారాల వాల్యూమ్స్ తెలుపుతున్నాయి. మూమెంటమ్ ఇండికేటర్లన్నీ పాజిటివ్ గాను, బుల్లిష్ ధోరణిని ధ్రువీకరిస్తున్నాయి. అప్‌ట్రెండ్ పటిష్ఠతను తెలిపే ఎడిఎక్స్ ఇండికేటర్ గరిష్ఠంగా 49గా ఉంది. ఈ షేరును రూ.836 నుంచి రూ.890 మధ్య అక్యములేట్ చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.786. స్వల్పకాలిక లక్ష్యం రూ.982. వచ్చే పన్నెండు నెలల కాలానికి లక్ష్యం రూ.1,217. వచ్చే ఏడాది కాలం ఐటి స్టాక్స్ మార్కెట్లో మెరుగైన పనితీరును కనబరచనున్నాయి.

టి బ్రహ్మాచారి, హెడ్, అసోసియేషన్ ఆఫ్ టెక్నికల్ మార్కెట్ ఎనలిస్ట్, హైదరాబాద్ చాప్టర్
tbchary@gmail.com

గమనిక : ఈ శీర్షికలో అందించే రికమండేషన్ల ఆధారంగా జరిపే లావాదేవీలకు ఇన్వెస్టర్లదే పూర్తి బాధ్యత. వారి లాభనష్టాలకు ఆంధ్రజ్యోతి పత్రిక, కాలమిస్ట్ ఎలాంటి బాధ్యత వహించరు. లావాదేవీలు చేపట్టే ముందు మీ వ్యక్తిగత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ సలహా తీసుకోండి.



ఆదిత్య బిర్లా సన్ లైఫ్ మ్యూచువల్ ఫండ్

ఈ సంస్థ ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఫిక్స్‌డ్ టర్మ్ ప్లాన్ - సీరిస్ పికె (1132 రోజులు) పేరుతో కొత్త పథకాన్ని ప్రారంభించింది. ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సెక్యూరిటీల్లో పెట్టుబడుల ద్వారా ఆదాయాన్ని పెంచాలన్నది ఈ స్కీమ్ ఉద్దేశం. ఆదాయం కేటగిరీలో వచ్చిన క్లోజ్ ఎండెడ్ స్కీమ్ ఇది. ఈ కొత్త ఫండ్ ఆఫర్ ఈ నెల 8వ తేదీన ప్రారంభమైంది. 14వ తేదీన ముగుస్తుంది. కనీసం 1,000 రూపాయల పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది.

ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ ఫిక్స్‌డ్ మెచ్యూరిటీ ప్లాన్

ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్.. ఫిక్స్‌డ్ మెచ్యూరిటీ ప్లాన్ సిరీస్ 82 (1136 రోజులు) పేరుతో కొత్త పథకాన్ని ప్రారభించింది. ఇది క్లోజ్ ఎండెడ్ పథకం. ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సెక్యూరిటీస్, డెట్ ఇన్‌స్ట్రుమెంట్లలో పెట్టుబడులు పెట్టడం ద్వారా రాబడులు ఆర్జించాలన్నది ఈ ప్లాన్ ముఖ్య ఉద్దేశం. ఈ నెల 7న ప్రారంభమైన ఈ స్కీమ్ 21వ తేదీన ముగియనుంది. కనీస సబ్‌స్క్రిప్షన్ మొత్తం 5,000 రూపాయలు.



హౌజ్ ప్రాపర్టీ అంటే ఏమిటి? ఈ ఆస్తులపై వచ్చే ఆదాయం, నష్టాలకు సంబంధించిన పన్నులు, తదితర అంశాలపై 'బిజినెస్ ప్లస్' పాఠకుల కోసం చార్టర్డ్ అకౌంటెంట్ జిసి రెడ్డి విశ్లేషణ



హౌజ్ ప్రాపర్టీ లెక్కల్లో మార్పులొచ్చాయ్

గత ఆర్థిక సంవత్సరం (2016-17) వరకు గృహ ఆస్తులపై వచ్చే నష్టాన్ని, ఏదో ఒక ఇతర ఆదాయ లాభాల నుంచి ఎలాంటి పరిమితులు లేకుండా భర్తీ చేసుకునే అవకాశం ఉండేది. 2017-18 ఆర్థిక సంవత్సరం నుంచి ఇలా భర్తీ చేసుకునే నష్టాన్ని 2 లక్షల రూపాయలకు పరిమితం చేశారు.

గృహ ఆస్తి అంటే?

భవనాలు, వాటికి సంబంధించి స్థలాలను గృహ ఆస్తులంటారు. ఇక్కడ భవనాలంటే కేవలం నివాస గృహాలే కాదు. ఫ్యాక్టరీ, ఆఫీసులు, షాపులు, గిడ్డంగులు, ఇతర వాణిజ్య సముదాయాలనూ భవనాలుగానే పరిగణించాలి. అలాగే తోటలు, గ్యారేజీ వంటి ఆస్తులనూ గృహ సంబంధ ఆస్తులుగానే పరిగణిస్తారు. ఖాళీగా ఉండే భూముల ద్వారా లభించే ఆదాయాన్ని గృహ ఆస్తుల ఆదాయంగా కాకుండా, 'ఇతర వనరుల నుంచి వచ్చే ఆదాయం'గా పరిగణించాలి. ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 22 ప్రకారం... అసెసీ తప్పనిసరిగా ఆయా ఆస్తులకు యజమాని అయి ఉండాలి.

పన్ను ఎలా లెక్కిస్తారంటే ?

◆ ఒకటి కంటే ఎక్కువ గృహ ఆస్తులు స్వాధీనంలో ఉంటే, ఒక ఇంటిని మాత్రమే అసెసీ అనుభవిస్తున్నట్టుగా పరిగణిస్తారు. ఇతర ఇళ్లను అద్దెకు ఇచ్చినట్టు పరిగణించి ఆ ఆదాయాన్ని స్థూల వార్షిక విలువ (గ్రాస్ యాన్యువల్ వాల్యూ)గా పరిగణిస్తారు.

◆ స్వాధీనంలో ఉన్న ఇంటిని సంవత్సరంలో కొంత కాలంపాటు మాత్రమే ఇతరులకు అద్దెకి ఇచ్చినా, పూర్తి సంవత్సరానికి అద్దెకు ఇచ్చినట్టుగానే పరిగణిస్తారు.

◆ అద్దెకు ఇచ్చిన గృహ ఆస్తి కొంత కాలం పాటు ఖాళీగా ఉన్నా, దాన్ని పూర్తి సంవత్సరానికి అద్దెకు ఇచ్చినట్టుగానే పరిగణిస్తారు. ఇక్కడ స్థూల వార్షిక విలువ (గ్రాస్ యాన్యువల్ వాల్యూ) నుంచి ఖాళీగా ఉన్న కాలానికి నష్టపోయిన అద్దె ఆదాయాన్ని తీసివేస్తారు. ఇది తీసివేయగా వచ్చే ఆదాయాన్ని మాత్రమే పన్ను చెల్లించాల్సిన స్థూల వార్షిక విలువ (టిజిఎవి)గా పరిగణనలోకి తీసుకుంటారు.

◆ ఒక్కోసారి ఏదైనా ఇంటిని ఫర్నీచర్ వంటి ఇతర చరాస్తులతో సహా అద్దెకు ఇస్తుంటారు. ఇలా వచ్చే అద్దె ఆదాయాన్ని వ్యాపారం, వృత్తి లేదా ఇతర ఆదాయంగానే పరిగణిస్తారు.

◆ ఒకవేళ అసెసీకి విదేశాల్లోనూ ఆస్తులు ఉండి, ఆ ఆస్తులపైనా అద్దె రూపంలో ఆదాయం వస్తుంటే, అతడి రెసిడెన్షియల్ స్టేటస్ ఆధారంగా ఆ ఆదాయంపై పన్ను విధిస్తారు. అసెసీ సంవత్సరంలో సగానికంటే ఎక్కువ రోజులు దేశంలోనే ఉంటే, ఆ అద్దె రాబడిపై మన దేశంలోనే పన్ను చెల్లించాలి.

పన్ను మినహాయింపులు

గృహ ఆస్తులపై వచ్చే ఆదాయంపై చెల్లించే పన్నులకు కొన్ని మినహాయింపులు ఉన్నాయి. అవి ఏమిటంటే..

1. మున్సిపల్ పన్నులు

యాజమానే మున్సిపల్ పన్నులు చెల్లిస్తుంటే ఈ పన్నులను మినహాయించి అద్దె ఆదాయాన్ని లెక్కించాలి. అయితే ఈ పన్నులు యజమాని అదే ఆర్థిక సంవత్సరం చెల్లించి ఉండాలి.

2. ప్రామాణిక తగ్గింపు

నికర వార్షిక విలువలో 30 శాతం వరకు స్టాండర్డ్ డిడక్షన్‌గా అనుమతిస్తారు.

మూడు షరతులు

మూడు షరతులకు లోబడి ఈ మినహాయింపు ఉంటుంది. ఆ షరతులు ఏమిటంటే...

◆ ఆస్తుల కొనుగోలు లేదా నిర్మాణం కోసం తీసుకునే అప్పు 1 ఏప్రిల్, 1999న లేదా ఆ తర్వాత తీసుకుని ఉండాలి.

◆ అప్పు తీసుకున్న ఆర్థిక సంవత్సరం ముగిసిన ఐదేళ్ల లోగా ఆస్తి కొనుగోలు లేదా నిర్మాణం పూర్తయి ఉండాలి.

◆ పన్ను చెల్లింపుదారు రుణ దాత నుంచి వడ్డీకి సంబంధించిన సర్టిఫికెట్ పొంది ఉండాలి.

ఈ మూడు షరతుల్లో ఏ షరతును పాటించలేకపోయినా 30,000 రూపాయలకు మించి మినహాయింపు లభించదు.

వడ్డీ లెక్కింపుల్లో తేడాలు

నిర్మాణానికి ముందు చెల్లించాల్సిన వడ్డీ..

ఇంటి నిర్మాణానికి ముందు తీసుకున్న అప్పుపై చెల్లించిన వడ్డీకి పన్ను చెల్లింపుల్లో మారటోరియం ఉంటుంది. నిర్మాణం పూర్తయిన సంవత్సరం కంటే ముందు ఏడాది నుంచి ఐదేళ్లపాటు సమాన వాయిదాల్లో దీనిని మినహాయించుకోవచ్చు.

ఉదాహరణకు ఒక వ్యక్తి ఇంటి నిర్మాణం కోసం 10 శాతం వార్షిక వడ్డీతో 2014 అక్టోబరు 1న 10 లక్షల రూపాయలు అప్పు తీసుకున్నాడనుకుందాం. ఈ ఇంటి నిర్మాణం 2016 ఆగస్టు 21న పూర్తయింది. ఇక్కడ 2014 అక్టోబరు 1 నుంచి 2016 మార్చి 31వరకు (ఏడాదిన్నర) కాలానికి చెల్లించాల్సిన 1.5 లక్షల రూపాయల వడ్డీని ఆ తర్వాత ఐదేళ్లపాటు ఏటా 30 వేల రూపాయల చొప్పున పన్ను నుంచి మినహాయించుకోవచ్చు.

నిర్మాణం తర్వాత చెల్లించే వడ్డీ

ఇంటి నిర్మాణం పూర్తయిన ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి గృహ రుణంపై చెల్లించాల్సిన వడ్డీని నిర్మాణాంతర వడ్డీ అంటారు. ఇలాంటి ఆస్తులు స్వీయ అనుభవంలో ఉంటే ఏటా రూ.2 లక్షల వరకు చెల్లించే వడ్డీకి, పన్ను మినహాయింపు లభిస్తుంది. నిర్మాణం పూర్తి కావడానికి ముందు చెల్లించిన వడ్డీ కూడా ఈ రెండు లక్షల పరిమితిలోనే ఉంటుంది. ఆస్తిని అద్దెకు ఇస్తే మాత్రం ఈ వడ్డీ చెల్లింపుల మినహాయింపులకు పరిమితి ఉండదు. అయితే గృహ ఆస్తులపై వచ్చే నష్టాన్ని భర్తీ చేసుకునేందుకు ఒక ఆర్థిక సంవత్సరంలో ఇతర ఆదాయ పద్దుల మిగులు (లాభాలు) కింద వచ్చే 2 లక్షల రూపాయల గరిష్ఠ మొత్తాన్ని, పన్ను నుంచి మినహాయించుకోవచ్చు. 2 లక్షల రూపాయలకు మించితే మాత్రం తర్వాత గరిష్ఠంగా ఎనిమిదేళ్ల వరకు క్యారీ ఫార్వర్డ్ చేయవచ్చు.



మీ టిడిఎస్ చెక్ చేసుకోవడం ఎలా !

మీరు వేతన ఉద్యోగా? ప్రతి నెలా మీ జీతం నుంచి టిడిఎస్ (మూలం వద్ద పన్ను) కట్ అవుతోందా? టిడిఎస్ చెల్లించమని మీకు ఆదాయ పన్ను శాఖ నుంచి నోటీసేమీ రాలేదు కదా..!

టిడిఎస్ అన్న పదం గురించి వేతన జీవులందరికీ తెలుసు. ఉద్యోగి జీతం నుంచి ఫలానా మొత్తాన్ని యాజమాన్యమే మినహాయించి.. అతని లేదా ఆమె పాన్ (పర్మనెంట్ అకౌంట్ నెంబర్) పేరుతో ప్రభుత్వానికి చెల్లించడం. ఆర్థిక సంవత్సరం ముగిశాక యాజమాన్యం తన ఉద్యోగులందరికీ ఫారమ్-16ని అందజేస్తుంది. అందులో గడచిన ఆర్థిక సంవత్సరంలో వారికి వచ్చిన మొత్తం జీతం, చెల్లించిన పన్నుల వివరాలు వంటివన్నీ ఉంటాయి.

అయితే ఈ మధ్యే ఓ భారీ కుంభకోణం బయటపడింది. సుమారు 447 ప్రైవేటు కంపెనీలు తమ ఉద్యోగుల జీతాల నుంచి టిడిఎస్ పేరుతో నెలనెలా నిర్దిష్ట మొత్తాన్ని కట్ చేసి తమ ఖాతాలో వేసుకుంటున్నట్లు ఆదాయపు పన్ను శాఖ తేల్చింది. దాదాపు 3,200 కోట్ల రూపాయల మేర ఇలా టిడిఎస్ స్వాహా జరిగినట్లు పరిశోధనలో వెల్లడైంది. కంపెనీలు ఉద్యోగుల డబ్బును మింగేస్తే ఆదాయపు పన్ను శాఖ సదరు ఉద్యోగికే నోటీసులిస్తుంది. ఫారమ్-16లో లేదా ఫారమ్ 26 ఎఎస్‌లో అవకతవకలు, లోపాలపై వివరణ కోరుతుంది. అప్పుడు లబోదిబోమనడం ఉద్యోగి వంతవుతుంది. ఇలా జరక్కుండా ఏం చేయాలన్న దానిపై ఐటి అధికారులు తర్జన భర్జన పడి చివరకు ఉద్యోగులే నిరంతరం తమ టిడిఎస్ కటింగ్‌ను తనిఖీ చేసుకొనేలా కొన్ని మార్గదర్శకాలు రూపొందించారు.

ఏం చేయాలి?

ఫారమ్-16 కోసం ఏడాదంతా వేచి చూడాల్సిన పనిలేదు. ప్రతి మూడు నెలలకోసారి ఆదాయపు పన్ను శాఖ ఇ-ఫైలింగ్ వెబ్‌సైట్‌ను పరిశీలించాలి.

- మీ లాగిన్, పాస్‌వర్డ్‌లతో ఇ-ఫైలింగ్ వెబ్‌సైట్‌లోకి వెళ్లవచ్చు.
- కుడి వైపున ఉన్న 26 ఎఎస్ టాబ్‌ను క్లిక్ చేస్తే ట్రేసెస్ అనే మరో వెబ్‌సైట్‌లోకి దారి దొరుకుతుంది.
- ట్రేసెస్ వెబ్‌సైట్ నుంచి ఫారమ్ 26 ఎఎస్‌ను డౌన్‌లోడ్ చేయదల్చుకుంటే టాక్స్ క్రెడిట్ (ఫారమ్ 26 ఎఎస్ ఆప్షన్)ను క్లిక్ చేయాలి.
- మీకు ఏదైనా బ్యాంకుతో నెట్ బ్యాంకింగ్ ఉంటే దాని ద్వారా కూడా ఫామ్ 26 ఎఎస్‌ను చూడవచ్చు. నెట్ బ్యాంకింగ్ వెబ్‌సైటుకు వెళ్లి "ఫారమ్ 26 ఎఎస్ వ్యూ" అన్న ఆప్షన్‌ను క్లిక్ చేస్తే చాలు... వివరాలన్నీ కనబడతాయి
- మీ పాన్ నెంబరు పేరిట టిడిఎస్ కట్ అయి ప్రభుత్వానికి చేరిందో లేదో ఎస్ఎంఎస్ అలర్ట్‌ల ద్వారా కూడా తెలుసుకోవచ్చు. ఇందుకోసం ఈ-ఫైలింగ్ వెబ్‌సైట్‌లో మీరు తరచూ వాడే ఫోన్ నెంబరు (ఇది మీ అకౌంట్ పేరున రిజిస్టర్ అయి ఉండాలి) సరిగ్గా, అప్‌డేటెడ్‌గా ఉందో లేదో చూసుకోండి.
- మీ సరైన పాన్ నంబరును మీ యాజమాన్యానికి తెలియజేయాలి. ఒకవేళ మీరు చెక్ చేసుకొంటున్నప్పుడు ఏవైనా తేడాలు గమనిస్తే వెంటనే యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి సరిచేయించుకొని సవరించిన ఫారమ్ 16ను తీసుకోండి.

రూ.10 లక్షలు మించితే ఇక ఆన్‌లైనే

ఇపిఎఫ్ విత్‌డ్రాయల్స్‌లో మార్పులు

ఉద్యోగ భవిష్య నిధి (ఇపిఎఫ్) ఖాతా నుంచి రూ.10 లక్షలకు మించి సొమ్ము వెనక్కి తీసుకోవాలనుకుంటున్నారా? అయితే ఇలాంటి అప్లికేషన్లు ఇక ఆన్‌లైన్‌లోనే సమర్పించాలి. ఆఫ్‌లైన్‌లో సమర్పిస్తే కుదరదు. ఉద్యోగుల పెన్షన్ పథకం (ఇపిఎస్) నుంచి రూ.5 లక్షలకు మించి వెనక్కి తీసుకోవాలన్నా ఇక ఇదే పద్ధతి. గత నెల 27న ఇపిఎఫ్ఒ ఈ మేరకు ఒక సర్క్యులర్ జారీ చేసింది. ఇలా ఆన్‌లైన్‌లో అప్లికేషన్ ఫైల్ చేయాలంటే ముందుగా ఇపిఎఫ్ సభ్యుల సార్వత్రిక ఖాతా సంఖ్య (యుఎఎన్)తో బ్యాంకు ఖాతా, ఆధార్ నంబర్ కూడా లింకప్ అయి ఉండాలి.

ఆన్‌లైన్ ద్వారా అప్లికేషన్ సమర్పించే పద్ధతి

- ముందుగా యుఎఎన్ వివరాలతో ఇపిఎఫ్ఒ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఇపిఎఫ్ఒ మెంబర్ ఇంటర్‌ఫేస్‌లో లాగిన్ కావాలి. తర్వాత ఆధార్ వివరాలతో లాగిన్ కావాలి.
- ఇవన్నీ పూర్తయ్యాక 'ఆన్‌లైన్ సర్వీస్' టాబ్ కింద సంబంధిత క్లెయిమ్ ఫారాన్ని ఎంచుకుని పూర్తి చేయాలి.
- ఇపిఎఫ్ తుది సెటిల్‌మెంట్ కోసమైతే రిటైర్ అయిన రెండు నెలల తర్వాతే క్లెయిమ్ సబ్మిట్ చేయాలి.
- ఇపిఎఫ్ తుది సెటిల్‌మెంట్ కోసం ఆన్‌లైన్‌లోనే ఫారమ్ 19, పాక్షిక ఉపసంహరణ కోసమైతే ఫారమ్ 31, పెన్షన్ విత్‌డ్రాల్స్ కోసమైతే ఫారమ్ 10-సి ఎంచుకుని పూర్తి చేసి సబ్‌మిట్ చేయాలి.
- ఆన్‌లైన్‌లో క్లెయిమ్ అప్లికేషన్ ఫారమ్ పూర్తి చేసి సబ్‌మిట్ చేశాక, తమ క్లెయిమ్ రిక్వెస్ట్ స్టేటస్‌ను కూడా ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. ఇందుకోసం ఆన్‌లైన్ సర్వీసెస్ టాబ్ క్లిక్ చేసి 'ట్రాక్ క్లెయిమ్ స్టేటస్' క్లిక్ చేస్తే మీ విత్‌డ్రాల్ క్లెయిమ్ తాజా స్టేటస్ ఏమిటో వెంటనే తెలిసిపోతుంది.

మొత్తం మీద ఈ మార్పుతో పిఎఫ్ వెనక్కి తీసుకోవడం కోసం పిఎఫ్ ఆఫీసులో అప్లికేషన్ ఇచ్చి, ఆ ఆఫీసు చుట్టూ తిరగాల్సిన శ్రమ తప్పుతుంది. ముందు ముందు ఈ సర్వీసును రూ.5 లక్షల కంటే తక్కువ విత్‌డ్రాల్స్‌కూ విస్తరించే అవకాశం ఉందని భావిస్తున్నారు.



'సీతారామ స్వామి.. నే జేసిన నేరంబేమి'.. 'రామచంద్రాయ జనకరాజజా మనోహరాయ..' అంటూ భద్రాద్రిరాముడిని రామదాసు 'సీతారామచంద్ర స్వామి'గా కొలిచాడు! ఆలయ గోపురంపై శివపరివారాన్ని చెక్కించాడు. ఆలయంలో శివలింగాన్ని ప్రతిష్ఠించాడు. అయితే.. హరిహరుల అభేదంగా రామదాసు నిర్మించిన ఆ ఆలయాన్ని పూర్తిస్థాయి వైష్ణవ క్షేత్రంగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని కొందరు పండితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీతారామచంద్రస్వామిని రామనారాయణుడిగా మార్చేస్తున్నారని.. కల్యాణ సమయంలో సీతారాముల గోత్రనామాలు, ప్రవరలకు బదులు లక్ష్మీనారాయణుల ప్రవర చదువుతున్నారని.. అక్కడ జరుగుతోంది సీతారామ కల్యాణం కాదని ఆందోళన వెలిబుచ్చుతున్నారు. దీనిపై ప్రముఖ ఆధ్యాత్మికవేత్త అన్నదానం చిదంబర శాస్త్రి 'ఆంధ్రజ్యోతి'కి పలు వివరాలు అందించారు. ఆ వివరాలతో ప్రత్యేక కథనం.



సీతారామకల్యాణం అంటే.. ఊరంత వైభోగం! ఆకాశమంత పందిరి.. భూదేవంత పీట వేసి.. సిరికల్యాణపు బొట్టును పెట్టుకున్న సిగ్గుల మొగ్గ సీతమ్మతల్లి.. సొంపుగ కస్తూరి నామం తీర్చి పెళ్లికొడుకైన రామయ్యకు భద్రాచలంలో జరిపే కల్యాణ వేడుకలను తిలకించి పులకించిపోయేందుకు భక్తజనం తపిస్తారు! అంతటి గొప్ప వివాహ వేడుకలో చెబుతున్న గోత్ర, ప్రవరలు సీతారాములవి కావట. రామనారాయణుడిగా పదేపదే ప్రస్తావించి.. రామచంద్రుడనే పేరును మరుగుపరిచే ప్రయత్నం జరుగుతోందని, శివకేశవులిద్దరూ ఒక్కటేనంటూ, ఆలయ గోపురంపై ఇద్దరినీ అర్ధనారీశ్వరునిలా రామదాసు చెక్కిస్తే.. ఆ హరిహరాద్వైత క్షేత్రానికి వైష్ణవ క్షేత్రంగా ముద్ర వేసేందుకు ప్రయత్నం జరుగుతోందని కొందరు పండితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శ్లోకాన్ని తీసేశారు

"యస్యావతార దివసే తస్యకల్యాణ మాచరేత్' అని పాంచరాత్ర ఆగమం చెబుతోంది. అంటే ఏ రోజు ఏ అవతారం వచ్చిందో ఆ రోజు ఆ అవతారానికి కల్యాణం చేయొచ్చని అర్థం. రాముడు చైత్ర శుద్ధ నవమినాడు పుట్టాడు. ఆ రోజు కల్యాణంలో దశరథుని గోత్రప్రవరలే చెప్పాల్సి వస్తుందని దానికి సంబంధించిన శ్లోకాన్ని శుభలేఖ నుంచి తీసేశారు" అన్నది కొందరి ఆరోపణ. కానీ కలియుగంలో విష్ణుమూర్తి చతుర్భుజాలతో రాముడిలా భద్రుడికి దర్శనమిచ్చాడు కనుక విష్ణువు గోత్రప్రవరలు చెప్పడమే సరైనదన్న వాదన కూడా ఉంది.

అన్నీ మార్చేసి..

రాముని గోత్రం వశిష్ఠ. కానీ.. భద్రాచలంలో సీతారామ కల్యాణంలో 'అచ్యుత' గోత్రం చెబుతున్నారు. సీతమ్మ గోత్రం గౌతమ కాగా.. సౌభాగ్య గోత్రాన్ని చెబుతున్నారు. ప్రవరల విషయానికి వస్తే.. రాముడికి నాభాగ, అజ, దశరథ అని చెప్పాలి. కానీ పరబ్రహ్మ శర్మ, వ్యూహ నారాయణ శర్మ, విభవ వాసుదేవ శర్మ అని చెబుతున్నారు. సీతాదేవికి స్వర్ణరోమ, హ్రస్వరోమ, జనకుడు అనే ప్రవర చెప్పాలి. దానికి బదులు.. విశ్వంభర శర్మ, రత్నాకర శర్మ, క్షీరార్ణవ శర్మ అని చెబుతున్నారు. దీనికి కారణం ఏమిటో వైష్ణవ స్వాములే చెప్పాలని చిదంబరశాస్త్రి ప్రశ్నిస్తున్నారు. మహాపండితులు జటావల్లభుల జగన్నాథ శాస్త్రి.. తమ కాలంలో భద్రాద్రిలో సీతారాముల గోత్రప్రవరలే చెప్పేవారని ఆయన తెలిపారు. భద్రాద్రి కల్యాణవ్యాఖ్యకు ఆద్యులు జమ్మలమడక మాధవ రామ శర్మ.. కల్యాణసమయంలో సీతారామ ప్రవరలే చెబుతున్నట్లుగా వ్యాఖ్యానించారని చిదంబర శాస్త్రి వెల్లడించారు. భద్రాద్రి క్షేత్రం ట్రస్టీ.. 97 ఏళ్ల జీవించిన టీవీ జీఆర్ కృష్ణమూర్తి.. 2004 దాకా సీతారామ ప్రవరలే చెప్పేవారని ఒక వ్యాసంలో స్పష్టం చేశారు.

శ్రీరామ నీ నామమే మారెనా?

భద్రాచలంలో మారిన సీతారాముల గోత్రప్రవరలు!

రాముడి గోత్రం వశిష్ఠ.. కల్యాణంలో చెబుతున్నది అచ్యుత

సీతమ్మ గోత్రం గౌతమ.. చెబుతున్నది సౌభాగ్య గోత్రం

'రామచంద్ర స్వామినే వరాయ' అనడానికి బదులు

'రామనారాయణ స్వామినే వరాయ' అంటున్న అర్చకులు!

గతంలో 'రామచంద్ర' అనే చెప్పేవారంటున్న భక్తులు







కొత్తగా రామనారాయణ..

గోపన్న వంశంలోని 9వ తరం పండితులు కంచర్ల పాండురంగ శర్మ.. 'రామదాసు చరిత్ర' రాసి 1963లో, 1996లో ముద్రించారు. ఇతరుల చొరవతో మరోసారి అది ముద్రితమైంది. తాజా ముద్రణలో 'రామానారాయణ' అనే పదం 11 సార్లు ఉంది. కానీ, మూలంలో తాను 'రామనారాయణ' అనే పదప్రయోగం ఒక్కసారి కూడా చేయలేదని పాండురంగశర్మ వాపోయారు. 'రామనారాయణ' శబ్దాన్ని తొలగించాలనే తన విజ్ఞప్తిని అర్చకులు లెక్కచేయకపోతే నిరశన వ్రతానికి, ప్రాణత్యాగానికైనా సిద్ధమని హెచ్చరించారు. 'రామనారాయణ' అనడం వెనుక ఉన్న దురుద్దేశాలను, అధర్మ, అసత్య ప్రవర్తనలను భక్తులు ఎదిరించి ఆ ప్రయత్నాలను ఆపాలని కోరారు. 'రామనారాయణ' అనే మాటను రామదాసు ఏనాడూ వాడలేదని తేల్చిచెప్పారు. కానీ.. భద్రాద్రి రాముడిని రామనారాయణుడిగా మార్చేందుకు వైష్ణవ స్వాములు పలు ప్రయత్నాలు చేస్తున్నారని చిదంబర శాస్త్రి ఆరోపిస్తున్నారు. "ఆలయ శిలాఫలకంపై 'సీతారామ రమేశ రామ మహిత జ్ఞాన స్వరూప ప్రభో' అని ఉంటుంది. కానీ 'శ్రీ భద్రాద్రి రామ స్తోత్ర మంజరి'లో దాన్ని 'సీతారామ రమేశ రామ చిన్మయ హరే శ్రీరామనారాయణ' అని మార్చి అచ్చువేశారు. దీనివల్ల ఛందస్సు భంగమైనా పండితులకు అర్థమైనా సామాన్యులు గ్రహించలేరన్న ధీమాతో ఇలా వ్యవహరించారు" అని ఆయన ఆవేదన వెలిబుచ్చుతున్నారు. "భద్రాద్రిలో అత్యంత ముఖ్యమైన కల్యాణం నిర్వహించే వ్యవస్థను రామదాసు ఏర్పాటు చేయగా తెలుగువారందరూ దాన్నే అనుసరిస్తున్నారు. 'రామచంద్రస్వామినే వరాయ' అని అక్కడ ఆది నుంచి అనేవారు. 'మ'కారంలోని శివత్వాన్ని పోగొట్టాలంటే పక్కన నారాయణ శబ్దం వాడడమే మార్గమని వైష్ణవ స్వాములు 'రామనారాయణ స్వామినే వరాయ' అని చెప్పడం ప్రారంభించారు. భద్రాద్రి ప్రమాణంగానే తెలుగువారంతా సీతారామకల్యాణం చేస్తూ.. ఆనాటి గోత్రప్రవరలే నేటికీ చెబుతుంటే, మూలస్థానంలో మాత్రం మార్చేశారనే సంగతి లోకానికి తెలియదు" అని వివరించారు.

గర్భాలయం కొలతలూ మార్చేయత్నం..

గోపురంపై ఉన్న శివపరివారాన్ని కూడా తొలగించే ప్రయత్నం గతంలో జరిగిందని కొందరు భక్తులు చెబుతున్నారు. అయితే, ఏ వంకా లేకుండా ఆ మూర్తులను తొలగించడం సాధ్యం కాదు కాబట్టి.. గర్భాలయ కొలతలు మార్చాలనే ఆలోచన చేశారని.. గర్భాలయాన్నే మార్చేటట్లయితే తక్కిన నిర్మాణాలను కూడా మార్చేసే వీలు కలుగుతుందనే ఉద్దేశంతో 1960లో ఆలయ పునరుద్ధరణకు నడుంబిగించారని అన్నదానం చిదంబర శాస్త్రి ఆరోపిస్తున్నారు. "గర్భాలయ కొలతలు మార్చే ప్రయత్నాన్ని గమనించిన కొందరు భక్తులు ప్రతిఘటించడంతో.. ఆ విషయం అప్పట్లో పత్రికలు, శాసనసభ దాకా చేరింది. చివరికి ఈ వ్యవహారాన్ని కంచి కామకోటి శంకరాచార్యులవారికి నివేదించి వారి తీర్పును ఉభయపక్షాలూ అంగీకరించాలని నిర్ణయించారు. ఎస్‌జీటీ వరదాచార్యులు కంచికి వెళ్లి పరమాచార్యులవారిని సంప్రదించగా.. ఆలయ కొలతలను మార్చాల్సిన అవసరం లేదని ఆయన తేల్చిచెప్పారు. ఆయన తీర్పును అంగీకరిస్తామన్నవారు.. ఆ తర్వాత మాటమార్చేశారు. అద్వైత మత ప్రవర్తకులైన కంచి స్వామి జోక్యం కూడదని వాదించారు. ఆ వ్యవహారాన్ని కోర్టుకు లాగారు. కోర్టులో వారి వాదం నెగ్గలేదు" అని చిదంబర శాస్త్రి వివరించారు.




అష్టాక్షరిలో 'రా'.. పంచాక్షరిలో 'మ'

నారాయణ అష్టాక్షరి మంత్రంలోని జీవాక్షరమైన 'రా'ని, శివ పంచాక్షరిలో జీవాక్షరమైన 'మ'ని కలిపి వశిష్ఠుడు దశరథుని జ్యేష్ఠపుత్రుడికి రాముడని పేరు పెట్టాడు. అందువల్ల రాముడు హరిహరులిద్దరి తత్త్వమని రామాయణ సారోద్ధారం చెప్పింది.

'నారాయణాష్టాక్షరే చ శివ పంచాక్షరే తథా, సార్థకార్ణద్వయం ప్రాప్య రామ ఇత్యక్షర ద్వయం గృహీత్వా రామనా మైవం వశిష్టః దత్తవానితి, తస్మాద్రామః హరిహరో(ఉ)భయాత్మకః ఇతి స్పష్టమ్' (రామాయణ సారోద్ధారం)

రామదాసు హరిహరాద్వైతి. ఆయనకు శివకేశవ భేదం లేదు. భద్రాద్రిలో రామునితోపాటు శివలింగం బయల్పడగా దానిని రాముని ముందు ప్రతిష్ఠించాడు. గోపురంపై శివకేశవులను అర్ధనారీశ్వరునిలా చెరొకవైపూ చెక్కించి.. శివునివైపు నందిని, విష్ణువు వైపు గరుడుని ఉంచాడు. అలాగే గణపతిని, దక్షిణామూర్తిని, సుబ్రహ్మణ్యుని నాగబంధాన్ని కూడా చెక్కించాడు. తన మనుమనికి 'లింగన్న' అని శివుని పేరు పెట్టాడు. వైష్ణవులు దీన్ని మార్చేందుకు ప్రయత్నిస్తుండడమే గోత్రప్రవరల మార్పునకు, ఇతర వివాదాలకు కారణమని చిదంబర శాస్త్రి ఆరోపిస్తున్నారు. "రామదాసు జయంతికి నవరత్న కీర్తనలు పాడతారు. అందులో 7వ కీర్తన 'హరిహర రామ! నన్నరమర చూడకు, నిరతము నీ నామస్మరణ ఏమరను' అనేది మంగళంపల్లి బాలమురళీకృష్ణగానంలో సుస్పష్టం. కానీ అచ్చులో దాన్ని 'హరి హరి రామ' అని ముద్రించారు. చూసినవారు అదేదో అచ్చుతప్పు అనుకుని వదిలేస్తారు. కానీ, అది కావాలనే చేసిన మార్పు" అని ఆయన అంటున్నారు.



రాముడు కాకపోతే కల్యాణం ఎందుకు చేస్తున్నట్టు?

భద్రాచలంలో కొలువైనది రామచంద్రుడే. నారాయణుడు అనడానికి ఎవరికీ అభ్యంతరం లేదుగానీ.. రాముడిని రామనారాయణుడిగా హైలైట్ చేయాల్సిన అవసరం ఏమిటి? ఇది రామ క్షేత్రం కాబట్టి రాముడనే అనాలి. క్షేత్రచరిత్రను మార్చొద్దు. రామదాసు రచించిన స్తోత్రాల్లో ఆయన కీర్తించింది రాములవారినే. రామనారాయణుడిని కాదు. చెరలో ఉన్న రామదాసును విడిపించడానికి వచ్చింది లక్ష్మీనారాయణుడు కాదు. రామలక్ష్మణులే నవాబుకు దర్శనమిచ్చి బంగారు మాడలు ఇచ్చారు. ఇది చరిత్ర. భద్రాచలంలో తొలినాళ్లలో మిరాశీదారు వ్యవస్థ ఉండేది. ఆ తర్వాత అర్చకులను నియమించారు. అప్పటి నుంచే ఈ సమస్య వచ్చింది. క్షేత్రమహిమను ఎవ్వరూ మార్చకూడదు. సీతారామ కల్యాణాన్ని నా 12వ ఏట నుంచి చూస్తున్నాను. 'రామచంద్ర స్వామినే వరాయ' అనే అనేవారు. అలాంటిది ఇప్పుడు ఇప్పుడు ఏ ఉద్దేశంతో రామనారాయణ అంటున్నారో వాళ్లకే తెలియాలి. భద్రాద్రిలో కొలువైంది రాముడు కాకపోతే సీతారామ కల్యాణం ఎందుకు చేస్తున్నట్టు? దీనిపై ప్రభుత్వమే ఒక కమిటీని నియమించి.. స్వామిని ఏ పేరుతో కొలవాలో అధికారికంగా తేల్చిచెబితే బాగుంటుంది.

–తూము వెంకట లక్ష్మీ శ్యామ్‌సుందర్‌రావు, సీనియర్ పాత్రికేయులు (అపర రామదాసుగా పేరొందిన భక్త శిఖామణి తూము నరసింహదాసు వారసుడు ఈయన. నరసింహదాసు పాల్వంచ పరగణాకు తహసీల్దారుగా, భద్రాచల ఆలయానికి ధర్మాధికారిగా పనిచేశారు)



ధర్మాచార్యులు కలగజేసుకోవాలి

భద్రాచల రాముడి నామ, గోత్ర, ప్రవరలే ఆపదలో పడి కల్యాణ భంగం జరుగుతున్న ఈ దశలో పెద్దలైనవారు మౌనం వహింపక న్యాయం జరిగేట్లుగా చూడాలి. ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత సంప్రదాయాల సమన్వయ కృషి కోసం త్రివిధ పీఠాల ధర్మాచార్యులతో ఏర్పడిన ప్రతిష్ఠాత్మక వ్యవస్థ హిందూ ధర్మాచార్య ప్రతిష్ఠాన్. ఈ వ్యవస్థను త్రిదండి చినజీయర్ స్వామి, సుబుధేంద్రస్వామి, పరిపూర్ణానందస్వామి సారథులుగా ఉండి నడిపిస్తున్నారు. భద్రాద్రి ఆలయం విషయంలో వీరి తీర్పు ప్రభుత్వానికి సరైన రీతిలో మార్గదర్శనం చేయగలదని రామభక్తులు ఆశిస్తున్నారు.

–అన్నదానం చిదంబర శాస్త్రి, రచయిత



శివలింగాన్ని పీకేశారు!

భద్రాచల పూర్వ అర్చకులు పొడిచేటి రంగాచార్యుల వారు 'శ్రీ భద్రగిరి వైభవం'లో ఒక సంగతిని వివరంగా తెలిపారు. అదేంటంటే.. ఆలయంలో రాముని సమీపంలో ప్రతిష్ఠితమైన శివలింగాన్ని వైష్ణవార్చకులు గతంలో పీకి, బిందెలో వేసుకుని పోయి గోదావరిలో పడేసి వచ్చారు. కావేరిలో పారేసిన రామపంచాయతనం త్యాగరాజుకు అందినట్లుగా.. మర్నాడు భద్రాద్రి ఆలయ తలుపులు తెరిచేసరికి శివలింగం యథాస్థానంలో ఉన్నదట. మళ్లీ మళ్లీ పీకి నదిలో పారేసినా అలాగే జరుగుతూ వచ్చిందట. మహిమాన్వితమైన ఆ శివలింగాన్ని అలా తొలగించలేమని నిశ్చయానికి వచ్చి.. శక్తిబంధం చేసి అవతల కొద్దిదూరంలో ప్రతిష్ఠించి అనామకంగా మార్చారట. దేవాదాయ శాఖ ముద్రించిన పుస్తకంలో ఉన్నదిది. నేటికీ ఆ శివలింగాన్ని అక్కడ చూడొచ్చు.

ఆలయంలో ఆళ్వారుల విగ్రహాలు

"**ఆ**లయానికి పూర్తిస్థాయి వైష్ణవ క్షేత్రంగా ముద్ర వేయాలంటే 12 మంది ఆళ్వారులు ఆలయంలో ఉండాలనే ఉద్దేశంతో వైష్ణవ స్వాములు.. 12 మంది ఆళ్వారుల విగ్రహాలను, వాటితోపాటు రామదాసు విగ్రహాన్ని ప్రతిష్ఠించి, వాటిని కూడా రామదాసే ప్రతిష్ఠించాడని చెబుతున్నారు" అని చిదంబర శాస్త్రి ఆరోపిస్తున్నారు. శివలింగం ఉండగా ఆళ్వారులను పెట్టరని.. దీన్ని రామదాసు వంశీయులే ఆక్షేపించారని ఆయన పేర్కొంటున్నారు.





రాముడికి 4 చేతులున్నాయా?

"**భ**ద్రాద్రి రాముడికి నాలుగు చేతులు ఉండడం వల్ల.. ఆయనను రామనారాయణుడు అనాలన్నది అర్చకుల వాదనల్లో ముఖ్యమైనది. కానీ, భద్రుడికి రాముడు నాలుగు చేతులతోనే దర్శనమిచ్చాడు. రామదర్శనం కాగానే భద్రుడు.. 'నమస్తే దేవదేవేశ శంఖచక్రగదాధర! ధనుర్బాణ ధరానంత రామచంద్ర నమోస్తుతే' అని స్తుతించాడు. 'రామచంద్ర' అనే సంబోధించాడు తప్ప నాలుగు చేతులతో కనిపించాడు కాబట్టి 'రామనారాయణ' అనలేదు. అందుకే రామదాసు కూడా సీతారామచంద్రస్వామి దేవస్థానాన్నే ఏర్పరచి.. 'రామచంద్ర స్వామినే వరాయ' అనిపించాడు. దానిని మార్చి 'రామనారాయణ' అనడం భద్రుడు, గోపన్నల ఆశయాలకు విరుద్ధం. ముఖ్యమైన ప్రశ్నేమిటంటే.. భద్రుడికి సాక్షాత్కరించింది నారాయణుడైతే పక్కన లక్ష్మణుడు ఎలా ఉంటాడు? భద్రునికి సాక్షాత్కరించిన రాముడి శంఖచక్రాలు భరత శత్రుఘ్నులుగా గ్రహించాలి. సీతారామలక్ష్మణులతో అది రామపంచాయతనంగా గ్రహించాలి తప్ప నారాయణ శబ్దం వాడటం తగదు. రామదాసు ఏర్పాటు చేసిన హరిహరాద్వైత వ్యవస్థను తుడిచివేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి." అని చిదంబర శాస్త్రి విజ్ఞప్తి చేస్తున్నారు.



సభలో అభివాదం చేస్తున్న వంగపల్లి, యాతాకుల తదితరులు

ఎస్సీ ఉపకులాలకు కార్పొరేషన్: వంగపల్లి

ఉస్మానియాయూనివర్సిటీ/హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని టీఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. ఓయూలో ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేడి పాపన్న అధ్యక్షతన ఆదివారం మాదిగ, ఉపకులాల రాష్ట్ర ప్రతినిధుల సభ జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే ఎస్సీ వర్గీకరణపై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలన్నారు. బడ్జెట్‌లో మాదిగ, ఉప కులాలకు న్యాయం చేయాలని 19న జిల్లాల్లోని అన్ని మండల కార్యాలయాల్లో ధర్నాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. 21న కలెక్టరేట్ల ఎదుట దీక్ష, 23న చలో ప్రగతిభవన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

టీజేఏసీపై నిర్బంధం సరికాదు : జానారెడ్డి

త్రిపురారం, మార్చి11 : టీజేఏసీపై నిర్బంధం విధించడం సరికాదని సీఎల్పీ నేత జానారెడ్డి పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా త్రిపురారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రజాచైతన్య పాదయాత్రలో ఆయన మాట్లాడారు. ఆనాడు కాంగ్రెస్ తలుచుకుంటే టీఆర్ఎస్ పార్టీ గడపదాటి బయటకు వచ్చేదా? అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు.

మాతో కలవండి: కోదండతో ఆప్ నేత

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో విలువలతో కూడిన రాజకీయాలు అవసరమని ఆమ్ ఆద్మీ పార్టీ నేత సోమ్‌నాథ్ భారతి అన్నారు. ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం తమతో కలిసి పనిచేయాలని టీజేఏసీ చైర్మన్ కోదండరాంను కోరారు. ఆదివారం ఇక్కడి ఓ హోటల్‌లో టీజేఏసీ నేతలతో సోమ్‌నాథ్ బృందం సమావేశమై టీజేఏసీ ఏర్పాటు చేయబోతున్న పార్టీ గురించి ఆరా తీసింది. కాగా, ఆప్‌తో కలిసి పనిచేసే విషయం ముఖ్యులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కోదండరాం తెలిపారు.

ఆర్మూర్‌లో కాంగ్రెస్ దుకాణం బంద్: జీవన్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ దుకాణం బంద్ అయిందని టీఆర్ఎస్ ఎమ్మెల్యే ఎ.జీవన్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ నేతలు ఆదివారం ఇక్కడ తెలంగాణభవన్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో టీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. టీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నామని వారు తెలిపారు.

దమ్ముంటే రాజీనామా చేయించండి: ఇంద్రసేన

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): "దమ్ముంటే ఫిరాయించిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించండి.. ఎన్నికలకు వెళదాం.. ఎవరి సత్తా ఏంటో తేల్చుకుందాం" అని బీజేపీ సీనియర్ నేత ఇంద్రసేనారెడ్డి టీఆర్ఎస్‌కు సవాల్ విసిరారు. బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ తెలంగాణకు అదనంగా ఒక్క రూపాయి కూడా కేంద్రం ఇవ్వలేదన్న మంత్రి కేటీఆర్ ప్రకటనను తప్పుబట్టారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రుణవిమోచన కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

విభజన హామీలపై నేడు కేంద్ర హోంశాఖ భేటీ

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విభజన చట్టంలో పేర్కొన్న హామీలపై కేంద్ర హోంశాఖ సోమవారం సమావేశమవ్వనుంది. దీంతో పాటు.. తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న అపరిష్కృత సమస్యలపై చర్చించనుంది. ఢిల్లీలో మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభంకానున్న ఈ సమావేశంలో.. తెలంగాణ, ఏపీకి చెందిన అధికారులు పాల్గొననున్నారు.

రేవంత్‌వి గాలిమాటలు: కర్నె

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నవన్నీ గాలిమాటలేనని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అన్నారు. దిగజారుడు రాజకీయాలు చేస్తూ టీఆర్ఎస్ నేతలపై రేవంత్‌రెడ్డి వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని మండిపడ్డారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వంపై చేసిన ఆరోపణల్లో ఒక్కదానిని కూడా కాంగ్రెస్ నేతలు ఇప్పటివరకు నిరూపించలేకపోయారన్నారు. మంత్రి హరీశ్‌రావు బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాను ఎప్పుడు కలిశారో రేవంత్ నిరూపించాలని డిమాండ్ చేశారు.

జూన్ 2 నుంచి రైతు బీమా అమలు

హైదరాబాద్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి రైతుకూ రూ.5 లక్షల రైతు బీమా పథకం జూన్ 2 నుంచి అమల్లోకి రానుంది. వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధికారిక నివాసంలో జీవితబీమా సంస్థ అధికారులతో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. తొలుత ఏప్రిల్ నెల నుంచే అమలు చేయాలనుకున్నప్పటికీ రాష్ట్రంలోని రైతుల సంఖ్య తేలితేగానీ స్పష్టత రాదని ఎల్ఐసీ ప్రతినిధులు, వ్యవసాయశాఖ అధికారులు అభిప్రాయపడడంతో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 2 నుంచి అమలు చేయాలని నిర్ణయించారు.

కోలుకుంటున్న కల్తీ కల్లు బాధితులు

శంషాబాద్ రూరల్, మార్చి 11: కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురైన 18 మంది బాధితులు కోలుకుంటున్నారు. బాధితుల్లో 16 మంది హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో, ఇద్దరు చిన్నారులు శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిల్లో చికిత్స పొందుతున్నారు. శనివారం ఫిల్లోనిగూడలో జూకల్ మధ్యలో ఉన్న తాటి చెట్ల వద్ద కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. స్థానిక పోలీసులు ఆదివారం గాంధీ ఆస్పత్రికి చేరుకుని బాధితుల వివరాలు సేకరించారు. ఎస్ఎఫ్ఎల్ నివేదిక వచ్చాకే కల్తీ కల్లుపై స్పష్టత రానుందని వైద్యులు తెలిపారు.

'ఉద్యోగుల మహాసభ'కు సన్నాహకం

హైదరాబాద్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఈ నెల 25న హైదరాబాద్‌లో నిర్వహించనున్న సకల ఉద్యోగుల మహాసభను విజయవంతం చేసే క్రమంలో జిల్లాల్లో సన్నాహక సమావేశాలను నిర్వహించాలని తెలంగాణ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనుదారుల జేఏసీ నిర్ణయించింది. 17న ఖమ్మం, 19న వరంగల్, 20న మహబూబ్‌నగర్, 21న నిజామాబాద్, 22న హైదరాబాద్‌లో సమావేశాలు నిర్వహించాలని తీర్మానించింది.

బహుజనులకు సీఎం సీటు ఇవ్వండి: తమ్మినేని

ఎల్బీనగర్/ఉప్పల్ /హైదరాబాద్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): బహుజనులకు గొర్రెలు, బర్రెలు వద్దు.. సీఎం సీటు కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి, బహుజన లెఫ్ట్ ఫ్రంట్ కన్వీనర్ తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆదివారం ఎల్బీనగర్‌లో జరిగిన బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల బహిరంగ సభలో మాట్లాడుతూ రాష్ట్రంలో బహుజనులు 83% ఉన్నారని, వారి జనాభాకు తగ్గట్లు నిధులు కేటాయించకపోవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.

ట్రాన్స్‌కో ఏఈ పరీక్షకు 68 వేల మంది హాజరు

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కోలో 330 అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఆదివారం ముగిసింది. పరీక్షకు మొత్తం 68,171 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

నక్సలైట్లను ఎందుకు చంపావ్?: హరగోపాల్

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): 'తెలంగాణ వస్తే ఎన్‌కౌంటర్లు ఉండవన్నావు. మావోయిస్టుల ఎజెండానే నా ఎజెండా అన్నావు. మరి తెలంగాణ వచ్చాక రాష్ట్ర సరిహద్దులు దాటి మరి పదుల సంఖ్యలో నక్సలైట్లను ఎందుకు ఎన్‌కౌంటర్ చేయిస్తున్నావు?' అని సీఎం కేసీఆర్‌ను పౌరహక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్ ప్రశ్నించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజాఫ్రంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. మిలియన్ మార్చ్ స్ఫూర్తి కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించడాన్ని తప్పుబట్టారు.

'నీట్' పీజీ ప్రవేశ ఫలితాలు విడుదల

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : నీట్ పీజీ ప్రవేశ ఫలితాలను విడుదల చేసినట్లు వరంగల్ కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. 5,608 మంది విద్యార్థులు సాధించిన మార్కులు, ఆల్ ఇండియా ర్యాంక్ తదితర వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని ఆదివారం తెలిపారు.

నేటి నుంచే అసెంబ్లీ

బడ్జెట్ సమావేశాలను ప్రారంభించనున్న గవర్నర్



బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ వద్ద పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్న పోలీసులు

▸▸ **15న ఉభయ సభల్లో వార్షిక బడ్జెట్**

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ శాసనసభ 9వ సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. 2018-19 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను ఈ సమావేశాల్లో ఆమోదించనున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు తొలుత ఉభయ సభలనుద్దేశించి రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ప్రసంగించనున్నారు. గవర్నర్ ప్రసంగానికి ఇప్పటికే సర్క్యులేషన్ పద్ధతిలో రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గవర్నర్ ప్రసంగం ముగిసిన వెంటనే సభను వాయిదా వేస్తారు. అనంతరం సభా వ్యవహారాల కమిటీ (బీఏసీ) సమావేశమవుతుంది. శాసనసభ సమావేశాలను ఎన్ని రోజులు నిర్వహించాన్నది నిర్ణయిస్తుంది. అయితే ఈ నెలాఖరు నాటికే సమావేశాలను ముగించాలనే ప్రతిపాదనతో పాటు ఏప్రిల్‌లోనూ కొన్నిరోజులపాటు సభలను సమావేశపరిచే అవకాశముందని భావిస్తున్నారు. బడ్జెట్ ప్రతిపాదనలను ఈ నెల 15న ఉభయ సభల్లోనూ ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుత ప్రభుత్వానికి ఇదే పూర్తిస్థాయి చివరి బడ్జెట్ కానుంది. ఒకవేళ మరో బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉన్నా.. అది ఓట్ ఆన్ అకౌంట్ పద్ధతిలోనే ఉంటుంది. ఈ నేపథ్యంలో బడ్జెట్‌ను అటు అభివృద్ధి, ఇటు సంక్షేమాన్ని మేళవిస్తూ ప్రజానుకూల బడ్జెట్ దిశగా రూపొందించినట్లు సమాచారం. ఈసారి బడ్జెట్ ప్రతిపాదనలు రూ.1.78 లక్షల కోట్లుగా ఉండే అవకాశం ఉంది. ఇందులో నీటి పారుదల రంగానికి పెద్దపీట వేయడంతోపాటు అనేక సంక్షేమ పథకాలకు కేటాయింపులు భారీగానే ఉంటాయని అంచనా వేస్తున్నారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రభుత్వం పలు బిల్లులను సభలో ప్రవేశపెట్టనుంది. దీంతోపాటు పలు అంశాలపై తీర్మానాలు చేయనుంది.

ప్రవేశపెట్టనున్న బిల్లులు ఇవే..

పంచాయతీరాజ్ చట్టం-2018: తండా పంచాయతీల ఏర్పాటు, పంచాయతీలకు నేరుగా నిధులు, సర్పంచ్‌లకు అదనంగా కొన్ని అధికారాలు, రిజర్వేషన్ రెండు పర్యాయాలు కొనసాగింపు వంటివి ముఖ్యాంశాలుగా ఉన్నాయి.

డీజీపీ నియామక చట్టం-2018: ప్రస్తుతం కేంద్రం పరిధిలో ఉన్న రాష్ట్ర డీజీపీ నియామకాన్ని రాష్ట్ర ప్రభుత్వమే నియమించుకునేలా చట్టం తేనున్నారు.

అసైన్డ్ ల్యాండ్ సవరణ చట్టం: భూమి రికార్డులకు సంబంధించి ప్రభుత్వం అనేక సంస్కరణలు తెచ్చిన నేపథ్యంలో ఈ సవరణ చేస్తున్నారు.

తెలుగు తప్పనిసరి చట్టం (చట్టం చేయని పక్షంలో ఆర్డినెన్స్): పదో తరగతి వరకు తెలుగు సబ్జెక్టును తప్పనిసరి చేయనున్నారు.

ఆ రెండు తీర్మానాలపైనే..

ఈసారి బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం పలు బిల్లులకు ఆమోదం తెలపడంతోపాటు కొన్ని తీర్మానాలు చేసే అవకాశం ఉంది. ఇందులోనే రిజర్వేషన్ల అంశం ఉండవచ్చని భావిస్తున్నారు. ముస్లింలు, ఎస్టీలకు రిజర్వేషన్ల కోటా పెంచడానికి సంబంధించి ఒకే బిల్లును శాసనసభలో ఆమోదించి కేంద్రానికి పంపారు. అయితే ఈ బిల్లును వేర్వేరుగా ఆమోదించి పంపాలన్న సూచన నేపథ్యంలో ఇవి సభ ముందుకు రానున్నట్లు భావిస్తున్నారు.

వ్యూహ ప్రతివ్యూహాలు

▸▸ **ప్రభుత్వ తీరును ఎండగట్టాలని విపక్షాల నిర్ణయం**

▸▸ **విమర్శలను తిప్పికొట్టేందుకు టీఆర్ఎస్ సిద్ధం**

హైదరాబాద్, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహ, ప్రతివ్యూహాలతో అధికార, విపక్ష పార్టీలు సన్నద్ధమయ్యాయి. ఎన్నికల హామీల అమలులో టీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ప్రతిపక్షాలు నిర్ణయించుకోగా, విపక్షాల విమర్శలను సమర్థంగా తిప్పికొట్టేందుకు అధికార పార్టీ సిద్ధమైంది. మరోవైపు టీఆర్ఎస్ సైతం పక్కా వ్యూహం రూపొందించుకుంది. విపక్షాలు కోరినన్ని రోజులు సభ నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని, అభివృద్ధి, సంక్షేమ పథకాలను అసెంబ్లీ వేదికగా ప్రజలకు మరింత విస్తృతంగా వివరించాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సీఎం కేసీఆర్ ఆదేశించారు. విపక్షాలు లేవనెత్తే అంశాలను దీటుగా ఎదుర్కోవాలని, ఆరోపణలను సమర్థంగా తిప్పికొట్టాలని సూచించారు. అధికార పార్టీ వైఫల్యాలను ఎండగట్టేందుకు విపక్షాలు అస్త్రాలతో సిద్ధమయ్యాయి. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌తో పాటు, బీజేపీ, టీడీపీలు ఎన్నికల హామీల అమలులో టీఆర్ఎస్ వైఫల్యాలను నిలదీయాలని నిర్ణయించాయి. ఈ సమావేశాల్లో దూకుడు పెంచాలని, ఏమాత్రం రాజీపడవద్దని కాంగ్రెస్ శాసనసభాపక్షం నిర్ణయించింది. మాట్లాడే అవకాశం ఇవ్వకపోయినా, ప్రజా సమస్యలపై ప్రభుత్వం సరైన రీతిలో స్పందించకపోయినా ఎలాంటి నిరసనలకైనా వెనుకాడకూడదని నిర్ణయించింది. బడ్జెట్‌లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే బాధ్యతను పార్టీ సీనియర్ నేత భట్టి విక్రమార్కకు అప్పగించారు. బీజేపీ శాసనసభా పక్షం సోమవారం సమావేశమై... అనుసరించాల్సిన వ్యూహంపై నిర్ణయం తీసుకోనుంది. ఈ విషయాన్ని బీజేపీ ఎల్పీ నేత జి.కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా నిరుద్యోగ, రైతాంగ సమస్యలపై బీజేపీ ఎమ్మెల్యేలు గళమెత్తనున్నారు. ఎన్నికల ముందు టీఆర్ఎస్ ఆర్భాటంగా ప్రకటించిన లక్ష రూపాయల రుణమాఫీని పాక్షికంగానే అమలు చేయడంపై, వడ్డీ చెల్లింపుపై ప్రభుత్వ వైఖరిని నిలదీయాలని టీడీపీ నిర్ణయించింది. అధికార పార్టీకి మిత్రపక్షంగా వ్యవహరిస్తున్నా పలు సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని మజ్లిస్ పార్టీ నిర్ణయించింది. మైనారిటీ సంక్షేమం, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ తదితర అంశాలను ప్రస్తావిస్తామని మజ్లిస్ ఎమ్మెల్యేలు చెప్పారు. ప్రజా సమస్యలపై రోజుకో వాయిదా తీర్మానం ఇస్తామని సీపీఎం ఎమ్మెల్యే సున్నం రాజయ్య తెలిపారు. కాగా, రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారంలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ బీజేపీ సోమవారం ర్యాలీ నిర్వహించనుంది. బీజేఎల్పీ నేత జి.కిషన్‌రెడ్డి, బీజేఎల్పీ నేత ఎన్.రాంచందర్‌రావు, పార్టీ ఎమ్మెల్యేలు ఉదయం 9 గంటలకు బషీర్‌బాగ్‌లోని బాబూ జగ్జీవన్‌రాం విగ్రహం వద్దకు చేరుకుని, ర్యాలీగా అసెంబ్లీకి వెళతారు.

అసెంబ్లీని అడ్డుకుంటాం: వీహెచ్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ సమావేశాలను కాంగ్రెస్ అడ్డుకుంటుందని కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకూ సమావేశాలను అడ్డుకోవాలని తమ పార్టీ నేత జానారెడ్డి, ఎమ్మెల్యేలను ఇప్పటికే కోరినట్లు తెలిపారు. అసెంబ్లీ ఆవరణలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రిజర్వేషన్ల విషయమై ఢిల్లీలో కేసీఆర్ ధర్నా చేస్తాననడం హాస్యాస్పదమన్నారు.

ఇక టమాటాలు నెలైనా పాడవ్వవు!



నానో పదార్థాన్ని తయారు చేసిన ఐఐటీ-హైదరాబాద్ శాస్త్రవేత్తలు

టమాటాలు బయట ఉంటే 3, 4 రోజుల కన్నా ఎక్కువ కాలం నిల్వ ఉండవు. ఫ్రిజ్‌లో పెట్టినా వారం దాటితే పాడవుతాయి. అదే, నెల రోజులైనా తాజా తాజాగా ఉంటే ఎంత బాగుంటుంది. ఆ దిశగా పరిశోధనలు చేపట్టిన ఐఐటీ-హైదరాబాద్ శాస్త్రవేత్తలు.. వినూత్న పరిష్కారం కనుగొన్నారు. సెల్యూలోజ్, వెండి నానో కణాలు ఉపయోగించి ఓ నానో పదార్థాన్ని రూపొందించారు. టమాటాలపై ఫంగస్, బ్యాక్టీరియా పేరుకుపోవడం వల్ల పాడవుతాయి. వాటిని ఆ నానో పదార్థం నాశనం చేసి 30 రోజుల పాటు నిల్వ ఉండేలా చేస్తుందని మెటీరియల్ సైన్స్ విభాగానికి చెందిన డాక్టర్ ముద్రికా ఖండేల్వాల్, డాక్టర్ శివకల్యాణి చెప్పారు. 'సెల్యూలోజ్‌కు నీటిని ఎక్కువ కాలం నిల్వ చేసుకొనే సామర్థ్యం ఉంటుంది. అందువల్ల నానో పదార్థ తయారీకి దీన్ని ఎంచుకున్నాం.' అని ఖండేల్వాల్ తెలిపారు. 'సెల్యూలోజ్‌కు సోడియం హైడ్రాక్సైడ్‌ను కలిపి బ్యాక్టీరియాను చంపేశాం. దానికి సిల్వర్ నైట్రేట్ ద్రావకాన్ని, సోడియం బైహైడ్రేట్‌ను కలిపి నానోకణాలు తయారు చేశాం. ఇవి ఐదు నుంచి ఆరు నానోమీటర్ల పరిమాణం కలిగి ఉంటాయి. పరిమాణం ఎక్కువ ఉంటే టమాటలపై ఉండే ఫంగస్, బ్యాక్టీరియా వీటి నుంచి తప్పించుకోవచ్చు. అందువల్ల తక్కువ పరిమాణంతో వీటిని తయారుచేశాం.' అని డాక్టర్ శివకల్యాణి వివరించారు. ఈ నానో పదార్థం టమాటలపై ముడతలు పడకుండా కూడా చేస్తుందన్నారు. కూరగాయలు, పళ్లపైనే కాకుండా బ్యాక్టీరియా ఎక్కువగా పేరుకుపోయే ఏ వస్తువుపైనైనా ఈ నానో పదార్థాన్ని వాడవచ్చని, అయితే దీనిపై మరిన్ని పరిశోధనలు చేయాల్సి ఉందని ఖండేల్వాల్ పేర్కొన్నారు.

- స్పెషల్ డెస్క్



తుక్కిబొల్లారంలో ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి హరీశ్, ఎంపీ ప్రభాకర్ రెడ్డి

కేసీఆర్ ముంపు బాధితుడే

ముంపు బాధితుల కష్టాలు ఆయనకు తెలుసు

▸▸ **ఆర్అండ్ఆర్ కాలనీని ఇతరులు ఈర్ష్య పడేలా నిర్మిస్తాం**

▸▸ **6 నెలల్లో పూర్తి చేసి నిర్వాసితులకు అందజేస్తాం: హరీశ్‌రావు**

గజ్వేల్, మార్చి 11: "సీఎం కేసీఆర్ కూడా ముంపు బాధితుడే. ముంపు గ్రామాల ప్రజల సమస్యలు ఆయనకు బాగా తెలుసు. ఎగువ మానేరు డ్యామ్ నిర్మాణంలో కేసీఆర్ గ్రామం ముంపునకు గురైతే వాళ్ల నాన్న చింతమడకకు వచ్చి స్థిరపడ్డారు. ముంపు బాధితుల బాధను కేసీఆర్ కళ్లారా చూశారు. అందుకే మీ కష్టాలను ఆయన కష్టాలుగా భావించి దేశంలోనే అత్యంత అద్భుతంగా ఆర్అండ్ఆర్ కాలనీని నిర్మించి ఇవ్వాలని నిర్ణయించారు" అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. కొండపోచమ్మ, మల్లన్నసాగర్ రిజర్వాయర్ ముంపు గ్రామాల ప్రజలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో భాగంగా సిద్దిపేట జిల్లా ములుగు మండలం తుక్కిబొల్లారం, గజ్వేల్ మండలం ముత్రాజ్‌పల్లి గ్రామాల్లో డబుల్ ఇళ్ల నిర్మాణానికి మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి ఆదివారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిజర్వాయర్ల నిర్మాణంలో ఇళ్లు కోల్పోతున్న ములుగు మండలం బైలంపూర్, మామిడ్యాల, తానేదార్‌పల్లి, కొండపాక మండలం సింగారం, ఎర్రవల్లి, తొగుట మండలం పల్లెపహాడ్, వేములఘాట్, ఏటిగడ్డ కిష్టాపూర్ గ్రామాల ప్రజల త్యాగం వెలకట్ట లేనిదని, త్యాగమూర్తులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్నారు. ఆర్ అండ్ ఆర్ కాలనీ ద్వారా కొత్త చరిత్రకు శంకుస్థాపన చేస్తున్నామన్నారు. కొండపోచమ్మ రిజర్వాయర్ ద్వారా 2,85,280 ఎకరాలకు, మల్లన్నసాగర్ రిజర్వాయర్ ద్వారా 7 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఈ కాలనీలను రాష్ట్రంలోనే అత్యుత్తమంగా, ఇతరులు ఈర్ష్య పడే లా నిర్మిస్తామని, కొన్ని రోజులు ఇబ్బంది పడ్డా కాలనీ నిర్మించే వరకు ఓపిక పట్టాలని, గుడికి గుడి, బడికి బడి, గ్రామానికి గ్రామం నిర్మించి ఇస్తామన్నారు. స్మశానవాటిక, సీసీ రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఫంక్షన్‌హాల్‌లు కూడా నిర్మిస్తామన్నారు. ఈ కాలనీ పనులను తన సొంత ఇంటి పనిలా భావించి 15 రోజులకోసారి పర్యవేక్షిస్తానన్నారు. రిజర్వాయర్ల నిర్మాణం జరగదని, భూములు కంపెనీలకు ఇస్తారని చాలా మంది పుకార్లు సృష్టించారని, ఇప్పుడు ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభమైనందున ఎవరికీ ఎలాంటి అనుమానం అవసరం లేదని, ఇచ్చిన ప్రతి హామీని నిలుపుకుంటామన్నారు. జిల్లా కలెక్టర్ వెంకట్రాంరెడ్డి ప్రజల గురించి ఆలోచించే మంచి మనిషి, కష్టపడే వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి అని కొనియాడారు.

నిర్వాసితులకు మత్స్య సంపదతో సుస్థిర ఆదాయం

నిర్వాసితులను సొసైటీలుగా ఏర్పాటు చేసి రిజర్వాయర్లలోని చేపల ద్వారా వచ్చే ఆదాయాన్ని వారి ఖాతాల్లో జమ చేయిస్తామని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. కాలం కాకున్నా గోదావరి నది నుంచి నీటిని లిఫ్టు చేసి కొండపోచమ్మ, మల్లన్నసాగర్‌లను నింపుతామని, ఈ ప్రాజెక్టుల నుంచే హైదరాబాద్‌కు తాగునీరు వెళ్తుందన్నారు. మత్స్య సంపద ద్వారా నిర్వాసితులకు శాశ్వత, సుస్థిర ఆదాయాన్ని కల్పిస్తామన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, ఎస్సీ, ఎస్టీ, బీసీ వ్యవసాయ సంక్షేమ పథకాల్లో నిర్వాసితులకు తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు. 18 ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరికీ 250 చదరపు గజాల ఇళ్ల స్థలాన్ని కేటాయిస్తామన్నారు.

భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

(మూడో పేజీ తరువాయి)

అదనపు డీజీగా పదోన్నతి పొందిన సైబరాబాద్ సీపీ సందీప్ శాండిల్యను రైల్వే అండ్ రోడ్ సేఫ్టీకి బదిలీ చేశారు. తెలంగాణ ఆవిర్భావం నుంచే మహిళా భద్రతకు పెద్దపీట వేసిన సర్కారు.. ఆ విభాగానికి పూర్తి స్థాయి ఐజీ(హైదరాబాద్)గా స్వాతి లక్రా, తెలంగాణ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఐజీగా సౌమ్యమిశ్రాను నియమించింది. సీఐడీ విభాగాన్ని బలోపేతం చేసేందుకు నేర పరిశోధనలో పేరున్న సీనియర్ ఐపీఎస్‌లను కేటాయించారు. తెలంగాణ పోలీస్ నియామక బోర్డు చైర్మన్‌గా వీవీ శ్రీనివాస్‌ను నియమించారు. పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా సంతోశ్ మెహ్రా, అగ్నిమాపక శాఖకు గోపికృష్ణను కేటాయించారు. రానున్నది ఎన్నికల కాలం కావడంతో ఆందోళనల సమయంలో చాకచక్యంగా వ్యవహరించే అనుభవమున్న అధికారులను జిల్లాలు, కమిషనరేట్ల పరిధుల్లో శాంతి భద్రతల విభాగాలకు బదిలీ చేశారు. హైదరాబాద్ పరిధిలో సీపీ సహా ముగ్గురు అదనపు సీపీలు, ముగ్గురు డీసీపీల బదిలీలతో పూర్తి స్థాయిలో శాంతిభద్రతలు, నేరాలు, ట్రాఫిక్ విభాగాల్లో ప్రక్షాళన జరిగినట్లయింది.

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
టి. కృష్ణ ప్రసాద్	డీజీపీ రైల్వేస్, రోడ్ సేఫ్టీ	డీజీ రోడ్ సేఫ్టీ అథారిటీ
సంతోష్ మెహ్రా	అడిషినల్ డీజీపీ(వెయిటింగ్)	డైరెక్టర్, తెలంగాణ పోలీసు అకాడమీ
అంజనీకుమార్	అడిషనల్ డీజీ(శాంతి భద్రతలు)	హైదరాబాద్ సీపీ
గోపీ కృష్ణ	అడిషనల్ డీజీ(ఆర్గనైజేషన్)	తెలంగాణ అగ్నిమాపకశాఖ
రాజీవ్‌రతన్	తెలంగాణ అగ్నిమాపకశాఖ	అడిషనల్ డీజీ(ఆర్గనైజేషన్)
జితేందర్	డైరెక్టర్, తెలంగాణ పోలీస్ అకాడమీ	అడిషనల్ డీజీ (శాంతి భద్రతలు)
సందీప్‌శాండిల్య	సైబరాబాద్ సీపీ	అడిషనల్ డీజీ రైల్వేస్, రోడ్‌సేఫ్టీ
సౌమ్య మిశ్రా	ఐజీ (సంక్షేమం)	ఐజీ, సీఐడీ(డబ్ల్యూపీసీ)
షికాగోయెల్	ఐజీ, సీఐడీ	అడిషనల్ సీపీ, హైదరాబాద్
స్వాతి లక్రా	అడిషనల్ సీపీ హైదరాబాద్	మహిళా భద్రత (షీ టీమ్స్, భరోసా)
వీవీ శ్రీనివాసరావు	అడిషినల్ సీపీ హైదరాబాద్	పోలీస్ నియామక సంస్థ
అనిల్‌కుమార్	ఐజీ (వెయిటింగ్)	అడిషనల్ సీపీ, హైదరాబాద్(ట్రాఫిక్)
వీసీ సజ్జనార్	ఐజీ, ఎస్ఐబీ	సైబరాబాద్ సీపీ
దేవేంద్రసింగ్ చౌహాన్	ఐజీ (వెయిటింగ్)	అడిషనల్ సీపీ (శాంతిభద్రతలు) హైదరాబాద్
టీవీ శశిధర్‌రెడ్డి	డైరెక్టర్, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్	అడిషనల్ డైరెక్టర్, తెలంగాణ పోలీసు అకాడమీ
జీ. సుధీర్‌బాబు	వరంగల్ సీపీ	జాయింట్ కమిషనర్, సైబరాబాద్
సీ. రవి వర్మ	డీఐజీ (వెయిటింగ్)	డీఐజీ, సీఐడీ
టి. ప్రభాకర్‌రావు	డీఐజీ, ఎస్ఐబీ	డీఐజీ ఇంటెలిజెన్స్
వి. రవీందర్	జాయింట్ సీపీ ట్రాఫిక్ హైదరాబాద్	వరంగల్ సీపీ
తరుణ్‌జోషి	జాయింట్ సీపీ, రాచకొండ	డీఐజీ, స్పెషల్ బ్రాంచ్ హైదరాబాద్
శివకుమార్	సిద్దిపేట కమిషనర్	ఎస్పీ, ఇంటెలిజెన్స్
ఏ. వెంకటేశ్వరరావు	వెస్ట్‌జోన్, డీసీపీ, హైదరాబాద్	మాదాపూర్ డీసీపీ, సైబరాబాద్
పి. విశ్వప్రసాద్	డీసీపీ మాదాపూర్, సైబరాబాద్	సెంట్రల్‌జోన్ డీసీపీ, హైదరాబాద్
ఏఆర్ శ్రీనివాస్	డీసీపీ(ట్రాఫిక్) సైబరాబాద్	వెస్ట్‌జోన్ డీసీపీ, హైదరాబాద్
ఎం. రమేష్	గ్రూప్ కమాండర్ గ్రేహౌండ్స్	ఈస్ట్‌జోన్ డీసీపీ, హైదరాబాద్
సీ. శశిధర్‌రాజు	ఈస్ట్‌జోన్ డీసీపీ, హైదరాబాద్	ఎస్పీ(వెయిటింగ్)
ఎం. శ్రీనివాసులు	ఎస్పీ(వెయిటింగ్)	ఎస్పీ, సీఐడీ
రెమా రాజేశ్వరి	ఎస్పీ(వెయిటింగ్)	ఎస్పీ గద్వాల్
జోయల్ డేవిస్	సెంట్రల్ జోన్ డీసీపీ, హైదరాబాద్	సిద్దిపేట కమిషనర్
ఎం. విజయ్‌కుమార్	ఎస్పీ గద్వాల్	గ్రూప్ కమాండర్, గ్రేహౌండ్స్
అనంత శర్మ	ఎస్పీ జగిత్యాల	డిప్యూటీ డైరెక్టర్, తెలంగాణ పోలీసు అకాడమీ
విశ్వజిత్ కంపాటి	ఎస్పీ సిరిసిల్ల	డైరెక్టర్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, జీహెచ్ఎంసీ
రాహుల్ హెగ్డే	ఏఎస్పీ, ఏటూరు నాగారం	ఎస్పీ రాజన్నసిరిసిల్ల
సునీల్‌దత్	ఏఎస్పీ, భద్రాచలం	ఎస్పీ జగిత్యాల
అపూర్వరావు	ఏఎస్పీ, గోదావరిఖని	ఎస్పీ, సీఐడీ
చేతన	ఏఎస్పీ(వెయిటింగ్)	ఏసీపీ, సుల్తాన్‌బజార్ హైదరాబాద్
రక్షిత కే మూర్తి	ఏఎస్పీ (వెయిటింగ్)	ఏఎస్పీ గోదావరిఖని
పాటిల్ సంగ్రాం సింగ్ గణోపాత్రో	ఏఎస్పీ వెయిటింగ్	ఏఎస్పీ భద్రాచలం

దక్షిణాఫ్రికా x ఆస్ట్రేలియా
రెండో టెస్ట్
నాలుగో రోజు
మ.1.30 నుంచి
SONY SIX

జాతీయ రెజ్లింగ్‌కు ఆధార్ తప్పనిసరి

న్యూఢిల్లీ: జాతీయ రెజ్లింగ్ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఇకపై ఆధార్ కార్డును ధ్రువీకరణ పత్రంగా చూపాల్సి ఉంటుంది. జాతీయ సీనియర్, జూనియర్, సబ్ జూనియర్, క్యాడెట్ పోటీలలో పాల్గొనే క్రీడాకారులందరికీ ఈ నిబంధన వర్తిస్తుందని జాతీయ రెజ్లింగ్ సమాఖ్య తెలిపింది. వయసు, ప్రాంతీయతకు సంబంధించిన మోసాలను అరికట్టేందుకు ఈ విధానం ఉపయోగపడుతుంది.



చాందిమల్‌పై రెండు మ్యాచ్‌ల నిషేధం

కొలంబో: శ్రీలంక కెప్టెన్ దినేశ్ చాందిమల్‌పై వేటు పడింది. బంగ్లాదేశ్‌తో శనివారం జరిగిన టీ-20 మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా అతనిపై ఐసీసీ రెండు మ్యాచ్‌ల నిషేధాన్ని విధించింది. దీంతో, ముక్కోణపు టోర్నీలో భాగంగా సోమవారం భారత్‌తో జరిగే మ్యాచ్‌కు, 16న బంగ్లాతో పోరుకు చాందిమల్ దూరం కానున్నాడు. బంగ్లాతో మ్యాచ్‌లో లంక నిర్ణీత సమయంలోగా 4ఓవర్లు వెనుకబడింది. దీన్ని సీరియస్ ఓవర్ రేట్ ఉల్లంఘనగా గుర్తించిన మ్యాచ్ రెఫరీ క్రిస్ బ్రాడ్ తొలి రెండు ఓవర్లకుగాను లంక ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో పది శాతం కోతతో పాటు నిర్ణీత సమయంలో బౌలింగ్‌ను పూర్తి చేయనందుకు మరో 20 శాతం జరిమానాగా విధించాడు. అదే సమయంలో కెప్టెన్‌కు రెండు సస్పెన్షన్ పాయింట్లు ఇచ్చాడు. నిబంధనల ప్రకారం 2 పాయింట్లు అందుకున్న ఆటగాడు ఒక టెస్టు లేదా రెండు వన్డేలు లేదా రెండు టీ-20ల నిషేధం ఎదుర్కోవాల్సి ఉంటుంది.



రోహిత్ శర్మ

తొలి మ్యాచ్‌లో శ్రీలంక చేతిలో అనూహ్య పరాజయం తర్వాత బంగ్లాపై నెగ్గిన టీమిండియా ముక్కోణపు టీ-20 సిరీస్‌లో వెంటనే పుంజుకుంది. బంగ్లాపై బౌలింగ్, బ్యాటింగ్ రెండింటిలో మెప్పించడంతో జట్టులో మళ్లీ విశ్వాసం వచ్చింది. అయినా భారత్ ఆందోళన చెందుతున్న అంశం కెప్టెన్ రోహిత్ శర్మ పేలవ ఫామ్..! గత ఐదు టీ-20ల్లో రెండు సార్లు డకౌటైన రోహిత్ కేవలం 49 పరుగులే చేశాడు. మరి.. నేడు లంకతో జరిగే మ్యాచ్‌లో అయినా రోహిత్ హిట్టు కొడతాడా? ఆరంభ మ్యాచ్ ఓటమికి ఆతిథ్య జట్టుపై భారత్ బదులు తీర్చుకుంటుందా?

రోహిట్టు కొట్టాలి!

- కెప్టెన్ ఫామ్‌పై ఆందోళన
- నేడు శ్రీలంకతో భారత్ పోరు

రాత్రి 7 గం. నుంచి డీస్పోర్ట్స్, డీడీ స్పోర్ట్స్‌లలో

కొలంబో: టీమిండియా జోరు సాగుతుందని ఊహించిన నిదహాస్ ట్రై సిరీస్ రోజు రోజుకూ రసవత్తరంగా మారుతోంది. ఒకదాన్ని మించి మరొకటి అన్నట్టుగా మూడు జట్లూ మెరిపిస్తున్నాయి. ఆరంభ పోరులోనే భారత్‌కు శ్రీలంక షాకిస్తే.. ఆ జట్టును ఓడించిన బంగ్లాదేశ్ సంచలనమే సృష్టించింది. ఇప్పుడు మరో ఆసక్తికర పోరుకు తెరలేచింది. భారత్-శ్రీలంక మరోసారి సవాల్‌కు సిద్ధమయ్యాయి. సోమవారం జరిగే ఈ పోరులో మొదటి మ్యాచ్‌లో ఎదురైన ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలని టీమిండియా భావిస్తోంది. మరోవైపు రోహిత్‌సేనపై మరోసారి పైచేయి సాధించడంతో పాటు గత టీ-20లో బంగ్లా చేతిలో అనూహ్య పరాజయం నుంచి తేరుకోవాలని లంక కోరుకుంటోంది. కాగా, టోర్నీలో ప్రస్తుతం మూడు జట్లూ తలా ఓ విజయంతో రెండేసి పాయింట్లతో నిలిచాయి. మెరుగైన రన్‌రేట్ ఆధారంగా లంక మొదటి స్థానంలో ఉంది. ఈ మ్యాచ్‌లో నెగ్గితే.. అగ్రస్థానానికి చేరుకోవడంతో పాటు రోహిత్‌సేన ఫైనల్‌కూ దగ్గరవుతుంది.

నాయకుడు నడిపించాలి..: ప్రతీకారమే లక్ష్యంగా ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగుతున్న టీమిండియా.. దానితో పాటు కెప్టెన్ రోహిత్ ఫామ్‌లోకి రావాలని ఆరాటపడుతోంది. రెగ్యులర్ కెప్టెన్ విరాట్ కోహ్లీ తర్వాత పరిమిత ఓవర్లలో అంతటి అత్యుత్తమ ఆటగాడిగా పేరొందిన రోహిత్ కొంత కాలంగా నిరాశ పరుస్తున్నాడు. సౌతాఫ్రికా టూర్ పేలవ ఫామ్‌ను ఇక్కడా కొనసాగిస్తున్నాడు. గత ఐదు టీ-20ల్లో 17, 0, 11, 0, 21 స్కోర్లతో తేలిపోవడం జట్టును ఆందోళనకు గురి చేస్తోంది. ఈ మ్యాచ్‌తో అయినా గాడిలో పడి ఆత్మవిశ్వాసం ప్రోది చేసుకోవాలని రోహిత్ ఆశిస్తున్నాడు. ఒకవైపు వైస్ కెప్టెన్ శిఖర్ ధవన్ జోరు చూపిస్తుండగా... నాయకుడిగా అతను కూడా జట్టును ముందుండి నడిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇక, వరుసగా రెండు అర్ధశతకాలతో ధవన్ మంచి ఫామ్‌లో ఉండడం జట్టుకు సానుకూలాంశం. సౌతాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో నిరాశ పరిచిన శిఖర్ ఆ జట్టుపై పరిమిత ఓవర్ల క్రికెట్‌లో లయ దొరకబుచ్చుకున్నాడు. గత ఐదు టీ-20 ఇన్నింగ్స్‌ల్లో అతను 55, 90, 47, 24, 72 స్కోరు చేయడం చూస్తే అతని జోరు ఎలా ఉందో చెప్పొచ్చు. తొలి మ్యాచ్ మాదిరిగా లంకపై మరోసారి చెలరేగాలని చూస్తున్నాడు ధవన్. ఇతర బ్యాట్స్‌మెన్‌లో మనీష్ పాండే (37, 27) కాస్త మెరుగ్గా ఉండగా.. రీ ఎంట్రీ ప్లేయర్ సురేశ్ రైనా, దినేశ్ కార్తీక్‌తో మిడిలార్డర్ బలంగానే కనిపిస్తోంది. ఇక, యువ ఆటగాడు రిషభ్ పంత్‌కు మరో అవకాశం ఇవ్వాలా వద్దా అనేదానిపై మేనేజ్‌మెంట్ మల్లగుల్లాలు పడుతోంది. ధోనీ వారసుడిగా భావిస్తున్న ఈ వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్.. అంచనాలను అందుకోలేకపోయాడు. తొలి మ్యాచ్‌లో వేగంగా ఆడలేకపోయిన అతను.. బంగ్లాపై నిరాశ పరిచాడు. లోకేశ్ రాహుల్ రూపంలో మరో నాణ్యమైన బ్యాట్స్‌మన్ అవకాశం కోసం ఎదురు చూస్తున్నందున పంత్‌కు మరో చాన్స్ దక్కడం కష్టమే. పైగా, రాహుల్‌ను తీసుకుంటే అతణ్ణి ఓపెనర్‌గా ఉపయోగించడంతో పాటు తాను నాలుగో నెంబర్‌కు వచ్చే సౌలభ్యం కెప్టెన్‌కు ఉంటుంది. ఇక బౌలింగ్ విషయానికి వస్తే జయదేవ్ ఉనాద్కట్‌కు మరింత నిలకడ సాధించాల్సిన అవసరం ఉంది. గత రెండు మ్యాచ్‌ల్లో ఈ లెఫ్టార్మ్ పేసర్ నాలుగు వికెట్లు తీసినా.. ధారాళంగా పరుగులు ఇచ్చుకున్నాడు. పేస్ దళానికి నాయకత్వం వహించే ఆటగాడి నుంచి ఇలాంటి బౌలింగ్‌ను ఆశించలేం. అయితే, యువ బౌలర్లు వాషింగ్టన్ సుందర్, చాహల్, విజయ్ శంకర్ బంగ్లాపై మెప్పించడం జట్టులో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. తొలి పోరులో బయటపడిన లోపాలను సరిదిద్దుకొని ఆడితే భారత్‌కు విజయావకాశాలు మెండుగా ఉంటాయి.



కుశాల్ పెరీరా   జీవన్ మెండిస్

లంక డీలా..: ఫేవరెట్ భారత్‌ను ఓడించి టోర్నీని అద్భుతంగా ఆరంభించిన ఆతిథ్య లంక గత పోరులో బంగ్లాదేశ్ చేతిలో చావుదెబ్బతిన్నది. 214 పరుగుల భారీ స్కోరు చేసినా దాన్ని కాపాడుకోలేకపోయిన లంకేయులు ఇప్పుడు డీలా పడ్డారు. ముఖ్యంగా బౌలింగ్ వైఫల్యం ఆ జట్టును తీవ్రంగా దెబ్బతీసింది. బంగ్లా బ్యాట్స్‌మెన్ ఒకరిని మించి మరొకరు బంతిని బాదేస్తుంటే ఆతిథ్య బౌలర్లు చేష్టలుడిగిపోయారు. ఫలితంగా సొంతగడ్డపై ఘోర ఓటమిని ఎదుర్కొన్న లంక.. ఆత్మరక్షణలో పడింది. భారత్‌పై వాళ్లు ఎలా తేరుకుంటారన్నది ఇప్పుడు ఆసక్తిగా మారింది. అయితే, బ్యాటింగ్‌లో కుశాల్ ద్వయం.. కుశాల్ మెండిస్, కుశాల్ పెరీర మంచి ఫామ్‌లో ఉండడం ఆ జట్టుకు ప్లస్ పాయింట్. ముఖ్యంగా తొలి రెండు మ్యాచ్‌ల్లో 66, 74 స్కోర్లతో విజృంభించిన పెరీరను అడ్డుకునే మార్గాలు భారత బౌలర్లు కనిపెట్టాలి. బంగ్లాపై 57 పరుగులతో మెరిసిన మెండిస్‌ను కూడా ఎంత త్వరగా పెవిలియన్ చేర్చితే రోహిత్‌సేనకు అంత మంచిది.

పేస్‌కు మళ్లీ పిలుపు



చైనాతో డేవిస్ కప్ పోరుకు జట్టులో చోటు

న్యూఢిల్లీ: ఊహించినట్టుగానే భారత టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్‌కు డేవిస్ కప్‌లో చోటు దక్కింది. వచ్చేనెలలో చైనాతో జరిగే ఆసియా/ఓసియానియా గ్రూప్-1 రెండో రౌండ్‌లో పోటీ పడే భారత జట్టును అఖిల భారత టెన్నిస్ సమాఖ్య (ఐటా) ఆదివారం ప్రకటించింది. గతేడాది ఏప్రిల్‌లో ఉజ్బెకిస్థాన్‌తో జరిగిన పోరులో పేస్‌ను పక్కనపెట్టారు. కెనడాతో వరల్డ్ గ్రూప్ ప్లేఆఫ్‌లోనూ అతడిపై వేటు పడింది. నాన్ ప్లేయింగ్ కెప్టెన్‌గా మహేశ్ భూపతి రాకతో పేస్ స్థానం గల్లంతయింది. అయితే అప్పట్లో ఆ నిర్ణయం జట్టు ఆటతీరును ప్రభావితం చేసినట్టు సెలెక్టర్లు భావించారు. అందుకే చైనాతో జరిగే మ్యాచ్‌లకు ఈ డేవిస్ కప్ హీరోను తిరిగి జట్టులో చేర్చారు.

రికార్డుకు చేరువలో..: డేవిస్‌కప్‌లో లియాండర్ పేస్‌కు అద్భుత చరిత్ర ఉంది. దేశం తరఫున ఆడడమంటే అమితంగా ఇష్టపడే ఈ వెటరన్ ఇప్పటిదాకా ఈ కప్‌లో 42 డబుల్స్ విజయాలతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాడు. చైనాతో జరిగే పోరులో మరో విజయం సాధిస్తే చరిత్ర సృష్టిస్తాడు. జట్టులో చోటు దక్కడం సంతోషకరమని, బోపన్నతో ఆడేందుకు ఎదురుచూస్తున్నట్టు పేస్ తెలిపాడు.

జట్టు: యుకీ భాంబ్రీ, రామ్‌కుమార్, సుమిత్ నగల్, రోహన్ బోపన్న, లియాండర్ పేస్, దివిజ్ శరణ్ (రిజర్వ్).



బోపన్న అసంతృప్తి

డేవిస్ కప్‌కు పేస్‌ను ఎంపిక చేయడంపై మరో డబుల్స్ ఆటగాడు రోహన్ బోపన్న అసంతృప్తిగా ఉన్నాడు. 'శనివారం ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో ఈ విషయం చర్చకు వచ్చింది. బోపన్న ఇప్పటికీ పేస్‌తో ఆడేందుకు ఇష్టపడడం లేదు. వ్యక్తిగత కారణాలతో దేశం తరఫున పాల్గొనకుండా ఉంటే అలాంటి ఆటగాళ్లకు ఐటా మద్దతు ఇవ్వదు. ఏడాదిలో 2-3 సార్లు మాత్రమే వారికి ఇలాంటి అవకాశం వస్తుంది. ఓ రెండు వారాల పాటు కూడా ఆడలేక పోతే ఎలా?' అని ఐటా అధికారి ఒకరు ఆక్షేపించారు.



అఖిల్ షెరాన్

అఖిల్ షెరాన్‌కు స్వర్ణం

- భారత్‌కు 'టాప్' ఖాయం

న్యూఢిల్లీ: యువ షూటర్ అఖిల్ షెరాన్ శనివారం భారత్‌కు మరో స్వర్ణ పతకం అందించాడు. మెక్సికోలో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్‌లో అఖిల్ 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్ ఈవెంట్‌లో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణం కైవసం చేసుకున్నాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన 22 ఏళ్ల అఖిల్ ఫైనల్లో 455.6 పాయింట్లు సాధించి ఆస్ట్రియాకు చెందిన బెర్నార్డ్ పికల్ (452)ను రెండో స్థానానికి పరిమితం చేశాడు. హంగరీకి చెందిన ఇస్త్వాన్ పెని కాంస్యం గెలుచుకున్నాడు. ఈ టోర్నీలో ఇప్పటివరకు భారత్‌కు 4 స్వర్ణ, ఒక రజత, 4 కాంస్య పతకాలు దక్కాయి. చైనా రెండు స్వర్ణాలు, రెండు రజతాలు, ఒక కాంస్యం గెలుచుకుంది. దీంతో టోర్నీలో భారత్ అగ్రస్థానానికి ఢోకా లేకుండాపోయింది. ప్రపంచకప్ షూటింగ్‌లో భారత్ అగ్రస్థానంలో నిలవడం ఇదే ప్రథమం.



డివిల్లీర్స్ (126)

పట్టుబిగించిన దక్షిణాఫ్రికా

పోర్ట్‌ఎలిజబెత్: ఆస్ట్రేలియాతో రెండో టెస్ట్‌లో దక్షిణాఫ్రికా పట్టుబిగించింది. తొలుత డివిల్లీర్స్ అద్భుత సెంచరీ (146 బంతుల్లో 20 ఫోర్లు, ఒక సిక్స్‌తో 126 నాటౌట్)తో మొదటి ఇన్నింగ్స్‌లో 139 పరుగుల ఆధిక్యం చేజిక్కించుకున్న దక్షిణాఫ్రికా.. ఆపై రబాడ (3/38) విజృంభించడంతో ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో ఆదిలోనే నాలుగు వికెట్లు పడగొట్టి మ్యాచ్‌పై పట్టు సాధించింది. అయితే ఖవాజా (75), మిచెల్ మార్ష్ (39 బ్యాటింగ్) బాధ్యతాయుతంగా ఆడడంతో ఆస్ట్రేలియా కోలుకొంది. ఆదివారం మూడోరోజు ఆటముగిసేసరికి ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లకు 180 పరుగులు చేసింది. కేవలం 41 పరుగుల ఆధిక్యంలోనే ఉన్న ఆసీస్‌కు ఇంకా ఐదు వికెట్లే చేతిలో ఉన్నాయి. అంతకుముందు ఓవర్‌నైట్ 263/7 తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా.. డివిల్లీర్స్ అమోఘ ఇన్నింగ్స్‌తో 382 పరుగులు చేసింది. ఫిలాండర్ (36)తో కలిసి ఎనిమిదో వికెట్‌కు డివిల్లీర్స్ 84 పరుగులు జోడించాడు.

వార్నర్.. బాల్ టాంపరింగ్!

- దక్షిణాఫ్రికా ఫిర్యాదు



ఆస్ట్రేలియా వైస్‌కెప్టెన్ డేవిడ్ వార్నర్‌ను మరో వివాదం చుట్టుముట్టింది. సౌతాఫ్రికాతో ఇక్కడ జరుగుతున్న రెండో టెస్ట్‌లో శనివారం, రెండోరోజు ఆట సందర్భంగా వార్నర్ ఎడమ అరచేతికి పెద్ద బ్యాండేజీ వేసుకొని కనిపించాడు. అయితే ఆ బ్యాండేజీ ద్వారా వార్నర్ బాల్ టాంపరింగ్‌కు పాల్పడుతున్నాడని దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ అంపైర్‌కు ఫిర్యాదు చేశారు. తొలి టెస్ట్ సందర్భంగా సౌతాఫ్రికా కీపర్ క్వింటన్ డికాక్‌తో పెద్ద గొడవ పెట్టుకొన్న వార్నర్‌కు మ్యాచ్ ఫీజులో 75శాతం జరిమానా విధించిన సంగతి తెలిసిందే.



చర్చలకు నేను రెడీ

- పూర్తి స్థాయిలో విచారిస్తే అన్నీ బయటపడతాయి
- భార్య ఆరోపణలపై పేసర్ షమి



హసీన్ జహా

'ఆ మొబైల్ దొరక్కుంటే విడాకులిచ్చేవాడు'

షమి కారులో అతడి సీక్రెట్ మొబైల్ తనకు దొరక్క పోయుంటే ఈపాటికి విడాకులిచ్చేవాడని భార్య హసీన్ జహా మరో ఆరోపణ చేసింది. 'చాలా రోజుల నుంచి అతడిలో మార్పు కోసం నేను ప్రయత్నిస్తూనే ఉన్నాను. అతడి ఫోన్‌ను నేను సంపాదించకుండా ఉంటే ఇప్పటికే నాకు విడాకులిచ్చేవాడు. అసలు నేను ఇన్ని వివరాలు వెల్లడించినా కూడా మీడియా ఎందుకు పరిశోధన చేయడం లేదు? ఒకవేళ అతడు తన తప్పు అంగీకరించి నాతో కలిసి ఉండాలని అనుకుంటే ఆ విషయాన్ని పరిశీలిస్తా' అని హసీన్ పేర్కొంది.

న్యూఢిల్లీ: ఓవైపు భార్య హసీన్ జహా తీవ్రమైన ఆరోపణలతో విరుచుకుపడుతుండగా ఈ వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకోవాలని పేసర్ మహ్మద్ షమి భావిస్తున్నాడు. అంతేకాదు పూర్తి స్థాయిలో విచారణ జరిపితే అసలు నిజాలు బయటకు వస్తాయని అన్నాడు. 'ఒకవేళ ఈ సమస్య చర్చల ద్వారా పరిష్కారం అయితే అందుకు నేను సిద్ధం. ఏదో ఒక సర్దుబాటు జరిగితేనే నాకు, నా కూతురికి మంచిది. కోల్‌కతాకే కాదు ఆమె ఎక్కడికి రమ్మన్నా వచ్చి మాట్లాడతా. కుటుంబ సభ్యుల సమక్షంలో పరిష్కారం కోసం నేను ప్రయత్నిస్తున్నా. న్యాయపరంగా ముందుకెళ్లడానికి కూడా సిద్ధంగా ఉన్నా. చట్టాన్ని గౌరవించే వ్యక్తిని. త్వరలోనే అంతా సర్దుకుంటుందని ఆశిస్తున్నా. వారం రోజుల క్రితం దాకా అంతా బాగానే ఉంది. కానీ హఠాత్తుగా ఏమైందో ఏమో అర్థం కావడం లేదు. విచారణ కోసం నేను కూడా సాక్ష్యాలను అందిస్తాను' అని షమి మీడియాకు చెప్పాడు.

మా అల్లుడు మంచోడే...

ఇబ్బందికర పరిస్థితుల్లో పడిన పేసర్ షమికి అనూహ్యంగా అతడి మామ (హసీన్ తండ్రి) మహ్మద్ హసన్ నుంచి మద్దతు లభించింది. 'వారిద్దరి మధ్య వివాదం గురించి మాకు మీడియా ద్వారానే తెలిసింది. నాకు తెలిసినంత వరకు షమి చాలా మంచి వ్యక్తి. తక్కువగా మాట్లాడతాడు. అసలు విషయాలు వారిద్దరికే తెలుసు' అని అన్నాడు.

'నా మాజీ భార్య టచ్‌లోనే ఉంటుంది'

షమిపై ఆరోపణలు గుప్పిస్తున్న తరుణంలో హసీన్ మాజీ భర్త సైఫుద్దీన్ తెరపైకి వచ్చాడు. సైఫుద్దీన్‌తో వివాహబంధంలో ఆమెకు ఇద్దరు కూతుళ్లున్నారు. ఈ పిల్లలు సైఫుద్దీన్ వద్దే ఉంటున్నారు. వారానికి 2-3 సార్లు తన ఇద్దరు కూతుళ్లతో హసీన్ మాట్లాడుతుంటుందని సైఫుద్దీన్ చెప్పాడు. చిన్నప్పటి నుంచే తామిద్దరం స్నేహితులమని, ఆ తర్వాత 2002లో ప్రేమ వివాహం చేసుకున్నామని వివరించాడు. ఆమె పదో తరగతిలో ఉన్నప్పుడే తాను ప్రపోజ్ చేశానని చెప్పుకొచ్చాడు. 2010లో ఈ జంట విడిపోయింది. ఆమెకు జీవితంపై వేరే లక్ష్యాలున్నాయని, ఏదో సాధించాలన్న లక్ష్యంతో వెళ్లిపోయిందని తెలిపాడు.

ఆత్మవిశ్వాసంతో మిథాలీసేన



ఆసీస్ సారథి లానింగ్

ఆసీస్‌తో తొలి వన్డే నేడు

భారత కెప్టెన్ మిథాలీ

ఉ. 9 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్ 1 లో...

వడోదర: దక్షిణాఫ్రికాను వారి దేశంలోనే ఓడించి వన్డే సిరీస్‌ను కైవసం చేసుకున్న మిథాలీసేన మరో క్లిష్టమైన సిరీస్‌కు సన్నద్ధమైంది. ఆస్ట్రేలియాతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా సోమవారం ఇక్కడి రిలయన్స్ స్టేడియం వేదికగా జరిగే తొలి వన్డేలో తలపడనుంది. ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతున్న భారత జట్టు దక్షిణాఫ్రికాపై కనబరిచిన ప్రదర్శననే ఈ సిరీస్‌లోనూ పునరావృతం చేయాలని ఉవ్విళ్లూరుతోంది. అంతేగాక ఐసీసీ ఉమెన్ చాంపియన్‌షిప్‌లో భాగంగా జరుగుతున్న ఈ సిరీస్‌లో మొదటి మ్యాచ్‌తోనే బోణీ కొట్టాలని కూడా పట్టుదలగా ఉంది. సిరీస్‌లో మిగిలిన రెండు వన్డేలు (15, 18) ఇదే స్టేడియం వేదికగా జరుగుతాయి. మ్యాచ్‌లు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయి. మరోవైపు భారత్-ఎతో రెండు ప్రాక్టీస్ మ్యాచ్‌లలో విజయాలు సాధించిన ఆసీస్ కూడా ఎనలేని ఆత్మవిశ్వాసంతో ఉంది. తొలి వన్డేలో గెలుపొందడం ద్వారా శుభారంభం అందుకోవాలని భావిస్తోంది. చివరిసారి భారత్-ఆసీస్ గత జూలైలో ఇంగ్లండ్‌లో జరిగిన వన్డే ప్రపంచ కప్ సెమీస్‌లో తలపడ్డాయి. ఆ మ్యాచ్‌లో భారత్ 36 పరుగులతో ఆసీస్‌పై నెగ్గింది.

ఒక్కో జట్టుకు రూ. 250 కోట్లు

ముంబై: ఐపీఎల్‌లోని ఎనిమిది ఫ్రాంచైజీలకు బంపర్ ఆఫర్... ఇక నుంచి బీసీసీఐ ఒక్కో జట్టుకు ఏడాదికి రూ.250 కోట్లు ఇవ్వనుంది. ప్రపంచ క్రికెట్‌లోనే అత్యంత ఖరీదైన లీగ్‌గా పేరు తెచ్చుకున్న ఐపీఎల్ వార్షిక ఆదాయం నుంచి ఆయా జట్లకు ఈ భారీ మొత్తాన్ని అందించనుంది. ఇప్పటిదాకా ఒక్కో జట్టు రూ.60 కోట్లు మాత్రమే పొందేది. ఇది ఇప్పుడు నాలుగు రెట్లు పెరగడం విశేషం. దీనికంతటికీ కారణం.. ఐపీఎల్ ప్రసార హక్కులను ఐదేళ్ల కాలానికి స్టార్ స్పోర్ట్స్ రూ.16,347 కోట్ల భారీ మొత్తానికి ఒప్పందం కుదుర్చుకోవడమే. దీంతో ఒక్కో సీజన్‌కు బీసీసీఐ రూ. 3,200 కోట్లు పొందనుంది. ఇందులో నుంచే తమ ఫ్రాంచైజీలకు పంచనుంది. గతంలో సోనీ టీవీ ద్వారా ఏడాదికి రూ. 800 కోట్లు మాత్రమే దక్కేది.

నవజోత్‌కౌర్‌కు రెండో ర్యాంకు



న్యూఢిల్లీ: భారత స్టార్ రెజ్లర్, ఇటీవల ఆసియా చాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలిచి చరిత్ర సృష్టించిన నవజోత్‌కౌర్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో అదరగొట్టింది. మహిళల 65 కిలోల విభాగంలో నవజోత్ కెరీర్‌లోనే అత్యుత్తమంగా రెండో ర్యాంకుకు చేరుకుంది. ఫిన్లాండ్‌కు చెందిన పెట్రా ఒల్లి టాప్‌ర్యాంక్‌లో నిలిచింది. 50 కిలోల విభాగంలో భారత్‌కు చెందిన వినేష్ ఫోగట్ 22 పాయింట్లతో రెండో ర్యాంక్‌లో నిలవగా, చైనా రెజ్లర్ లీ చున్ 24 పాయింట్లతో నంబర్‌వన్ ర్యాంక్‌ను దక్కించుకుంది. 59 కిలోల విభాగంలో సంగీత ఫోగట్ 5వ ర్యాంకు, 62 కిలోల విభాగంలో ఒలింపిక్ కాంస్య పతక విజేత సాక్షి మాలిక్ 18 పాయింట్లతో 4వ ర్యాంక్‌లో కొనసాగుతున్నారు. పురుషుల ఫ్రీస్టయిల్ కేటగిరి 61 కిలోల విభాగంలో శ్రావణ్ 8వ ర్యాంకు, 65 కిలోల విభాగంలో భజరంగ్ పూనియా 4వ ర్యాంకు అందుకున్నారు.

హాకీ అమ్మాయిలకు డ్రా

సియోల్: దక్షిణ కొరియా మహిళల హాకీ జట్టుతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 3-1తో ముగించింది. ఇప్పటికే సిరీస్‌ను దక్కించుకున్న భారత మహిళలు.. ఆదివారం జరిగిన ఆఖరి మ్యాచ్‌ను 1-1తో డ్రాగా ముగించారు. ఆట ప్రారంభం నుంచి ఇరుజట్లూ గోల్స్ కోసం తీవ్రంగా ప్రయత్నించాయి. అయినా తొలి మూడు క్వార్టర్లలో ఒక్క గోల్ కూడా నమోదు కాలేదు. చివరికి 48వ నిమిషంలో వందన కటారియా గోల్‌తో భారత్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది. రెండు నిమిషాల వ్యవధిలోనే కొరియాకు చెందిన బోమి కిమ్ గోల్ చేయడంతో స్కోరు 1-1తో సమమైంది. ఆ తర్వాత ఇరుజట్లూ మరో గోల్ చేయక పోవడంతో మ్యాచ్ ఫలితం తేలలేదు.

300 కోట్ల మోసం!

- విక్రమ్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ వంచన
- బాధితుల్లో రాహుల్ ద్రవిడ్, ప్రకాశ్ పదుకోన్
- నలుగురు నిందితుల అరెస్టు




బెంగళూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాజధాని బెంగళూరులో రూ. 300 కోట్ల ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. నగరంలోని యశ్వంతపుర, బనశంకరి ప్రాంతాల్లో విక్రమ్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ ప్రముఖుల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసి మోసం చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు నలుగురిని అరెస్టు చేసి విచారణ సాగిస్తున్నట్లు దక్షిణ మండల డీసీపీ శరణప్ప ఆదివారం వివరించారు. విక్రమ్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ ఎండీ రాఘవేంద్ర శ్రీనాథ్ (39), సూత్రం సురేశ్ (41), నరసింహమూర్తి (44), ప్రహ్లాద్ (47)లను అరెస్టు చేశారు. సూత్రం సురేశ్ మాజీ స్పోర్ట్స్ రిపోర్టర్ కాగా.. రాఘవేంద్ర శ్రీనాథ్‌తో కలసి పలువురు క్రీడాకారులు, సినీ నటులు, రాజకీయ నాయకుల ద్వారా ఈ పెట్టుబడులు పెట్టించారు. ఒక్కొక్కరి నుంచి 8 నుంచి 10కోట్ల రూపాయల దాకా డిపాజిట్లు సేకరించినట్లు తెలుస్తోంది. వీరిలో మాజీ క్రికెటర్ రాహుల్ ద్రావిడ్, బ్యాడ్మింటన్ మాజీ ప్లేయర్ ప్రకాశ్ పదుకోన్‌తోపాటు పలువురు క్రీడాకారులు ఉన్నట్లు సమాచారం. స్టాక్ కమోడిటీస్ పేరుతో పెట్టుబడులు వసూలు చేసిన కంపెనీ.. గత అక్టోబరు నుంచి ఎవరికీ లాభాలు పంచలేదు. దీంతో మోసానికి గురయ్యామని బావించిన వారు బనశంకరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో రూ. 300కోట్ల మోసం వెలుగులోకి వచ్చింది.

శశికళకు యూనిఫాం నిబంధన వర్తించదు: అధికారులు

బెంగళూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు పరప్పన అగ్రహార జైలులో శిక్ష అనుభవిస్తున్న శశికళకు జైలు యూనిఫాం వర్తించదని అధికారులు స్పష్టం చేశారు. శశికళ జైలుకు వచ్చినప్పటి నుంచి ఆమె విలాసవంతమైన జీవితం గడుపుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో.. జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖాశర్మ శనివారం ఆ జైలులో ఆకస్మిక తనిఖీ చేశారు. శశికళ, ఇలవరసి సాధారణ దుస్తుల్లో ఉండడంపై అధికారులను నిలదీశారు. దీంతో.. సాధారణ ఖైదీలకు యూనిఫాం తప్పనిసరి కాదని అధికారులు తెలిపారు. నిబంధనల ప్రకారం కఠిన కారాగార శిక్ష, యావజ్జీవ కారాగార శిక్ష, ఉరిశిక్షకు గురైన ఖైదీలకు యూనిఫాం ఉంటుందన్నారు.




మంటల్లో గాయపడిన ఓ విద్యార్థి... ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నవారిని పరామర్శిస్తున్న తేని జిల్లా కలెక్టర్

కమ్మేసిన కార్చిచ్చు

- ట్రెక్కింగ్‌కు వెళ్లిన సుమారు 50 మంది
- దావానలంలో చిక్కుకుని విలవిల
- 15 మందికి 30-50% గాయాలు

చెన్నై, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సాహసయాత్ర విషాద యాత్రగా మారింది! అడవిలో ట్రెక్కింగ్‌కు వెళ్లిన దాదాపు 50 మందిని దావానలం చుట్టుముట్టింది! కన్ను మూసి తెరిచేంతలో కమ్మేసిన కార్చిచ్చులో వారంతా చిక్కుకుపోయారు. బయటకు వచ్చే దారి తెలియక విలవిలలాడారు. 15 మందికి 30 నుంచి 50 శాతం దాకా కాలిన గాయాలయ్యాయి. తీవ్రగాయాలపాలైన 10 మందిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. తమిళనాడు, కేరళ సరిహద్దు ప్రాంతంలోని తేని జిల్లా బోడినాయకనూర్ సమీపాన ఉన్న కురంగని అటవీ ప్రాంతంలో జరిగిందీ విషాదం. తిరుప్పూర్, ఈరోడ్డుకు చెందిన 13 మంది సభ్యుల బృందం.. చెన్నై ట్రెక్కింగ్ క్లబ్‌కు చెందిన 8 మంది పురుషులు, 24 మంది యువతులు, ముగ్గురు పిల్లలు.. ట్రెక్కింగ్ కోసం శనివారం మధ్యాహ్నం అటవీ ప్రాంతానికి వెళ్లారు. అయితే, 4 రోజుల క్రితమే అక్కడ ఏర్పడిన కార్చిచ్చు.. ఆదివారం నాల్కలుజాస్తూ శరవేగంగా విస్తరించింది. వారు గుడారాలు వేసుకున్న చోటును ఆక్రమించింది. కార్చిచ్చు కమ్మేస్తుండడంతో.. నందిని అనే విద్యార్థిని తన సెల్‌ఫోన్ ద్వారా అటవీకార్యాలయానికి ఫోన్ చేసింది. తాము దావానలంలో చిక్కుకున్నామని తమను కాపాడాలని వేడుకుంది. వెంటనే తేని జిల్లా ఎస్పీ భాస్కరన్, ఇతర ఉన్నతాధికారులు హుటాహుటిన అక్కడికి బయల్దేరారు. ఈలోపు.. కొండపైనున్న వారు ఎటువారు అటుగా విడిపోయి కిందికి వచ్చే ప్రయత్నం చేశారు. తొలుత ఐదుగురు సురక్షితంగా కిందికి రాగలిగారు. ప్రమాదం విషయం తెలియగానే జిల్లా, ప్రభుత్వ యంత్రాంగాలు అప్రమత్తమయ్యాయి. మంటల్లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. అగ్నిమాపక దళం సభ్యులు, అటవీ సిబ్బంది, పోలీసులు సుమారు 100 మంది ఆ ప్రాంతానికి వెళ్లి మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆదివారం రాత్రి 9 గంటల సమయానికి 9మందిని అధికారులు కొండ దిగువకు చేర్చారు. మిగతా వారిని రక్షించేందుకు చర్యలు చేపడుతున్నారు. కొండ పై నుండి దిగువకు బాధితులను తీసుకురావడం కష్టసాధ్యంగా మారడంతో డోలీల సాయంతో వారికి కిందకు తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న తమిళనాడు సీఎం ఎడప్పాడి పళనిస్వామి.. కార్చిచ్చులో చిక్కుకున్న వారందరినీ సురక్షితంగా కాపాడాలని, అత్యవసర చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

వైమానిక దళం వచ్చినా..

కార్చిచ్చులో చిక్కుకున్న వారిని రక్షించేందుకు తమిళనాడు ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు వైమానిక దళాన్ని కూడా రంగంలోకి దింపారు. కోవై సూలూరు వైమానిక కేంద్రం నుంచి వైద్య సిబ్బంది సహా ఒక హెలికాప్టర్ సంఘటనా స్థలానికి చేరుకుంది. అయితే చీకటి పడడంతో వాయుసేన సహాయక చర్యలు నిలిచిపోయాయి. హెలికాప్టర్ ద్వారా విద్యార్థుల్ని అక్కడ నుండి తీసుకురావడం కష్టమని కేంద్ర రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. 15 మంది సురక్షితంగా ఉన్నారని ఆమె ప్రకటించారు. సోమవారం తెల్లవారుజామునే రక్షణ చర్యలు చేపట్టేందుకు ఆ ప్రాంతంలో 3 హెలికాప్టర్లను వాయుసేన సిద్ధంగా ఉంచింది. అలాగే 40కిపైగా ఆంబులెన్స్‌లు కురంగని అటవీ ప్రాంతానికి దిగువ సిద్ధంగా ఉన్నాయి. ఉప ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం ఈ ప్రమాదం సంగతి తెలియగానే హుటాహుటిన కురంగని అటవీ ప్రాంతానికి బయలుదేరి వెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు.

వాతావరణ మార్పులపై పోరుకు

వేదాలవైపు మరలుదాం!

- సోలార్ ప్రాజెక్టులకు రాయితీలు అవసరం
- 2022 నాటికి 175 గిగావాట్ల పునరుత్పాదన ఇంధన వనరుల విద్యుదుత్పత్తి
- అంతర్జాతీయ సౌర కూటమి సదస్సులో మోదీ
- సౌరశక్తిపై 10 సూత్రాల ప్రణాళిక ఆవిష్కరణ



ఐఎస్ఏ తొలి సదస్సులో మెక్రాన్, మోదీ

న్యూఢిల్లీ, మార్చి 11: వాతావరణ మార్పులను సమర్థంగా ఎదుర్కొనేందుకు వేదాలవైపు మరలిచూడాల్సిన అవసరం ఆసన్నమైందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. వాతావరణంలో సంభవిస్తున్న దుష్పరిణామాలను అరికట్టేందుకు ప్రపంచ వ్యాప్తంగా సౌర విప్లవం రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఆదివారమిక్కడ రాష్ట్రపతి భవన్‌లో భారత్-ఫ్రాన్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ సౌర కుటమి (ఐఎస్ఏ) తొలి సదస్సులో ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్, శ్రీలంక అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేనలతో కలిసి ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ అన్ని దేశాలకు సౌరశక్తిని అందుబాటులోకి తెచ్చేందుకు 10 సూత్రాల కార్యాచరణ ప్రణాళికను ఆవిష్కరించారు. ఫొటోవాల్టయిక్ సెల్స్ (సోలార్ సెల్స్) ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును పెంపొందించాలన్నారు. సౌర ప్రాజెక్టులకు పలు రాయితీలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పునరుత్పాక ఇంధన వనరుల ద్వారా 2022 నాటికి భారత్.. ఇప్పుడున్న దానికి రెండితలకుపైగా (175 గిగావాట్ల) విద్యుదుత్పత్తి చేసే స్థాయికి చేరుతుందని అన్నారు. ఈ సదస్సు నేపథ్యంలో ఐఎస్ఏ, ప్రపంచ ఆర్థిక సంస్థల మధ్య శనివారమే పలు కీలక ఒప్పందాలు జరిగినట్టు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. అలాగే ఆర్థిక మంత్రి జైట్లీ సమక్షంలో అంతర్జాతీయ విద్యుత్తు ఏజెన్సీతో కలిసి జాయింట్ పార్ట్‌నర్‌షిప్ డిక్లరేషన్‌పై సంతకాలు చేసినట్టు ఆ శాఖ ప్రకటనలో పొందుపర్చింది. 2030 వరకు 1000 బిలియన్ డాలర్లకుపైగా సమీకరించి 1000 గిగావాట్లకు పైగా సౌరశక్తిని అభివృద్ధి చేయాలని ఈ డిక్లరేషన్‌లో పేర్కొన్నారు.

ట్రంప్‌కు చురకలు.. మోదీకి ప్రశంసలు

సదస్సులో ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీరును దుయ్యబట్టారు. పారిస్ ఒప్పందం నుంచి అమెరికా వైదొలగడాన్ని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. నేరుగా ట్రంప్ పేరును ప్రస్తావించకుండా ఆయన తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబట్టారు. అదే సమయంలో అంతర్జాతీయ సౌర కూటమి ఏర్పాటు కోసం ప్రధాని మోదీ చూపిన చొరవను ఆయన ప్రశంసించారు. రెండేళ్ల క్రితం ఇది ఓ ఆలోచన మాత్రమేనని, అంతర్జాతీయ సౌర కూటమి ఇప్పుడు అద్భుతాలు సృష్టించేందుకు పరుగులు పెడుతోందని అన్నారు.

హైపర్‌సోనిక్ క్షిపణి 'కింజాల్'ను పరీక్షించిన రష్యా



- ధ్వని కంటే పది రెట్లు అధిక వేగం

మాస్కో, మార్చి 11: శక్తిమంతమైన ఆయుధాలను కూడగట్టుకుంటున్నామని పదేపదే ప్రకటనలు చేస్తున్న రష్యా తాజాగా మరో అధునాతన క్షిపణిని ప్రయోగించింది. రష్యా అధ్యక్ష ఎన్నికల నేపథ్యంలో.. ఆ దేశాధినేత పుతిన్ క్షిపణి ప్రయోగాలను వేగవంతం చేశారు. ధ్వని కంటే పది రెట్లు అధిక వేగంతో దూసుకెళ్లే హైపర్‌సోనిక్ క్షిపణి కింజాల్ (డాగర్)ను విజయవంతంగా పరీక్షించారు. మిగ్-31 సూపర్‌సోనిక్ ఇంటర్‌సెప్టర్ ద్వారా దీన్ని ప్రయోగించినట్లు పుతిన్ తెలిపారు. ఈ క్షిపణిని డిసెంబరు 1న సైన్యానికి అందించామన్నారు.



- ముంబైకి చేరిన 50,000 మంది రైతులు.. నేడు అసెంబ్లీ ముట్టడి

ముంబై, మార్చి 11: మహారాష్ట్ర రైతుల పాదయాత్ర మహా ప్రవాహంలా ఆదివారం ఉదయం ముంబైలోకి ప్రవేశించింది. దారి పొడవునా కర్షకులు వచ్చి చేరడంతో.. వారి సంఖ్య 50,000 దాటింది. పూర్తి రుణమాఫీ, మద్దతు ధర కోసం ఉద్యమించిన రైతులు సోమవారం అసెంబ్లీని ముట్టడించనున్నారు. ముందుగా కె.జె.సోమయ్య గ్రౌండ్‌కు చేరుకున్న రైతులు అర్ధరాత్రి ఆజాద్ మైదాన్ దిశగా కదిలారు. ఉదయం అక్కడ్నుంచి అసెంబ్లీ ముట్టడికి వెళతారు. ఆరు రోజుల కిందట మంగళవారం సాయంత్రం నాసిక్ నుంచి వేల మంది రైతులతో మార్చ్ ప్రారంభమైన సంగతి తెలిసిందే. కష్టాలకు వెరవక 180 కిలోమీటర్లు పాదయాత్రను కొనసాగించారు. రైతుల ఉద్యమానికి అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) సారథ్యం వహిస్తోంది. ఎర్రటోపీలు ధరించిన రైతులతో ముంబై వీధులు పోటెత్తాయి. ప్రస్తుతం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నా.. రైతులను అడ్డుకోవద్దని మహారాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ఆదేశించింది. ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందుల దృష్ట్యా అసెంబ్లీ ముట్టడి యత్నాన్ని విరమించుకోవాలని కోరింది. శాంతియుతంగా అసెంబ్లీ ముట్టడి నిర్వహిస్తామని ఏఐకేఎస్ నేతలు అజిత్ నవాలే, అశోక్ ధావ్లే తెలిపారు. రైతులకు శివసేన, కాంగ్రెస్, ఎన్‌సీపీ, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేనలు మద్దతు ప్రకటించాయి.

చంపేస్తారని నాన్నకు చెప్పా!

ఓ గట్టి నిర్ణయం తీసుకున్నప్పుడు రాజకీయాల్లో ఇలాంటివి జరుగుతాయి

- ఆ హంతకులను పూర్తిగా క్షమించేశాం
- విడుదలపై ప్రభుత్వానిదే నిర్ణయం
- తనను చంపేస్తారని నానమ్మ చెప్పింది
- ముఖాముఖి చర్చలో రాహుల్‌గాంధీ వెల్లడి



సింగపూర్, మార్చి 11: మాజీ ప్రధానిగా, కాంగ్రెస్ నాయకుడిగా ప్రచారంలో దూసుకెళ్తున్న రాజీవ్‌గాంధీ 1991 మే 21న తమిళనాడులో హత్యకు గురయ్యారు. ప్రభాకరన్ నేతృత్వంలోని ఎల్‌టీటీఈ మహిళా కార్యకర్త తనను తాను పేల్చేసుకొని ఈ హత్యకు పాల్పడడం నాడు దేశవ్యాప్తంగా సచలనం సృష్టించింది. అయితే, తన నానమ్మ లాగే తండ్రిని కూడా చంపేస్తారని ముందే తెలుసని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రకటించారు. తన తండ్రి ప్రాణాలను తీసిన హంతకులకు తాను, తన సోదరి ప్రియాంక పూర్తిగా క్షమించేశామని స్పష్టం చేశారు. ఐఐఎం పూర్వ విద్యార్థులతో శుక్రవారం సింగపూర్‌లో సమావేశమైన రాహుల్ ఈ విషయం చెప్పారు. రాజీవ్ హత్యపై గతంలోనూ ఆయన స్పందించినా.. హంతకుల గురించి మాట్లాడడానికి నిరాకరించేవారు. ఈ సారి హంతకుల పైనా స్పందించడం గమనార్హం. "మా నానమ్మ చనిపోయినప్పుడు నా వయసు 14 ఏళ్లు. తనను చంపేస్తారని ఆమె నాకు చెప్పింది. రోజూ నాతో బ్యాడ్మింటన్ ఆడేవాళ్లే ఆమెను చంపేశారు. అందుకే.. నిన్ను కూడా చంపేస్తారని నాన్నకు చెప్పాను. ఎందుకంటే.. రాజకీయాల్లో తప్పుడు శక్తులతో తలపడినా, ఏదైనా ఒక అంశంపై గట్టిగా నిలబడినా చంపేస్తారు" అని రాహుల్ భావోద్వేగంతో ప్రకటించారు. తమ తండ్రిని చంపినప్పుడు చాలా కాలం బాధపడ్డామని, కోపం కూడా వచ్చిందన్నారు. ఏదేమైనా తాను, తన సోదరి ప్రియాంక వారిని (హంతకులను) పూర్తిగా క్షమించేశామని రాహుల్ చెప్పారు. తన తండ్రిని చంపిన ఎల్‌టీటీఈ అధినేత ప్రభాకరన్ చనిపోయినప్పుడు తనకేమీ సంతోషం కలగలేదన్నారు. "ప్రభాకరన్ మరణాన్ని 2009లో టీవీలో చూసినప్పుడు నా మదిలో రెండు ఆలోచనలను కలిగాయి. ఒకటి- ఆయన విషయంలో ఎందుకింత అమానవీయంగా ప్రవర్తిస్తున్నారు అనిపించింది. రెండు- ఆయన కుటుంబం, బిడ్డల భవిష్యత్తు ఎంటా అని బాధపడ్డాను. హింసకు ఎవరు పాల్పడినా దాని ప్రభావం ఎదుర్కొనే కుటుంబ బాధ ఏంటో నాకు తెలుసు. టీవీలో ఈ వార్త చూసిన వెంటనే నా సోదరి ప్రియాంకకు ఫోన్ చేశారు. ప్రభాకరన్ను చంపేస్తే నాకు సంతోషం కలగాలిగానీ.. అలాంటిదేమీ లేదని చెప్పాను. ఆమె కూడా ఇలాగే స్పందించారు. ఇలాంటి విషాదాలు చోటుచేసుకున్నప్పుడు ఎవరినీ ద్వేషించకుండా.. అనంతర మానవీణ కోణాలను గుర్తించాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్నాను" అని రాహుల్ చెప్పారు. అందుకే, ఆ హంతకులను పూర్తిగా క్షమించేశామన్నారు. ఈ కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఏడుగురిని విడుదల చేయడానికి 2016లో తమిళనాడు సీఎం జయలలిత ప్రతిపాదించగా కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. దీనిపైనా రాహుల్ స్పష్టత ఇచ్చారు.

చట్టంలో వీలుంటే హంతకుల విడుదల: ఎడప్పాడి

చెన్నై, మార్చి 11(ఆంధ్రజ్యోతి): చట్టం అనుమతిస్తే రాజీవ్‌గాంధీ హంతకులను విడుదల చేసేందుకు తాము సిద్ధమేనని తమిళనాడు ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి స్పష్టం చేశారు. రాజీవ్ హంతకులను తమ కుటుంబం క్షమించినట్లు రాహుల్ చేసిన ప్రకటనపై ఎడప్పాడి పైవిధంగా స్పందించారు. ఏళ్లతరబడి కారాగారవాసం గడుపుతున్న రాజీవ్ హంతకులు ఏడుగురినీ విడుదల చేసేందుకు అన్నాడీఎంకే ప్రభుత్వం గతంలోనూ చర్యలు చేపట్టిందన్నారు. రాహుల్ ప్రకటనపై డీఎంకే, ఇతర ప్రాంతీయ పార్టీలు హర్షం ప్రకటించగా, బీజేపీ తీవ్ర నిరసన తెలిపింది. రాజీవ్ హత్య కేసులో శిక్ష అనుభవిస్తున్న వారిలో ఒకరైన పేరరివాలన్ తల్లి... రాహుల్ ప్రకటనపై ఆనందం వ్యక్తం చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఫస్ట్‌పర్సన్

విద్యా బాలన్...
నార్త్‌ను ఏలుతున్న సౌత్ అమ్మాయి.
పెళ్ళయినా హీరోయిన్‌గా నటించవచ్చని నిరూపించిన నాయిక.
రొటీన్ పాత్రలు చేయాలంటే కిక్ రాదని కుండబద్దలు కొట్టే కొత్త తరం మహిళ. సినిమాల్లోనూ, జీవితంలోనూ ఫెయిల్యూర్స్‌ను ఈ నవతరం అమ్మాయి ఎలా ఎదుర్కొన్నారో ఆమె మాటల్లోనే...

ఒక్కోసారి నిద్ర పట్టేది కాదు!

సినిమాల్లోకి ఎలా వచ్చారంటూ నన్ను చాలామంది అడుగుతూ ఉంటారు. అదో ఆసక్తికరమైన కథ. చిన్నపటి నుంచి నాకు సినిమాలంటే ఆసక్తి. నటి మాధురీ దీక్షిత్ డ్యాన్స్ చేస్తూ కనిపించే 'ఏక్.. దో... తీన్...'పాటంటే చిన్నప్పుడు నాకు భలే ఇష్టం. మా అక్కకు ఒక బ్రౌన్ సిల్క్ స్కర్ట్ ఉండేది. తొమ్మిదేళ్ళ వయసులో నేను అది తలకు చుట్టుకొని, అద్దం ముందు ఆ పాట పాడుతూ, డ్యాన్స్ చేసేదాన్ని. నిజం చెప్పాలంటే, ఎలాగైనా సరే సినిమా నటిని కావాలని చిన్నప్పటి నుంచీ నాకు ఆశగా ఉండేది. 1995లోనే టీవీ సీరియల్ 'హమ్ పాంచ్'లో అవకాశం వచ్చి, నటించడం మొదలుపెట్టాను. అయితే, షూటింగ్ మూలంగా స్కూల్ చదువుకు ఇబ్బంది వచ్చింది. అటెండెన్స్ సమస్యగా మారింది. దాంతో, 'హమ్ పాంచ్' లో నటించడం మానేసి, వాణిజ్య ప్రకటనలు చేయడం మొదలుపెట్టా.

ఆ క్షణంలో నా బాధ వర్ణనాతీతం!

నిజం చెప్పాలంటే, అప్పట్లో ఈ రంగంలో నాకు గైడ్ చేయడానికి ఎవరూ లేరు. ఒక దాని నుంచి మరొకటి కలిసొచ్చింది. అలా అడుగులు వేసుకుంటూ ముందుకు సాగిపోయా. ఒకసారి ఓ టెలివిజన్ మీడియా వర్క్‌షాప్‌కు హాజరయ్యా. అప్పుడే ఏదో యాడ్ క్యాంపెయిన్‌కి తగ్గ కొత్త అమ్మాయి కోసం వెతుకుతున్నట్లు తెలిసింది. దానికి వెళ్ళా. ఆడిషన్ చేశారు. నాకు అవకాశం ఇచ్చారు. అలా మొదలై ఏకంగా 90కి పైగా యాడ్ ఫిల్మ్స్ చేశా. ఆ తరువాత దక్షిణ భారతీయ సినిమా పరిశ్రమకు వచ్చా. సినిమా రంగంలో కూడా నాకేమీ ఘన స్వాగతం రాలేదు. నా మొదటి సినిమా మలయాళంలో. అదీ... అగ్రహీరో మోహన్‌లాల్‌తో. కానీ, అనుకోకుండా ఆ దర్శకుడికీ, మోహన్‌లాల్‌కీ మధ్య ఏదో గొడవ వచ్చి, ఆ ప్రాజెక్టు కాస్తా మూలపడింది. ఆ సినిమాలో నేను చేస్తున్న సంగతి తెలిసి, నాకు అవకాశం ఇచ్చిన ఇతర సినిమాల వాళ్ళు నా తొలి సినిమాయే ఆగిపోవడం అపశకునమని భావించారు. అంతే... షూటింగైనా మొదలవక ముందే తమ సినిమాల నుంచి నన్ను నిర్దాక్షిణ్యంగా తీసేశారు. ఆ క్షణంలో నా బాధ వర్ణనాతీతం. ఒక్కోసారి సరిగ్గా నిద్ర కూడా పట్టేది కాదు. అసలు ఈ రంగానికి నేను పనికి రానేమోనని కూడా అనుకొనేదాన్ని. కానీ, మరునాటి ఉదయమే నాకు నేను సర్దిచెప్పుకొని, కొత్త ఉత్సాహం తెచ్చుకొనేదాన్ని. అలాంటి టైమ్‌లో 'పరిణీత' చిత్రం నాకు పెద్ద టర్నింగ్ పాయింట్ అయింది.

నా ఆలోచన మార్చిన సినిమా!

'పరిణీత' సినిమా చేస్తున్నప్పుడు నాకు నిండా 24 ఏళ్ళే. ఆ వయసులోనే నాకు ఒక పెద్ద వయసు మహిళ పాత్ర వేసే అవకాశం వచ్చింది. ఇక, 2018 నాటి కల్లా నేను ఒక నిర్ణయానికి వచ్చేశా. నటించడానికి సవాలుగా నిలిచే పాత్రలు మాత్రమే పోషించాలని తీర్మానించుకున్నా. ఆ పద్ధతిలోనే 'ది డర్టీ పిక్చర్' లో నటించా. అందులో చేసిన పాత్రకు నాకు జాతీయ అవార్డు రావడంతో చాలా ఆనందపడ్డా. ఆ సినిమా ట్రైలర్ రిలీజైనప్పుడు చాలామంది నాకు

ఆయన పద్ధతి నాకు ఇష్టం!

- నేను బాగా రెస్ట్‌లెస్ పర్సన్‌ని. ఉత్తుత్తినే అసహనానికి గురవుతుంటా.
- సినిమాల్లోనూ, బయట... నేను ఎంతో ధైర్యవంతురాలినైనా, హార్రర్ సినిమాలంటే ఇష్టం లేదు. అందుకే, హార్రర్ సినిమాలు నేను చేయను.
- నేటి అగ్ర హీరోల్లో అక్షయ్ కుమార్ బోలెడంత వినోదం పంచుతారు. ఎప్పటికప్పుడు ఆయన తనను తాను కొత్తగా ఆవిష్కరించుకొనే పద్ధతి, ఆయన ఎంచుకొనే సినిమా స్క్రిప్టులు నాకెంతో ఇష్టం.

ఫోన్ చేసి, నన్ను అలాంటి పాత్రలో చూడాలని తాము అనుకోవడం లేదన్నారు. నిజం చెప్పాలంటే, నాకూ, ఆ 'డర్టీ పిక్చర్' చిత్రం ఎవరి జీవితకథ మీద ఆధారపడి తీశారో ఆ నటి సిల్క్ స్మితకూ ఏ రకంగానూ పోలికలు లేవు. కానీ, ఆ చిత్ర దర్శకుడు మిలన్ లూథ్రియా నాతో ఒకటే మాట అన్నారు... "నువ్వు సిల్క్‌కు గౌరవం ఇస్తే, జనం నీ సిల్క్ పాత్రకు గౌరవం ఇస్తారు". అంతే. నేను ఆ మాట వేదంలా అనుసరించా. ఫలితంగా, ఆ సినిమాకూ, నా పాత్రకూ ఎంత పేరొచ్చిందో అందరికీ తెలుసు. 'ది డర్టీ పిక్చర్' సినిమా వల్ల నాకు జాతీయ అవార్డు మాత్రమే కాదు... నాకు మరో పెద్ద బహుమతి కూడా లభించింది. అది ఏమిటంటే, ప్రతి విషయంలోనూ అతిగా జడ్జిమెంటల్‌గా లేకపోవడమనే వైఖరి అలవాటైంది. ఆ సినిమా నా ఆలోచనా ధోరణిని మార్చేసింది.

చెప్పకుండా ఉండాల్సిందనుకున్నా!

ఈ రంగంలో నేను చాలా ఎత్తుపల్లాలే చూశా. ఒక దశలో నా సినిమాలు అయిదు వరుసగా విజయం సాధించాయి. ఆ తరువాత వరుసగా అయిదు సినిమాలు ఫెయిలైపోయాయి. సరిగ్గా నా పెళ్ళయిన సమయం అది. పెళ్ళయిపోయిన కథానాయికలను చూడడానికి ప్రేక్షకులు సిద్ధంగా ఉండరని అందరూ అంటూ ఉంటారు. నా సినిమాల ఫెయిల్యూర్స్‌తో నేను కూడా ఆలోచనలో పడ్డా. అందరూ అనుకొనే మాటే నిజమేమో అని భావించా. నాకు పెళ్ళయిన సంగతి బయటకు చెప్పకుండా ఉండి ఉంటే బాగుండేదేమో అనుకున్నా. కానీ, అవన్నీ తప్పుడు అభిప్రాయాలని నాకు ఇప్పుడు అర్థమైపోయింది.

రాబోయే రోజులన్నీ వాటివే!

ఇప్పటికీ మహిళా ప్రధాన సినిమాలు, హీరోయిన్లు ప్రధాన పాత్రలు పోషించే సినిమాలు అనగానే వాటిలో భారీగా డబ్బు పెట్టుబడి పెట్టడానికి నిర్మాతలు ముందుకు రావడం లేదు. అయితే, రాబోయే రోజుల్లో అలాంటి సినిమాలకే మరింత భవిష్యత్తు ఉంది. 'క్వీన్, తను వెడ్స్ మను, తుమ్హారీ సులూ' లాంటి సినిమాలే అందుకు ఉదాహరణ. ఏమైనా, ఇటీవల కొన్ని మంచి సినిమాలు తయారవుతున్నాయి. అక్షయ్ కుమార్ నటించిన 'ప్యాడ్ మ్యాన్' అలాంటిదే.





'మకామ్' అంటే 'మహిళా కిసాన్ అధికార్ మంచ్'. 'మకామ్' వేదిక ద్వారా మహిళా రైతుల హక్కులు, వారికందాల్సిన ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాల గురించి అవగాహన పెంపొందిస్తున్నాం.

స్ఫూర్తి

డా.రుక్మిణీ రావు... పట్టణాల్లోనే కాదు గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా హక్కుల కోసం... దళిత స్త్రీలు, బాలలు, మహిళా రైతుల హక్కుల కోసం... చట్టాల్లో మార్పులు తేవడం కోసం ఎంతో కీలకంగా వ్యవహరించిన యాక్టివిస్టు. అందుకోసం ఆమె 'మకామ్' అనే మహిళా రైతుల హక్కుల వేదికను కూడా ఏర్పాటుచేశారు. 'మానవతా సమాజస్థాపనే తన లక్ష్యం' అంటున్న రుక్మిణీరావును 'నవ్య' పలకరించింది. ఆ విశేషాలే ఇవి...

'మకామ్'.. మహిళా రైతుల చైతన్య వేదిక

పట్టణాల్లో, గ్రామాల్లో మహిళలపై జరుగుతున్న గృహహింస, వరకట్న వేధింపులు, లైంగిక దాడులు, అత్యాచారాలు... బాలలపై వేధింపులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా... అలాగే దళితులు, వెనుకబడిన వర్గాల బాలల విద్య కోసం... బాల్య వివాహాలకు, భ్రూణహత్యలకు వ్యతిరేకంగా... సింగిల్ విమెన్ రక్షణ విషయంలో... ఇలా ఎన్నో సామాజిక సమస్యలపై గత రెండు దశాబ్దాలకు పైగా డా. రుక్మిణీరావు పనిచేస్తున్నారు. వీటికి సంబంధించి చట్టాలు తీసుకురావడంలో, ఉన్న చట్టాలకు కొత్త సవరణలు చేపట్టేలా కృషిచేయడంలో దేశవ్యాప్తంగా ఇతర యాక్టివిస్టులతో కలిసి పనిచేశారామె.

పట్టణాల నుంచి పల్లె మహిళల కోసం...

పట్టణ ప్రాంత మహిళల కోసం పనిచేయడంతో తన పోరాటం ప్రారంభమైందని రుక్మిణి తెలిపారు. తొలుత మహిళల వరకట్న హత్యలపై దృష్టిసారించారామె. వరకట్న మరణాలకు సంబంధించిన చాలా కేసులను యాక్సిడెంటల్ మరణాలుగా పోలీసులు తేల్చడం రుక్మిణిలో ఆలోచనలను రేకెత్తించాయి. ఈ సమస్య పరిష్కారానికి 'ప్రో-యాక్టివ్ అప్రోచ్' అవసరమని భావించారామె. వరకట్నం పేరుతో ఆడవాళ్లపై జరుగుతున్న హింసకు అడ్డుకట్ట వేయాలని 1981లో 'సహేలీ రిసోర్స్ సెంటర్ ఫర్ విమెన్' సంస్థను ఏర్పాటు చేశారు. అలా మొదలైన రుక్మిణీ రావు యాక్టివిజం విస్తృతస్థాయిలో కొనసాగుతూనే ఉంది. సమస్యలపై పోరాటానికి గ్రామాలలోని దళితులు, వెనుకబడిన వర్గాల మహిళలను బృందాలుగా ఏర్పరిచి వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించారామె. 'మకామ్' కూడా ఈ లక్ష్యంతోనే ప్రారంభించారు. ఈ వేదిక ద్వారా మహిళా రైతుల హక్కులు, వారికందాల్సిన ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాల గురించి అవగాహన పెంపొందిస్తున్నారు. 'మకామ్' అంటే 'మహిళా కిసాన్ అధికార్ మంచ్'. దీనిని తెలుగులో 'మహిళా రైతుల హక్కుల వేదిక' అంటారు. ఈ ఆలోచనను పలు రాష్ట్రాలలోని స్వచ్ఛంద సంస్థలు కూడా అనుసరించడం విశేషం. అసలు గ్రామీణ ప్రాంత ప్రజల కోసం పనిచేయాలన్న ఆలోచన ఎలా వచ్చింది? అని అడిగితే "పట్టణ ప్రాంత మహిళలలో ఎక్కువమంది మధ్యతరగతి, ఉన్నత మధ్య తరగతి వర్గాలకు చెందినవారు. వారు ఆర్థికంగా కొంతమేర అండదండలున్న వాళ్లు కాబట్టి తమ హక్కుల సాధన కోసం కోర్టులను ఆశ్రయించగలరు. పైగా చట్టాలు, హక్కుల గురించి ఎంతోకొంత చైతన్యం ఉన్న వారు కూడా. కానీ గ్రామీణ మహిళలకు తమ కోసం ప్రత్యేక చట్టాలున్నాయని, ఎన్నో హక్కులున్నాయనే విషయం తెలియదు. న్యాయస్థానాల ద్వారా న్యాయం పొందవచ్చని తెలిసిన వారు వీళ్లలో చాలా తక్కువ. ఇకపోతే ప్రభుత్వం ఈ మహిళలకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అసలే తెలియదు. అందుకే గ్రామీణ మహిళా రైతులలో హక్కుల చైతన్యం పెంపొందించడం కోసం పనిచేయాలనుకున్నా" అంటారామె.

మనదేశంలో వ్యవసాయరంగంలో పనిచేస్తున్నది 70 శాతం మహిళా రైతులే. వారు పండిస్తే కాని మన నాలుగు వేళ్లూ నోట్లోకి పోవు. కానీ వారి హక్కుల పట్ల ప్రభుత్వాలతో పాటు సమాజం కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఇతర రాష్ట్రాలలో కొనసాగిస్తున్న లాభదాయకమైన వ్యవసాయ విధానాలను, పద్ధతులను ఆ రాష్ట్రాలకు చెందిన మహిళా రైతుల నుంచి తెలుసుకుని నూతన వ్యవసాయ సాగును 'మకామ్' అభివృద్ధిపరుస్తోంది.

మహిళా రైతుల హక్కుల కోసం...

"మకామ్" వేదికను 2014లో ప్రారంభించాం. మనదేశంలో వ్యవసాయరంగంలో పనిచేస్తున్నది 70 శాతం మహిళా రైతులే. వారు పండిస్తే కాని మన నాలుగు వేళ్లూ నోట్లోకి పోవు. కానీ వారి హక్కుల పట్ల ప్రభుత్వాలతో పాటు సమాజం కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో మహిళా రైతులు పడుతున్న శ్రమకు గుర్తింపు లేకపోవడాన్ని గమనించాం. 'మకామ్' ఇతర రాష్ట్రాలలో కొనసాగిస్తున్న లాభదాయకమైన, అభివృద్ధిదాయకమైన వ్యవసాయ విధానాలను, పద్ధతులను ఆ రాష్ట్రాలకు చెందిన మహిళా రైతుల నుంచి తెలుసుకుని నూతన వ్యవసాయ సాగును అభివృద్ధిపరుస్తోంది. అయితే మహిళా రైతులకు సంబంధించి ప్రస్తావించుకోవాల్సిన అంశాలు చాలానే ఉన్నాయి. మన దగ్గర మహిళా రైతు సంఘాలు లేనే లేవు. సాధారణ రైతు సంఘాలలో మహిళా రైతులు ఎంతమంది సభ్యులుగా ఉన్నారు? వారు అడుగుతున్న డిమాండ్లకు ఏ మేర స్పందిస్తున్నారు? మహిళా రైతుల అవసరాలను గుర్తిస్తున్నారా? ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలలో బడ్జెట్‌లో 30 శాతం మహిళా రైతులకు కేటాయించాలని ఆర్థిక సర్వే ప్రభుత్వానికి సూచించినా ఆ దిశగా ఎటువంటి ప్రణాళికా ప్రభుత్వాలు చేపట్టలేదు. అలాగే పంటలకు మద్దతు ధర పెంచితేనే మహిళా రైతులకు లాభం. ఆదివాసీ ప్రాంతాలలో మహిళా రైతులు సేంద్రియ వ్యవసాయం సాగిస్తున్నారు. వారి పెట్టుబడులకు, కూలీ ఖర్చులకు అధిక కేటాయింపులు కావాలి. అలాగే వ్యవసాయంలో మహిళా రైతుల పనిభారాన్ని తగ్గించడానికి, ఆహార భద్రత కల్పించడానికి కూడా బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలి. విచారకరమైన విషయం ఏమిటంటే ప్రభుత్వ గణాంకాలలో మహిళలకు రైతులుగా గుర్తింపు లేదు! జెండర్ పరంగా గణాంకాలను రికార్డు చేసే పద్ధతి కరువవడం వలన ప్రభుత్వ చేపడుతున్న చర్యలు మహిళా రైతులకు ఎంతవరకు అందుతున్నాయనేది అంచనా వేయలేని పరిస్థితి.

అలాగే అడవి నుంచి ఆహార సేకరణ చేసే ఆదివాసీ మహిళలకు, అడవుల నుంచి పొందాల్సిన ప్రయోజనాలను దూరం చేస్తున్నారు. అందుకే మహిళా రైతులకు గుర్తింపు, రాయితీలు, అన్ని రకాల పథకాల హక్కులను ఇవ్వాలని 'మకామ్' డిమాండ్ చేస్తోంది. రైతు ఆత్మహత్య కుటుంబాలలో మహిళలకు జీవనోపాధి సహాయం అందించడంతో సహా రుణ మాఫీతో సమగ్ర వ్యూహాన్ని రూపొందించాలి. దీనికి అవసరమైన బడ్జెట్ కేటాయింపులుండాలి. భూమి లేని వారికిచ్చే కిసాన్ క్రెడిట్ కార్డులను మహిళా రైతులకు కూడా ఇవ్వాలి. ఇవే కాకుండా భూమి లేని దళిత మహిళలకు భూమి కొనుగోలు పథకాలు, కనీస మద్దతు ధర, మహిళా రైతులకు డ్రిప్, భూగర్భజలాల పథకాలకు ప్రోత్సాహం వంటి వాటికోసం 'మకామ్' పోరాడుతోంది అని రుక్మిణీరావు అన్నారు.

• **నాగసుందరి,** ఫోటో:ఎల్.అనిల్‌కుమార్‌రెడ్డి

పేరెంటచ్

ఎగ్జామ్ సెంటర్‌కు వెళ్లే ముందు..

వాస్తవానికి ఎగ్జామినేషన్ సెంటర్‌కు వెళ్లేటప్పటికి పిల్లలు ఎంత ప్రశాంతంగా ఉంటే అంత మేలు. లేదంటే ఒక్కోసారి ఏడాది పొడవునా చదివిందంతా బుగ్గిపాలవుతుంది. ఎగ్జామ్ రాసేది రెండు గంటలయితే, అంతకన్నా దాదాపు రెండు గంటల ముందు నుంచే ప్రశాంతంగా ఉండాలి. కనీసం ఓ అరగంట ముందే ఎగ్జామ్ సెంటర్‌కు వెళితే తప్ప ఆ ప్రశాంతత రాదు. చాలా మంది పిల్లలు సరిగ్గా ఎగ్జామ్ టైమ్‌కే అక్కడికి చేరుకుంటారు. ఎక్కడ టైమ్ అయిపోయి గేటు మూసేస్తారోనని గాబరాపడుతుంటారు. ఆ టెన్షన్‌లో ప్రశ్నపత్రం చేతికొస్తే, అన్నీ చదివినవే అయినా, అయోమయంగానే అనిపిస్తాయి. ఏం రాయాలో ఏమీ అర్థం కాదు.

ఇంకొందరి పరిస్థితి వేరు, టైమ్ అయిపోతోందన్న హడావిడిలో పెన్నో, పెన్సిలో, హాల్‌టికెటో మరిచిపోతారు. తీరా ఎగ్జామ్ సెంటర్‌లోకి ప్రవేశించాక అవి గుర్తుకొస్తే ఏం లాభం? మళ్లీ వెనక్కి వెళ్లి తెచ్చుకుందామనుకుంటే కుదరదు. ఇలాంటి తప్పుల వల్ల ఒక విద్యా సంవత్సరమే వృథా అయిపోతుంది. పిల్లల విషయంలో ఇలా ఉంటే, కొన్నిసార్లు తల్లిదండ్రుల వల్ల జరిగే ఇబ్బందులు కూడా పెద్దగానే ఉంటాయి. ఉదాహరణకు ఒక్కోసారి, తీరా ఇంట్లోంచి బయలు దేరే సమయానికి టైర్ పంక్చర్ అవుతుంది. కొన్నిసార్లు కొంత దూరం వెళ్లగానే బైక్‌లో పెట్రోల్ అయిపోతుంది. అప్పుడిక ఏ ఆటో కోసమో, క్యాబ్ కోసమో చూస్తే, ఒక్కోసారి సరిగ్గా ఆ సమయానికి ఒక్కటీ రాదు. ఇలాంటివన్నీ పిల్లల ఎగ్జామ్ స్పిరిట్‌ను బాగా దెబ్బ తీస్తాయి. అందుకే అనుకోని ఇలాంటి హఠాత్పరిణామాలను అధిగమించాలంటే, ఓ గంట ముందే ఎగ్జామ్ సెంటర్‌కు చేరుకునే ప్రయత్నం చేయాలి. దానివల్ల పిల్లలతో పాటు పేరెంట్స్ కూడా ప్రశాంతంగా ఉంటారు.



బ్యూటీ కేర్

మొటిమలకూ ఓ ప్యాక్!

మొటిమల సమస్యతో ఇబ్బంది పడే వాళ్లు ఇంట్లో ఈ ప్యాక్ చేసుకుని వేసుకుంటే ఆ సమస్య నుంచి బయటపడొచ్చు.

కావలసినవి:

కీరదోసకాయ రసం - నాలుగు టేబుల్ స్పూన్‌లు, నిమ్మరసం - ఒక టేబుల్ స్పూన్, పసుపు - చిటికెడు, గంధం పొడి - ఒక టీస్పూన్, పుదీనా లేదా తులసి ఆకులు కొన్ని.

తయారీ:

పైన చెప్పిన పదార్థాలన్నింటినీ ఒక గిన్నెలో వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకుని పావుగంట అలానే ఉండాలి. ఈ ప్యాక్ వల్ల ముఖ చర్మానికి కూలింగ్ ఎఫెక్ట్ ఉంటుంది. అంతేకాకుండా ఈ ప్యాక్ మృత కణాలతో పాటు చర్మంపై ఎండిపోయి, పేరుకుపోయిన సెబమ్‌ను, ఇన్ఫెక్షన్ కలిగించే బ్యాక్టీరియాను కూడా తొలగిస్తుంది. ఇవే చర్మ రంధ్రాల్లో పేరుకుపోయి మొటిమలకి కారణం అవుతాయి. కాబట్టి వాటిని తొలగించడం వల్ల మొటిమల బాధను తగ్గించొచ్చు.



సమ్మర్ జ్యూస్

తర్బూజా థండా

కావలసినవి:

పుచ్చకాయ (తర్బూజ) - ఒకటి, గుల్‌కండ్ లేదా గులాబీల జామ్ లేదా పంచదార - మూడు టేబుల్ స్పూన్లు (ఇష్టపడితేనే), బ్లాక్ లేదా రాక్ సాల్ట్, చాట్ మసాలా(ఇవి నచ్చితేనే వాడండి), ఐస్‌క్యూబ్స్ - కొన్ని.

తయారీ:

- పుచ్చకాయ ముక్కలు కోసి గింజలు తీసేయాలి.
- బ్లెండర్‌లో వేసి పుచ్చకాయ ముక్కలు, గుల్‌కంద్ వేసి మిక్సీ పట్టాలి.
- పుచ్చకాయ జ్యూస్‌ను గ్లాసులో పోసి పైన ఐస్ క్యూబ్స్ వేయాలి.
- ఇష్టపడే వాళ్లు ఇందులో చాట్ మసాలా, బ్లాక్ సాల్ట్ వేసి జ్యూస్‌ను తాగేయొచ్చు.



చదివింది తెలియకూడదా?

టెక్ ఫీచర్



మీ కొలీగ్ నుంచి మీకో వాట్సాప్ సందేశం వచ్చింది. దాన్ని మీరు చదవాలి. కానీ చదివారన్న విషయం మీ కొలీగ్‌కు తెలియకూడదు. అదెలా సాధ్యం? మెసేజ్ చదవగానే బ్లూటిక్స్ కనిపిస్తాయి కదా అంటారా? అలా కనిపించకుండా చదవొచ్చు. వాట్సాప్‌లో సందేశం పంపించగానే ఒక గ్రే టిక్ కనిపిస్తుంది. అవతలి వ్యక్తికి ఆ సందేశం చేరగానే రెండు గ్రే టిక్‌లు కనిపిస్తాయి. ఒకవేళ ఆ వ్యక్తి మెసేజ్ ఓపెన్ చేస్తే ఆ గ్రే టిక్‌లు బ్లూ టిక్‌లుగా మారతాయి. అంటే అవతలి వ్యక్తి చదివాడని అర్థం. ఇది తెలియకుండా ఉండాలంటే సింపుల్‌గా ఇలా చేయండి. వాట్సాప్‌లో సందేశం రాగానే నోటిఫికేషన్ ప్యానెల్‌ను స్క్రోల్ డౌన్ చేసి ఎరోప్లేన్ మోడ్‌ను ఆన్ చేయండి. ఇప్పుడు వాట్సాప్‌లో వెళ్లి మెసేజ్ చదవండి. తరువాత వాట్సాప్ క్లోజ్ చేయండి. తిరిగి ఎరోప్లేన్ మోడ్‌ను ఆఫ్ చేయండి. ఆఫ్‌లైన్‌లో మీరు వాట్సాప్‌ను ఓపెన్ చేసి మెసేజ్ చదివితే పంపిన వారికి మీరు చదివిన విషయం తెలియదు. బ్లూటిక్స్ కనిపించవు. అయితే వాట్సాప్‌ను పూర్తిగా క్లోజ్ చేసి ఎరోప్లేన్ మోడ్‌ను ఆన్ చేయాలి. సింపుల్‌గా బ్యాక్‌బటన్ నొక్కి క్లోజ్ అయింది అనుకుంటే సరిపోదు. ఎందుకంటే బ్యాక్‌గ్రౌండ్ యాప్ రన్ అవుతుంటే సింక్రనైజ్ అయి బ్లూటిక్స్ కనిపించే అవకాశం ఉంటుంది.

టెక్ గురు



ఫోన్‌లో డేటా పోయిందా..!

ఫోటోలు, వీడియోలు, డాక్యుమెంట్లు, ఆడియో ఫైళ్లు.. ఇలా భారీ మొత్తంలో అతి ముఖ్యమైన ఫైళ్లను మనం తరచూ భద్రపరుచుకుంటూ ఉంటాం. అయితే పొరబాటున ఆ డేటా డిలీట్ చేయబడితే పరిస్థితి ఏంటి? దాన్ని తిరిగి వెనక్కి తీసుకు వచ్చే అవకాశం ఏదైనా ఉందా?

కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ఆండ్రాయిడ్, యాపిల్ ఐఫోన్లు.. మనం వాడే డివైజ్ ఏదైనా పొరబాటున గానీ, కొన్నిసార్లు మన ప్రమేయం లేకుండా దానంతట అదే గానీ ముఖ్యమైన డేటా డిలీట్ అయిపోతుంటుంది. చాలా సందర్భాల్లో డేటా రికవరీ చేయడం సాధ్యమే. అయితే మనకు కావాల్సిన ఫైళ్లు సురక్షితంగా వెనక్కు రావాలంటే మాత్రం కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి. లేదంటే రికవరీ అవకాశాలు బాగా తగ్గిపోతాయి. ప్రతీ డివైజ్‌కీ విభిన్నమైన టూల్స్ మనకు అందుబాటులో ఉన్నాయి. వాటిని సక్రమంగా వాడడమే కావలసింది.

ఎప్పుడు సాధ్యమంటే..

మీ ఫోన్‌లో గానీ, కంప్యూటర్‌లో గానీ ఫైళ్లు డిలీట్ చేసిన వెంటనే వీలైనంత త్వరగా వాటిని రికవర్ చేయడానికి ప్రయత్నించాలి. రోజులు గడిచి పోయేకొద్దీ ఆ డేటా రికవర్ అయ్యే అవకాశాలు బాగా తగ్గిపోతాయి. ముఖ్యంగా ఒక హార్డ్‌డిస్కులో గానీ, మెమరీ కార్డులో గానీ ఒక 100 ఎంబి డేటాని డిలీట్ చేస్తే.. దానికంటే ఎక్కువ డేటాని తిరిగి అదే హార్డ్‌డిస్కులో కాపీ చేస్తే పోయిన డేటా వెనక్కు వచ్చే అవకాశం తగ్గిపోతుంది.

డిలీట్ అయినప్పుడు ఏమవుతుంది?

సహజంగా మనం హార్డ్‌డిస్కు, మెమరీ కార్డు నుండి ఏవైనా ఫైళ్లను డిలీట్ చేసినప్పుడు ఆ ఫైళ్లు శాశ్వతంగా డిలీట్ కావు. ప్రతీ డిస్కులోనూ ఫైల్ అలోకేషన్ టేబుల్ లేదా 'ఎన్‌టిఎఫ్ఎస్' లేదా 'ఇఎక్స్‌టి 3' వంటి ఫైల్ సిస్టమ్‌లు అనుసరించబడుతుంటాయి. ఇవి మనం డిస్కులో సేవ్ చేసే ఫైళ్లు, ఫోల్డర్ల వివరాలను, అవి డిస్కులో ఏ సెక్టార్ నుండి ఏ సెక్టార్ వరకూ స్థలం ఆక్రమించుకున్నాయి అన్న సమాచారాన్నీ నిక్షిప్తం చేసుకుని ఉంటాయి. మనం డిస్క్ నుండి ఏదైనా ఫైల్‌ని డిలీట్ చేసిన వెంటనే వాస్తవానికి ఆ ఫైలు మొత్తం డిలీట్ అవడానికి బదులుగా ఆ ఫైలుకు సంబంధించిన రిఫరెన్స్ ఎంట్రీ మాత్రమే తొలగించబడుతుంది.

దీన్ని మరింత సులభంగా అర్థం చేసుకోవాలంటే.. మీ దగ్గర ఓ పుస్తకం ఉందనుకుందాం. దాంతో 37వ పేజీలో ఓ కొత్త ఛాప్టర్ ఉందనుకుంటే.. ఆ ఛాప్టర్ పేరు మొదటిపేజీలో ఇండెక్స్‌లోనూ రాయబడి ఉంటుంది కదా. ఫైల్ డిలీట్ అంటే ఇండెక్స్‌లో ఉన్న పేరుని కొట్టేయడం లాంటిది. అలా పేరు కొట్టేసినా కూడా పేజీలు తిప్పుకుంటూ వెళితే 37వ పేజీ అక్కడ ఉంటుంది కదా. సరిగ్గా డిస్కులోని ఫైళ్ల విషయంలో ఇలాగే జరుగుతుంది.

ఎందుకు త్వరగా రికవరీ చేయాలి?

ఫైల్ డిలీట్ చేసిన తర్వాత తిరిగి వీలైనంత వేగంగా దాన్ని రికవర్ చేసే ప్రయత్నాలు చేయాలని ఇంతకుముందు చెప్పుకున్నాం గదా. దీనికి ప్రధాన కారణం, మనం డిలీట్ చేసిన ఫైల్ కేవలం ఫైల్ అలోకేషన్ టేబుల్‌లో మాయమైనంతవరకు పర్లేదు, కానీ కొన్నిసార్లు కొత్తగా మనం డిస్కులోకి కాపీ చేసే ఇతర ఫైళ్లకు తగిన మొత్తంలో స్థలం లేనప్పుడు.. డిలీట్ చేయబడిన డేటా ఏ ప్రదేశంలో భద్రపరచబడి ఉందో దానిపై కొత్త డేటా ఓవర్‌రైట్ అవుతుంది. దీంతో పూర్తిగా పాత డేటా రికవర్ అయ్యే అవకాశాలు తగ్గిపోతాయి. అందుకే వీలైనంత వరకూ మనకు కావాల్సిన ముఖ్యమైన ఫైళ్లు డిలీట్ అయ్యాయని గుర్తించిన వెంటనే డిస్క్ యాక్టివిటీ నిలిపివేయాలి. అంటే కొత్తగా ఆ హార్డ్‌డిస్కు, పెన్ డ్రైవ్, మెమరీ కార్డ్ వంటి వాటిలో ఫైళ్లని కాపీ చెయ్యడం ఆపేయాలి. మంచి శక్తివంతమైన డేటా రికవరీ టూల్‌ని వెదికి పట్టుకుని రికవరీ ప్రక్రియ మొదలుపెట్టాలి.

ఆండ్రాయిడ్ యూజర్లకి..

మీరు ఆండ్రాయిడ్ ఫోన్లు వాడుతున్నట్లయితే గూగుల్ ప్లే స్టోర్లో 'ఈజజ్ మొబిసేవర్ - రికవర్ ఫైల్స్, ఎస్సెమ్మెస్, కాంటాక్ట్స్ అనే అప్లికేషన్‌తో పాటు పెద్ద సంఖ్యలో ఇతర అప్లికేషన్లు కూడా లభిస్తున్నాయి. వీటిలో కొన్నిటిని వాడాలంటే మన ఫోన్‌ని రూట్ చేయాల్సి ఉంటుంది. మరికొన్ని నేరుగానే పనిచేస్తాయి. అయితే మన ఆండ్రాయిడ్ ఫోన్లలో ప్రాసెసర్లు అంత శక్తివంతంగా ఉండవు కాబట్టి కంప్యూటర్ ద్వారా ఫోన్లలోనే డేటాని రికవర్ చేసే టూల్స్‌ని ప్రయత్నించడం మంచిది.



దీనికోసం 'మినిటూల్ మొబైల్ రికవరీ ఫర్ ఆండ్రాయిడ్, 7 డేటా రికవరీ - ఆండ్రాయిడ్ డేటా రికవరీ', 'వండర్‌షేర్ డా.ఫోన్ రికవరీ' వంటి సాఫ్ట్‌వేర్లు మన కంప్యూటర్లో లేదా లాప్టాప్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవడానికి లభిస్తాయి. మీ ఫోన్‌ని కంప్యూటర్‌కి డేటా కేబుల్ ద్వారా కనెక్ట్ చేసి ఈ ప్రోగ్రాముల్ని రన్ చేస్తే అవి మీ డివైజ్ మొత్తాన్ని స్కాన్ చేసి రికవరీ అవడానికి అవకాశమున్న ఫైళ్ల వివరాల్ని చూపిస్తాయి. వీటిలో అధిక శాతం పెయిడ్ సాఫ్ట్‌వేర్లే. కాకపోతే డిలీటైన అతి ముఖ్యమైన డేటా కోసం కొద్ది మొత్తంలో ఖర్చుపెట్టడం తప్పదు కదా. వాస్తవానికి కొన్ని ఉచిత సాఫ్ట్వేర్లు అందుబాటులో ఉన్నా అవి అంత ప్రభావవంతంగా పని చేయవు.

యాపిల్ ఐఫోన్ల కోసం

అలాగే మీరు యాపిల్ ఐఫోన్ వాడుతున్నట్లయితే 'డా.ఫోన్ ఐఫోన్/ఐప్యాడ్ డేటా రికవరీ', 'స్టెల్లార్ ఐఫోన్ డేటా రికవరీ', 'క్లెవర్‌ఫైల్స్ ఐఫోన్ డేటా రికవరీ' వంటి వివిధ రకాల సాఫ్ట్‌వేర్లను ప్రయత్నించవచ్చు. ఇవికూడా మొదట కంప్యూటర్లో ఇన్‌స్టాల్ చేసి మీ ఐఫోన్ ని కంప్యూటర్‌కి కనెక్ట్ చేసి స్కానింగ్ చేస్తే ఫలితాలు చూపించబడతాయి.

కంప్యూటర్లో రికవరీ కోసం

ఇక మీ కంప్యూటర్లో లేదా ల్యాప్‌టాప్‌లో డిలీట్ అయిన డేటాని వెనక్కి తీసుకురావడానికి కూడా భారీ మొత్తంలో సాఫ్ట్వేర్లు లభిస్తున్నాయి. 'ఈజజ్ డేటా రికవరీ విజార్డ్', 'రికవర్ మై ఫైల్స్', 7 డేటారికవరీ, వండర్‌షేర్ డేటా రికవరీ.. ఇలా పెద్ద మొత్తంలో సాఫ్ట్‌వేర్లు ఉన్నాయి. వీటి సాయంతో కేవలం హార్డ్‌డిస్కులు మాత్రమే కాకుండా, మెమరీ కార్డులు, పెన్‌డ్రైవ్‌లలోని డేటా కూడా సులభంగా వెనక్కి తీసుకు రావచ్చు.

ఇతర జాగ్రత్తలు

ఒకవేళ మీరు కంప్యూటర్లో ఉన్న డేటాని రికవర్ చేయాలనుకుంటే ఎప్పుడూ ఆపరేటింగ్ సిస్టం ఇన్‌స్టాల్ అయి ఉన్న సి డ్రైవ్‌లో డేటా రికవరీ కోసం ప్రయత్నించకండి. ఇలా చేస్తే ఆ డ్రైవ్‌లో ఉన్న డేటా వెనక్కి రావడం కన్నా శాశ్వతంగా చెరిగిపోయే ప్రమాదం ఎక్కువ. ఒకవేళ మీకు సి డ్రైవ్‌లో అతి ముఖ్యమైన డేటా ఉందనిపిస్తే.. ఆ హార్డ్‌డిస్కును తొలగించి దాన్ని వేరే కంప్యూటర్‌కి కనెక్ట్ చేసి ఆ రెండో కంప్యూటర్లో డేటా రికవరీ సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేసి అక్కడ స్కాన్ చేయడం మంచిది. అలాగే ఎక్కువ సార్లు రిపీటెడ్‌గా స్కాన్ చేస్తూ పోతే ఉన్న డేటా కూడా ఎందుకూ పనికిరాకుండా పోయే ప్రమాదం ఉంది. కొన్నిసార్లు బేసిక్ స్కాన్‌లో మనకు కావాల్సిన ఫైళ్లు కనిపించకపోవచ్చు, అలాంటప్పుడు కంప్లీట్ స్కాన్ చేయాల్సి ఉంటుంది. మన హార్డ్‌డిస్క్, మెమరీ కార్డ్, పెన్‌డ్రైవ్‌ల స్టోరేజ్ కెపాసిటీని బట్టి స్కానింగ్ పూర్తవడానికి ఎక్కువ సమయం పట్టొచ్చు. ఈ ప్రక్రియ మొత్తం పూర్తి అయ్యేంతవరకూ ఓపికగా వేచి ఉండాలి. మధ్యలోనే ఆపేసి మళ్లీ మళ్లీ ప్రయత్నించడం కరెక్ట్ కాదు. చివరిగా మనకు అతి ముఖ్యమైన డేటా అనుకున్నది జాగ్రత్తగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనదే. ముఖ్యమైన ఫైళ్లను క్లౌడ్ స్టోరేజ్ సర్వీసుల్లో భద్రపర్చుకోవటం సురక్షితం. అలాగే ఏవైనా ఫైళ్లని డిలీట్ చేసే ముందు ఒకటికి పదిసార్లు అవి అవసరమా కాదా అన్నది ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.



- నల్లమోతు శ్రీధర్
fb.com/nallamothusridhar

టెక్ సందేహాలు

విపిఎన్ సర్వీసులతో సెక్యూరిటీ సమస్యా?

విపిఎన్ సర్వీసుల్ని వాడితే సెక్యూరిటీ ఉంటుందంటారు. వీటివలన ఉపయోగాలు, నష్టాలు తెలియజేయండి?

- ప్రశాంత్, విన్నన్నపేట



విపిఎన్ సర్వీసులు మన కంప్యూటర్లోకి వచ్చే డేటాని, అలాగే మనం కంప్యూటర్ నుండి పంపించే డేటాని ఎన్‌క్రిప్ట్ చేస్తుంటాయి. దీంతో పాకెట్ స్నిఫర్లు వంటి టూల్స్ వాడి హ్యాకర్లు మన డేటాని తస్కరించడం కష్టమవుతుంది. అందుకే సెక్యూరిటీ పరంగా ఈ సర్వీసులు మెరుగ్గా ఉంటాయి. అయితే ఈమధ్య కాలంలో దాదాపు అధికశాతం వెబ్‌సైట్లు డీఫాల్ట్‌గానే ఎన్‌క్రిప్ట్ అయి ఉంటున్నాయి కాబట్టి ప్రత్యేకంగా విపిఎన్ వాడాల్సిన అవసరం ఉండదు. ముఖ్యంగా ఈ సర్వీసులని వాడేది మనదేశంలో ఓపెన్ కాని సైట్లను యాక్సెస్ చెయ్యడానికి. కొన్ని వెబ్‌సైట్లు కేవలం యుఎస్‌లో మాత్రమే ఓపెన్ అయ్యేలా ఏర్పాటు చేయబడి ఉంటాయి. అలాంటప్పుడు విపిఎన్ ద్వారా ఆ సైట్లను యాక్సెస్ చేసుకోవచ్చు. అలాగే మనం వాడే ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు కొన్ని సైట్లని బ్లాక్ చేస్తుంటారు. అలాంటప్పుడు కూడా అలా బ్లాక్ చేయబడిన సైట్లను ఈ విపిఎన్ ద్వారా వాడుకోవచ్చు. విపిఎన్ సర్వీసుల వలన కొద్దిగా ఇంటర్నెట్ బ్రౌజింగ్ వేగం తగ్గుతుంది. కాబట్టి వీటిని వాడాలనుకున్నప్పుడు ఈ అంశాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలి.

డోజ్ మోడ్ ఉపయోగం ఏమిటి?

ఆండ్రాయిడ్ ఫోన్లో డోజ్ మోడ్ అని ఒకటి ఉంటుందని విన్నాను. దాని వల్ల ఉపయోగం ఏమిటో చెప్పగలరు?

- విమల్, కరీంనగర్




మన ఫోన్ లోని బ్యాటరీని ఆదా చేయడానికి డోజ్ మోడ్ అనే ఓ ప్రత్యేకమైన ఏర్పాటుని ఆండ్రాయిడ్ మార్ష్‌మల్లో, నౌగట్, ఓరియో ఆపరేటింగ్ సిస్టంలలో పొందుపరచడం జరిగింది. ఈ మోడ్ రాకముందు.. మన ఫోన్లో చాలా అప్లికేషన్లు ఫోన్ స్లీప్ మోడ్‌లోకి వెళ్లకుండా అడ్డుకుంటూ బ్యాటరీ భారీ మొత్తంలో ఖర్చు అవడానికి కారణం అయ్యేవి. దాంతో చాలా తక్కువ సమయంలోనే బ్యాటరీ ఖాళీ అవుతూ వుండేది. డోజ్ మోడ్ వచ్చాక మనం ఫోన్ స్క్రీన్ ఆఫ్ చేసినప్పుడు, ఛార్జర్‌కి కనెక్ట్ చేయనప్పుడూ, కొద్దిసేపు ఫోన్లో ఏ పనీ చేయకుండా అలాగే ఖాళీగా వదిలేసినప్పుడు బ్యాక్‌గ్రౌండ్లో రన్ అవుతున్న అప్లికేషన్లను ఆప్టిమైజ్ చేయడం ద్వారా బ్యాటరీ బ్యాకప్ మెరుగ్గా వచ్చేలా ఇది ఏర్పాటు చేస్తుంది. అవసరాన్ని బట్టి ఆయా అప్లికేషన్లకు నెట్‌వర్క్ కనెక్షన్ కూడా ఈ డోజ్ మోడ్ నిలిపివేస్తుంది. మనకు అతి ముఖ్యమైన అప్లికేషన్లను ఇలా ఆప్టిమైజ్ చేయబడకుండా మినహాయించుకోవచ్చు కూడా!

డౌన్‌లోడ్ స్లో ఎందుకు?

నా ఇంటర్నెట్ కనెక్షన్ స్పీడ్‌గానే ఉన్నా గూగుల్ ప్లేస్టోర్ నుండి యాప్స్ చాలా స్లోగా డౌన్‌లోడ్ అవుతున్నాయి, దీనికి పరిష్కారం సూచించగలరు.

- శ్రీనివాస్, బాపట్ల



మీ ఇంటర్నెట్ కనెక్షన్ డౌన్‌లోడ్, అప్‌లోడ్ స్పీడ్లు ఎంత గొప్పగా ఉన్నా కొన్నిసార్లు సమస్యలు తప్పవు. ముఖ్యంగా ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ల వద్ద ఉండే డిఎన్ఎస్ సర్వర్ల మీద ఎక్కువ లోడ్ ఉన్నప్పుడు డౌన్‌లోడింగ్ మొదలుకావడం, అది పూర్తవడం ఆలస్యంగా జరుగుతుంటుంది. అలాంటప్పుడు మీ ఫోన్లో డిఎన్ఎస్ ఛేంజర్ అనే అప్లికేషన్ ఇన్‌స్టాల్ చేసుకొని దాంట్లో ఉండే గూగుల్ పబ్లిక్ డిఎన్ఎస్ అనే సెట్టింగును ఎంపిక చేసుకొని, ఆ తర్వాత డౌన్‌లోడ్ చేయడానికి ప్రయత్నించండి. కచ్చితంగా మునుపటికన్నా వేగంగా యాప్స్ డౌన్‌లోడింగ్ మొదలవుతుంది, అలాగే ఇంటర్నెట్ వెబ్ సైట్లు కూడా మునుపటి కన్నా వేగంగా ఓపెన్ అవుతాయి.

మీ టెక్ సందేహాలకు సమాధానాల కోసం navya@andhrajyothy.com

నయా మొబైల్

స్మార్ట్ సెల్ఫీల కోసం...!



మొబైల్ వినియోగదారులను ఆకట్టుకోవడానికి కంపెనీలు కొత్త కొత్త ఫీచర్లతో వస్తున్నాయి. తాజాగా ఒప్పో కూడా అదే బాటలో నడుస్తోంది. 'ఎ83' పేరుతో బడ్జెట్ స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. ఆకట్టుకునే డిజైన్‌తో ఉన్న ఈ స్మార్ట్‌ఫోన్‌లో ఉన్న ఫీచర్లను పరిశీలిస్తే... ఫుల్ స్క్రీన్ డిస్‌ప్లే, ఫేస్ అన్‌లాక్ వంటి ఫీచర్లు ఆకట్టుకుంటాయి. ఒప్పో ఇతర ఫోన్ల మాదిరిగానే ఈ ఫోన్‌ను సెల్ఫీ ప్రియులను దృష్టిలో పెట్టుకుని రూపొందించారు. ఇందులో ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ) సహాయంతో నాణ్యమైన సెల్ఫీలు దిగొచ్చు. 8 మెగా పిక్సెల్ ఫ్రంట్ కెమెరా 200కు పైగా ఫేసియల్ ఫీచర్ స్పాట్స్‌ను రిఫైన్ చేస్తుందని కంపెనీ చెబుతోంది. బ్యూటిఫై మోడ్‌ను ఎంచుకుని సెల్ఫీలకు మెరుగులు దిద్దుకోవచ్చు. 13 మెగాపిక్సెల్ రియర్ కెమెరా పనితీరు కూడా బాగుంది. స్మార్ట్‌ఫోన్ లాక్, అన్‌లాక్ చేసుకోవడానికి ఫింగర్‌ప్రింట్ బదులుగా ఫేస్‌అన్‌లాక్ ఫీచర్‌ను పొందుపరిచారు. ఫేస్‌అన్‌లాక్ ఫీచర్ పనిచేయకపోతే ప్యాటర్న్ లాక్‌ను ఎంచుకోవచ్చు. నిరాశపరిచే అంశం ఏమిటంటే డిస్‌ప్లే రెజల్యూషన్(720పి) చాలా తక్కువగా ఉంది. 3జిబి ర్యామ్, 32 జిబి స్టోరేజ్ సామర్థ్యం ఉంది. దీని ధర ఆన్‌లైన్‌లో రూ.12,490.

నయా యాప్

సామ్‌సంగ్ మాక్స్‌తో సేఫ్ బ్రౌజింగ్

బ్యాంకింగ్ లావాదేవీలు, ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు, చెల్లింపులు... ఒక్కటేమిటి అన్నీ ఆన్‌లైన్‌లోనే జరిగిపోతున్నాయి. అదే సమయంలో ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోతున్నాయి. సైబర్ నేరాల నుంచి కాపాడుకోవాలంటే మొబైల్ వినియోగదారులు మరిన్ని చర్యలు తీసుకోవాలి. ఆన్‌లైన్ మోసాలను అడ్డుకోవడం, వినియోగదారులకు అవసరమైన సెక్యూరిటీ కల్పించడమే లక్ష్యంగా సామ్‌సంగ్ కంపెనీ 'సామ్‌సంగ్ మాక్స్' పేరుతో యాప్‌ను విడుదల చేసింది. ఈ ఆండ్రాయిడ్ యాప్‌ను రూపొందించడం వెనక ప్రధాన ఉద్దేశం వినియోగదారులు మరింత సేఫ్‌గా బ్రౌజ్ చేసుకునే అవకాశం కల్పించడం. ఈ యాప్ ఎలా పనిచేస్తుందంటే మీరు వినియోగించే డాటాను తగ్గిస్తుంది. అంటే వెబ్‌బ్రౌజర్ ద్వారా లేక యాప్ ద్వారా యాక్సెస్ చేసే వెబ్‌పేజీలు, ఫొటోలను కంప్రెస్ చేసి స్క్రీన్‌పై అందిస్తుంది. అంతేకాకుండా డాటాను అధికంగా వినియోగించుకునే యాప్స్‌ను గుర్తిస్తుంది. మీరు కోరుకుంటే వాటి వినియోగాన్ని కట్ చేస్తుంది. అలాగే సెక్యూర్డ్ కాని వై-ఫై నెట్‌వర్క్‌లను ఉపయోగిస్తున్నప్పుడు మీ డాటాను ఎన్‌క్రిప్ట్ చేస్తుంది. ట్రాకర్ బ్లాకింగ్, డీఎన్ఎస్ మాస్కింగ్ ఫీచర్స్ వంటివి భద్రతతో కూడిన బ్రౌజింగ్‌ను అందిస్తాయి. గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.



టెక్ రైడ్

ఆండ్రాయిడ్‌తో పనిచేసే ఎలక్ట్రిక్ స్కూటర్



బ్యాటరీ సహాయంతో నడిచే ఎలక్ట్రిక్ వాహనాలను చూసే ఉంటారు. కానీ ఈ తరహా స్కూటర్‌ను చూసుండరు. ఎందుకంటే ఇది ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్‌తో అనుసంధానమై పనిచేస్తుంది. స్కూటర్ బోర్డ్‌పై నిలుచుని డిస్‌ప్లేలో చూస్తూ దూసుకెళ్లిపోవచ్చు. ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ త్వరలో అందుబాటులోకి రానుంది. 'ఎర్సోస్ సిటీ కనెక్ట్' అని పిలుస్తోన్న ఈ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను ఫ్రెంచ్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ ఎర్సోస్ రూపొందించింది.



గంటకు 25 కి.మీ వేగంతో పరిగెత్తే సామర్థ్యం ఉన్న ఎలక్ట్రిక్ స్కూటర్‌పై నిలుచోవడానికి వీలుగా 5 అంగుళాల డ్యాష్‌బోర్డ్ ఉంటుంది. స్కూటర్ హ్యాండిల్ మధ్యలో ఎల్‌సిడి డిస్‌ప్లే ఉంటుంది. 1జిబి ర్యామ్, 8 జిబి మెమొరీ ఉంటుంది. 3జి కనెక్టివిటీని సపోర్టు చేస్తుంది. ఆండ్రాయిడ్ ఓరియో ఓఎస్‌పై పనిచేసే ఈ స్కూటర్ డిస్‌ప్లేలో గూగుల్ మ్యాప్‌ను చూడొచ్చు. బ్యాటరీ సామర్థ్యం ఎంతుందో తెలుసుకోవచ్చు. ఎంత వేగంతో వెళుతున్నదీ డిస్‌ప్లేపై చూడొచ్చు. నావిగేషన్, మ్యూజిక్, మెసేజ్ నోటిఫికేషన్ వంటి ఫీచర్లు పొందవచ్చు. బరువు 12 కేజీలున్నా 100 కేజీల వరకు బరువు మోస్తుంది. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 25 కిలోమీటర్ల వరకు నడుస్తుంది. 250 వాట్స్ మోటర్, 36 వాట్స్ బ్యాటరీ గంటకు 25 కి.మీ వేగంతో వెళ్లేందుకు దోహదం చేస్తాయి. ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ పంక్చర్ అవుతుందన్న భయం లేదు. ఎందుకంటే పంక్చర్ ప్రూఫ్ వీల్స్‌ను అమర్చారు. కార్పోరేట్ కార్యాలయాల్లో, క్యాంపస్‌లలో దూసుకెళ్లడానికి ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ చక్కగా పనికొస్తుంది. బార్సిలోనాలో జరిగే మొబైల్ వరల్డ్ కాంగ్రెస్‌లో దీన్ని ప్రదర్శించనున్నారు. దీని ధర సుమారు రూ.40 వేలు.



గుడ్ సర్వీస్



పడకేసిన మగ్గాలు... చాలీచాలని ఆర్థిక వనరులు... కాలంతో పోటీపడి సాంకేతికత పరుగులు పెడుతున్న క్రమంలో చేతి నిండా పనిలేక... నాలుగు వేళ్లూ నోట్లోకి వెళ్లక... కుటుంబ పోషణ బరువై బలవంతంగా ప్రాణం తీసుకుంటున్నాడు నేతన్న. పత్రికల్లో చూసిన ఈ మరణ ఘోష ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని కదిలించింది. కార్మికుల బలవన్మరణాలను నివారించి... చేనేత'లకు పూర్వ వైభవం తెచ్చే దిశగా అతడిని అడుగులు వేయించింది. ఆరంకెల ఉద్యోగాన్ని వదిలి... 'వీవర్స్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్' నెలకొల్పి... సమస్యల పరిష్కారానికి వ్యవస్థీకృతంగా కార్యక్రమాలు చేపడుతున్న దాసు సురేశ్ సేవా మార్గం అతడి మాటల్లోనే...

చే'నేత'కు చేయూత

చేనేత వర్గానికి చెందిన మా తాతయ్య దాసు కుమారస్వామి స్వాతంత్ర్య సమరయోధుడు. వినోబాభావే గారితో కలిసి ఆర్థిక భూదాన ఉద్యమంలో పనిచేశారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సహచరుడిగా తెలంగాణ జిల్లాల్లో ఎన్నో సాంఘిక కార్యక్రమాలు నిర్వహించారు. సామాజిక చైతన్యం రగిలించే ఐదు వేల పాటలు రాశారు. అలా నాకు తెలియకుండానే ఆయన సేవా మార్గం వైపు ఆకర్షితుడిని అయ్యాను. వరంగల్ జిల్లాలోని భీమారం మండలం ఎర్రగట్టు మా సొంతూరు. ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ)లో ఎంబీఏ చేశాను. నాన్న నలభై ఏళ్లు పోలీసు శాఖలో పనిచేసి ఎస్ఐగా రిటైర్ అయ్యారు. చుట్టుపక్కల వారికి ఏదైనా అవసరం ఉంటే చేతనైన సాయం చేసేవారు. శాఖలో ఆయన సేవలకు గానూ 'డీజీపీ అవార్డు' వచ్చింది. అమ్మ రమాదేవి గృహిణి. చదువైన తరువాత కొంత కాలం బెంగళూరులో ఉద్యోగం చేసేవాడిని. అప్పుడు తమ్ముడు నరేశ్ రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆ ఘటనతో అమ్మా నాన్న మానసికంగా కుంగిపోయారు. వాళ్లని చూసుకోవడానికి నేను బెంగళూరు వదిలి హైదరాబాద్ వచ్చాను. అదే సమయంలో చేనేత కార్మికుల ఆత్మహత్యల వార్తలు నా మనసు కలచివేశాయి. ఇంట్లో ఓ వ్యక్తిని కోల్పోతే ఆ కుటుంబం బాధ ఎలా ఉంటుందో నాకు తెలుసు. అలాంటిది ఇంత మంది నేతన్నలు నిత్యం బలవన్మరణాలకు పాల్పడుతుంటే వారిని నమ్ముకున్న కుటుంబాల పరిస్థితి ఏంటి? అనే ఆలోచనతో నిద్ర పట్టలేదు. దాంతో చేనేత కార్మికుల సంక్షేమానికి ఏదో ఒకటి చేయాలనే సంకల్పం బలంగా నాటుకుపోయింది.

ఉద్యోగం... సేవా మార్గం...

సాఫ్ట్‌వేర్ మేనేజ్‌మెంట్‌లో ఉన్నత స్థాయి ఉద్యోగం. ఒరాకిల్, శాప్ తదితర బహుళజాతి సంస్థల్లో పదిహేనేళ్లకు పైగా పనిచేసిన అనుభవం. ఎంబీఏలో... ఆ తరువాత వృత్తిలో పెంచుకున్న నిర్వహణ సామర్థ్యం... అన్నింటినీ మించి ఆరంకెల జీతం... పెళ్లి, పిల్లలు, జీవితానికి ఢోకా లేదు. కానీ... అన్నీ ఉన్నా చేనేత కుటుంబంలో పుట్టి నేతన్నలకు ఏమీ చేయలేకపోతున్నాననే బాధ ఏదో మూల తొలిచేస్తుండేది. ఏం చేయాలి... ఎలా చేయాలి? ఒక్కడినే ఎంత వరకు చేయగలను? అయితే ఎక్కడో ఒక చోట తొలి అడుగు వేయాలనే ఉద్దేశంతో రిటైర్డ్ ప్రొఫెసర్ కె.మోహన్‌రావు గారితో కలిసి తెలంగాణలోని సిరిసిల్ల, సిద్దిపేట, కమలాపూర్, ఐనవోలు, పోచంపల్లి, నల్లగొండ, గద్వాల్ తదితర ప్రాంతాల్లో మూడు నెలలు పర్యటించి చేనేత కార్మికులతో మాట్లాడాం. వారికి ఎదురవుతున్న ఇబ్బందులు, ఉపసరాలు, నాయకత్వ లోపాలు, ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేశాం. ఏ విధంగా ఆత్మహత్యలు నివారించి కార్మికుల సంక్షేమం అందించగలమో ఆలోచిస్తూ... 'వీవర్స్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్' స్థాపించాను. ప్రతి చేనేత కార్మికుడినీ చైతన్య పరిచి, అవగాహన పెంచేందుకు వివిధ ప్రాంతాల్లో యాభైకి పైగా కార్యక్రమాలు ఫౌండేషన్ తరపున నిర్వహించాం.

కృషికి ఫలితం...

చేనేత కార్మికుల సమస్యలు, వాటికి పరిష్కారాలను సూచిస్తూ రూపొందించిన నివేదికను తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు గారికి అందించాను. 'కార్మిక ఆధారిత వ్యవస్థ' ఏర్పాటు చేయాలని, కార్మికుడు చనిపోతే అతని కుటుంబం రోడ్డున పడకుండా ఉచిత జీవిత బీమా కల్పించాలని, అతడికి భరోసా కల్పించేందుకు ఉచిత ఆరోగ్య బీమా ఇవ్వాలనేవి నివేదికలో ముఖ్యమైన సూచనలు. దాన్ని పరిశీలించిన సీఎం అభినందిస్తూ... 'నివేదిక శాస్త్రీయంగా ఉంది. మరి దీనికి కార్యాచరణ ఏమిటి' అని అడిగారు. అందుకు కొన్ని సూచనలు నివేదించాను. ఆ తరువాత 20 వేల మంది కార్మికులను కలిసి అన్ని వివరాలతో వారి డేటా సేకరించాం. దాన్ని ఇన్సూరెన్స్ కంపెనీలకు సమర్పించాం. వారిచ్చిన వివరాల ఆధారంగా నివేదికను మంత్రులు కేటీఆర్, ఈటల రాజేందర్‌కు అందించాను. ఈ కృషి ఫలితంగా మూడు నెలల కిందట 45 వేల మంది పవర్‌లూమ్ కార్మికులకు లబ్ధి చేకూరేలా ఒక్కొక్కరికీ రూ.6 లక్షల ఉచిత ఇన్సూరెన్స్ కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం జీఓ జారీ చేసింది. చేనేత కార్మికుల కోసం హెల్ప్‌లైన్ నంబరును ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన కార్యరూపం దాల్చింది. ఒక్కడినే మొదలు పెట్టిన ఈ సామాజిక కార్యక్రమం ప్రభుత్వాన్ని కదిలించిందంటే అంతకంటే సంతోషం, సంతృప్తి ఏముంటాయి!



ఇప్పుడు నేతన్నలకు ఏ అవసరం వచ్చినా నా ఇంటి తలుపు తడుతున్నారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ఏమేం చేయగలమో అవన్నీ ప్రతి పాదనల రూపంలో ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సమర్పించి, వారికి లబ్ధి చేకూర్చే ప్రయత్నం చేస్తున్నా.

సంక్షేమమే అసలు లక్ష్యం...

నేతన్నల సంక్షేమమే సామాజిక బాధ్యతగా చేతనైన సాయం చేసే దిశగా అడుగులు వేస్తున్నాను. రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, అధికారులను కలిసి సమస్యలను విన్నవించుకున్నాం. దీంతో అటు ఉద్యోగం... ఇటు సేవా కార్యక్రమం... రెండింటికీ సమయం కేటాయించడం కష్టమైపోయింది. ఏదో ఒకటే అనుకున్నప్పుడు... చివరకు నా మనసు సామాజిక సేవకే ఓటు వేసింది. అంతే... మూడు నెలల కిందట ఉద్యోగం వదిలేసి పూర్తిస్థాయిలో చేనేతల సంక్షేమం కోసమే పని చేస్తున్నాను. నేను సంపాదించిన దాంట్లో సేవింగ్స్, స్నేహితుడితో కలిసి హైదరాబాద్‌లో నెలకొల్పిన డబ్బింగ్ స్టూడియో నుంచి నెలకు దాదాపు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఆదాయం వస్తుంది. నా కుటుంబం గడవడానికి అది సరిపోతుంది. ఇప్పుడు నేతన్నలకు ఏ అవసరం వచ్చినా నా ఇంటి తలుపు తడుతున్నారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ఏమేం చేయగలమో అవన్నీ ప్రతి పాదనల రూపంలో ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సమర్పించి, వారికి లబ్ధి చేకూర్చే ప్రయత్నం చేస్తున్నా. పోలీసు, మున్సిపాలిటీ తదితర ప్రభుత్వ కార్యాలయాలు, హాస్పిటల్స్‌లో ఉపయోగించే డ్రెస్‌లు, బెడ్‌లు, అతిథులు వచ్చినప్పుడు కప్పే శాలువాలు వంటి వాటికి సంబంధించి ఏడాదికి ఎంత వస్త్రం ఖర్చవుతుందనే దానిపై ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించాను. దానిపై స్పష్టత వస్తే... ఆ పనిని ముందుగానే చేనేత కార్మికులకు అప్పగించి, వారికి ఏడాదంతా కచ్చితమైన ఉపాధి కల్పించినట్టవుతుంది.

సేవకు పురస్కారం...

అప్పుల ఊబిలో కూరుకుపోయిన నేత కార్మికులను రుణాలు కట్టమని బ్యాంకులు వెంటపడుతున్న క్రమంలో రుణమాఫీ కల్పించాలని మంత్రి కేటీఆర్‌కు విన్నవించాను. అందుకు స్పందించిన ప్రభుత్వం రూ.19 కోట్లు విడుదల చేసింది. అలాగే మా ఫౌండేషన్ నుంచి ఆత్మహత్యలు చేసుకున్న వారి కుటుంబాలకు రూ.10వేల చొప్పున అందించాము. చనిపోయిన వారి దహన సంస్కారాలకు రూ.5 వేల చొప్పున ఇచ్చాం. టెన్త్, ఇంటర్ చదివే నేతన్నల పిల్లలకు ఉపాధి అవకాశాలు కల్పించాం. నా సేవకు గుర్తుగా జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కేంద్ర టెక్స్‌టైల్ మంత్రిత్వ శాఖ 'సేవా పురస్కార్' ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఏటా నిర్వహించే స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవాల కమిటీకి నన్ను వైస్ చైర్మన్‌గా నియమించింది. అంతకు ముందు కూడా ఎర్రగట్టు ప్రాంతంలో మౌలిక వసతుల కోసం పోరాడి సాధించాను. వెయ్యికి పైగా చెట్లు నాటించాము. మా కృషి ఫలితంగా ప్రభుత్వం రూ.2.5 కోట్ల పనులు మంజూరు చేసింది. నేను కోరుకునేది చేనేత కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం. ఆ దిశగా నా పయనం సాగుతూనే ఉంటుంది.

• హనుమా

నవజీవనగీతం

నా ఆయుష్షు నువ్వే పోసుకో!



మనసివ్వడం గురించి అప్పుడెప్పుడో ఆత్రేయ రాసిన ఓ ప్రేమగీతంలో "ఉన్నవన్నీ సేకర్షణ చేసి లేనిదానినయ్యాను... ఏమీ లేనిదాననయ్యాను" అనే పాదం వస్తుంది. అవునూ...! హృదయాన్ని అర్పిస్తే పేదవారవుతారా ఎవరైనా? నిజమేనేమో! లేకపోతే, 1964లో విడుదలైన 'ఆయా మిలన్ కీ బేలా' సినిమా కోసం హస్రత్ జైపురి రాసిన ఈ పాటలో కూడా ఆ మాటే ఎందుకు వస్తుంది! మహాకవులే ఆ మాట అంటే ఇంక మనమెలా కాదంటాం! ఆ భావాల మాట ఎలా ఉన్నా, ఈ పాటకు శంకర్ - జైకిషన్ సమకూర్చిన బాణీ లతా మంగేష్కర్ గొంతులో పడి, తేనెల సోనగా మారిపోయింది.

• • • • • •

తుమ్హే ఔర్ క్యా దూఁ, మై దిల్ కే సివాయ్
తుమ్‌కో హమారీ ఉమర్ లగ్‌జాయ్

(హృదయం అర్పించడం తప్ప, నీ కోసం ఇంకేం చేయగలను?
కడకు నా ఆయుష్షు సైతం నీకే జతగూడనీ)

మానవ జీవితంలో హృదయాన్ని మించిన సంపద ఏముంటుంది? అలాంటి అమూల్యమైన హృదయాన్నే ఎవరికైనా అర్పించేస్తే, ఆ తర్వాత ఆ వ్యక్తి వద్ద ఇంకా మిగిలేదేముంది? ఒకవేళ ఏదైనా ఇంకా మిగిలి ఉంటుందీ అంటే, అది తన ప్రాణమే, తన ఆయుష్షే! ప్రాణాధికంగా ప్రేమించే వాళ్ల కోసం కొందరు ఆయుష్షును, చివరికి తన ప్రాణాన్ని సైతం ఇచ్చేయడానికి సిద్ధమైపోతారు.

మురాదేఁ హో పూరీ - సజే హర్ తమన్నా - ముహబ్బత్ కీ దునియా కే - తుమ్ చాంద్ బన్‌నా
బహారోంకి మంజిల్ పే హస్‌నా, హసానా -ఖుషీ మే భీ హమారీ ఆవాజ్ సున్‌నా
కభీ జిందగీ మే కోయీ గమ్ న ఆయే /తుమ్‌కో హమారీ /

(నీ కాంక్షలన్నీ నెరవేరనీ - ఆశలన్నీ నీ ఆభరణం కానీ
ప్రేమ లోకానికి నువ్వే జాబిల్లివైపో - వసంతసీమలో నవ్వుతూ నవ్విస్తూ ఉండిపో, ఎంత సంతోషంలో ఉన్నా, నా గొంతు మాత్రం వింటూ ఉండు, ఏనాడూ జీవితాన
నీకు ఏ బాధా రాకుండనీ)



తానెంత బాధపడుతున్నా, తన ప్రేమమూర్తి జీవితంలో మాత్రం ఏ చిన్న బాధ కూడా జొరబడకూడదనుకుంటారు. ఒకవేళ ఏ కారణంగానో అతడు దూరమైపోయినా, అతనికి మాత్రం అనుకున్నవన్నీ నెరవేరాలనీ కోరుకుంటారు. కాకపోతే, అతడెంత ఆనందంలో మునిగితేలుతున్నా, తన హృదయనాదాన్ని మాత్రం వింటూనే ఉండాలనుకుంటారు. అలా అయితే, అతడు తన జీవితంతో కలిసి నడవకపోయినా, ఆ దూరతీరాల్లోంచి తన మనసును చూస్తున్నాడనీ తృప్తి పడతారు. ఆ తృప్తి ఆధారంగానే జీవనయాత్రను కొనసాగిస్తారు.

ముఝే జో ఖుషీ హై తుమ్హే క్యా బతావూఁ - భలా దిల్ కీ ధడ్‌కన్ కో కైసే ఛుపావూఁ
కహీఁ హో న జావూఁ - ఖుశీ సే మై పాగల్ - తుమ్హే దేఖ్‌కర్ ఔర్ భీ ముస్కురావూఁ
ఖుదా దిల్ జలోంకీ నజర్ సే బచాయే /తుమ్‌కో హమారీ/

(నా సంతోషమేమిటో నీకేం చెప్పను? నా హృదయ స్పందనల్ని నేనెలా దాచుకోను? - ఆనందంలో నేను పిచ్చిదాన్నవుతానా ఏమి? నిన్ను చూసి మరింత మందహాసంలో తేలిపోనా? ఓర్వలేని జనం నుంచి దైవం కాపాడనీ)

తన అంతర ప్రపంచం మాట ఎలా ఉన్నా, ఓర్వలేని బాహ్య ప్రపంచం ఒకటుంది కదా! దాన్నించి తనను, తన ప్రేమనూ కాపాడుకోవడం చాలామందికి కష్టమవుతుంది. ఆ స్థితిలో బెంబేలెత్తిన ప్రేమికులు ఒక్కోసారి 'వాళ్ల చూపులేవీ తమపైన పడకుండా ఏ దైవశక్తో అడ్డుపడితే బావుండు కదా' అని కూడా అనుకుంటారు.

సితారోంసే ఊంఛా హో రుత్‌బా తుమ్హారా - బనో తుమ్ హర్ ఏక్ జిందగీ కా సహారా
తుమ్హే జిస్ సే ఉల్ఫత్ హో మిల్‌జాయే తుమ్‌కో - లో యే హమారీ దువా కా ఇషారా
ముఖద్దర్ తుమ్హారా సదా జగ్‌మగాయే / తుమ్‌కో హమారీ/

(నక్షత్రాల కన్నా ఎత్తుగా నీ యశస్సు నిలవనీ - ప్రతి జీవితానికీ నువ్వే ఆధారమైపో
నువ్వు ప్రేమించే ప్రతిదీ నీ స్వాధీనమవనీ - ఈ నా శుభాకాంక్షలు నువ్వు స్వీకరించు
కలకాలం నీ అదృష్టం దేదీప్యంగా వెలగనీ)

ఎదిగిన ప్రేమ హృదయులు ఎప్పుడూ తాను ప్రేమించిన వ్యక్తిని బంధనాల్లో ఉంచరు. పైగా, చుట్టూ ఉన్న ఎంతో మంది జీవితాలకు అండదండగా నిలవాలని కోరుకుంటారు. ఆ క్రమంలో అతని కీర్తిప్రతిష్టలు నక్షత్రాల కన్నా ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షిస్తారు. పరిత్యాగం అంటే అదేదో వైరాగ్యంలోనే సాధ్యమనుకుంటారు చాలా మంది. కాని, అసలు సిసలైన ప్రేమికుల్ని చూస్తే, అది ప్రేమలోనూ సంభవమేనని బోధపడుతుంది.

• బమ్మెర

కౌన్సెలింగ్

హెమామెలిస్‌తో రక్తస్రావానికి చెక్

మా అబ్బాయికి 24 ఏళ్లు. గత రెండేళ్లుగా అర్శమొలల సమస్యతో బాధపడుతున్నాడు. బాగా రక్తస్రావమై ఒక్కోసారి స్పృహ తప్పి పడిపోతున్నాడు. ఇప్పటిదాకా మేము సంప్రదించిన డాక్టర్లంతా ఈ స్థితిలో శస్త్ర చికిత్స తప్ప మరో మార్గం లేదంటున్నారు. నా మిత్రుల్లో కొందరేమో శస్త్ర చికిత్స చేయించినా కొద్ది రోజుల్లోనే సమస్య మళ్లీ మొదలవుతుంది అంటున్నారు. ఏ నిర్ణయం తీసుకోవాలో మాకేమీ అర్థం కావడం లేదు. ఏం చేయాలో సలహా ఇవ్వండి.

- ఎన్. రామ్మూర్తి, తెనాలి



మీ అబ్బాయి సమస్య శస్త్రచికిత్స లేకుండానే నయమవుతుంది. కాకపోతే రక్తస్రావం కారణంగా స్పృహతప్పి పడిపోతున్న స్థితి కాబట్టి అతనికి వెంటనే రక్తం ఎక్కించాలి. ఆ తర్వాత హోమియో మందులతో రక్తస్రావాన్ని నిలిపివేయవచ్చు. మీరు వెంటనే హెమామెలిస్ -30 మందును రోజుకు ఒకసారి చొప్పున మూడు రోజుల పాటు ఇవ్వాలి. ఆ తర్వాత 3 రోజుల పాటు ఆపేసి, మళ్లీ అదే మందును, అదే ప్రకారం మళ్లీ మూడు రోజుల పాటు ఇవ్వాలి. దీనికి తోడు కేడస్ మార్- క్యూ అనే ద్రావణాన్ని అరకప్పు నీటిలో 15 చుక్కల చొప్పున వేసి రోజుకు రెండు సార్లు తీసుకోవాలి. అలా 15 రోజుల పాటు తీసుకుంటే, రక్తస్రావం ఆగిపోతుంది. ఆ తర్వాత సమీపంలో ఉన్న హోమియో వైద్యున్ని సంప్రదిస్తే మీ అబ్బాయి సమస్య పూర్తిగా తొలగిపోతుంది.

- డాక్టర్ బి. సోహన్‌సింగ్
రిటైర్డ్ సూపరింటెండెంట్
ప్రభుత్వ హోమియో వైద్య కళాశాల, హైదరాబాద్

డైలీ సుడోకు - 129

	8				3		2	
9		7	1					
2		5		9		7		
					1	2		
5				3				9
		3	2					
		8		1		6		4
					9	1		2
	6		8				3	

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు-128 సమాధానం

9	6	8	5	4	1	2	3	7
5	3	2	9	7	6	4	1	8
7	1	4	2	8	3	6	5	9
4	2	3	1	9	7	5	8	6
8	7	1	6	2	5	3	9	4
6	9	5	8	3	4	1	7	2
1	5	7	4	6	8	9	2	3
3	4	9	7	5	2	8	6	1
2	8	6	3	1	9	7	4	5

మీకు మీరే డాక్టర్

నల్లేరుతో పలు లాభాలు!



- నాలుగు అంగుళాల పొడవు గల నల్లేరు కాడను ఒక తులం వెన్నలో కలిపి ముద్దగా నూరి, రోజుకు ఒకసారి తినాలి. ఆ తర్వాత 3 గంటల దాకా ఏరకమైన ఆహారమూ తీసుకోకూడదు. ఇలా 7 రోజుల పాటు తినిపిస్తే, విరిగిన ఎముకలు త్వరగా అతుకుతాయి.
- నల్లేరును పచ్చడిగా నూరి, ప్రతి రోజూ తులం మోతాదు ముద్దను తింటే, ఎముకలు గుల్లబారిపోయే ఆస్టియోపొరోసిస్ సమస్య పోయి, ఎముకలు గట్టిపడతాయి.
- కణుపులు తప్పించి, మిగిలిన కాడల చూర్ణాన్ని ఒక స్పూను మోతాదులో తీసుకుంటే పైల్స్ వ్యాధి తగ్గుముఖం పడుతుంది. ఆకలి, జీర్ణశక్తి పెరుగుతాయి.
- నల్లేరు కాడలు ఎండించి, కాల్చిన బూడిదను 2 గ్రాముల చొప్పున నీటిలో కలిపి సేవిస్తే ఉబ్బసం వ్యాధి శమిస్తుంది.
- కాడలను నీటితో ముద్దగా నూరి, అరతులం మోతాదులో పాలతో ప్రతి రోజూ రెండు పూటలా తీసుకుంటే, మోకాళ్ల నొప్పులు తగ్గుతాయి.

లైఫ్‌లెసన్

ఆమె జీవితమే...ఓ పోరాటం!

1953 జనవరి 22..
చింతామణి ద్వారకానాథ్ దేశ్‌ముఖ్‌కి, దుర్గాబాయమ్మకి పెళ్లయింది.
ఆ రోజు నుంచి ఆమె దుర్గాబాయి దేశ్‌ముఖ్ అయింది.
అప్పటికి వారిద్దరికీ వేర్వేరు వివాహాలు అయ్యాయి.
ఈ పెళ్లినాటికి- ఆయన కేంద్ర ఆర్థికమంత్రి! ఆమె ప్రణాళిక సంఘ సభ్యురాలు!!
ఆమె వయసు 44, ఆయనకు 57.
ఆమె గతమంతా దిగుడు ఎగుళ్లతో సాగింది.

దుర్గ జన్మించింది 1909 రాజమహేంద్రవరంలో. తండ్రి రామారావు కాకినాడ కోర్టులో స్టెనోగ్రాఫర్. చాలీచాలని జీతం. ఊళ్లలో అంటువ్యాధులు ప్రబలితే ముందుండి సేవలు చేసేవారు. కూతురిని కూడా అలాగే పెంచేవారు. దుర్గను అప్పుడప్పుడు శ్మశానాలకు తీసుకువెళ్లి, కాలే శవాల్ని చూపి చావు పుట్టుకల గురించి చెప్పేవారు. ఇల్లు గడవడంలో ఇబ్బందులున్నా తల్లి కృష్ణవేణమ్మ గుండెనిబ్బరంతో ఉండేది. ఈ లక్షణాలన్నీ దుర్గకూ వచ్చాయి.

చదువుల్లో, ఆటపాటల్లో అన్నింట్లో ఫస్ట్. హిందీ అంటే మరీ ఇష్టం.

1917లో అమలాపురానికి చెందిన గుమ్మడిదల సుబ్బారావుతో ఆమెకి పెళ్లి చేశారు. అప్పటికి ఆ అమ్మాయి వయసు ఎనిమిదేళ్లే! తెలిసీ తెలియని వయసు. కాపురానికి ఇంకా అత్తారింటికి పంపలేదు కానీ బడి మాత్రం మానేయాల్సి వచ్చింది. కానీ దుర్గ మొండిఘటం. ఇంట్లోనే స్కూలు ప్రారంభించింది. నలుగురు ఆడపిల్లలు చేరారు. తానే టీచరు. ఆ పాఠశాలలో తల్లికి కూడా హిందీ నేర్పింది 11 ఏళ్ల దుర్గ. ఆ హిందీ తోనే ట్యూషన్లు చెప్పి, ఇంటికి ఆసరా అయ్యింది కృష్ణవేణమ్మ.

1921 మార్చి 20...

గాంధీజీ రాజమండ్రి వచ్చారు. అప్పటికి దుర్గకి 12 ఏళ్లు. పార్టీ నిధి కోసం చేతి రుమాలు పుచ్చుకొని చందాలు వసూలు చేసింది. తన వంతు సాయంగా ఆ బాలిక అలా అపురూపంగా సొమ్ము ఇస్తూంటే గాంధీ ఆనందించేశారు. అంత దగ్గరగా ఆయనను చూసిన స్ఫూర్తితో ఆమె తన చేతి బంగారు గాజుల్ని కూడా దానం చేసేసింది. అప్పటి నుంచి స్వాతంత్ర్య పోరాటాల్లో చురుగ్గా పాల్గొనేది.



1923 డిసెంబరు 28....

కాకినాడలో కాంగ్రెస్ జాతీయమహాసభలు జరిగాయి. అప్పుడు ఖద్దరు ప్రదర్శన ఏర్పాటు చేశారు. అందు కోసం రెండు అణాల టిక్కెట్ పెట్టారు. అర్హులనే లోపలకు పంపే బాధ్యత దుర్గకి అప్పగించారు. మల్లెపువ్వు లాంటి తెల్లటి దుస్తులు ధరించిన ఓ అందమైన వ్యక్తి ఏదో ఆలోచిస్తూ- యథాలాపంగా ఖాదీ ప్రదర్శనలోకి ప్రవేశించబోయాడు. దుర్గ అడ్డం పడింది. టిక్కెట్ ఏదీ అంటూ గదమాయించింది. అతను లేదన్నాడు. అయితే 'నో ఎంట్రీ' అందామె. వెంటనే అక్కడున్న నాయకులు, కార్యకర్తలు పరుగుపరుగున వచ్చారు. దుర్గను తిట్టిపోశారు. వచ్చింది ఎవరో తెలుసా 'జవహర్‌లాల్‌నెహ్రూ' అన్నారు. 'అయితే ఏంటి' అంది ధైర్యంగా దుర్గ. ఆమె నిజాయతీని, నిర్భయాన్ని మెచ్చుకున్నారు నెహ్రూ.

జాతీయోద్యమంలో పాల్గొన్న కారణంగా దుర్గను అరెస్టు చేశారు ఆంగ్లేయులు. 1930లో వేలూరు జైల్లో వేశారామెని. తాను కారాగారానికి వచ్చానని ఆమెకి ఏ కోశానా లేదు. విహారయాత్రకి వచ్చినట్లు ఫీలైంది. తనతో పాటు బందీ అయిన తోటి నాయకురాళ్లనూ, కార్యకర్తలనూ ఉత్సాహపరిచింది. గొంతెత్తి కోరస్‌గా దేశభక్తి గీతాలు పాడించేది. రకరకాల వంటలు చేసుకొంటూ గడిపేవారు. గర్భవతి అయిన ఓ మహిళా కార్యకర్తకు ఏకంగా జైల్లోనే సీమంతం జరిపించేసింది. నూలు వడికించింది అందరి చేతా! పైగా హిందీ పాఠాలు నేర్పుతూ స్కూలు నడిపింది దుర్గ.



మరోసారి మదురై జైల్లో ఉన్నప్పుడు మరణపు అంచుల దాకా వెళ్లింది. ఉరిశిక్ష పడ్డవారి వార్డులో ఉంచారు దుర్గను. అలాంటి ఖైదీలు చావుకి ఎదురుచూస్తూ వింతగా, పిచ్చిగా ప్రవర్తించడం సహజం. దుర్గను వారు ఎప్పుడూ తిట్టేవారు. అప్పుడప్పుడూ కొట్టేవారు కూడా! వాటన్నింటితో బాగా నీరసించిపోయింది దుర్గ. అంతలో ఓ రోజు- ఓ మహిళాఖైదీ తన పసిగుడ్డుని పీక నులిమి చంపేయబోతుంటే అడ్డుకొంది దుర్గ. అంతే- ఆమె దుర్గని చావబాదింది. సమయానికి పోలీసులు వచ్చి ఆదుకొన్నారు. లేకుంటే ఆమె చనిపోయేది. అలాంటి పరిస్థితుల్లో 'నీకు ఎలాంటి సహాయం అయినా చేస్తాం కోరుకో' అన్నారు అధికారులు. అప్పుడామె తనకో వీణను ఇవ్వమని అడిగింది. తనకు బాధను కలిగినప్పుడల్లా ఆమె వీణపై రాగాలు ఆలపించుకొంటూ మానసిక ఉపశాంతిని పొందేది.

జైలు జీవితం ముగిశాక - చిన్నప్పుడు వదిలేసిన చదువు మళ్లీ మొదలెట్టాలనుకుంది దుర్గాబాయి. బెనారస్ హిందూ యూనివర్సిటీలో చేరింది. ఇంటర్మీడియట్ పాసైంది. అదే విద్యాలయంలో బి.ఎ పొలిటికల్ సైన్స్ చదవాలన్నది ఆమె ఆకాంక్ష. కానీ ఆడపిల్లలకు ఆ కోర్సులో అవకాశం లేదన్నారు. దాంతో పట్టువదలని దుర్గ విశాఖపట్నం ఆంధ్ర విశ్వకళా పరిషత్‌లో అదే డిగ్రీలో చేరింది. కానీ అక్కడ ఇంకొక చిక్కొచ్చింది. మహిళలకు హాస్టలు వసతి ఇవ్వలేం పొమ్మన్నారు. అంతే! తానే ఒక హాస్టలు ప్రారంభించాలని ఆమె నిశ్చయించుకొంది. వార్తాపత్రికలో ప్రకటన ఇచ్చింది. మొదట 12 మంది చేరారు. క్రమంగా ఆ సంఖ్య పెరిగింది. ఇక చేసేది లేక అధికారిక హాస్టలును యూనివర్సిటీ వారే ప్రారంభించాల్సి వచ్చింది. విశాఖలో చదువయ్యాక- మద్రాసు విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రంలో చేరింది దుర్గ. మరోవైపు ఆమె వైవాహిక జీవితం మాత్రం ఒడిదొడుకులకు లోనైంది. 'నువ్వు ఇలా తిరుగుతూంటే నీతో ఉండలేన'న్నాడు భర్త. ఆమెను విడిచి పెట్టేశాడు. తిమ్మాయమ్మ అనే మరో స్త్రీని పెళ్లిచేసుకొన్నాడు. కానీ ఆపై రెండేళ్లకే మరణించాడు ఆయన. వితంతువు అయిన తిమ్మాయమ్మను చేరదీసింది దుర్గాబాయే! ఇలాంటి బాల వితంతువులకూ, భర్తల నిర్లక్ష్యానికి గురైన మహిళలకూ, అనాథలకూ ఆశ్రయాన్నిస్తూ దుర్గాబాయి, 'ఆంధ్రమహిళాసభ'ను 1941లో స్థాపించింది.

అది మొదలు దుర్గాబాయి చేసిన సేవలు, చేపట్టిన పదవులు లెక్కలేనన్ని! భారతరాజ్యాంగ రచనకై ఏర్పాటైన రాజ్యాంగసభలో సభ్యురాలైంది. ప్రణాళికా సంఘంలో స్థానం పొందింది. ఈ ప్రయాణంలోనే దేశ్‌ముఖ్‌తో పరిచయం అయింది. అది కాస్తా పరిణయానికి దారి తీసింది. వీరి వివాహానికి సాక్షి సంతకం సాక్షాత్తు జవహర్‌లాల్ నెహ్రూ చేయడం ఓ వైచిత్రి.

జీవితం నది లాంటిది. పుట్టినప్పుడు బాగానే ఉండచ్చు. కొన్ని ప్రవహించాక ఉత్థాన పతనాలు తప్పవు. వాటిని ధైర్యంగా స్వీకరిస్తే హాయైన సాగరసంగమం తథ్యం.



- ఆకెళ్ల రాఘవేంద్ర

భామ... హంగామా... భరత్ చిందేస్తున్నాడమ్మా!




మహేశ్ బాబు

ముఖ్యమంత్రికి మనసుండదా? ఆ మనసుకు నచ్చిన అమ్మాయి దొరికితే ప్రేమలో పడదా? పడుతుంది కదా! మూడు పదుల వయసులోనే ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన భరత్‌రామ్ కూడా ఓ అమ్మాయికి మనసిచ్చాడు. ఆరడుగుల ఎత్తున్నాడు. అమ్మాయిలను ఇట్టే ఆకర్షించే అందగాడు. అందులోనూ ముఖ్యమంత్రి... అమ్మాయీ మనసిచ్చింది. ఇద్దరూ కలిసి హైదరాబాద్‌లో స్టెప్పులేస్తూ పాట పాడుకుంటున్నారు. అయితే... ఇద్దరిలో ఎవరు ముందు మనసిచ్చారో తెలియాలంటే 'భరత్ అనే నేను' విడుదల వరకూ ఎదురు చూడాల్సిందే. మహేశ్ బాబు హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ సినిమాలో కైరా అడ్వాణీ హీరోయిన్. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ప్రముఖ స్టూడియోలో వేసిన సెట్‌లో చిత్రీకరణ జరుగుతోంది. హీరో హీరోయిన్లపై పాటను తెరకెక్కిస్తున్నారు. ముందు ఈ పాటను పుణెలో తీయాలనుకున్నారట! అనుమతులు, ఇతర చిన్న చిన్న సమస్యలు రావడంతో ఇక్కడే సెట్ వేశారు. మంగళవారంతో పాట చిత్రీకరణ పూర్తవుతుంది. తర్వాత చిన్న చిన్న ప్యాచ్ వర్క్‌లు ఏవైనా ఉంటే పూర్తిచేసి, ఈ నెల మూడో వారంలో యూకే వెళ్ళడానికి చిత్రబృందం ఏర్పాట్లు చేసుకుంటోంది. ప్రకాశ్‌రాజ్, రావు రమేశ్, రవిశంకర్, పోసాని కృష్ణమురళి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ స్వరకర్త. వచ్చే నెల 20న చిత్రాన్ని విడుదల చేయనున్నారు.



తెరపై తాతయ్యగా...

అక్కినేని నాగేశ్వరరావు మనవడు నాగచైతన్య తెరపై తాతయ్యగా కనిపించేందుకు అంగీకరించారని ఫిల్మ్‌నగర్ టాక్. అందాల అభినేత్రి సావిత్రి జీవితకథతో రూపొందుతోన్న సినిమా 'మహానటి'. 'ఎవడే సుబ్రమణ్యం' ఫేమ్ నాగ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతి మూవీస్ సంస్థ నిర్మిస్తున్న ఈ సినిమాలో సావిత్రిగా కీర్తీ సురేశ్ నటిస్తున్నారు. అప్పట్లో అక్కినేని-సావిత్రి, ఎన్టీఆర్-సావిత్రి ఎన్నో మంచి మంచి చిత్రాలు చేశారు. 'మహానటి' కథ ప్రకారం ఆయా చిత్రాల్లో సన్నివేశాలు ఉన్నాయట! వాటిలో అక్కినేనిగా నటించమని నాగచైతన్యను, ఎన్టీఆర్‌గా నటించమని ఆయన మనవడు తారక్ (ఎన్టీఆర్)ను చిత్రబృందం సంప్రదించింది. తారక్ 'నో' చెప్పడంతో చైతూ కూడా 'నో' చెప్పాడని కథనాలొచ్చాయి. తాజా సమాచారం ప్రకారం... 'మహానటి'లో చైతూ 'ఎస్' చెప్పారట! బుధ, గురువారాల్లో చిత్రీకరణలో పాల్గొనడానికి డేట్స్ కూడా ఇచ్చారట! తాతయ్యగా తెరపై చైతూ ఎలా ఉంటారో? ఎన్టీఆర్ పాత్రను గ్రాఫిక్స్ ద్వారా సృష్టిస్తారని సమాచారం. ఇందులో మిగతా పాత్రల్లో సమంత, విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్, భానుమతిగా అనుష్క కనిపించనున్నారు.


సమంత

మూడు నెలలు.. ఆనందం!

అసలే పెళ్లయిన కొత్త. అందులోనూ సమంత 'మూడు నెలలు.. సంతోషం' అని అంటుంది ఏంటి? విశేషమా? అని అనుకుంటున్నారా? సమంత చెప్పింది కూడా మంచి విషయమే. అయితే అది సినిమాల పరంగా. ఈ ఏడాదిలో మూడు నెలలూ సమంత బిజీగా గడిపారు. ఆమె నటించిన 'రంగస్థలం', 'ఇరుంబు తిరై', 'సీమరాజా' చిత్రాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి. మరోవైపు 'మహానటి', 'యూ టర్న్', 'సూపర్ డీలక్స్' చిత్రాలు షూటింగ్‌లో ఉన్నాయి. త్వరలోనే నాగచైతన్యతో నటించబోయే చిత్రం ప్రారంభం కానుంది. బిజీబిజీగా గడుపుతోన్న సమంత ఆ విషయాన్ని ట్విట్టర్ ద్వారా వ్యక్తం చేశారు. "తమిళంలో నటిస్తోన్న 'సీమ రాజా' సినిమా చిత్రీకరణ పూర్తయింది. 2018లో చాలా హ్యాపీగా ఉన్నాను. ఈ ఏడాది మొదలై ఇది మూడో నెలే. అవకాశాలు మెండుగా ఉన్నాయి' అని అందులో రాశారు.

పండుగ వెనుక సందేశం గొప్పది

- వెంకయ్యనాయుడు


వెంకయ్యనాయుడు చేతుల మీదుగా పురస్కారాలు అందుకుంటున్న రమ్యకృష్ణ, జగపతిబాబు

ప్రతి పండుక వెనుక శాస్త్రీయ సందేశం ఉంటుందని, అదే మన పర్వదినాల గొప్పతనమని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఢిల్లీ తెలుగు అకాడమి అందించే ఉగాది పురస్కార వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎల్వీ రమణ అధ్యక్షత వహించిన ఈ వేడుకలో నటుడు జగపతి బాబు జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు. సినీ ప్రముఖులు రమ్యకృష్ణ, ఆర్పీ పట్నాయక్, ఎం.ఎం. శ్రీలేఖ ప్రతిభా భారతి పురస్కారాలను అందుకున్నారు. వెంకయ్యనాయుడు మాట్లాడుతూ "చరిత్రలో ఎంతో ప్రాచీనమైన నాగరికతలున్నా మన వ్యవస్థ, సంస్కృతి గొప్పగా నిలవడానికి ప్రధాన కారణం కుటుంబ వ్యవస్థే. మన దేశంలో ఆధ్యాత్మిక భావన ఎక్కువ ఉంటుంది. పండుగ అనగానే కొత్త బట్టలు, రకరకాల పిండివంటలు మాత్రమే కాకుండా, ఇలా పురస్కారాలు ఇవ్వాలని ఆలోచన చేసిన ఢిల్లీ తెలుగు అకాడమి వారిని అభినందిస్తున్నాను" అని చెప్పారు. జగపతిబాబు మాట్లాడుతూ "నేను 1988లో ఇదే నెలలో పరిశ్రమలో అడుగుపెట్టాను. ఈ 30 ఏళ్లలో హీరోగా, విలన్‌గా కూడా చేశాను. ఈ మధ్య బ్యాడ్‌గా నటిస్తోంటే అంతా గుడ్ జరుగుతోంది. తెలుగుదనం మూర్తీభవించినట్టు ఉండే వెంకయ్యనాయుడుగారి చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉంది. మమ్మీ డాడీ అనడం మానేసి తెలుగువారు అమ్మా, నాన్న అని పిలిస్తే చాలు" అని చెప్పారు. గాయనీగాయకులు బి విజయలక్ష్మి, కె సాకేత్, పీవీఎన్ఎస్ రోహిత్, కె.హారిక, ఈ మనీషలను ఇదే వేదికపై సత్కరించారు. పురస్కార గ్రహీతలందరూ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

థియేటర్స్‌లో రచ్చ రచ్చే

- నిఖిల్


ఆడియో ఆవిష్కరణలో అనిల్‌సుంకర, అల్లరి నరేశ్, నిఖిల్ తదితరులు


"కన్నడలో ఇంత మంచి సినిమా ఉందని గుర్తించి.. అందులో నటించే అవకాశాన్ని ఇచ్చినందుకు అనిల్ సుంకరకు ప్రత్యేక కృతజ్ఞతలు. 'కార్తికేయ'తో చందు మొండేటి, "స్వామి రారా"తో సుధీర్ వర్మకు ఎలాంటి మంచి పేరు వచ్చిందో.. 'కిరాక్ పార్టీ'తో శరణ్‌కి కూడా అదే స్థాయి పేరొస్తుంది. వినోదంతో పాటు చక్కని సందేశం ఉన్న చిత్రమిది. ఈ నెల 16న థియేటర్లలో రచ్చ రచ్చ అయిపోతుంది" అని నిఖిల్ అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'కిరాక్ పార్టీ'. సంయుక్త హెగ్డే, సిమ్రాన్ పరీంజా కథానాయికలు. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి సుధీర్ వర్మ స్క్రీన్‌ప్లే, చందూ మొండేటి సంభాషణలు సమకూరుస్తుండడం విశేషం. సుంకర రాంబ్రహ్మం నిర్మాత. శనివారం విజయవాడలో పాటల్ని విడుదల చేశారు. అల్లరి నరేష్ ఆడియో సీడీలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ "నిఖిల్‌ని చూసినప్పుడల్లా డ్యూరో సెల్ బ్యాటరీ గుర్తుకొస్తుంది. అతనిలో ఎనర్జీ అలాంటిది. ఆహుతి ప్రసాద్‌గారి అబ్బాయి కార్తీక్ ఈ సినిమాలో నటించడం ఆనందంగా ఉంది. కన్నడలో ఎంత పెద్ద హిట్ అయ్యిందో.. అదే స్థాయిలో తెలుగులోనూ సూపర్ హిట్ అవుతుందనే నమ్మకం ఉంది" అన్నారు. శరణ్ కొప్పిశెట్టి మాట్లాడుతూ.. "ఈ నెల 16న స్టూడెంట్స్ అందరూ మాస్ బంక్ కొట్టి మరీ సినిమాను ఎంజాయ్ చేస్తారని నమ్మకంగా చెప్పగలను" అని తెలిపారు.

క్రీస్తు ఏం బోధించారు...


పి.డి. రాజు, అభినయ

పి.డి. రాజు క్రీస్తు పాత్ర పోషిస్తున్న చిత్రం 'తొలికిరణం'. భానుచందర్ కీలక పాత్రధారుడు. సువర్ణ క్రియేషన్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రానికి జాన్‌బాబు దర్శకుడు. ఇటీవల హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో భానుచందర్ మాట్లాడుతూ "ఏసుప్రభుకు సంబంధించి చాలా సినిమాలే వచ్చాయి. క్రీస్తు పుట్టిన దగ్గరనుంచి చనిపోయే దాకా ఉన్న కథలు మాత్రమే మనకు తెలుసు. ఆయన మరణించిన 3 రోజుల తరువాత బ్రతికి వచ్చి ఏం చేసాడు.. భక్తులకు ఏం బోధించాడు అనేది ఇందులో ప్రత్యేకం" అని అన్నారు. "45 నిమిషాల గ్రాఫిక్స్ ఇందులో కీలకం. లండన్‌లో సీజీ వర్క్ జరుగుతోంది. త్వరలో సినిమాను విడుదల చేస్తాం" అని దర్శకుడు తెలిపారు.

జె.డి.చక్రవర్తి 'ఉగ్రం'


అక్షత, శ్రీరామ్‌చంద్ర

జె.డి.చక్రవర్తి, అక్షత, శ్రీరామ్‌చంద్ర, మనోజ్ నందం కీలక పాత్రధారులుగా నక్షత్ర మీడియా పతాకంపై అమ్మరాజశేఖర్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఉగ్రం'. నక్షత్ర రాజశేఖర్ నిర్మాత. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాత మాట్లాడుతూ "కొంతగ్యాప్ తర్వాత జె.డి చక్రవర్తి చేస్తున్న చక్కని యాక్షన్ కామెడీ థ్రిల్లర్ ఇది. 'సత్య' తరహాలో ఆద్యంతం ఉత్కంఠగా సాగుతుంది. నేపథ్య సంగీతాని కి, యాక్షన్‌కి మంచి స్కోప్ ఉంది. ఉగాదికి ఫస్ట్ లుక్‌ని విడుదల చేస్తాం" అని తెలిపారు.

ఇద్దరిది ఒకటే కథ


శ్రీవిష్ణు, సత్నా టైటస్


శ్రీవిష్ణు, సత్నా టైటస్ జంటగా నటించిన 'నీది నాది ఒకే కథ' చిత్రం ఈ నెల 23న విడుదలకానుంది. వేణు ఊడుగుల దర్శకత్వం వహించిన చిత్రమిది. అరాన్ మీడియా వర్క్స్ మరియు శ్రీ వైష్ణవి క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రశాంతి, కృష్ణ విజయ్, అట్లూరి నారాయణరావు సంయుక్తంగా నిర్మించారు. నిర్మాతలు మాట్లాడుతూ "చదువుకు ఆమడ దూరంలో ఉంటూ చదువు లేకపోయినా బతకొచ్చు అని నమ్మే ఓ కుర్రాడి కథ ఇది. ఓ అమ్మాయి రాకతో తన జీవితం ఎలా మారిందనే ఇతివృత్తంతో రూపొందించాం. ఇందులో చక్కని ప్రేమకథ, వినోదం కూడా ఉంది. శ్రీవిష్ణు స్టూడెంట్‌గా కనిపిస్తాడు. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్‌లో చిత్తూరు యాస, డైలాగ్‌లకు స్పందన బావుంది. 23న సినిమాను విడుదల చేస్తాం" అని చెప్పారు.

అమెరికా స్వర్గమా?



తేజస్, పల్లవి, వంశీకృష్ణ, శషాసింగ్, వంశీ కోడూరి, మేఘన కీలక పాత్రధారులుగా రాధా మీడియా బ్యానర్ సంస్థ నిర్మిస్తున్న చిత్రం 'అమీర్‌పేట్ టు అమెరికా'. రామ్మోహన్ కొమండూరి, భానుకిరణ్ చల్లా దర్శకులు. పద్మజ కొమండూరి నిర్మాత. ఆదివారం ఈ చిత్రం ట్రైలర్‌ను తనికెళ్ల భరణి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ "అమీర్ పేట్ టు అమెరికా ప్రయాణాన్నంతా ఈ సినిమాలో చూపించారు. ఇందులో చక్కని పాత్రను పోషించా" అన్నారు. రామ్మోహన్ కొమండూరి మాట్లాడుతూ "అమీర్ పేట్ నుంచి అమెరికా వెళ్లే వారి లైఫ్ స్వర్గంలా అనిపిస్తుంది. కానీ అక్కడ డాలర్ సంపాదించాలంటే చాలా కష్టపడాలి. ఆ ఇతివృత్తంతోనే ఈ సినిమా తీశాం. ఈ నెల 23న పాటల్ని విడుదల చేసి, 30న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అని తెలిపారు.

తెలంగాణ ఎలా వచ్చింది?



బిపిన్ నటిస్తూ స్వీయ దర్శకత్వంలో షిరిడిసాయి క్రియేషన్స్ పతాకంపై నిర్మించిన చిత్రం 'బంగారు తెలంగాణ'. రమ్య, అక్షర, ఏవీ స్వామి, బాబూమోహన్ ప్రధాన పాత్రధారులు. బిపిన్ సంగీతం అందించిన ఈ చిత్రం పాటల్ని శనివారం విడుదల చేశారు. బిపిన్ మాట్లాడుతూ "తెలంగాణ రాష్ట్రం ఎలా వచ్చింది? వచ్చాక కేసీఆర్ ముఖ్యమంత్రిగా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ బంగారు తెలంగాణాగా ఎలా తీర్చిదిద్దుతున్నారు అన్న కథాంశంతో తెరకెక్కిన సినిమా ఇది. ఇందులో ఐదు పాటలూ ఆకట్టుకుంటాయి. త్వరలో సినిమాను విడుదల చేస్తాం" అని చెప్పారు. "త్వరలో కేటీఆర్, కవిత, హరీశ్‌రావు గారి సమక్షంలో గ్రాండ్‌గా ప్రీ రిలీజ్ వేడుక జరపబోతున్నాం" అని సమర్పకుడు కూర అంజిరెడ్డి అన్నారు.